

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY

16 అనంతపురం
బుధవారం 2 ఆగస్టు 2017



బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటలో ఉన్న ఎన్‌జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో మంగళవారం ఆరు జిల్లాల వ్యవసాయాధికారులతో నిర్వహించిన సదస్సులో అంతర పంటల సాగు వివరాల కరపత్రాలు విడుదల చేస్తున్న వ్యవసాయ శాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, శాస్త్రవేత్తలు

నేటి నుంచే అంతర పంటల విత్తనాలివ్వండి


జొన్నలు

- 15లోగా పంపిణీ పూర్తి చేయండి
- ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధం కండి
- వ్యవసాయ శాఖ ప్రత్యేక కమిషనర్ హరిజవహర్‌లాల్

ప్రత్యామ్నాయమే
శరణ్యం



ఖరీఫ్‌లో వేరుశనగ విత్తనం వేయడానికి సమయం ముగిసిపోయింది. ఇక ఇప్పుడు వర్షాలు వచ్చినా వేయవద్దు. ప్రత్యామ్నాయ పంటల సాగే ఇక శరణ్యమని వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఒకవేళ అదును దాటిన తరువాత వేరుశనగ సాగుచేసినా దిగుబడి బాగా తగ్గిపోతుందని హెచ్చరించారు. బుక్కరాయసముద్రం మండలం రేకులకుంటలోని ఎన్‌జీరంగా వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో ఆరు జిల్లాల వ్యవసాయాధికారులతో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయా జిల్లాల వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు వారి వారి ప్రాంతాల్లో ఖరీఫ్ పంటల పరిస్థితి గురించి వివరించారు. ఆయా జిల్లాల పరిస్థితులను సమీక్షించారు.

6

- వేరుశనగకు ముగిసిన సమయం
- సూచించిన పంటల సాగే మేలు
- అనంతలో పరిస్థితి ఆందోళనకరం
- ఆరు జిల్లాల వ్యవసాయాధికారుల సదస్సులో అధికారులు, శాస్త్రవేత్తల స్పష్టీకరణ

పింఛన్ల పంపిణీలో..
సాంకేతిక సమస్య


గుత్తిలో పడిగాపులు కాస్తున్న వృద్ధులు, వికలాంగులు

- వృద్ధులకు తప్పని తిప్పలు
- 3 గంటలపాటు పడిగాపులు

అనంతపురం అర్బన్: పింఛన్ల పంపిణీకి సాంకేతిక సమస్య ఏర్పడింది. మంగళవారం తొలిరోజు ఉదయం 10 గంటల వరకు పంపిణీ స్తంభించిపోయింది. సాఫ్ట్‌వేర్ 4.0 వర్షన్ డౌన్‌లోడ్ చేసుకోవాలని రాష్ట్ర అధికారులు ఆదేశించారు. అయితే ఆ వర్షన్ డౌన్‌లోడ్ కాలేదు. దీంతో సుమారు 3 గంటల పాటు జిల్లావ్యాప్తంగా పంపిణీకి వెళ్లిన సిబ్బంది అవస్థలు పడ్డారు. అప్పటివరకు వృద్ధులు సైతం అక్కడే కూర్చొని పడిగాపులు కాయాల్సి వచ్చింది. చివరికి పాత 3.3 వర్షన్ సాఫ్ట్‌వేర్ ద్వారానే పంపిణీకి చర్యలు తీసుకున్నారు. డీఆర్‌డీఏ పీడీ వెంకటేశ్వర్లు టెలికాన్ఫరెన్స్ నిర్వహించి ఆదేశాలు జారీ చేశారు. ఆ తర్వాత పింఛన్ల పంపిణీ మొదలుపెట్టారు. దీంతో లబ్ధిదారులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విషయమై పీడీ మాట్లాడుతూ.. ఉదయం సాఫ్ట్‌వేర్ సమస్య తలెత్తిన విషయం వాస్తవమేనన్నారు. అయితే పాత సాఫ్ట్‌వేర్ ద్వారానే పంపిణీకి ఆదేశాలివ్వడంతో సమస్య తొలగిందన్నారు. రాత్రి 7 గంటల వరకూ 1,10,394 మంది లబ్ధిదారులకు పింఛన్లు ..మిగతా 6లో

గార్లదిన్నె, గడేకల్లు ఖాళీలపై గొడవ

- బదిలీల్లో 'నాట్ ఆప్టెడ్'కే ఎక్కువ మంది మొగ్గు
- నేడు 3301 నుంచి మిగిలిన ఎస్‌జీటీలందరికీ కౌన్సెలింగ్


కౌన్సెలింగ్‌కు హాజరైన ఉపాధ్యాయులు

అనంతపురం అర్బన్: ఉపాధ్యాయుల బదిలీలు చివరి అంకంలోకి ప్రవేశించాయి. మంగళవారం ఎస్‌జీటీల కౌన్సెలింగ్‌లో విచిత్ర పరిస్థితి కనిపించింది. ఉదయం 9 గంటల నుంచి జిల్లా సైన్స్‌సెంటర్‌లో కౌన్సెలింగ్ ప్రారంభమయింది. డీఈఓ లక్ష్మీనారాయణ పర్యవేక్షణలో ప్రక్రియ కొనసాగింది. 2401 నుంచి 3300 వరకు ఎస్‌జీ టీచర్లకు కౌన్సెలింగ్ నిర్వహించారు. అయితే చాలామంది ఉపాధ్యాయులు ప్లేస్‌లు లేక నాట్ ఆప్టెడ్ ఇస్తూ వెళ్లారు. ఏ 20 మందిలోనో ఒకరు ప్లేస్‌లు కోరుకోవడం కనిపించింది. 8 ఏళ్లు పూర్తి అయిన వారు తప్పనిసరిగా బదిలీ కావాల్సి ఉండడంతో వారు మాత్రం అయిష్టమైనా.. దూర ప్రాంతాలు కోరుకుని ఆవేదనతో వెనుదిరుగుతూ కనిపించారు. 'నాట్ ఆప్టెడ్'లు ఎక్కువగా ఉండడంతో కౌన్సెలింగ్ ప్రక్రియ వేగంగా కొనసాగింది. అయితే ఈ కౌన్సెలింగ్‌లోనూ గార్లదిన్నె, గడేకల్లు ఖాళీలపై వివాదం తలెత్తింది. ఉరవకొండ మండలంలోని కోనాపురం గ్రామాన్ని ఓ టీచర్ (2081 సీరియల్ నెంబర్) సోమవారం కోరుకుని వెళ్లారు. అయితే అక్కడ ఖాళీ లేదని మంగళవారం తిరిగివచ్చారు. ఉదయం అధికారులకు విషయం చెప్పారో.. లేదో తెలియదు కానీ 3800పైన ..మిగతా 6లో

రసవత్తరంగా రైల్వే ఇన్‌స్టిట్యూట్
ఎన్నికలు

- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న కార్మిక సంఘాలు
- నేడు పోలింగ్..
- రాత్రికి ఫలితాలు

14

నరకం

- అనంత సర్వజనాస్పత్రిలో బర్నింగ్ బాధ..



- సెంటర్‌స్ప్రెడ్‌లో

బర్న్స్ వార్డులో కొరవడిన సౌకర్యాలు.. కనీస వసతులూ కరువే.. పనిచేయని ఏసీలు.. తిరగని ఫ్యాన్లు.. కిటికీలకు రంధ్రాలు.. చల్లదనం కోసం బయటికొస్తున్న రోగులు.. డాక్టరు వచ్చినపుడే సిబ్బంది రాక..

పండిట్ల అప్‌గ్రెడేషన్‌కు ఆమోదం

- 5లోగా ప్రమోషన్లు కల్పించాలని ఉత్తర్వులు
- ఊపిరిపీల్చుకున్న మిగులు భాషా పండితులు
- అయినా హిందీ, పీఈటీలకు తిప్పలే

6

మేధాశక్తిని పెంపొందించుకోండి

- జేసీ-2 ఖాజామొహిద్దీన్
- విజయనగరం, శ్రీకాకుళం జిల్లా విద్యార్థుల పర్యటన
- జడ్పీ, జిల్లా స్థితిగతులను వివరించిన అధికారులు



మాట్లాడుతున్న జేసీ-2 ఖాజామొహిద్దీన్

అనంతపురం జిల్లాపరిషత్తు: యుక్తవయస్సులో మేధాశక్తిని పెంపొందించుకుని జీవితంలో అత్యున్నత స్థాయికి చేరుకోవాలని జిల్లా జేసీ-2 సయ్యద్ ఖాజామొహిద్దీన్ పేర్కొన్నారు. యువజనశాఖ ఆధ్వర్యంలో విజయనగరం, శ్రీకాకుళం జిల్లాలకు చెందిన విద్యార్థినీవిద్యార్థులు జిల్లాలో పర్యటించారు. మూడు రోజుల పర్యటనలో భాగంగా తొలి రోజు జిల్లా పరిషత్ ఆవరణలోని పంచాయతీ వనరుల కేంద్రం(డీపీఆర్సీ)లో వారితో అధికారులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జేసీ-2తో పాటు జడ్పీ ఇన్చార్జి సీఈఓ సూర్యనారాయణ, ఆన్సెట్ సీఈఓ వెంకటేశం, డీఆర్డీఏ పీడీ వెంకటేశ్వర్లు, ఇతర అధికారులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జేసీ-2 మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచే విజ్ఞానం పెంచుకోవాలన్నారు. చదువుతో పాటు ఆరోగ్యం కాపాడుకోవాలన్నారు. జిల్లాలో చూడాల్సిన ప్రదేశాలు ఎన్నో ఉన్నాయన్నారు. జిల్లాలో నెలకొన్న వర్షాభావ, కరువు పరిస్థితుల గురించి వివరించారు. విషయ పరిజ్ఞానం పెంపొందించుకోవడం ద్వారా విద్యలో రాణించగలుగుతారన్నారు. వివిధ అంశాలపై నైపుణ్యం పెంచుకుని ఉన్నతోద్యోగాలు సాధించాలన్నారు. జడ్పీ ఇన్చార్జి సీఈఓ సూర్యనారాయణ మాట్లాడుతూ.. గ్రామ, మండల, జిల్లా పరిపాలన విభాగంలో పంచాయతీరాజ్ వ్యవస్థ కీలకమైందన్నారు. ఆ చట్టం నిబంధనల మేరకు విధులు, వాటి విధానం ఉంటుందన్నారు. గ్రామ పంచాయతీ, మండల పరిషత్, జిల్లాపరిషత్ అనే మూడంచెల వ్యవస్థ గురించి వివరించారు. నిధులు, విధులు, పంచాయతీరాజ్ చట్టాలు, ఎన్నికలు, జిల్లాపరిషత్ అధికారాలు తదితర విషయాలు వివరించారు. ఆన్సెట్ సీఈఓ వెంకటేశం, డీఆర్డీఏ పీడీ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ..కీలక అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. మిగిలిన రెండు రోజుల్లో జిల్లావ్యాప్తంగా గల పర్యాటక ప్రాంతాలను సందర్శించే అవకాశం కల్పిస్తామన్నారు. ఎన్జీఓ సంస్థల ప్రతినిధులు పలు అంశాలపై అవగాహన కల్పిస్తారన్నారు. అంతకుముందు జడ్పీ సమావేశ మందిరం, జడ్పీలోని విభాగాల గురించి జడ్పీ ఇన్చార్జి సీఈఓ సూర్యనారాయణ వివరించారు. కార్యక్రమంలో పలు శాఖల అధికారులు, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల అధికారులు పాల్గొన్నారు.

నైపుణ్యంతోనే రాణింపు

ఉపాధి, సాగునీరే ప్రధాన లక్ష్యం

ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్

ఉరవకొండ: యువత నైపుణ్యాలు పెంపొందించుకుంటే అన్ని రంగాల్లో రాణించవచ్చునని ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. స్థానిక డిగ్రీ కళాశాలలో ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ, పయ్యావుల సోదరుల ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం మెగా జాబ్మేళా నిర్వహించారు. దీనికి మంచి స్పందన లభించింది. 16 కంపెనీలు ఇందులో పాల్గొన్నాయి. వాటి హెచ్ఆర్లు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా కేశవ్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ఓటమిని అధిగమించి లక్ష్యం చేరుకునేలా ముందుకెళ్లాలని సూచించారు. యువత కమ్యూనికేషన్ స్కిల్స్ పెంపొందించుకోవాలన్నారు. ఉరవకొండలో ఇప్పటికే మూడు జాబ్మేళాలు నిర్వహించామన్నారు. రెండింటి ద్వారా వెయ్యిమందికి ఉద్యోగావకాశాలు కల్పించామన్నారు. యువతకు వందశాతం ఉద్యోగాలిప్పించేందుకు కృషి చేస్తామన్నారు. గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నామన్నారు. ఏపీ ఎస్ఎస్డీసీ ప్రాజెక్టు మేనేజర్ విన్సెంట్ మాట్లాడుతూ నైపుణ్యాభివృద్ధి సంస్థ ద్వారా యువతలో నైపుణ్యాలు పెంపొందించడంతో పాటు ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నామన్నారు.

రాబోయే రెండేళ్లలో లక్ష ఎకరాలకు సాగునీరు

రాబోయే రెండేళ్లలో ఉరవకొండ నియోజకవర్గంలో లక్ష ఎకరాలకు సాగునీరందిస్తామని ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు నీటిపారుదల, విద్య, ఉపాధి, వైద్యం, విద్యుత్ వంటి అంశాలకు ప్రాధాన్యమిస్తున్నామన్నారు. గుంతకల్లు బ్రాంచ్ కెనాల్ (జీబీసీ) ఆధునికీకరణ ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరిస్తామన్నారు. హంద్రీనీవా ద్వారా 1.50 లక్షల ఎకరాలకు సాగునీరందించాలనే లక్ష్యంతో ప్రణాళికలు సిద్ధం చేశామన్నారు. 25 ఏళ్లుగా రాజకీయంగా అండగా నిలిచిన ఉరవకొండను అన్ని రంగాల్లో అభివృద్ధి చేయాలనేదే తన లక్ష్యమన్నారు. హంద్రీనీవా ద్వారా జిల్లాలో 3 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంటే ఉరవకొండ నియోజకవర్గంలోనే 1.50 లక్షల ఎకరాలుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రామచంద్రమూర్తి, ఎంపీపీలు సుంకురత్నమ్మ, ప్రతాప్నాయుడు, టీడీపీ నాయకులు దేవినేని పురుషోత్తం, యేళ్ల శంకరప్ప, రేగాటి నాగరాజు, విజయభాస్కర్, ఎం రామాంజనేయులు, తెలుగుయువత జిల్లా అధ్యక్షుడు తమ్మినేని పవన్కుమార్, అధికార ప్రతినిధి మదమంచి శ్రీనివాసులు, విడపనకల్లు మండల కన్వీనర్ మారయ్య, మండల ఉపాధ్యక్షుడు రాజేశ్, నెట్టెం రామకృష్ణ, డీకే ప్రసాద్, ప్యారం కేశవానంద, ఆసిఫ్, విజయమోహన్, మాజీ ఎంపీపీ కుళ్లాయప్ప తదితరులు పాల్గొన్నారు.

రెయిన్గన్ల నిర్వహణ ప్రత్యేక యాప్పై శిక్షణ

అనంతపురం కలెక్టరేట్: రెయిన్ గన్ల నిర్వహణపై రూపొందించిన ప్రత్యేక యాప్పై వ్యవసాయ అధికారులకు శిక్షణకార్యక్రమం నిర్వహించారు. స్థానిక జేడీఏ కార్యాలయంలో మంగళవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు వసార్ ల్యాబ్ టెక్నీషియన్ రెయిన్ గన్ల యాప్ను ఉపయోగించే విధానంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథులుగా ఏడీ శ్రీనివాసులు, సురేంద్రబెనర్జీ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..జిల్లాలో ఖరీఫ్లో సాగు చేసిన వేరుశనగ ఎంత విస్తీర్ణంలో బెట్టపరిస్థితుల్లో ఉంది..? ఎంత విస్తీర్ణానికి రక్షక తడులు ఇచ్చారు..? తదితర వివరాలను రోజువారీగా యాప్లో అప్లోడ్ చేయాలన్నారు. ఆ మేరకు వ్యవసాయ అధికారులు సిబ్బందికి పూర్తిస్థాయిలో అవగాహన కల్పించాలని ఆదేశించారు. యాంత్రీకరణలో ఈఏడాది నుంచి ప్రత్యేక నగదు బదిలీ పథకాన్ని ప్రభుత్వం ప్రదేశపెట్టిందన్నారు. ముందస్తుగా రైతులు పూర్తి ధర చెల్లిస్తే... ఆ తర్వాత సబ్సిడీ సొమ్మును రైతుల ఖాతాలకు నేరుగా జమ చేస్తుందన్నారు.



మాట్లాడుతున్న అంకాల్రెడ్డి

సంక్షేమ పథకాలు అర్హులకందడంలేదు

జన్మభూమి కమిటీలు రద్దు చేయండి

27, 28 తేదీల్లో అమిత్షా రాయలసీమ పర్యటన

బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంకాల్రెడ్డి

పెనుకొండ: జన్మభూమి కమిటీల వల్ల సంక్షేమ పథకాలు అర్హులైన పేదలకు అందడం లేదని బీజేపీ జిల్లా అధ్యక్షుడు అంకాల్రెడ్డి పేర్కొన్నారు. స్థానిక ఆర్అండ్బీ అతిథి గృహంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. వెంటనే జన్మభూమి కమిటీలు రద్దుచేసి పేదలందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా ముఖ్యమంత్రి చర్యలు తీసుకోవాలని కోరారు. దీన్దయాల్ శతజయంతిని పురస్కరించుకుని బీజేపీ విస్తృతస్థాయి కార్యక్రమాలు చేపట్టిందన్నారు. 3576పోలింగ్ కేంద్రాల్లో 50శాతం బూత్ కమిటీల ఏర్పాటు పూర్తి చేశామన్నారు. ప్రధాని నరేంద్రమోదీ మూడేళ్లపాలనలో అమలు చేసిన 106ప్రజా సంక్షేమ పథకాలపై గ్రామస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేస్తున్నామన్నారు. పెనుకొండ నియోజకవర్గంలోని 248పోలింగ్ కేంద్రాలకు 227బూత్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఈనెల 20, 25తేదీల మధ్య పెనుకొండ నియోజకవర్గ బీజేపీ సమావేశం నిర్వహిస్తామన్నారు. దీనికి జాతీయ, రాష్ట్రస్థాయి నాయకులు హాజరవుతారన్నారు. బీజేపీ జాతీయ అధ్యక్షుడు అమిత్షా ఈనెల 27,28,29 తేదీల్లో మూడురోజులపాటు రాయలసీమ జిల్లాల్లో పర్యటిస్తారన్నారు. సమావేశంలో బీజేపీ చేనేతసెల్ జిల్లా కన్వీనర్ మద్దిలేటిస్వామి, నాయకులు రామాంజనేయులు, రామక్రిష్ణ, సాయిప్రసాద్, రవి, అమృతయాదవ్, హనుమంతు, జితేంద్ర, సలీం, ఆంజనేయులు, లక్ష్మానాయక్, అనిల్కుమార్, అంబోజీరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ సమాచారం

కసాపురం

శ్రావణమాసాన్ని పురస్కరించుకుని కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి దేవాలయంలో బుధవారం తెల్లవారుజామున 4 గంటలకు అభిషేకాలు, అలంకారాలు, పూజా కార్యక్రమాలు. 5 గంటలకు సర్వదర్శనం. మధ్యాహ్నం 12 గంటలకు మహానివేదన, మహా మంగళ హారతి. మధ్యాహ్నం ఆలయం మూసివేత. 2 గంటలకు ఆలయంలో పూజల పునఃప్రారంభం. సాయంత్రం స్వామివారికి ప్రత్యేక పూజలు జరుగుతాయి. రాత్రి 8 గంటలకు మహామంగళ హారతి.



ఖాద్రి

శ్రీ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో 2 న బుధవారం ఉదయం 5.30 గంటల నుంచి 7 గంటల వరకు శ్రీవారి దర్శనం ఉంటుంది. 7.30 నుంచి 10 గంటల వరకు అభిషేకాలు ఉంటాయి. 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు శ్రీవారి దర్శనం ఉంటుంది. సాయంత్రం 4.30 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు స్వామివారి దర్శనం ఉంటుంది.



మినీ లోకం



'రెవెన్యూ అంశాలపై అప్రమత్తం కండి'

అనంతపురం కలెక్టరేట్: రెవెన్యూ అంశాలపై ఎప్పటికప్పుడు అప్రమత్తమై సమస్యలు పరిష్కరించాలని సీసీఎల్ఏ అనిల్ చంద్రపునేత ఆదేశించారు. మంగళవారం అన్ని జిల్లాల ఉన్నతాధికారులతో ఆయన వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌలు రైతులకు రుణ అర్హత కార్డులు ఇవ్వడంతోపాటు రుణాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎవరికీ అభ్యంతరం లేని ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకుని ఉంటే వాటిని క్రమబద్ధీకరణ చేయడంపై శ్రద్ధ పెట్టాలన్నారు. ఈనెల 4వతేదీ రెవెన్యూ అంశాలపై సీఎం చంద్రబాబునాయుడు సమీక్షించనున్నారన్నారు. అప్పటిలోగా రెవెన్యూ అంశాలను అప్డేట్ చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జేసీ-2 ఖాజామొహిద్దీన్ తదితరులుపాల్గొన్నారు.

ఒకే పాఠశాల నుంచి

20 మంది ఉపాధ్యాయుల బదిలీ

విడపనకల్లు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఒక్కసారిగా 20 మంది ఉపాధ్యాయులు బదిలీ అయ్యారు. పాఠశాలలో మొత్తం 25 మంది ఉపాధ్యాయులుండగా ఒకరు పదవీవిరమణ పొందారు. ప్రస్తుతం 20 మంది వివిధ ప్రాంతాలకు బదిలీ చేయించుకున్నారు. హెచ్‌ఎం వసుంధరాదేవితో పాటు మరో 19 మంది బదిలీపై వెళ్లారు. ఉపాధ్యాయులందరినీ ఒకేసారి రిలీవ్ చేయకుండా అంచెలంచెలుగా రిలీవ్ చేస్తున్నట్లు హెచ్‌ఎం తెలిపారు. 20 మంది ఉపాధ్యాయులు ఒకేసారి బదిలీ కావడంతో విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. బదిలీ అయిన వారిస్థానంలో 20మంది కొత్త ఉపాధ్యాయులు వస్తే పూర్వ వైభవం ఉంటుంది. లేకపోతే విద్యార్థుల భవిషత్తు ఎలా ఉంటుందోనని వారి తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కమిషన్ నివేదిక మేరకే కాపులను బీసీల్లో చేర్చాలి

రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు



ప్రసంగిస్తున్న రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు

గోరంట్ల రూరల్: రాష్ట్రంలోని అన్ని కులాల స్థితిగతులు, వారి ఆర్థిక, సామాజిక, రాజకీయ, విద్య, ఉద్యోగపరమైన పరిస్థితులపై రూపొందించిన బీసీ కమిషన్ నివేదిక మేరకే కాపులను బీసీల్లో చేర్చాలని రాష్ట్ర కాపునాడు అధ్యక్షుడు నారాయణస్వామి రాయల్ కోరారు. గోరంట్ల ఆర్‌అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మంగళవారం విలేకరుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఇందుకు వీలుగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మంజునాథ్ కమిషన్ నివేదికను వెంటనే తెప్పించుకోవాలని డిమాండ్ చేశారు. అలాకాకుండా నేరుగా బీసీల్లో చేర్చితే చట్టపరంగా న్యాయస్థానాల్లో వీగిపోయే ప్రమాదం ఉందన్నారు. సుప్రీం కోర్టు ఆర్డర్ 259/1994 ప్రకారం తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల్లో కాపులకు రిజర్వేషన్ కల్పించారన్నారు. ఏపీలో మైనార్టీలతో కలిపి బీసీల రిజర్వేషన్ 29 శాతం ఉందన్నారు. రిజర్వేషన్ శాతాన్ని 50కి పెంచుతూ కాపులకు బీసీల్లో ఏబీసీడీ త రహాలో ఎఫ్ స్థానం ఇవ్వడం వల్ల బీసీ కులాలకు ఎలాంటి నష్టం జరగదన్నారు. కొంతమంది నాయకులు పాదయాత్ర, రైలు దహనాలు, ఉద్యమాలు చేపట్టడం వల్ల ప్రయోజనం శూన్యమన్నారు. కాపులకు రిజర్వేషన్ ఇవ్వడానికి వీలులేదని కొంతమంది మంత్రులు మాట్లాడడం సమంజసం కాదన్నారు. కాపులకు ఎంతశాతం రిజర్వేషన్ ఇస్తారో.. అంతేశాతం రాజకీయంగా కూడా ఇవ్వాలని కోరారు. కాపుల రిజర్వేషన్‌తోపాటు కర్ణాటక తరహాలో గ్రామీణ తెలుగు మాధ్యమంలో విద్యాభ్యాసం చేసిన అభ్యర్థులకు అన్ని విభాగాల్లో ప్రత్యేకమైన కోటా కేటాయించాలన్నారు. దీంతో అసమానతలు తొలగి తెలుగుభాషపై మక్కువ ఏర్పడుతుందన్నారు. టీడీపీ ప్రభుత్వం కాపులను బీసీల్లో చేర్చుతుందనే నమ్మకం తనకు ఉందని, ఒక వేళ చేర్చలేని పక్షంలో అన్ని కమిటీలు ఏకమై కార్యాచరణ గురించి ఆలోచిస్తామన్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు గంగాధర్, భక్తవత్సలం, రమాదేవి, కేశవరెడ్డి, లక్ష్మీపతి, శంకర, లక్ష్మీనారాయణరెడ్డి, శ్రీనివాసులు, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రూ.50 వేలకుపైగా సరుకు రవాణా చేస్తే..

వే బిల్లులు ఉండాల్సిందే

- పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కల్పన

అనంతపురం జిల్లాపరిషత్తు: వస్తు సేవల పన్ను(జీఎస్టీ) విధానంలో రూ.50వేలకు పైగా విలువ చేసే సరుకు రవాణా చేస్తే ఈ-వే బిల్లులు జత చేయాల్సిందేనని పన్నుల శాఖ జాయింట్ కమిషనర్ కల్పన ఆదేశించారు. ఈ మేరకు ఆమె మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో స్పష్టం చేశారు. పన్నుల శాఖ వే-బిల్లులు నోటిఫై చేసిందన్నారు. జీఎస్టీ పరిధిలో రిజిస్టర్ అయిన, రిజిస్టర్ కాని వ్యాపారులందరూ అలా రవాణా చేస్తే ఈ- వే బిల్లులు జతపరచాలన్నారు. రాష్ట్రంలో లేక ఇతర రాష్ట్రాలకు రవాణా చేసే వారికి, ఇతర రాష్ట్రాల నుంచి సరుకు కొనుగోలు చేసేవారికి ఇది వర్తిస్తుందన్నారు. ట్రాన్స్‌పోర్టర్ ద్వారా సరుకు రవాణా చేసేవారు తమ వే బిల్లుతో పాటు ట్రాన్స్‌పోర్టర్ డిక్లరేషన్ పొందుపరచాలన్నారు. సరుకు రవాణా కోసం ఉపయోగించే వాహనం ఏ కారణం చేతనైనా ఆగిపోతే డిక్లరేషన్ పొందుపరిచి కొత్త వాహనంలో రవాణా చేయాలన్నారు. వ్యాపారస్తులందరూ తప్పకుండా ఇన్‌వాయిస్‌లు వేసి, వాటికి అకౌంట్ చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని జాయింట్ కమిషనర్ కల్పన ఆ ప్రకటనలో హెచ్చరించారు.

అర్హుల జాబితా తయారు చేయండి

10లోపు గ్రామ సభలు పూర్తి చేయండి: జేసీ రమామణి

అనంతపురం కలెక్టరేట్: ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్‌కు అర్హుల జాబితా తయారు చేసేందుకు చర్యలు తీసుకోవాలని జేసీ రమామణి ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి జేసీ-2 ఖాజా మొహిద్దీన్‌తో కలిసి ఆర్‌డీఓలు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, హౌసింగ్ అధికారులతో మంగళవారం ఆమె వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. గత ఏడాది నిర్వహించిన ప్రజాసాధికార సర్వేలో 2.32 లక్షల మంది ఇళ్లులేని వారు ఉన్నట్లు గుర్తించామన్నారు. కేంద్ర ప్రభుత్వ నియమనిబంధనల మేరకు గ్రామ సభల ద్వారా అర్హుల జాబితాను నిర్ధారించి నివేదికలు సమర్పించాలన్నారు. ఈనెల 10వ తేదీలోగా గ్రామ సభలు పూర్తి చేసి జాబితా సిద్ధం చేయాలన్నారు. గ్రామ సభల షెడ్యూల్‌ను ఎంపీడీఓలు రూపొందించి డీఈల ద్వారా హౌసింగ్ పీడీకి పంపాలన్నారు. రోజుకు రెండు గ్రామాలు పూర్తి చేసేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు.

గ్రామసభలు నిర్వహించే తేదీలను ప్రజలకు ముందస్తుగా తెలియజేయాలన్నారు. ఏరోజుకారోజు సమాచారాన్ని జిల్లా కేంద్రానికి పంపాలన్నారు. జేసీ-2 ఖాజామొహిద్దీన్ మాట్లాడుతూ... గ్రామ సభలను ఆర్‌డీఓలు పర్యవేక్షించాలని ఆదేశించారు. ప్రజా సాధికార డేటాను మండల బృందాలకు అందజేయాలని హౌసింగ్ అధికారులను ఆదేశించారు. ముందస్తుగా గ్రామ సభలపై విస్తృత ప్రచారం నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ ఈఈలు చంద్రమోహన్‌రెడ్డి, నాగేశషుబాబు, డీపీఓ సుధాకర్‌రెడ్డి, డీఎస్‌ఓ శివరాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రమనోహరంగా మంగళగౌరీ వ్రతం

అనంతపురం టౌన్: శ్రావణమాసం రెండవ మంగళవారాన్ని పురస్కరించుకుని స్థానిక ఐదవ రోడ్డులోని కనకదుర్గా భవానీ దేవాలయంలో నేత్రమనోహరంగా మంగళగౌరీ వ్రతం నిర్వహించారు. ఉదయం కనకదుర్గమ్మ మూల విరాట్‌కు నిర్మాల్యవిసర్జన, పంచామృతాభిషేకాలు, అర్చనలు, వివిధరకాల పుష్పాలంకరణలు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ఆవరణలో గణపతి హోమం, దుర్గాహోమాలు నిర్వహించారు. అదే విధంగా మంగళగౌరీమాతను కలశంపై ఆశీనులను చేసి విశేషంగా అలంకరించారు. పెద్దఎత్తున హాజరైన మహిళలు సామాహికంగా మంగళగౌరీ వ్రతం ఆచరించారు. ఈసందర్భంగా మాతాభవానీ హైమావతి వ్రత కథను చదవడంతోపాటు వ్రత విశిష్టత గురించి భక్తులకు వివరించారు. సాయంత్రం ఆలయ ఆవరణలో మహిళలు జ్యోతులు వెలిగించి అమ్మవారికి హారతులు పట్టారు.



ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

ప్రత్యామ్నాయమే శరణ్యం



వర్క్‌షాపును జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న రాష్ట్ర వ్యవసాయ ప్రత్యేక కమిషనర్ జవహర్‌లాల్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, అనంతపురం: ఖరీఫ్‌లో వేరుశనగ వేయడానికి సమయం ముగిసిందని, ప్రత్యామ్నాయ పంటల సాగే ఇక శరణ్యమని వ్యవసాయాధికారులు, శ్రాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఒకవేళ అదును దాటిన తరువాత వేరుశనగ సాగుచేసినా దిగుబడి బాగా తగ్గిపోతుందని హెచ్చరించారు. బుక్కరాయసముద్రం మండలంలోని రేకులకుంటలో గల ఎన్‌జీరంగా వ్యవసాయ పరిశోధనాకేంద్రంలో ఆరు జిల్లాల వ్యవసాయాధికారులతో మంగళవారం వర్క్‌షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా జిల్లాల వ్యవసాయశాఖ సంయుక్త సంచాలకులు వారివారి ప్రాంతాల్లో ఖరీఫ్ పంటల పరిస్థితి గురించి వివరించారు. ఆయా జిల్లాల పరిస్థితులను సమీక్షించారు. ఆ వివరాలు కింది విధంగా ఉన్నాయి. ఖరీఫ్ పంటల సాగులో అనంతపురం జిల్లా పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. జిల్లాలో ఖరీఫ్‌లో 8,37,503 హెక్టార్లలో పలురకాల పంటలు సాగవుతాయని అంచనా వేయగా 1,62,185 హెక్టార్లలోనే సాగయ్యాయి. కేవలం ఖరీఫ్ ప్రణాళికలో 20 శాతం మాత్రమే రైతులు పంటలు సాగుచేయడం ఆందోళన కలిగిస్తోంది. జిల్లాలో ఆరు లక్షల హెక్టార్లలో వేరుశనగ సాగవుతుండగా జూలై ఆఖరు నాటికి కేవలం 1.59 లక్షల హెక్టార్లలోనే సాగయింది. ఖరీఫ్‌లో వేరుశనగ విత్తనం వేయడానికి జూలై ఆఖరుతో గడువు ముగిసింది. ఇకపై ఆ పంట సాగుచేస్తే దిగుబడి తగ్గిపోతుంది. కాబట్టి వెంటనే ప్రత్యామ్నాయ పంటలకు విత్తనాలు సరఫరా చేయాల్సిన అవసరముంది. కర్నూలు జిల్లాలో ఖరీఫ్‌లో 5,91,102 హెక్టార్లలో పంటలు సాగవుతాయని అంచనా వేశారు. అందులో వర్షాభావ పరిస్థితులతో 2,64,775 హెక్టార్లలోనే పంటలు సాగయ్యాయి. 43 శాతం మాత్రమే ఖరీఫ్ పంటలు సాగయ్యాయి. కడప జిల్లాలో 1,51,120 హెక్టార్లలో పంటలు సాగవుతాయని అంచనా వేయగా జూలై ఆఖరునాటికి 22,840 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. కేవలం 17 శాతం మాత్రమే ఆ జిల్లాలో ఖరీఫ్ పంటలు సాగుచేయడం ఆందోళన కలిగిస్తోంది. చిత్తూరు జిల్లాలో 2,00,038 హెక్టార్లకు గానూ 1,28,736 హెక్టార్లలో మాత్రమే ఖరీఫ్ పంటలు సాగయ్యాయి. ఆ జిల్లాలో 66 శాతం పంటలు సాగైనట్టు గుర్తించారు. ప్రకాశం జిల్లాలో 2,65,609 హెక్టార్లలో ఖరీఫ్ పంటలు సాగవుతాయని అధికారులు అంచనా వేయగా జూలై ఆఖరునాటికి 30,624 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. అంటే కేవలం 13శాతం మాత్రమే పంటలు సాగయ్యాయి. నెల్లూరు జిల్లాలో ఖరీఫ్‌లో 97,519 హెక్టార్లకు గాను ఇప్పటివరకూ 30,686 హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. 40 శాతం పంటలు సాగైనట్టు గుర్తించారు. కాగా, నైరుతి రుతుపవనాల సమయంలో ఖరీఫ్ పంటలపై అనంతపురం జిల్లా మాత్రమే ఆధారపడి ఉండడం విశేషం. తక్కిన జిల్లాలపై ఈశాన్య రుతుపవనాల ప్రభావం ఉండడంతో రబీ పంటలు అధికంగా సాగు చేస్తారు.

ఆరు జిల్లాల్లో లోటు వర్షపాతం..

ఈ సందర్భంగా రాయలసీమ జిల్లాలతోపాటు ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లో జూన్, జూలై నెలల్లో నమోదైన వర్షపాతాలు పరిశీలిస్తే.. అనంతపురం జిల్లాలో జూన్, జూలై సాధారణ వర్షపాతం 122.6 మి.మీ నమోదు కావాల్సి ఉండగా 32.0 మి.మీ లోటుగా నమోదైంది. కర్నూలు జిల్లాలో 177.0 మి.మీ కాగా 15.6 మి.మీ లోటుగా నమోదైంది. కడప జిల్లాలో ఖరీఫ్‌లో ఇప్పటి వరకు కురవాల్సిన సాధారణ వర్షపాతం 153.1 మి.మీ కాగా 17.1 మి.మీ లోటుగా నమోదైంది. చిత్తూరు జిల్లాలో రెండు నెలల సాధారణ వర్షపాతం 169.1 మి.మీ కాగా ఇప్పటివరకూ 27.0 మి.మీ లోటు వర్షపాతం నమోదైంది. ప్రకాశం జిల్లాలో ఖరీఫ్ రెండు నెలల సాధారణ వర్షపాతం 137.1 మి.మీ కాగా 6.7 మి.మీ లోటు నమోదైంది. నెల్లూరు జిల్లాలో రెండునెలల సాధారణ వర్షపాతం 135.5 మి.మీ కాగా ఇప్పటివరకూ 11.4 లోటుగా నమోదైంది. ఈ ప్రభావంతో ఆ ఆరుజిల్లాల్లో ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం కూడా గణనీయంగా తగ్గింది.

ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక విడుదల..

ఖరీఫ్‌లో వేరుశనగసాగుకు అదును దాటడంతో ఇక ప్రత్యామ్నాయ పంటల సాగే శరణ్యమని వర్క్‌షాపులో అధికారులు నిర్ణయించారు. అనంతపురం జిల్లాలో ప్రత్యామ్నాయ పంటల ప్రణాళికను విడుదల చేశారు. అందులో ఆగస్టు 1 నుంచి ఎర్ర నేలల్లో కంది, జొన్న సజ్జ, కొర్ర, ఆముదం, పెసర, అలసంద, అనుములు, ఉలవ, ప్రొద్దుతిరుగుడు, గోరుచిక్కుడు పంటలు సాగుచేస్తే మంచి ఫలితాలు వస్తాయని సూచించారు. సెప్టెంబరు నెలలో జొన్న, సజ్జ, పెసర, అలసంద, అనుములు, గోరుచిక్కుడు సాగుచేయవచ్చునన్నారు. నల్లరేగడి నేలల్లో ఆగస్టులో కంది, జొన్న, కొర్ర, ఆముదం, పెసర, అలసంద, అనుములు, ప్రొద్దుతిరుగుడు, గోరుచిక్కుడు సాగుచేయవచ్చునని సూచించారు. సెప్టెంబరులో జొన్న, కొర్ర, పెసర, అనుములు, ప్రొద్దుతిరుగుడు, గోరుచిక్కుడు సాగుచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చునన్నారు. ఇతర జిల్లాల వారు కూడా ఈ ప్రణాళిక ప్రకారం ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయవచ్చునని సూచించారు. వర్క్‌షాపులో వ్యవసాయశాఖ కమిషనర్ హరిజవహర్‌లాల్, పరిశోధనకేంద్రం రాష్ట్ర డైరెక్టర్ ఎన్‌వీ నాయుడు, సీఆర్‌ఐడీ ప్రధాన శాస్త్రవేత్త, నోడల్ ఆఫీసర్ కేవీ రావు, ఆచార్య ఎన్‌జీ రంగా విస్తరణ సంచాలకుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాతావరణ ఒడిదుడుకులతో రైతులు చితికిపోతారు

- డాక్టర్. ఎన్‌వీ నాయుడు, డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్

వాతారణ పరిస్థితుల్లో ఒడిదుడుకులు ఏర్పడితే రైతులు చితికిపోతారు. ఈయేడాది అలాంటి పరిస్థితే ఎదురైంది. ఖరీఫ్ పంటల సాగు గణనీయంగా తగ్గిపోయింది. ప్రధానంగా వేరుశనగపై ఆధారపడిన అనంతపురం లాంటి జిల్లాల్లో అదును దాటింది. 80 శాతం పంటలు సాగుకాలేదు. ప్రత్యామ్నాయ పంటలు సాగు చేసుకోకపోతే రైతులు తీవ్రంగా నష్టపోతారు.

వర్షం తక్కువగా కురిసినా తట్టుకునే పంటలు వేసుకోవాలి: డాక్టర్ కేవీరావు, ప్రిన్సిపల్ సైంటిస్టు, భారత వ్యవసాయ పరిశోధనా మండలి

ఈఏడాది ఖరీఫ్‌లో వర్షాలు తక్కువగానే ఉంటాయని అంచనా వేశాం. ఖరీఫ్‌లో ఇప్పటికే రెండునెలల సమయం పూర్తయింది. ప్రధాన పంటలకు అదును దాటింది. ఇక మిగిలిన రెండునెలల్లో పండే పంటలనే వేసుకోవాలి. వర్షం తక్కువగా కురిసినా తట్టుకునే పంటలు ఎంచుకోవాలి. అలాంటి పంటల ప్రణాళికనే మేము తయారు చేసి జిల్లాల అధికారులకు అందజేశాం.

నేటినుంచే అంతర పంటల విత్తనాలివ్వండి

15లోగా పంపిణీ పూర్తి చేయండి

ప్రత్యామ్నాయ పంటలకు సిద్ధం కండి

వ్యవసాయ ప్రత్యేక కమిషనర్ హరిజవహర్‌లాల్

బుక్కరాయసముద్రం: ఖరీఫ్ గడువు ముగిసినా జిల్లాలో వర్షాలు సరిగా కురవనందున ప్రత్యామ్నాయపంటల సాగుకు రైతులు సిద్ధం కావాలని రాష్ట్ర వ్యవసాయ ప్రత్యేక కమిషనర్ హరిజవహర్‌లాల్ సూచించారు. ఇందుకు వీలుగా బుధవారం నుంచి జిల్లాలో ఇప్పటికే అందుబాటులో ఉన్న అంతర పంటల విత్తనాలను రైతులకు అందజేసే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టు 15లోగా వాటిని రైతులకు పూర్తిగా అందజేయనున్నట్లు పేర్కొన్నారు. మండల పరిధిలోని రేకులకుంటలో గల ఆచార్యఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రంలో ప్రత్యామ్నాయ పంటల సాగు, ఆరు జిల్లాల్లోని వర్షాభావ పరిస్థితులు, పంటల ప్రణాళికపై మంగళవారం వర్క్‌షాపు నిర్వహించారు. ఇందులో హరిజవహర్‌లాల్‌తో పాటు రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల జేడీఎలు, ఏడీఏలు, నోడల్ అధికారి కేవీరావు, ఇతర ప్రధాన శాస్త్రవేత్తలు, రాష్ట్ర వ్యవసాయ పరిశోధన కేంద్రం డైరెక్టర్ ఎన్వీ నాయుడు, విస్తరణ సంచాలకుడు రాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు. రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో కరువు, పంటల పరిస్థితులపై చర్చించారు. ఇందులో ప్రత్యామ్నాయ పంటల సాగుపై పలు సూచనలు చేశారు. ప్రత్యామ్నాయ పంటల విత్తనాలు ఏ మేరకు అవసరం, సబ్సిడీ ఎలా ఇవ్వాలి, ఏ జిల్లాలో వర్షపాతం ఎంతలోటుంది?, వర్షం కురిసిన మండలాలేవి? వంటివాటిపై జిల్లాల వారీగా నివేదికలు తయారు చేయాలని హరిజవహర్‌లాల్ సూచించారు. జిల్లాల వారీగా వ్యవసాయాధికారులు, శాస్త్రవేత్తలు ఇచ్చిన నివేదికలను ప్రభుత్వం దృష్టికి తీసుకుపోనున్నట్లు వెల్లడించారు. అంతర పంటలు కంది జొన్న, సజ్జ, కొర్ర, అలసంద, పెసర, అనుములు, ఉలవ, జొన్న, మేత జొన్న, సజ్జ వంటి పంటలు సాగు చేయాలన్నారు. ఈ పంటలపై రైతులకు అవగాహన కల్పించాలన్నారు. వేరుశనగ సాగు చేయవద్దని సూచించాలన్నారు. బుధవారం నుంచే జిల్లాలో అంతర పంటల విత్తనాల పంపిణీకి చర్యలు చేపట్టాలన్నారు. ఆగస్టు 15లోగా పంపిణీ పూర్తిచేయాలన్నారు. సబ్సిడీ ధర ఇంకా నిర్ణయించలేదన్నారు. అంతర పంటలకు సంబంధించిన కరపత్రాన్ని సమావేశంలో విడుదల చేశారు. సమావేశానంతరం బుక్కరాయసమ్రుదం ఎస్‌బీఐ శాఖను సందర్శించి ఇన్‌పుట్‌సబ్సిడీ పంపిణీ తీరు గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు.

గార్లెదిన్నె, గడేకల్లు ఖాళీలపై గొడవ

(మొదటి పేజీ తరువాయి)

కౌన్సెలింగ్ హాల్‌లోకి వచ్చారు. అదే సమయంలో గార్లదిన్నె ఎంపీపీఎస్ పాఠశాలలో పనిచేస్తున్న ఓ టీచర్ బొమ్మనహాళ్ మండలానికి వెళ్లారు. దీంతో గార్లదిన్నె ప్లేస్ అరైజింగ్ ఖాళీ ఏర్పడింది. ఆ ప్లేస్‌ను తనకు ఇవ్వాలని ఆయన(2081) పట్టుబట్టారు. ఇందుకు కొందరు నాయకులు మద్దతుగా నిలిచారు. అయితే అరైజింగ్ ఖాళీలు ఎలా కేటాయిస్తారని ఇతర ఉపాధ్యాయులు ప్రశ్నించారు. అలాగే మరికొందరు నాయకులు కూడా అలా కేటాయించడం సరికాదని తప్పుబట్టారు. ఈ విషయమై కొద్దిసేపు వివాదం కొనసాగింది. ఆ తరువాత యథాతథంగా సీరియల్ నెంబర్ ప్రకారం మరో టీచర్‌కే అధికారులు గార్లదిన్నె ప్లేసు కేటాయించడంతో సమస్య సద్దుమణిగింది. ఆ తరువాత మరో వివాదం తెరపైకి వచ్చింది. విడపనకల్లు మండలం గడేకల్లు ఎంపీపీఎస్‌లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయి. 616 నెంబర్‌కు చెందిన శైలజ, 911 నెంబర్‌కు చెందిన మస్తాన్ ముందుగానే కోరుకుని అక్కడికి వెళ్లారు. అయితే 2675 సీరియల్ నెంబర్‌కు చెందిన లక్ష్మీప్రసాద్ అనే టీచర్‌కు మంగళవారం ఇంకో పోస్టు ఖాళీగా ఉన్నట్లు చూపగా.. ఆయన దాన్ని కోరుకున్నారు. అయితే అక్కడ ఖాళీ లేదని, కావాలని చూపించి ఇచ్చారని తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం (టీఎన్‌యూఎస్) నాయకుడు రామలింగయ్య తదితరులు అధికారులతో వాదనకు దిగారు. దీనిపై చర్యలు తీసుకోవాలని డీఈఓకు ఫిర్యాదు చేశారు. ఆన్‌లైన్‌లో పరిశీలించగా.. అక్కడ రెండే ఖాళీలున్నట్లు చూపించింది. దీంతో మూడవ పోస్టు ఎలా వచ్చిందని టీఎన్‌యూఎస్ నాయకులు ప్రశ్నించారు. ఇలా గార్లదిన్నె. గడేకల్లు ఖాళీలపై వివాదం తలెత్తింది. ఈ రెండు అంశాలూ మినహా కౌన్సెలింగ్ ప్రశాంతంగానే ముగిసింది.

నేడు మిగులు ఎస్‌జీటీలందరికీ కౌన్సెలింగ్..

ఉపాధ్యాయుల కౌన్సెలింగ్ బుధవారం ముగియనుంది. ఇప్పటివరకు 3300 సీరియల్ నెంబర్ వరకు గల ఎస్‌జీటీలకు కౌన్సెలింగ్ నిర్వహించారు. బదిలీకి దరఖాస్తు చేసుకున్న మిగిలిన ఎస్‌జీటీలందరికీ బుధవారం కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ లక్ష్మీనారాయణ తెలిపారు. ఉదయం 8 గంటలకు ఆ ఉపాధ్యాయులందరూ తప్పనిసరిగా హాజరుకావాలన్నారు. మొత్తమ్మీద బదిలీల కౌన్సెలింగ్ ముగింపు దశకు చేరుకోవడంతో అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు.

పండిట్ల అప్‌గ్రెడేషన్‌కు ఆమోదం

5లోగా ప్రమోషన్లు కల్పించాలని ఉత్తర్వులు

ఊపిరిపీల్చుకున్న మిగులు భాషా పండితులు

అయినా హిందీ, పీఈటీలకు తిప్పలే

అనంతపురం అర్బన్: ఎల్‌పీ తెలుగు, హిందీ పోస్టుల అప్‌గ్రెడేషన్‌కు రాష్ట్ర విద్యాశాఖ ఆమోదం తెలిపింది. నాలుగు నెలల క్రితమే ఇందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినా.. ఎస్‌జీటీ, ఎల్‌పీ పండిట్ల మధ్య వివాదం తలెత్తి న్యాయస్థానం వరకు వెళ్లడంతో ప్రక్రియ ముందుకు సాగలేదు. ఇలాంటి పరిస్థితుల్లో బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. ప్రస్తుత బదిలీల్లో అప్‌గ్రేడ్ పోస్టులకు ఎస్‌ఏ పండిట్లను పంపారు. దీంతో ఎల్‌పీ పండిట్లకు పోస్టులు కరువయ్యాయి. జిల్లాలో ఎల్‌పీ తెలుగులో 58 మంది డీఈఓ పూల్‌లో మిగిలి ఉన్నారు. హిందీలో 28 మంది, పీఈటీలు 32 మంది మిగిలి ఉన్నారు. ఇది సమస్యగా మారడంతో తెర దించేందుకు విద్యాశాఖ డైరెక్టర్ సంధ్యారాణి అప్‌గ్రెడేషన్‌కు ఆమోదం తెలిపారు. ఈనెల 5వ తేదీ లోగా ప్రమోషన్లు కల్పించి భర్తీ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో పండిట్లకు ప్రమోషన్లు లభించనున్నాయి. ఎస్‌ఏ తెలుగు పోస్టులు 84 అప్‌గ్రేడ్ అయ్యాయి. ఇందులో 70 శాతం పోస్టులకు పదోన్నతులు కల్పించనున్నారు. ఈ లెక్కన జిల్లాపరిషత్ పాఠశాలల్లో 56, ప్రభుత్వ పాఠశాలల్లో ఇద్దరు చొప్పున 58 మందికి పదోన్నతులు దక్కనున్నాయి. అయినా ఇంకా 11 మంది ఎల్‌పీ తెలుగు ఉపాధ్యాయులకు పోస్టుల కొరత ఏర్పడనుంది. ఎస్‌ఏ తెలుగు పోస్టుల్లో ఖాళీలు ఏర్పడుతుండడంతో వారిని అక్కడ నియమించి మరో ఎస్‌జీటీ కేడర్ పోస్టులో జీతాలు చెల్లించేందుకు విద్యాశాఖ నిర్ణయం తీసుకుంది. అలాగే హిందీలోనూ 40 పోస్టులు అప్‌గ్రేడ్ అయ్యాయి. 70 శాతం మేరకు.. అంటే 28 మందికి పదోన్నతులు దక్కనున్నాయి. అయితే హిందీలో 45 మంది ఎల్‌పీ హిందీ పండిట్లు ప్రస్తుత బదిలీల్లో మిగిలి ఉన్నారు. ఉద్యోగోన్నతులు పోగా.. ఇంకా 17 మంది ఎల్‌పీ హిందీ పండిట్లు ఉంటారు. జిల్లాలో ఎస్‌ఏ హిందీలో 12 ఖాళీలు మిగిలి ఉంటాయి. వాటిలో మిగిలి ఉన్న ఎల్‌పీ హిందీ టీచర్లను సర్దుబాటు చేసినా ఇంకా ఐదుగురు మిగిలిపోనున్నారు. అలాగే పీఈటీల్లోనూ ఇదే పరిస్థితి ఏర్పడింది. ఇక్కడ 104 పోస్టులు అప్‌గ్రేడ్ చేయగా.. 70 శాతం నిబంధనల మేరకు 72 పోస్టులకు ప్రమోషన్లు దక్కనున్నాయి. అయితే ఇక్కడ ప్రస్తుత బదిలీల్లో 32 మంది పీఈటీలు మిగిలి.. డీఈఓ పూల్‌లో ఉన్నారు. మిగిలిన పీడీ పోస్టులకు సర్దుబాటు చేసినా.. ఇంకా మిగిలిపోతున్నారు. వీరిని ఎక్కడ ఎక్కువ మంది పిల్లలుంటే ఆ పాఠశాలలకు సర్దుబాటు చేసి ఎస్‌జీటీ కేడర్‌లో ఎగ్జినెస్ట్ పోస్టులో వేతనాలు ఇచ్చేందుకు విద్యాశాఖ అడుగులు వేస్తోంది. ప్రమోషన్లకు రాష్ట్రశాఖ ఆమోదం వేయడంతో భాషా పండితులు ఊపిరిపీల్చుకుంటున్నారు. అయినా ఇంకా ఎల్‌పీ హిందీ, పీఈటీలకు తిప్పలు తప్పడం లేదు. ఈ ప్రక్రియ వేగవంతం చేసేదిశగా విద్యాశాఖ అడుగులు వేస్తోంది. 5వ తేదీలోగా ఉద్యోగోన్నతులు కల్పించి మిగులు టీచర్లకు ప్లేస్‌మెంట్లు చూపించి సమస్యను పరిష్కరించేందుకు డీఈఓ లక్ష్మీనారాయణ, ఏడీ ఎఓ జయచంద్రనాయుడు జాబితా తయారు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పండిట్లకు మరోసారి రీకౌన్సెలింగ్ నిర్వహించి ప్లేస్‌లు కేటాయించనున్నారు.

పింఛన్ల పంపిణీలో

సాంకేతిక సమస్య

(మొదటి పేజీ తరువాయి)

అందజేసి రాష్ట్రంలో జిల్లా మూడవ స్థానంలో నిలిచిందన్నారు. బుధవారం నుంచి ఎలాంటి సమస్య ఉండదని తెలిపారు.

మొరాయించిన సర్వరు

పింఛన్ల కోసం వృద్ధుల పడిగాపులు

గుత్తి: సర్వర్ మొరాయించడంతో గుత్తి మున్సిపాలిటీ పరిధిలో పింఛన్ల పంపిణీకి తీవ్ర అంతరాయం కలిగింది. దీంతో లబ్ధిదారులు పడిగాపులు కాయాల్సి వచ్చింది. ఉదయం 6 గంటల నుంచి పింఛన్లు పంపిణీ చేయాలనే ఆదేశాలుండడంతో మున్సిపల్ అధికారులు ఆ మేరకు కసరత్తు చేసినప్పటికీ మధ్యాహ్నం 12 గంటల వరకు సర్వర్ పని చేయలేదు. దీంతో వృద్ధులు ఉదయం నుంచి పింఛన్ కోసం పంపిణీ కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తూ తమ గోడు వెల్లబోసుకున్నారు. పింఛన్ ఇస్తారా? లేదా? అంటూ వారు అసహనం ప్రదర్శించారు. గతంలో ఉన్న పద్ధతే బాగుండేదని, ప్రస్తుతం వేలిముద్రల విధానం ప్రవేశపెట్టడంతో సమయానికి పింఛన్ అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్‌ను వివరణ కోరగా ఉదయం నుంచే సర్వర్లు పని చేయక పింఛన్ల పంపిణీకి ఇబ్బందికరంగా మారిందన్నారు.



గాయపడిన పద్మావతి

కత్తిపట్టిన ఉన్మాదం!

తల్లి, భార్య, కూతురిపై కొడవలితో దాడి..

అర్ధరాత్రి దాటే వరకు ఏం చేశావని నిలదీసినందుకు ఘాతుకం..

పావగడ: ఉన్మాదం కత్తి పట్టింది. రాత్రి ఆలస్యంగా ఇంటికి ఎందుకొచ్చవనీ, ఇప్పటిదాకా ఏం చేశావని.. నిలదీసిన తల్లి, అడ్డువచ్చిన భార్య, కుమార్తెపై స్థానిక ఎస్‌బీఎం బ్యాంక్ క్యాషియర్ రాఘవేంద్రాచారి కొడవలితో విచక్షణా రహితంగా దాడి చేశాడు. ధర్మవరానికి చెందిన ఇతడు పదేళ్లుగా పావగడ ఎస్‌బీఎంలో క్యాషియర్‌గా పనిచేస్తున్నాడు. స్థానిక రైన్‌గేజ్‌లో నివాసముంటున్నాడు. ఎప్పటిలాగే సోమవారం అర్ధరాత్రి దాటాక ఇంటికెళ్లి తలుపుతట్టాడు. రాత్రి 2 గంటలవడంతో ఇంత సేపు ఎక్కడికెళ్లావని తల్లి పద్మావతి మందలించింది. దీంతో ఆగ్రహించిన రాఘవేంద్రాచారి ఒక్కసారిగా కొడవలి తో ఆమెపై దాడి చేశాడు. అడ్డుకునేందుకు వచ్చిన భార్య మాధవి, కూతురు ప్రవల్లికపై కూడా విచక్షణా రహితంగా దాడి చేశాడు. దీనిని గమనించి ఇంటి యజమాని నాగాచారి పోలీసులకు సమాచారం అందించాడు. వెంటనే గాయపడిన వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం బెంగుళూరు తీసుకెళ్లారు. పద్మావతి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. రాఘవేంద్రాచారికి మతిస్థిమితం లేక దాడి చేసినట్లు బంధువులు తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ మహేష్, ఎస్‌ఐ మల్లికార్జున తెలిపారు.







బ్యాంక్ క్యాషియర్ రాఘవేంద్రాచారి, అతడి దాడిలో గాయపడిన భార్య మాధవి, కూతురు ప్రవల్లిక

దంపతులపై కత్తితో దాడి



గాయపడిన నాగప్ప

సోమందేపల్లి: స్థానిక ఎస్సీ కాలనీకి చెందిన శాంతమ్మ, నాగప్ప దంపతులపై మంగళవారం సాయంత్రం ఆంజనేయులు అనే వ్యక్తి కత్తితో దాడి చేశాడు. రెండ్రోజుల క్రితం శాంతమ్మను వేధిస్తున్నాడన్న కారణంతో నాగయ్య.. ఆంజనేయులును మందలించాడు. దీంతో కక్ష పెంచుకున్న ఆంజనేయులు.. ఇంట్లో ఉన్న నాగప్ప దంపతులపై కత్తితో విరుచుకుపడ్డాడు. నాగప్పకు నాలుగుచోట్ల, శాంతమ్మ మెడ, ఛాతీ భాగాల్లో కత్తిపోట్లు తగిలాయి. స్థానికులు వెంటనే విషయాన్ని పోలీసులకు తెలపడంతో ఎస్‌ఐ ప్రసాద్ ఘటనాస్థలానికి చేరుకుని, గాయపడిన వారిని పెనుకొండ ఆస్పత్రికి తరలించారు. దీనిపై నాగప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. కత్తితో దాడి చేయడానికి మందలింపే కారణమా.. ఇతర కారణాలేవైనా ఉన్నాయా.. అనే విషయం పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

అనంతలో పగలే చోరీ

ఆంధ్రజ్యోతి, అనంతపురం: జిల్లా కేంద్రంలోని మారుతీనగర్‌లో పట్టపగలే చోరీ చేశారు. మారుతీనగర్ 4వ క్రాస్‌కు చెందిన భూదేవి మంగళవారం ఇంటికి తాళం వేసి, బయటికెళ్లింది. అదను చూసిన దొంగలు ఇంట్లోకి చొరబడ్డారు. బీరువాను పగలకొట్టి, అందులో ఉన్న రెండున్నర తులాల బంగారు ఆభరణాలు, రూ.1500 నగదు అపహరించారు. దీనిపై బాధితురాలు నాలుగో పట్టణ పోలీసులకు ఫిర్యాదుచేసింది. వారు దర్యాప్తు చేస్తున్నారు.

పింఛన్ తీసుకుంటూ వృద్ధురాలి మృతి

కుందుర్పి: మండలంలోని బెస్తరపల్లికి చెందిన బోయ లక్ష్మమ్మ (68) మంగళవారం పింఛన్ తీసుకుంటూ గుండెపోటుతో మృతిచెందింది. ఒకటో తేదీ కావడంతో ఈమె పింఛన్ కోసం గ్రామంలోని పంచాయతీ కార్యాలయానికి చేరుకుంది. పింఛన్ కోసం వేలిముద్ర వేస్తుండగా, గుండెపోటుతో మృతిచెందినట్లు సర్పంచ్ రాఘవేంద్రబాబు, జడ్పీటీసీ మల్లికార్జున తెలిపారు.

వేర్వేరుచోట్ల ఇద్దరి ఆత్మహత్య



మృతిచెందిన షకీలాభాను

పామిడి/తాడిపత్రి టౌన్: జిల్లాలో వేర్వేరుచోట్ల మంగళవారం ఇద్దరు ఆత్మహత్య చేసుకున్నారు. పామిడిలోని కాగితాల మఖానం సమీపాన షకీలాభాను (30), వన్నూరువలి దంపతులు తమ ముగ్గురు పిల్లలతో నివసిస్తుండేవారు. షకీలాభాను కుట్టుమిషన్, వన్నూరువలి వస్త్రాల కటింగ్ చేస్తూ జీవనం సాగించేవారు. ఈ నేపథ్యంలోనే షకీలాభాను మంగళవారం తెల్లవారుజామున ఉరేసుకుని, మరణించింది. ఈమెకు కుమార్తెలు అక్సర్, కౌసర్, కుమారుడు సుబహాన్ ఉన్నట్లు తెలిసింది. మృతికి కారణాలు తెలియరాలేదు. ఎస్‌ఐ రవిశంకర్‌రెడ్డిని అడగ్గా.. తమకు ఫిర్యాదు అందలేదన్నారు.

కడుపునొప్పి భరించలేక..

తాడిపత్రి పట్టణంలోని టైలర్స్‌కాలనీకి చెందిన రాంప్రసాద్(30) కడుపునొప్పి భరించలేక మంగళవారం ఆత్మహత్య చేసుకున్నాడు. అనంతపురంలోని శ్రీనివాసనగర్‌కు చెందిన రాంప్రసాద్ రెండేళ్ల క్రితం జీవనోపాధి నిమిత్తం తాడిపత్రికి వచ్చాడు. ఇక్కడ టైలర్స్ కాలనీలో ఉంటూ సెల్‌పాయింట్‌లో పనిచేస్తుండేవాడు. కొన్నాళ్లుగా కడుపునొప్పితో బాధపడుతుండేవాడు. పలుచోట్ల వైద్యం చేయించినా నయం కాలేదు. దీంతో మనస్తాపం చెంది, తెల్లవారుజామున పురుగుల మందు తాగి, మరణించాడు. ఇతడికి భార్య సునీత, కుమారుడు, కుమార్తె ఉన్నారు. రాంప్రసాద్ తండ్రి రామసుబ్బయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాస్‌గౌడ్ తెలిపారు.

అధ్యాపకుడి అనుమానాస్పద మృతి



మృతిచెందిన నరేష్

గోరంట్ల రూరల్: పట్టణానికి చెందిన జువాలజీ అధ్యాపకుడు నరేష్ (33) అనుమానాస్పద స్థితిలో సోమవారం రాత్రి మృతిచెందాడు. ఇతడు ఓడీసీలోని విజ్ఞాన్ కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తుండేవాడు. 2011లో గోరంట్లకు చెందిన భవానిని ప్రేమించి, పెళ్లి చేసుకున్నాడు. భవానికి అంతకుముందే పెళ్లవగా.. భర్త మరణించాడు. నరేష్‌ను రెండో పెళ్లి చేసుకుంది. భార్యాభర్తలతోపాటు నరేష్ తల్లి సరోజమ్మ, అవ్వ అంజినమ్మ గోరంట్లలో ఉండేవారు. నరేష్ వివాహేతర సంబంధం పెట్టుకున్నాడన్న అనుమానంతో ఏడాదికాలంగా ఇద్దరూ గొడవపడేవారు. మూడు రోజులుగా గొడవ తీవ్రమైంది. ఈ నేపథ్యంలోనే సోమవారం అర్ధరాత్రి నరేష్ పురుగుల మందు తాగి, ఆత్మహత్య చేసుకున్నాడని భవాని.. హాస్టల్‌లో పనిచేస్తున్న అత్త సరోజమ్మకు తెలిపింది. వెంటనే గోరంట్ల ఆస్పత్రికి తరలించగా.. మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. తన కుమారుడిని భవాని హతమార్చిందని సరోజమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. నరేష్ మర్మాంగాలపై ఒత్తిడి తేవడంతోనే మరణించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. దీంతో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్లు తెలిపారు. పుట్టపర్తి ఇన్‌చార్జి డీఎస్పీ శివరామిరెడ్డి, ధర్మవరం సీఐ హరినాథ్ గోరంట్ల వచ్చి విచారించారు. పోస్టుమార్టం నివేదిక వస్తే.. ఓ అంచనాకు రావొచ్చని డీఎస్పీ తెలిపారు.

రోడ్డు ప్రమాదాలను నివారించండి

బుక్కరాయసముద్రం: రోడ్డు ప్రమాదాలను నివారించాల్సిన బాధ్యత పోలీసులపై ఉందని ఎస్పీ జీవీజీ అశోక్‌కూమార్ తెలిపారు. ఇటీవలిగా అనంతపురం-తాడిపత్రి రహదారిలో పలు రోడ్డు ప్రమాదాలు జరిగాయి. వీటిలో పలువురు మృతి చెందడంతో ప్రమాదాలకు కారణమేంటని ఆరా తీస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఎస్పీ అశోక్ కుమార్, డీఎస్పీలు మల్లికార్జున వర్మ, మహబూబ్ బాషా, కాశీం సాహెబ్ అనంతపురం- తాడిపత్రి రోడ్డును పరిశీలించారు. ప్రమాదాలపై ఎస్పీ చర్చించారు. ఈ రోడ్డు మలుపులు ఎక్కువగా ఉండటంతోనా? అతి వేగంతోనా? అనే అంశంపై విచారించారు. ఎస్పీ మాట్లాడుతూ.. అనంతపురం-తాడిపత్రి రోడ్డులోని నాలుగు కిలోమీటర్ల వరకు డేంజర్ జోన్‌గా గుర్తించామన్నారు. ఈ రోడ్డులో నాన్ ఓవర్‌టేకింగ్ జోన్‌గా గుర్తించి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రమాదాలను నివారించడానికి ఆర్‌అండ్‌బీ, నేషనల్ హైవే అధికారులతో సంప్రదించి, రోడ్డు పక్కన లైట్లు, ప్రమాద సూచికలు, స్పీడ్ బ్రేకర్లు, రేడియం స్టికర్లతోపాటు సూచికలు ఏర్పాటు చేస్తామన్నారు. రాత్రి సమయాల్లో సరైన వెలుతురు లేని కారణంగా కొన్ని ప్రమాదాలు సంభవిస్తున్నట్లు గుర్తించారు. త్వరలోనే ఈ రోడ్డుపై ప్ర మాద సూచికలు పెట్టడంతోపాటు రోడ్డు ప్రమాదాలు నివారించడంపై ప్రత్యేక దృష్టి సారిస్తామన్నారు. అనంతరం బుక్కరాయ సముద్రం పోలీసుస్టేషన్‌ను ఎస్పీ తనిఖీ చేశారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి, చెట్లను విరివిగా పెంచడం పట్ల సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ యాదవ్ పాల్గొన్నారు.



రోడ్డు ప్రమాదాల నివారణపై సూచనలిస్తున్న ఎస్పీ

ఆర్‌ఎస్‌ఐ, కానిస్టేబుళ్ల వాగ్వాదం

ఆంధ్రజ్యోతి, అనంతపురం: క్రమశిక్షణకు మారుపేరైన పోలీసు శాఖలో శిక్షణ గాడి తప్పుతోంది. మంగళవారం ఏఆర్ విభాగంలో తలెత్తిన ఘటనే ఇందుకు నిదర్శనం. ఆర్‌ఎస్‌ఐ జాఫర్, కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, వీరన్న మధ్యం తీవ్రస్థాయిలో వాగ్వాదం సాగింది. డ్యూటీ విషయంలో తలెత్తిన వాగ్వాదం కాస్తా ఘర్షణకు దారితీసినట్లు పోలీసు వర్గాల ద్వారా అందిన సమాచారం. ఆర్‌ఎస్‌ఐ జాఫర్ తమను దూషించడంతోపాటు, దాడి చేశాడని కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, వీరన్న చెబుతున్నారు. తాను వారిపై దాడి గానీ, దూషణ గానీ చేయలేదని డ్యూటీకి వెళ్లాలని మాత్రమే చెప్పానని ఆర్‌ఎస్‌ఐ జాఫర్ అంటున్నాడు. పరస్పరం ఇరువర్గాలు డీఎస్పీ చిన్నికృష్ణకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం కాస్తా ఎస్పీ, డీఐజీ, ఐజీల దృష్టికి కూడా వెళ్లినట్లు తెలిసింది. విధి నిర్వహణలో బాధ్యతారాహిత్యంగా వ్యవహరించినట్లు విచారణలో తేలితే వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకునే అవకాశం లేకపోలేదు. జాఫర్ కొంతకాలంగా ఆర్‌ఎస్‌ఐగా ఏఆర్ విభాగంలో పనిచేస్తున్నారు. అదే విభాగంలో కానిస్టేబుళ్లుగా శ్రీనివాసులు, వీరన్న విధులు నిర్వర్తిస్తున్నారు. పది రోజుల క్రితం కానిస్టేబుళ్లిద్దరూ ఇంటెలిజెన్స్ టర్మ్ డ్యూటీలో భాగంగా హైదరాబాద్ వెళ్లారు. మంగళవారం ఉదయం జిల్లా కేంద్రానికి చేరుకున్నారు. ఆర్‌ఎస్‌ఐ జాఫర్ వద్దకు వెళ్లారు. వీరిద్దరినీ చూసిన ఆర్‌ఎస్‌ఐ వారికి డ్యూటీ వేసేందుకు సిద్ధమయ్యారు. కిర్లంపూడికి బందోబస్తుకు వెళ్లాలని సూచించారు. తాము పది రోజులపాటు బందోబస్తు డ్యూటీ చేసి, ఈరోజే వచ్చామనీ, మళ్లీ కిర్లంపూడి వెళ్లమంటే ఎలా అంటూ ప్రశ్నించే ధోరణిలో మాట్లాడినట్లు సమాచారం. ఈ క్రమంలోనే సదరు ఆర్‌ఎస్‌ఐ కోపంతో వారి పట్ల దురుసుగా వ్యవహరించారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ఆ వ్యవహారమే.. ఇంతటి వివాదానికి దారితీసినట్లు పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి.

అనారోగ్యంతో ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ మృతి



హెడ్‌కానిస్టేబుల్ అయుబ్ ఖాన్ (ఫైల్)

ఆంధ్రజ్యోతి, అనంతపురం: ఏఆర్ హెడ్‌కానిస్టేబుల్ అయూబ్‌ఖాన్ (46) అనారోగ్యంతో మంగళవారం మృతిచెందారు. ఈయన కొంత కాలంగా కామెర్ల వ్యాధితో బాధపడుతుండేవాడు. జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయారు. ఆయన మృతదేహాన్ని సందర్శనార్థం పోలీసు హెడ్ క్వార్టర్స్‌లోని ఆయన నివాసంలో ఉంచారు. అయూబ్‌ఖాన్ మృతిపై ఎస్పీ అశోక్‌కుమార్‌తోపాటు పోలీసు అధికారుల సంఘం జిల్లా అధ్యక్షుడు త్రిలోక్‌నాథ్, కార్యనిర్వాహక కార్యదర్శి సుధాకర్, సభ్యులు మసూద్‌వలి, హరినాథ్, ఏఆర్ డీఎస్పీ చిన్నికృష్ణ తదితరులు మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. ఆయన మృతికి సంతాపం వ్యక్తం చేశారు.

బస్సు లేని పాసులెందుకు?



గూడమేకలపల్లి నుంచి నల్లమాడకు కాలినడకన వెళ్తున్న విద్యార్థులు

బడికెళ్లాలంటే కాలినడకే శరణ్యం..

నల్లమాడ: రోజేశారు. బస్సు పాసులిచ్చారు. బస్సులే లేవు. అన్నీ ఉన్నా.. బడికెళ్లాలంటే విద్యార్థులకు కాలినడక తప్పట్లేదు. బస్సు లేనపుడు పాసులు ఏం చేసుకోవాలో ఆర్టీసీ అధికారులే సెలవియ్యాలి. మండలంలో నాలుగు ఉన్నత పాఠశాలలు, జూనియర్, ప్రైవేటు డిఎల్‌ఈడీ కళాశాలలున్నాయి. నల్లమాడ నుంచి పులగంపల్లి వరకు కోట్ల రూపాయలతో పైగా వెచ్చించి, తారు రోడ్డు అభివృద్ధి చేశారు. ప్రతినెలా పుట్టపర్తి, కదిరి ఆర్టీసీ డిపోల నుంచి అధికారులు, సిబ్బంది వచ్చి పోటా పోటీగా 'మేళా'లు పెట్టి విద్యార్థులకు బస్సు పాసులు, ప్రయాణికులకు క్యాట్ కార్డులు జారీ చేశారు. బస్సులు నడపడం మాత్రం మరచిపోయారు. కదిరి నుంచి కొండమనాయని పాళ్యం మీదుగా పుట్టపర్తికి మాత్రమే బస్సులు నడుపుతున్నారు. ఫలితంగా చాలా గ్రామాల విద్యార్థులు పాఠశాలలకు కాలినడకనే వెళ్లాల్సి వస్తోంది. మరి కొన్ని గ్రామాల విద్యార్థులు ఆటోలు, ప్రైవేటు వాహనాలను ఆశ్రయిస్తున్నారు. మండలంలో నల్లమాడ, రెడ్డిపల్లి, పులగంపల్లి, దొన్నికోట గ్రామాల్లో ఉన్నత పాఠశాలలున్నాయి. నల్లమాడ మండల కేంద్రం నుంచి వివిధ గ్రామాలను కలుపుతూ కదిరి వెళ్లేందుకు నాలుగు మార్గాల్లో రోడ్లు వేశారు. కదిరి నుంచి దొన్నికోట మీదుగా నల్లమాడ రావడానికి ఒక్క బస్సు కూడా లేదు. ఈ రూట్లో ఉన్న గూడమేకలపల్లి, ముత్యాలగారిపల్లి, మసకవంకపల్లి, చెర్లోపల్లి, చౌటుకుంటపల్లి, ఎద్దులవాండ్లపల్లి, ఎద్దులవాండ్లపల్లి తాండాల నుంచి సుమారు 100 మంది విద్యార్థులు దొన్నికోట, నల్లమాడ పాఠశాలలకు వెళ్తారు. ఈ రూట్‌లో ఒక్క బస్సు కూడా లేకపోవడంతో ఆటోలను ఆశ్రయిస్తున్నారు. లేదంటే కాలినడకన వస్తున్నారు. మలకవేముల క్రాస్ నుంచి రెడ్డిపల్లి మీదుగా నల్లమాడకు గతంలో పుష్కలంగా బస్సులుండేవి. ఇప్పుడు ఒక్క బస్సు కూడా లేకపోవడంతో రూట్‌లో ఉన్న గ్రామాల విద్యార్థులు, ప్రజలు ఆటోలను ఆశ్రయిస్తున్నారు. చారుపల్లి మీదుగా నల్లమాడకు ఒకే ఒక బస్సు అది కూడా విద్యార్థుల కోసమే నడపుతున్నారు. వంకరకుంట నుంచి రెడ్డిపల్లికి ఉదయం బస్సులో వచ్చే విద్యార్థులు తిరుగు ప్రయాణం మాత్రం కాలినడకే. ఇటీవలే కదిరి పుట్టపర్తి డిపోల అధికారులు వచ్చి దాదాపు 100 మంది విద్యార్థులకు రాయితీ, ఉచిత పాసులు, ప్రయాణికులకు క్యాట్, వనిత కార్డులు జారీ చేశారు. త్వరలోనే బస్సులు నడుపుతామని ప్రకటించారు. ఇంతవరకు బస్సులు నడపకపోవడంతో విద్యార్థులు పాట్లు తీరడం లేదు. ఆర్టీసీ బస్సు పాసులు ఇస్తున్నారు. రాయితీ బస్సు పాసులు నిరుపయోగంగా మిగిలిపోయాయి.

మా గ్రామానికి బస్సు లేదు - జయసుధ, చౌటకుంటపల్లి



మా గ్రామం నుంచి నల్లమాడ పాఠశాలకు వెళ్లాలంటే ఆర్టీసీ బస్సు సౌకర్యం లేదు. మా పిల్లలు ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఎక్కడ ప్రమాదం బారిన పడతారోనని భయంగా ఉంది. ఆర్టీసీ విద్యార్థులకు రాయితీ బస్సు పాసులు ఇచ్చింది. బస్సు సర్వీసును మాత్రం నడపట్లేదు. 15 రోజుల క్రితం కదిరి నుంచి దొన్నికోట మీదుగా నల్లమాడకు బస్సు సర్వీసును నడపాలని కదిరి డిపో మేనేజర్ సూర్యనారాయణకు అర్జీ ఇచ్చాం.

ఐదు కిలోమీటర్లు నడవాలి : అరవింద్, విద్యార్థి, గూడమేకలపల్లి



మా గ్రామం నుంచి పాఠశాలకు వెళ్లాలంటే ఐదు కిలోమీటర్ల దూరం ఉంది. ఆర్టీసీ బస్సు వేస్తామని చెప్పడంతో పాసుల కోసం దరఖాస్తు చేసుకున్నాం. పాసులు ఇచ్చినా.. పాఠశాల సమయానికి ఆర్టీసీ బస్సు సర్వీసు లేదు. దీంతో రోజూ ఐదు కిలోమీటర్లు నడిచి, దొన్నికోట పాఠశాలకు వెళ్తున్నాం. ఆర్టీసీ బస్సు నడపాలి.

సమయానికి చేరుకోలేకపోతున్నాం : చైతన్య, విద్యార్థి, గూడమేకలపల్లి



ఆర్టీసీ బస్సు సర్వీసు లేకపోవడంతో ఆటోల్లో, జీపుల్లో సమయానికి పాఠశాలకు చేరుకోలేకపోతున్నాం. బడి వేళలకు అనుగుణంగా ఆర్టీసీ బస్సు సర్వీసు నడిపితే, ఉచిత, రాయితీ పాసులు వినియోగించుకుంటాం.


నరకం





ఎంఎస్-2 వార్డు వద్ద దుర్వాసన వస్తుండటంతో ముక్కులు మూసుకున్న రోగి బంధువులు

మహిళల బర్న్స్ వార్డులో పనిచేయని ఏసీలు, ఫ్యాన్లు



వార్డులో సౌకర్యాలు ఎలా ఉండాలంటే...

బర్న్స్ వార్డులో చేరే వారికి నిరంతరం చల్లదనం కల్పించడంతోపాటు ఇన్ఫెక్షన్ సోకకుండా పరిశుభ్రంగా ఉంచాలి. తగినంత మంది నర్సులు, వార్డు బాయ్స్ ఉండాలి. బ్యాక్టీరియా, వైరస్ సోకకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలి. దీనికి ప్లీనమ్ వెంటిలేషన్ విధానాన్ని అమలు చేయాలి.

అనంత సర్వజనాస్పత్రిలో బర్నింగ్ బాధ..

- బర్న్స్ వార్డులో కొరవడిన సౌకర్యాలు..
- కనీస వసతులూ కరువే..
- పనిచేయని ఏసీలు.. తిరగని ఫ్యాన్లు..
- కిటికీలకు రంధ్రాలు..
- చల్లదనం కోసం బయటికొస్తున్న రోగులు..
- డాక్టరు వచ్చినపుడే సిబ్బంది రాక..
- వార్డులో చేరటమంటే.. నరకలోక ప్రవేశమే..
- సమస్యలు వివరించినా పట్టించుకునే వారేరీ?

పురుషుల బర్న్స్ వార్డులో పనిచేయని ఏసీలు

బిడ్డ నరకయాతన అనుభవిస్తోంది

నా కుమార్తె హసీనా వంట చేస్తుండగా.. నూనె పడటంతో శరీరమంతా కాలిపోయింది. సర్వజనాస్పత్రిలోని బర్న్స్ వార్డులో చేరాం. ఇక్కడ ఏసీలు, ఫ్యాన్లు పని చేయకపోవడంతో బిడ్డ కాలిన గాయాలతో నరకయాతన అనుభవస్తోంది. బయటకు వెళ్లి సేద తీరుదామంటే కాలిన గాయాలతో వెళ్ల లేని పరిస్థితి.



ఆరీషా, కొత్తకోట, చిత్తూరు జిల్లా

ఏసీ స్విచ్ వేస్తే మంటలు

నా భర్తకు విద్యుత్ షాక్ తగలడంతో శరీరంపై కొన్నిచోట్ల కాలిపోయింది. దీంతో ప్రభుత్వాస్పత్రిలోని బర్న్స్ వార్డులో రెండ్రోజుల కిందట చేరాడు. ఇక్కడ ఏసీలు పని చేయట్లేదని రెండుసార్లు సిబ్బంది దృష్టికి తీసుకెళ్లాం. ఎట్టకేలకు వారు వచ్చి, ఏసీ స్విచాన్ చేయగా అక్కడి నుంచి మంటలు చెలరేగాయి. దీంతో భయపడిపోయాం.



పద్మావతి, చీపురాల, మడకశిర మండలం

అనంతపురం వైద్యం

వివిధ సమస్యలతో ఒంటికి నిప్పంటించుకున్న, గ్యాస్ స్టౌ పేలుడు, విద్యుత్ ప్రమాదాల్లో గాయపడిన వారిని సర్వజనాస్పత్రికి తీసుకొస్తుంటారు. కాలిన గాయాల కంటే ఆస్పత్రిలో సౌకర్యాల లేమి వీరిని ఎక్కువగా బాధిస్తోంది. బర్న్స్ వార్డులో పడకలు మాత్రమే పూర్తిగా ఉన్నాయి. ఫ్యాన్లు, ఏసీలు మరమ్మతులకు చేరి నెలలు దాటింది. అయినా.. అధికారులు పట్టించుకోవడం లేదని అక్కడి సిబ్బందే చెప్పుతుండటం గమనార్హం.



కాలిన గాయాలతో చికిత్సలు పొందుతున్న చిన్నారిని వార్డు బయటకు తెచ్చి, సేద తీర్చుతున్న తల్లి

వార్డు బయటే సేద తీరుతున్న రోగి..

ఏసీలున్నా లేనట్టే...

సర్వజనాస్పత్రిలో సర్జికల్ విభాగాల పక్కనే మహిళ, పురుష బర్న్స్ వార్డులు వేర్వేరుగా ఉన్నాయి. ఒక్కో దాంట్లో 4 చొప్పున ఏసీలు కూడా అమర్చారు. అవి ఎప్పుడు పనిచేస్తాయో.. ఎప్పుడు పనిచేయవో.. తెలియని పరిస్థితి. కాలిన గాయాలతో తీవ్ర బాధపడే రోగులు.. ఏసీలు పనిచేయకపోవడంతో నరకయాతన అనుభవిస్తున్నారు. ఇక్కడి వార్డుల్లో 20కిపైగా పడకలున్నాయి. కొన్ని ఫ్యాన్లు పనిచేయడం లేదు. కిటికీలకు అద్దాలు పగిలిపోవడంతో అట్టలను అడ్డుగా పెట్టారు. మరికొన్ని చోట్ల అలాగే వదిలేశారు. దీంతో రాత్రి వేళల్లో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని రోగులు వాపోతున్నారు. కిటికీ తలుపులు లేకపోవడంతో ఏసీలు వేసినా.. ఉపశమనం లభించడం లేదు. మరమ్మతులకు చేరిన కిటికీల ద్వారా బ్యాక్టీరియా, వైరస్ లాంటివి రోగికి సోకే అవకాశాలు మెండుగా ఉన్నాయి. వార్డుల వద్దనే మరుగుదొడ్లు ఉండటంతో ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా మారిపోతోంది. దీంతో వైద్యులు, సిబ్బంది.. రోగుల వద్దకు రావాలంటే ముక్కులు మూసుకోవాల్సి వస్తోంది. ఇలాంటి వాటిపై కూడా అస్పత్రి అధికారులు దృష్టి సారించకపోవడం విమర్శలకు తావిస్తోంది.



కిటికీలకు పడిన రంధ్రాలు..

అనంత సర్వజనాస్పత్రిలోని బర్న్స్ వార్డు నరకానికే నరకం. కాలిన గాయాలతో విపరీతమైన బాధ అనుభవించే బాధితులు ఇక్కడ చేరితే.. నరకలోకంలో కన్నా.. కారిన్యమైన శిక్షలే ఎదుర్కొంటారు. శరీరం కాలిన గాయాలతో జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రికి వస్తే అక్కడ నెలకొన్న పరిస్థితులు బాధితులను మరింత దహిస్తున్నాయి. బర్న్స్ వార్డులో సమస్యలు నరకం చూపిస్తున్నాయి. ఏసీలు, ఫ్యాన్లు, పనిచేయకపోవడంతో బతుకుపై అశలు వదిలేస్తున్నారు.

తీసుకోవాల్సిన చర్యలు...

- వార్డులో ఇద్దరు నర్సులు, ప్రత్యేకంగా వార్డు బాయ్స్‌ను కేటాయించాలి. సర్వజనాస్పత్రిలో సిబ్బంది కొరత మూలంగా సర్జికల్ విభాగాల్లో పనిచేసే సిబ్బందే.. బర్న్స్ వార్డు బాధ్యతలు మోస్తున్నారు. కేవలం రౌండ్స్‌కు వచ్చినపుడు మాత్రమే నర్సులు వస్తున్నారనీ, ఆ తరువాత ఇటువైపు చూడట్లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. రాత్రి వేళ మరీ దారుణం. సిబ్బంది అస్సలు ఉండరని వాపోయారు.
- వార్డులో నిరంతరం ఏసీలు, ఫ్యాన్లు, పనిచేసేలా చర్యలు తీసుకోవాలి.. ఇక్కడ మాత్రం ఏసీలు పనిచేయక నెలలు గడస్తున్నాయి. దీనిని పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పరిష్కరించడం లేదని అక్కడి సిబ్బందే చెప్పడం శోచనీయం. రోగుల బంధవులు వార్డు పరిసరాల్లో అపరిశుభ్రం చేయకుండా చర్యలు తీసుకోవాలి.
- వార్డుకు దగ్గరగా మరుగుదొడ్లు ఉండటంతో నిత్యం దుర్వాసన వెదజల్లుతోందని బాధితుల బంధవులు వాపోయారు.
- ఈగలు, దోమలు ప్రవేశించకుండా వార్డు తులుపులు మూసి ఉంచాలి. అవసమైతే దోమతెరలు కూడా ఏర్పాటు చేయాలి.. ఇక్కడ వార్డుల్లో కొన్ని కిటికీల అద్దాలు పగిలిపోయి ఉండటంతో దోమలు, ఈగలు స్వైరవిహారం చేస్తున్నాయని చికిత్స పొందుతున్న వారు చెబుతున్నారు.
- ప్లాస్టిక్ డిస్పోజబుల్ బెడ్‌షీట్లు రోజూ మార్చాలి. ఇక్కడ అలాంటిది అమలవట్లేదు.

సమస్యలు లేకుండా చూస్తాం



బర్న్స్ వార్డులో ఏసీలు, ఫ్యాన్లు, కిటికీల అద్దాలకు మరమ్మతులు చేయించి, వినియోగంలోకి తెస్తాం. ఆస్పత్రిలో వైద్య సిబ్బంది కొరత కారణంగా.. ఆయా వార్డుల్లో రోగుల సంఖ్యను బట్టి ఒక నర్సును 24 గంటలు అందుబాటులో ఉండేలా చూస్తాం. ఆయా వార్డుల వద్ద శానిటేషన్ సిబ్బందితో త్వరతగతిన శుభ్రం చేయిస్తాం.

- జగన్నాథ్, సూపరింటెండెంట్, సర్వజనాస్పత్రి

వార్డు బయటే నయం...

బర్న్స్ వార్డులో ఉండటం కన్నా.. బయట సేదతీరటమే నయమని రోగులు చెబుతున్నారు. కాలిన గాయాలతో ఆస్పత్రికి వచ్చిన కొందరు వార్డుల్లో చాలినంత చల్లదనం లేక బయటకు వచ్చి సేద తీరుతున్నారు. అయినా, అధికారుల్లో చలనం లేదు. బర్న్స్ వార్డులో ఈ ఏడాది జూలై వరకు మొత్తం 163 మంది చికిత్స పొందరు. వీరిలో 27 మంది చనిపోయారు.

దందాకు కాదేదీ.. అనర్హం!



సర్వజనాస్పత్రి ఉద్యోగులు, సిబ్బంది క్వార్టర్స్

సర్వజనాస్పత్రి క్వార్టర్స్ అద్దెల్లోనూ అక్రమాలు..
ఉద్యోగులు, సిబ్బందికి కేటాయించిన వాటిలో ప్రైవేటు వ్యక్తుల పాగా..
షరామామూళ్లతో సరిపెట్టుకుంటున్న అధికారి..
ఏడాదికి రూ.12లక్షలు జేబుల్లోకి..
అద్దె బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం..
నోటీసులతో సరిపెడుతున్న వైనం..

ఆంధ్రజ్యోతి, అనంతపురం: దందాకు కాదేదీ అనర్హమని చాటి చెబుతున్నారు సర్వజనాస్పత్రి అధికారులు. క్వార్టర్స్ (నివాస సముదాయం)లో కూడా చేతివాటం సాగిస్తూ.. సొమ్ము చేసుకుంటున్నారు. నయా దందా సాగిస్తున్నారు. జిల్లా కేంద్రంలోని సర్వజనాస్పత్రి క్వార్టర్స్ పరుల పాలవుతున్నాయి. ఆస్పత్రిలో పనిచేసే ఉద్యోగులు, సిబ్బందికి కేటాయించిన క్వార్టర్స్‌లో ప్రైవేటు వ్యక్తులు పాగా వేశారు. క్వార్టర్స్ కేటాయించే ఓ ఉన్నతాధికారి, క్వార్టర్స్ పొందిన ఉద్యోగులు, సిబ్బంది కాసుల కక్కుర్తే ఇందుకు ప్రధాన కారణం. ఆ తరహా విమర్శలు ఆస్పత్రి వర్గాల నుంచే వినిపిస్తుండటం గమనార్హం. దొంగలు దొంగలు ఊళ్లు పంచుకున్న చందంగా... ఇక్కడి సర్వజనాస్పత్రి వర్గాలు క్వార్టర్స్‌ను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించి, నెలవారీ అద్దెల్లో వాటాలు పంచుకుంటున్నారన్న ఆరోపణలు బహిరంగంగా వ్యక్తమవుతున్నాయి. ఈ వ్యవహారంలో నెలకు రూ.లక్ష వరకు చేతులు మారుతోంది. ఈ లెక్కన ఏడాదికి రూ.12లక్షల దాకా సొమ్ము చేసుకుంటున్నారని ఆస్పత్రి వర్గాలే విమర్శిస్తున్నాయి. క్వార్టర్స్‌లో నివాసముంటున్న ఉద్యోగులు, సిబ్బంది నుంచి ప్రభుత్వం నిర్దేశించిన మేరకు అద్దె రూపంలో దాదాపు రూ.8లక్షలకుపైగానే బకాయిలు చెల్లించాల్సి ఉంది. వాటి వసూళ్ల విషయంలో సంబంధిత అధికారులు మీనమేషాలు లెక్కిస్తుండటం విమర్శలకు దారి తీస్తోంది. క్వార్టర్స్ ద్వారా ప్రభుత్వానికి రావాల్సిన బకాయిల వసూలు కంటే... వాటాల డబ్బుపైనే సంబంధిత అధికారులు శ్రద్ధ చూపుతున్నారన్నది సుస్పష్టంగా కనిపిస్తోందనడంలో సందేహం లేదు.

దందా ఇలా...



సర్వజనాస్పత్రిలో పనిచేసే వివిధ విభాగాల ఉద్యోగులు, సిబ్బందికి నివాస సౌకర్యం కల్పించేందుకుగాను పదేళ్ల క్రితం జీసస్‌నగర్ సమీపంలో 48 క్వార్టర్స్ నిర్మించిన విషయం తెలిసిందే. ఆది నుంచి క్వార్టర్స్ కేటాయింపులో వివాదం రేగుతోంది. ఉద్యోగులు, సిబ్బంది ఉండాల్సిన క్వార్టర్స్‌లో ఇతరులు నివాసముంటున్నారు. నిబంధనల మేరకు ఒక్కో క్వార్టర్స్‌లో నివాసముండే ఉద్యోగి అయినా... సిబ్బంది అయినా నెలకు రూ.1433 అద్దె చెల్లించాలి. ఇదే క్వార్టర్స్ కేటాయింపులు పొందిన ఉద్యోగులు సిబ్బందికి వరంగా మారుతోంది. ప్రైవేటు వ్యక్తులకు రూ.5వేల నుంచి రూ.6వేలకు అద్దెకిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. క్వార్టర్స్ కేటాయించే అధికారి గృహాలను పొందిన ఉద్యోగులు, సిబ్బంది ఒక్కొక్కరి నుంచి రూ.10వేల దాకా ప్రారంభంలో వసూలు చేయడంతో పాటు నెలనెలా ప్రైవేటు వ్యక్తులు ఉంటున్న ఇళ్ల అద్దెల్లోనే కాకుండా... సిబ్బంది నుంచి కొంత మొత్తాన్ని కమీషన్ రూపంలో తీసుకుంటున్నట్లు ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఆస్పత్రి అధికారికి వాటాలు చెల్లిస్తుండటంతో క్వార్టర్స్ పొందిన కొందరు ఉద్యోగులు, సిబ్బంది ప్రైవేటు వ్యక్తుల నుంచి అడ్వాన్స్‌ల రూపంలో వేలాది రూపాయలు దండుకుంటున్నారన్న విమర్శలు లేకపోలేదు.

బకాయిల వసూళ్లలో నిర్లక్ష్యం...

ప్రభుత్వాస్పత్రిలో పనిచేసే కొందరు ఉద్యోగులు, సిబ్బందికి కేటాయించిన క్వార్టర్స్ అద్దెలకు సంబంధించి ఇప్పటి వరకు రూ.8లక్షల దాకా అద్దె రూపంలో ప్రభుత్వ ఖజానాకు చేరాల్సి ఉంది. పర్యవేక్షణాధికారులు బకాయిల వసూళ్లపై దృష్టి సారించడం లేదు. వాటాల కోసమే తాపత్రయ పడుతుండటం విస్మయం కలిగిస్తోంది. క్వార్టర్స్ పొంది ప్రైవేటు వ్యక్తులకు అద్దెలకిచ్చి అధిక మొత్తంలో వసూలు చేసుకుంటున్నా... ప్రభుత్వానికి చెల్లించాల్సిన అద్దె సొమ్మును చెల్లించడంలో కొందరు ఉద్యోగులు, సిబ్బంది మీనమేషాలు లెక్కిస్తున్నారు. వసూలు చేయడంలోనూ పర్యవేక్షకులు అదే పంథాను అనుసరిస్తుండటం గమనార్హం. క్వార్టర్స్‌లో ఉండేందుకు ఇష్టపడుతున్న ఉద్యోగులు, సిబ్బందికి మాత్రం ఆస్పత్రి అధికారి మొండిచేయి చూపుతున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దాదాపు 30 మంది ఉద్యోగులు, సిబ్బంది క్వార్టర్స్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. వారంతా నిరీక్షిస్తున్నా... అదిగో.. ఇదిగో.. అంటూ కాలయాపన చేస్తున్నారంటే... ఆస్పత్రి అధికారి వైఖరి ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు. మరి ఈ దందాపై జిల్లా ఉన్నతాధికారులు ఏ మేరకు స్పందిస్తారో వేచి చూడాల్సిందే.

ప్రైవేటు వ్యక్తులుంటే బయటకు పంపుతాం : జగన్నాథ్, ఆస్పత్రి సూపరింటెండెంట్

ప్రభుత్వాస్పత్రి క్వార్టర్స్‌లో ఉద్యోగులు, సిబ్బంది కాకుండా ప్రైవేటు వ్యక్తులుంటే బయటకు పంపుతాం. క్వార్టర్స్‌ను పొంది అందులో లేకపోతే వారిని తొలగించి, ఇతరులకు న్యాయం చేస్తాం. అద్దె బకాయిలు వసూళ్లపై సీరియస్‌గా దృష్టి సారిస్తాం. బకాయి డబ్బు జీతంలో పట్టుకునేలా చర్యలు తీసుకోవాలని వైద్య కళాశాల ప్రిన్సిపాల్‌కు నివేదించాం.



మహిళల బర్న్స్ వార్డు వద్ద అపరిశుభ్రత..



ఆలోచన విధానం, సునిశిత దృష్టి.. ప్రధానం

పోలిక పరీక్ష

ఈ విభాగానికి సంబంధించిన ప్రశ్నల్లో పదం, దానికి ఒక సంబంధం ఇస్తారు. మరో పదం ఇచ్చి ఆ పదానికి కూడా అలాంటి సంబంధాన్నే తెలపమని అడుగుతారు. ఈ విభాగంలోని ప్రశ్నల్లో జనరల్ నాలెడ్జ్ ప్రశ్నలు కూడా ఉంటాయి. అభ్యర్థి ఆలోచన విధానం, విజ్ఞానం, సునిశిత దృష్టి, పరిశీలనాత్మకతను అంచనా వేయడమే ఈ పరీక్ష ముఖ్యోద్దేశం. ఇందులో మూడు రకాల ప్రశ్నలు ఉంటాయి. అవి..

1. పదాల పోలిక పరీక్ష
2. వర్ణమాల అక్షరాల పోలిక పరీక్ష
3. సంఖ్యలతో పోలిక పరీక్ష

మోడల్ - 1

1. చాక్‌పీస్: నల్లబల్ల:: ---- : పలక
ఎ) కలం బి) పెన్సిల్ సి) బలపం డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: నల్లబల్లపై చాక్ పీస్‌తో రాస్తారు. అదేవిధంగా పలకపై బలపంతో రాస్తారు.

2. విటమిన్ ఎ : రేచీకటి :: ------ : రికెట్స్
ఎ) విటమిన్ బి బి) విటమిన్ సి
సి) విటమిన్ డి డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: విటమిన్ ఎ లోపంతో వచ్చే వ్యాధి రేచీకటి. అదేవిధంగా విటమిన్ డి లోపంతో వచ్చే వ్యాధి రికెట్స్

3. పత్రం: క్లోరోఫిల్ :: రక్తం : -----
ఎ) కెరొటిన్ బి) జాంథోఫిల్
సి) హిమోగ్లోబిన్ డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: పత్రాల ఆకులు పచ్చగా ఉండటానికి కారణం క్లోరోఫిల్. అదేవిధంగా రక్తం ఎర్రగా ఉండడానికి కారణం హిమోగ్లోబిన్

4. థర్మామీటర్: ఉష్ణోగ్రత :: అమ్మీటర్ : -------
ఎ) విద్యుత్ బి) ఉష్ణం సి) తేమ డి) వేగం
సమాధానం : ఎ
వివరణ: ఉష్ణోగ్రతను కొలిచే సాధనం థర్మామీటర్. అలాగే విద్యుత్‌ను కొలిచేది అమ్మీటర్

5. రైతు : పొలం :: శాస్త్రజ్ఞుడు: -------
ఎ) కర్మాగారం బి) పాఠశాల
సి) ప్రయోగశాల డి) రంగస్థలం
సమాధానం: సి
వివరణ: రైతు పనిచేసే ప్రదేశం పొలం. అదేవిధంగా శాస్త్రవేత్త పనిచేసే ప్రదేశం ప్రయోగశాల

6. పక్షులు : ఆర్నిథాలజీ::గుండె: ------
ఎ) హెమటాలజీ బి) కార్డియాలజీ
సి) సెమన్‌టిక్స్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: పక్షులను గురించి వివరించే శాస్త్రం ఆర్నిథాలజీ. అదేవిధంగా హృదయ స్పందన గురించి వివరించే శాస్త్రం కార్డియాలజీ

7. రైతు : నాగలి :: సైనికుడు: ---------
ఎ) తుపాకి బి) కత్తి సి) సూది డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: నాగలిని ఉపయోగించే వ్యక్తి రైతు. అదేవిధంగా తుపాకిని ఉపయోగించే వ్యక్తి సైనికుడు

8. పాల స్వచ్ఛత: లాక్టోమీటర్ :: భూకంపాలు: ---
ఎ) బారోమీటర్ బి) అనిమోమీటర్
సి) ఆడో మీటర్ డి) సిస్మోగ్రాఫ్
సమాధానం: డి
వివరణ: పాల స్వచ్ఛతను కొలిచే పరికరం లాక్టోమీటర్. అలాగే భూకంప తీవ్రతను కొలిచే సాధనం సిస్మోగ్రాఫ్

9. బలం: వాట్ :: విద్యుత్ : --------
ఎ) జౌల్ బి) డిగ్రీ సి) ఆంపియర్ డి) సెకండ్స్
సమాధానం: సి
వివరణ: బలానికి ప్రమాణం వాట్ అలాగే విద్యుత్‌కు ప్రమాణం ఆంపియర్

10. ముఖేష్: హాకీ :: చెస్ : -------
ఎ) గగన్ నారంగ్ బి) హరి కృష్ణ
సి) లక్ష్మణ్ డి) ఎవరూకాదు
సమాధానం: బి



Panditi Meenakshi Pavan
Senior Faculty

Competitive Exams Special

వివరణ: ముఖేష్ హాకీ క్రీడాకారుడు. అలాగే హరికృష్ణ చెస్ క్రీడాకారుడు

11. కొలంబో : శ్రీలంక :: ------ : ఆఫ్ఘనిస్థాన్
ఎ) ఇస్లామాబాద్ బి) కాబూల్ సి) తింపు డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శ్రీలంక రాజధాని కొలంబో. అలాగే ఆఫ్ఘనిస్థాన్ రాజధాని కాబూల్

12. హస్తినాపురం : న్యూఢిల్లీ :: మద్రాస్ : -----
ఎ) చెన్నై బి) పనాజి సి) కోల్‌కతా డి) ముంబై
సమాధానం: ఎ
వివరణ: హస్తినాపురానికి కొత్త పేరు న్యూఢిల్లీ, అలాగే మద్రాస్‌కు కొత్త పేరు చెన్నై

13. భరతనాట్యం: తమిళనాడు :: యక్షగానం: --------
ఎ) కేరళ బి) మహారాష్ట్ర సి) కర్ణాటక డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: తమిళనాడు శాస్త్రీయ నృత్యం భరత నాట్యం. కర్ణాటక శాస్త్రీయ నృత్యం యక్షగానం

14. న్యూజిలాండ్ జాతీయ పక్షి : కివి :: మన జాతీయ పక్షి : --------
ఎ) నెమలి బి) పావురం సి) చిలుక డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: న్యూజిలాండ్ జాతీయ పక్షి కివి అదేవిధంగా మన జాతీయ పక్షి నెమలి.

15. చార్మినార్: హైదరాబాద్ :: తాజ్‌మహల్:-------
ఎ) న్యూఢిల్లీ బి) ఆగ్రా సి) మీరట్ డి) ఔరంగాబాద్
సమాధానం: బి
వివరణ: చార్మినార్ హైదరాబాద్‌లో ఉంది. తాజ్‌మహల్ ఆగ్రాలో ఉంది.

16. ఇండియా : రూపాయి :: జపాన్ : -------
ఎ) డాలర్ బి) ఫ్రాంక్ సి) యన్ డి) దీనార్
సమాధానం: సి
వివరణ: ఇండియా కరెన్సీ రూపాయి. జపాన్ కరెన్సీ యన్

17. గ్రహాలు : ఖగోళ శాస్త్రం :: నాణేలు : -----------
ఎ) సిస్మోగ్రాఫ్ బి) పేలియోగ్రఫీ
సి) పాథాలజీ డి) న్యూమిస్‌మాటిక్స్
సమాధానం: డి
వివరణ: గ్రహాల గురించి వివరించే శాస్త్రం ఖగోళశాస్త్రం. అలాగే నాణేల గురించి వివరించే శాస్త్రం న్యూమిస్‌మాటిక్స్

18. ఆర్య సమాజం: దయానంద సరస్వతి:: రామకృష్ణ మిషన్: --------
ఎ) అనిబిసెంట్ బి) స్వామి వివేకానంద
సి) నివేదిత డి) ఎవరూకాదు
సమాధానం: బి
వివరణ: ఆర్య సమాజ స్థాపకుడు దయానంద సరస్వతి. అదేవిధంగా రామకృష్ణ మిషన్ స్థాపకుడు స్వామి వివేకానంద

19. స్వామి వివేకానంద: నరేంద్రదత్:: దయానంద సరస్వతి: -------
ఎ) గధాధరుడు బి) మూల శంకర్
సి) రామచందర్ డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: స్వామి వివేకానంద అసలు పేరు నరేంద్ర దత్. దయానంద సరస్వతి అసలు పేరు మూల్ శంకర్

20. మెగస్తనీస్: ఇండికా:: పాణిని: -----------
ఎ) అష్టాధ్యాయి బి) హర్ష చరిత్ర
సి) చరక సంహిత డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మెగస్తనీస్ రచించిన గ్రంథం ఇండికా, అదేవిధంగా పాణిని రచించిన గ్రంథం అష్టాధ్యాయి.

21. పాస్కల్: ఒత్తిడి:: ఆంపియర్: -------
ఎ) విద్యుత్ బి) బలం సి) శక్తి డి) స్వచ్ఛత
సమాధానం: ఎ
వివరణ: పాస్కల్ అనేది ఒత్తిడికి ప్రమాణం. అలాగే ఆంపియర్ అనేది విద్యుత్‌కు ప్రమాణం

22. కన్నడం: కర్ణాటక:: మరాఠీ: -------
ఎ) మధ్యప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) గుజరాత్ డి) రాజస్థాన్

23. హాంకాంగ్: చైనా:: వాటికన్: --------
ఎ) నార్వే బి) డెన్మార్క్
సి) నెదర్‌లాండ్ డి) రోమ్
సమాధానం: డి
వివరణ: చైనాలోని ఒక నగరం హాంకాంగ్. అలాగే రోమ్‌లోని నగరం వాటికన్ సిటీ

24. ఇన్సులిన్: హార్మోన్::ట్రిప్సిన్: -------
ఎ) ఎంజైమ్ బి) విటమిన్ సి) హార్మోన్ డి) గ్రంధి
సమాధానం: ఎ
వివరణ: ఇన్సులిన్ అనేది హార్మోన్. అలాగే ట్రిప్సిన్ అనేది ఒక ఎంజైమ్

25. వినడం: చెముడు:: మాట్లాడడం: --------
ఎ) నిశ్శబ్దం బి) మూగ సి) శాంతి డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: వినలేకపోవడం చెముడు అలాగే మాట్లాడలేకపోవడం మూగ

26. భాక్రానంగల్: సట్లెజ్:: హీరాకుడ్ : -------
ఎ) గోదావరి బి) కృష్ణ సి) కావేరి డి) మహానది
సమాధానం: డి
వివరణ: భాక్రానంగల్ డ్యామ్ సట్లెజ్ నదిపై ఉంది అలాగే హీరాకుడ్ డ్యామ్ మహానదిపై ఉంది.

27. హరిత విప్లవం: మొక్కలు:: నీలి విప్లవం: ------
ఎ) చేపలు బి) పాలు సి) నూనె గింజలు డి) ఏదీకాదు
సమాధానం: ఎ
వివరణ: మొక్కల అధికోత్పత్తికి చేపట్టిన కార్యక్రమం హరిత విప్లవం. అలాగే చేపల అధిక దిగుబడికి చేపట్టిన కార్యక్రమం నీలి విప్లవం

28. తూర్పు: వాయవ్యం:: నైరుతి: ----
ఎ) ఈశాన్యం బి) తూర్పు సి) ఆగ్నేయం డి) ఉత్తరం
సమాధానం: బి
వివరణ: తూర్పునకు 135 డిగ్రీల అపసవ్యదిశ వాయవ్యం. నైరుతికి 135 డిగ్రీల అపసవ్య దిశ తూర్పు

29. సత్యజిత్ రే: సినిమా:: పికాసో: ------
ఎ) రచయిత బి) నాటక కర్త
సి) చిత్రకారుడు డి) ఏదీకాదు
సమాధానం: సి
వివరణ: సినిమా రంగానికి చెందిన ప్రముఖుడు సత్యజిత్ రే. అలాగే సుప్రసిద్ధ చిత్రకారుడు పికాసో

30. రెస్టారెంట్: మెను:: లైబ్రరీ: -----
ఎ) చదువు బి) పుస్తకాలు సి) విద్య డి) క్యాటలాగ్
సమాధానం: డి
వివరణ: మెను అనేది ఐటెమ్స్ లిస్ట్. కేటలాగ్ అనేది బుక్స్ లిస్ట్

31. ఓనం: కేరళ:: బిహు: ------
ఎ) కర్ణాటక బి) మిజోరాం సి) అసోం డి) ఒడిశా
సమాధానం: సి
వివరణ: కేరళ ప్రజలు చేసుకొనే పండుగ ఓనం. అసోం ప్రజలు చేసుకొనే పండుగ బిహు

32. ప్రమాదం: అజాగ్రత:: వ్యాధులు: -------
ఎ) అపరిశుభ్రత బి) వైద్యుడు
సి) మందులు డి) వైద్యం సమాధానం: ఎ
వివరణ: అజాగ్రత్తతో ప్రమాదం లభిస్తుంది. అలాగే అపరిశుభ్రత వల్ల వ్యాధులు ప్రబలుతాయి.

33. శిల్పం: రూపం:: పాట ------
ఎ) సంగీతం బి) గానం సి) చెప్పలేం డి) ఏదీకాదు
సమాధానం: బి
వివరణ: శిల్పానికి మంచి రూపం ఉండాలి. అలాగే పాటకు మంచి గానం ఉండాలి.

అడ్మిషన్స్

ఐఎన్ఎటి 2017

పుణెలోని ఇంటర్ యూనివర్సిటీ సెంటర్ ఫర్ ఆస్ట్రానమీ అండ్ ఆస్ట్రో ఫిజిక్స్ (ఐయుసిఏఏ), నేషనల్ సెంటర్ ఫర్ రేడియో ఆస్ట్రో ఫిజిక్స్ (ఎన్‌సిఆర్ఏ) సంస్థల్లో పిహెచ్‌డి చేసే వారికి ఉద్దేశించిన రీసెర్చ్ స్కాలర్‌షిప్‌నకు ప్రకటన విడుదలైంది.
విభాగాలు: ఆస్ట్రానమీ, ఆస్ట్రో ఫిజిక్స్, ఫిజిక్స్
అర్హత: ఆగస్టు నాటికి 55 శాతం మార్కులతో (బిఎస్సీ/ ఎమ్మెస్సీ/ ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ)(ఫిజిక్స్/ ఎలక్ట్రానిక్స్/ ఆస్ట్రానమీ/ అప్లయిడ్ మేథమెటిక్స్) లేదా బిఇ/ బిటెక్/ ఎంఇ/ ఎంటెక్ పూర్తి.
ఎంపిక: ఐయుసిఏఏ - ఎన్‌సిఆర్ఏ అడ్మిషన్ టెస్ట్(ఐఎన్ఎటి 2017), ఇంటర్వ్యూ ద్వారా
పరీక్ష కేంద్రం: ఐయుసిఏఏ, పుణె
ఇంటర్వ్యూ: డిసెంబరు 7, 8
వేదిక: ఎన్‌సిఆర్ఏ - టిఐఎఫ్ఆర్, పుణె
దరఖాస్తుకు చివరి తేదీ: సెప్టెంబరు 15, 2017
వెబ్‌సైట్: http://inat.ncra.tifr.res.in/inat

పుణె పాలిటెక్నిక్

పుణెలోని గవర్నమెంట్ పాలిటెక్నిక్ - **అడ్వాన్స్‌డ్ డిప్లొమా(ఆటోమోటివ్ మెకట్రానిక్స్)** ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఈ స్కిల్ బేస్డ్ జాబ్ ఓరియంటెడ్ కోర్సును **'మెర్సిడెజ్ - బెంజ్'** సహకారంతో నిర్వహిస్తున్నారు.
కోర్సు వ్యవధి: ఏడాది
అర్హత: డిప్లొమా/ డిగ్రీ (ఇంజనీరింగ్)
ఎంపిక: ఎంట్రెన్స్ ఎగ్జామ్ ద్వారా
ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఆగస్టు 18
పూర్తి వివరాలకు వెబ్‌సైట్ చూడవచ్చు.
వెబ్‌సైట్: www.gppuneamc.org

ఎయిమ్స్

న్యూఢిల్లీలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)- పిహెచ్‌డి ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి ఉద్దేశించిన **'ఆన్‌లైన్ ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్'**కు దరఖాస్తులు కోరుతోంది.
ఎగ్జామినేషన్ తేదీ: సెప్టెంబరు 8
పరీక్ష కేంద్రం: ఢిల్లీ/ ఎన్‌సిఆర్
ఆన్‌లైన్ ప్రక్రియ ప్రారంభం: ఆగస్టు 3, 2017
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 17, 2017
వెబ్‌సైట్: www.aiimsexams.org

డిఎస్‌సి

ద ఢిల్లీ స్కూల్ ఆఫ్ కమ్యూనికేషన్(డిఎస్‌సి)- పీజీ(కమ్యూనికేషన్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. మ్యాట్/ క్యాట్ అర్హత పొంది ఉండాలి. లేదా డిఎస్‌సి ఇంటర్నల్ అడ్మిషన్ టెస్ట్‌లో అర్హత పొంది ఉండాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 7, 2017
వెబ్‌సైట్: www.dsc.edu.in/

డిఐఎంహెచ్

చెన్నైలోని డైరెక్టరేట్ ఆఫ్ ఇండియన్ మెడిసిన్ అండ్ హోమియోపతి (డిఐఎంహెచ్)- బిఎస్ఎంఎస్/ బిఏఎంఎస్/ బిఎన్‌వైఎస్/ బియుఎంఎస్/ బిహెచ్ఎంఎస్ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: హయ్యర్ సెకండరీ
క్యాంపస్‌లు: తిరునల్వేలి. చెన్నై, మధురై, కన్యాకుమారి
దరఖాస్తు ఫీజు: రూ.500
అప్లికేషన్ డౌన్‌లోడింగ్‌కు చివరి తేదీ: ఆగస్టు 30, 2017
హార్డు కాపీ చేరేందుకు ఆఖరు తేదీ: ఆగస్టు 31, 2017
చిరునామా: The Secretary, Selection Committee, Directorate of Indian Medicine and Homoeopathy, Arignar Anna Govt.Hospital of Indian Medicine Campus, Arumbakkam, Chennai-600106
వెబ్‌సైట్: www.tnhealth.org

‘ద లైఫ్ డివైన్’ గ్రంథ రచయిత ఎవరు?

హోంరూల్ ఉద్యమం


1. భారతదేశం బ్రిటిష్ సామ్రాజ్యంలో అంతర్భాగంగా ఉంటూ స్వయంపాలన సాగించుకొనే స్థితిని సాధించే లక్ష్యంతో ప్రారంభమైన ఉద్యమం?
ఎ) సహాయనిరాకరణ ఉద్యమం
బి) హోంరూల్ ఉద్యమం
సి) క్విట్ ఇండియా ఉద్యమం డి) ఉప్పుసత్యాగ్రహం
2. హోంరూల్ లీగ్‌ను 1916 ఏప్రిల్‌లో స్థాపించింది?
ఎ) బాలగంగాధర్ తిలక్ బి) సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) పి.కె.తెలాంగ్
3. హోంరూల్ అనే పదాన్ని ఏ ఉద్యమం నుంచి స్వీకరించారు?
ఎ) గ్రీక్ ఉద్యమం బి) లాటిన్ ఉద్యమం
సి) ఐరిష్ ఉద్యమం డి) గ్రీన్‌పీస్ ఉద్యమం
4. 1916 సెప్టెంబరులో హోంరూల్ లీగ్‌ను స్థాపించింది?
ఎ) మోతీలాల్ నెహ్రూ బి) అనిబిసెంట్
సి) పి.కె.తెలాంగ్ డి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
5. 1897లో హోంరూల్ లీగ్ అనే పదాన్ని మొట్టమొదట ఉపయోగించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) శ్రీకృష్ణ కార్పడే
సి) నరసింహచింతామన్ కేల్కర్
డి) మోతీలాల్ నెహ్రూ
6. ‘న్యూ ఇండియా’ పత్రికను స్థాపించింది?
ఎ) శ్యాంజీ కృష్ణవర్మ బి) బి.పి.వాడియా
సి) జె.ఎస్.అరుండేల్ డి) అనిబిసెంట్
7. ‘ఇండియన్ ఉమెన్స్ అసోసియేషన్’ అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహమ్మద్ అలీ జిన్నా
బి) అంబికా చరణ్ మజుందర్
సి) అనిబిసెంట్ డి) సురేంద్రనాథ్ బెనర్జీ
8. 1885లో Fabian societyలో చేరి Fabian Essays అనే పత్రికలో సోషలిజం మీద వ్యాసాలు రాసింది?
ఎ) అనిబిసెంట్ బి) భగవాన్‌దాస్
సి) బి.పి.వాడియా డి) జె.ఎస్.అరుండేల్
9. అనిబిసెంట్ దివ్యజ్ఞాన సమాజంలో ఎప్పుడు చేరారు?
ఎ) 1885 బి) 1889 సి) 1895 డి) 1899
10. బెనారస్‌లో ‘కేంద్రీయ హిందూ కళాశాల’ను స్థాపించింది?
ఎ) గాంధీ బి) రాస్‌బిహారి ఘోష్
సి) అనిబిసెంట్ డి) బాలగంగాధర్ తిలక్
11. ‘భగవద్గీత’ను అనిబిసెంట్ ఎవరి సహకారంతో ఆంగ్లంలోకి అనువదించారు?
ఎ) రాస్‌బిహారి ఘోష్ బి) బి.పి.వాడియా
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) డాక్టర్ భగవాన్ దాస్
12. భారతీయులు పాశ్చాత్య సంప్రదాయాల పట్ల ఆకర్షితులు కావడాన్ని వ్యతిరేకించింది?
ఎ) సాండర్స్ బి) అనిబిసెంట్
సి) చెమ్స్‌ఫర్డ్ డి) మాంటేగ్
13. 1907లో కల్నల్ ఆల్కాట్ మరణం తరవాత దివ్యజ్ఞాన సమాజ బాధ్యతలు చేపట్టింది?
ఎ) అనిబిసెంట్ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) జె.ఎస్.అరుండేల్
14. ‘ద లైఫ్ డివైన్’ అనే గ్రంథాన్ని రచించింది?
ఎ) అరవింద్‌ఘోష్ బి) తిలక్
సి) లాలాలజపతిరాయ్ డి) బిపిన్ చంద్రపాల్
15. 1895-1907 మధ్య బెనారస్ కేంద్రంగా హిందూ మతం గురించి ఉపన్యాసాలు చేసింది?
ఎ) పి.కె.తెలాంగ్ బి) ఎస్.సుబ్రమణ్య అయ్యర్
సి) సి.పి.రామస్వామి అయ్యర్ డి) అనిబిసెంట్
16. 1916 లక్నో సమావేశంలో అతివాదులు తిరిగి కాంగ్రెస్ చేరడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) అనిబిసెంట్ బి) సురేంద్రనాథ్ బెనర్జీ
సి) రాస్‌బిహారి ఘోష్
డి) బాలకృష్ణ శివరాం మోహన్‌జీ
17. 'Englands difficulty is Indian opportunity' అనే నినాదాన్ని ఇచ్చింది?
ఎ) చాంబర్లీన్ బి) అనిబిసెంట్
సి) బి.పి.వాడియా డి) మహమ్మద్ అలీ జిన్నా
18. కాంగ్రెస్, ముస్లిం లీగ్ మధ్య 1916లో లక్నో ఒడంబడిక జరగడంలో కీలక పాత్ర పోషించింది?
ఎ) సి.పి.రామస్వామి అయ్యర్
బి) పి.కె.తెలాంగ్
సి) అనిబిసెంట్ డి) బి.పి.వాడియా



కె. చెంచుకుమార్
సీనియర్ ఫ్యాకల్టీ

19. ‘న్యూ ఇండియా’ డైలీ ఎప్పుడు ధరావతును కోల్పోయింది?
ఎ) 1914 బి) 1912 సి) 1915 డి) 1916
20. హోంరూల్ ఉద్యమానికి ప్రతిస్పందిస్తూ ఆగస్టు ప్రకటన చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మాంటేగ్
సి) హార్డింజ్ డి) పాల్ రిచర్డ్
21. ఏ సంవత్సరంలో అనిబిసెంట్ రాజకీయ రంగప్రవేశం చేస్తూ భారతదేశానికి హోంరూల్ ఇవ్వాలని కోరారు?
ఎ) 1911 బి) 1912 సి) 1913 డి) 1914
22. 1917లో ఏ ఐఎన్‌సి సమావేశానికి అనిబిసెంట్ నాయకత్వం వహించారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) మద్రాసు డి) గౌహతి
23. ఐఎన్‌సికి అధ్యక్షత వహించిన తొలి మహిళ?
ఎ) దుర్గాభాయి దేశ్‌ముఖ్ బి) విజయలక్ష్మి పండిట్
సి) నిర్మలాదేశ్ పాండే డి) అనిబిసెంట్

పోటీ పరీక్షల ప్రత్యేకం-ఇండియన్ హిస్టరీ



బాలగంగాధర్ తిలక్



అనిబిసెంట్

24. ‘బాయ్ స్కౌట్ అసోసియేషన్’ అనే సంస్థను స్థాపించింది?
ఎ) మహాత్మాగాంధీ బి) అనిబిసెంట్
సి) మోతీలాల్ నెహ్రూ
డి) వినాయక దామోదర్ సావర్కర్
25. మద్రాసులోని అడయార్‌లో అనిబిసెంట్ స్థాపించిన జాతీయ విశ్వవిద్యాలయానికి చాన్సలర్‌గా వ్యవహరించింది?
ఎ) రవీంద్రనాథ్ ఠాగూర్ బి) శ్యాంజీ కృష్ణవర్మ
సి) విజయలక్ష్మి పండిట్ డి) బి.పి.వాడియా
26. 1916 మేలో చిత్తూరు జిల్లాలోని మదనపల్లిలో ‘థియోసాపికల్ కళాశాల’ను స్థాపించింది?
ఎ) జె.ఎం.చటర్జీ బి) చాంబర్లీన్
సి) అనిబిసెంట్ డి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య
27. అనిబిసెంట్ ముఖ్య శిష్యుడు?
ఎ) కొండా వెంకటప్పయ్య
బి) పర్వతనేని వీరయ్య చౌదరి
సి) దుగ్గిరాల గోపాలకృష్ణయ్య డి) జిడ్డు కృష్ణమూర్తి
28. 'At the feet of master' గ్రంథ రచయిత?
ఎ) జిడ్డు కృష్ణమూర్తి బి) నీలకంఠ బ్రహ్మచారి
సి) అనిబిసెంట్ డి) విజయలక్ష్మి పండిట్
29. బ్రిటిష్ సారథ్యం కింద ఉంచుతూనే భారతీయులకు క్రమానుగతంగా స్వయం పరిపాలన ఇస్తామని ప్రకటన చేసిన భారత రాజ్య కార్యదర్శి?
ఎ) మింటో బి) మాంటేగ్ సి) మార్లే డి) హార్డింజ్
30. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌లో ముఖ్యపాత్ర పోషించింది?
ఎ) గణేష్ శ్రీకృష్ణ కార్పడే
బి) నరసింహ చింతామన్ కేల్కర్
సి) బాలకృష్ణ శివరాం మోహన్‌జీ డి) పైవారందరూ
31. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు అధ్యక్షుడిగా పని చేసింది?
ఎ) చాంబర్లీన్ బి) మార్లే
సి) జోసెఫ్ బాప్టిస్టా డి) పి.కె.తెలాంగ్
32. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు కార్యదర్శి?
ఎ) పాల్ రిచర్ట్ బి) కేల్కర్
సి) మీరా రిచర్డ్ డి) ఎస్.పి.సిన్హా
33. తిలక్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు పరిమితం అయింది?
ఎ) ఉత్తరప్రదేశ్ బి) మహారాష్ట్ర
సి) కర్ణాటక డి) బి, సి
34. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు గౌరవ అధ్యక్షుడిగా వ్యవహరించింది?
ఎ) సర్ ఎస్.సుబ్రమణ్య అయ్యర్
బి) కేల్కర్ సి) జోసెఫ్ బాప్టిస్టా
డి) బాలగంగాధర్ తిలక్
35. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ లీగ్‌కు ప్రధాన కార్యదర్శులుగా వ్యవహరించింది?
ఎ) జోసెఫ్ బాప్టిస్టా బి) సి.పి.రామస్వామి అయ్యర్
సి) పి.కె.తెలాంగ్ డి) బి, సి
36. అనిబిసెంట్ ఏర్పాటు చేసిన హోంరూల్ ఉద్యమం ఏయే ప్రాంతాలకు విస్తరించింది?
ఎ) దక్షిణ భారతదేశం బి) బీహార్, బెంగాల్
సి) యునైటెడ్ ప్రావిన్స్, సింధు డి) పైవన్నీ
37. అనిబిసెంట్ కృషి ఫలితంగా ఏ ఐఎన్‌సి సమావేశంలో బాలగంగాధర్ తిలక్ కాంగ్రెస్‌లో చేరారు?
ఎ) కలకత్తా బి) బొంబాయి సి) లక్నో డి) పూనా
38. 1916లో జరిగిన లక్నో కాంగ్రెస్ సమావేశానికి అధ్యక్షత వహించింది?
ఎ) రాస్‌బిహారి ఘోష్
బి) అంబికా చరణ్ మజుందర్
సి) అరుండేల్ డి) వాడియా
39. భారతదేశానికి స్వపరిపాలన ఇవ్వాలని ఏ ఐఎన్‌సి సమావేశం తీర్మానించింది?
ఎ) లక్నో బి) భోపాల్ సి) అమృత్‌సర్ డి) లాహోర్
40. కాంగ్రెస్, ముస్లింలీగ్ మధ్య రాజ్యాంగ సంస్కరణల విషయమై కుదిరిన ఒడంబడిక ఎప్పుడు జరిగింది?
ఎ) 1915 బి) 1916 సి) 1917 డి) 1918
41. Common Schemeను రూపొందించడంలో ముఖ్యపాత్ర వహించింది?
ఎ) మహాత్మాగాంధీ బి) బాలగంగాధర్ తిలక్
సి) సురేంద్రనాథ్ బెనర్జీ డి) మోతీలాల్ నెహ్రూ
42. 1916 డిసెంబర్‌లో ఏ ప్రాంతంలో సమావేశమై కాంగ్రెస్, ముస్లింలీగ్‌లు ఒక సామన్య ప్రణాళిక కోసం చెరొక కమిటీని నియమించాయి?
ఎ) మద్రాస్ బి) తిరువనంతపురం
సి) లక్నో డి) బెంగళూరు
43. హోంరూల్ ఉద్యమ కాలం?
ఎ) 1916-18 బి) 1920-22 సి) 1930-32 డి) 1940-42
44. భారతదేశ వైశ్రాయిగా 1916లో నియమితులైనది?
ఎ) మార్లే బి) లార్డ్ చెమ్స్‌ఫర్డ్
సి) మింటో డి) లార్డ్ కర్జన్
45. శాడ్లర్ కమిషన్‌ను ఎప్పుడు ఏర్పాటు చేశారు?
ఎ) 1914 బి) 1915 సి) 1916 డి) 1917
46. ‘వందేమాతరం’ అనే పత్రికను నడిపిన అతివాద నాయకుడు?
ఎ) మహాత్మాగాంధీ బి) అరవింద్ ఘోష్
సి) తిలక్ డి) లాలాలజపతి రాయ్
47. మితవాద రాజకీయాలను Policy of prayer, petition and protestగా అభివర్ణించింది?
ఎ) తిలక్ బి) లాలాలజపతిరాయ్
సి) అరవింద్ ఘోష్ డి) బిపిన్ చంద్రపాల్
48. ‘సావిత్రి’ అనే గ్రంథం రచించింది?
ఎ) మదన్ మోహన్ మాలవ్యా
బి) లాలాలజపతిరాయ్
సి) బాలగంగాధర్ తిలక్ డి) అరవింద్ ఘోష్
49. అరవింద్ ఘోష్ జన్మస్థలం?
ఎ) గౌహతి బి) కలకత్తా
సి) భువనేశ్వర్ డి) మద్రాసు

సమాధానాలు

		15) డి	24) బి	33) డి	42) సి
		16) ఎ	25) ఎ	34) ఎ	43) ఎ
1) బి	8) ఎ	17) బి	26) సి	35) డి	44) బి
2) ఎ	9) బి	18) సి	27) డి	36) డి	45) సి
3) సి	10) సి	19) డి	28) ఎ	37) సి	46) బి
4) బి	11) డి	20) బి	29) బి	38) బి	47) సి
5) ఎ	12) బి	21) సి	30) డి	39) ఎ	48) డి
6) డి	13) ఎ	22) ఎ	31) సి	40) బి	49) బి
7) సి	14) ఎ	23) డి	32) బి	41) డి	

JOBS ఉద్యోగాలు

నీతి ఆయోగ్

నేషనల్ ఇన్‌స్టిట్యూషన్ ఫర్ ట్రాన్స్‌ఫార్మింగ్ ఇండియా ఆయోగ్ (నీతి ఆయోగ్)- కింది పోస్టుల భర్తీకోసం దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 173
పోస్టులు - ఖాళీలు: అడ్వైజర్/ సీనియర్ అడ్వైజర్ 7, జాయింట్ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, డిప్యూటీ అడ్వైజర్(ఫ్లెక్సీ పూల్) 19, సీనియర్ రీసెర్చ్ ఆఫీసర్ 28, రీసెర్చ్ ఆఫీసర్(ఫ్లెక్సీ పూల్) 28, ఎకనామిక్ ఆఫీసర్ (ఫ్లెక్సీ పూల్)28, ఎకనామిక్ ఆఫీసర్ 44
అర్హత: పోస్టును అనుసరించి పీజీ/ ఎంబిబిఎస్
వయసు: 26 నుంచి 50 ఏళ్ల మధ్య ఉండాలి
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 25, 2017
వెబ్‌సైట్: www.niti.gov.in

సఫ్దర్‌జంగ్ హాస్పిటల్

ఢిల్లీలోని సఫ్దర్‌జంగ్ హాస్పిటల్- జూనియర్ రెసిడెంట్ (నాన్ పీజీ) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
మొత్తం ఖాళీలు: 58
కాంట్రాక్ట్ వ్యవధి: ఏడాది
అర్హత: ఎంబిబిఎస్ డిగ్రీ ఉత్తీర్ణత + ఢిల్లీ మెడికల్ కౌన్సిల్ గుర్తింపు పొంది ఉండాలి. అభ్యర్థులు 2015 జూలై 1 తరవాతనే ఇంటర్న్‌షిప్ పూర్తిచేసి ఉండాలి.
ఎంపిక: రాత పరీక్ష, కౌన్సెలింగ్ ద్వారా
దరఖాస్తు ఫీజు: రూ.500 (ఒబిసిలకు రూ.250 కాగా ఎస్సీ/ ఎస్టీ/ దివ్యాంగులకు మినహాయింపు వర్తిస్తుంది).
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును నిర్దేశిత చిరునామాకు పంపాలి
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 10, 2017
చిరునామా: The Medical Superintendent, Safdarjung Hospital & VMMC, New Delhi- 110029
వెబ్‌సైట్: www.vmmc.sjh.nic.in/

ఇండియన్ ఆర్మీ

ఇండియన్ ఆర్మీ కింది పోస్టుల భర్తీకోసం విడివిడిగా దరఖాస్తులు కోరుతోంది.
లా గ్రాడ్యుయేట్స్
ఖాళీలు: 14 (పురుషులకు 10, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: 55 శాతం మార్కులతో లా డిగ్రీ ఉత్తీర్ణతతో పాటు మూడేళ్ల అనుభవం ఉండాలి. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా/ స్టేట్‌లో రిజిస్ట్రేషన్‌కు అర్హత పొంది ఉండాలి.
వయసు: 21 నుంచి 27 ఏళ్ల మధ్య ఉండాలి
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
ఎన్‌సిసి స్పెషల్ ఎంట్రీ (43 కోర్స్)
ఖాళీలు: 54 (పురుషులకు 50, మహిళలకు 4 పోస్టులు కేటాయించారు)
అర్హత: ఎన్‌సిసి సర్టిఫికెట్‌తోపాటు 50 శాతం మార్కులతో డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. బ్యాటిల్ క్యాజువాలిటీస్/ ఆర్మీ పర్సనల్ పిల్లలకైతే ఎన్‌సిసి సర్టిఫికెట్ అవసరం లేదు.
వయసు: 19 నుంచి 25 ఏళ్లు
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 23, 2017
కంబైన్డ్ రిక్రూట్‌మెంట్ **ఖాళీలు:** 142
ట్రేడ్స్ వారీ ఖాళీలు: మెటీరియల్ అసిస్టెంట్ 6, ఎల్‌డిసి 1, ఫార్మసిస్ట్ 1, టెలీ ఆపరేటర్ 1, ఫైర్‌మన్ 36, ట్రేడ్స్‌మన్(మేట్) 94, ఎంటిఎస్ 1, దోబి 1, టైలర్ 1
అర్హత: పోస్టును అనుసరించి బిఇ/ బిటెక్/ డిఫార్మసీ/ డిప్లొమా / ఇంటర్/ 10వ తరగతి
వయసు: పోస్టును అనుసరించి 18 నుంచి 27 ఏళ్లు
ఎంపిక: ఫిజికల్ అండ్యూరెన్స్ టెస్ట్, స్కిల్ టెస్ట్, రాత పరీక్ష ఆధారంగా.
ఆసక్తిగల అభ్యర్థులు తమ దరఖాస్తును స్పీడ్ / రిజిస్టర్డ్/ ఆర్డినరీ పోస్టుద్వారా నిర్దేశిత చిరునామాకు పంపాలి.
దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 16, 2017
చిరునామా: Commandant 21 Field Ammunition Depot - 909721
వెబ్‌సైట్: https://joinindianarmy.nic.in

పోలీసుల తక్షణ స్పందన..

బాధితులకు ఊరట

డయల్-100, 9989819191కు 2306కాల్స్

పోలీసుల పనితీరును సమీక్షించిన ఎస్పీ

ఆంధ్రజ్యోతి, అనంతపురం: డయల్-100, 9989819191 నెంబర్లకు ప్రజలు, బాధితుల నుంచి గతనెలలో 2306 కాల్స్ వచ్చాయి. వాటికి పోలీసులు తక్షణమే స్పందించారు. బాధితులకు ఊరట కల్పించారు. ప్రజల నుంచి వచ్చిన కాల్స్ ఆధారంగా.. ప్రాణాలతో కొట్టుమిట్టాడుతున్న క్షతగాత్రులను ఆసుపత్రికి తరలించడం, ఈవ్‌టీజింగ్, అసభ్యకర సందేశాలతో వేధింపుల నుంచి అమ్మాయిలకు విముక్తి కల్పించడం, తప్పిపోయిన చిన్నారిని తల్లిదండ్రులకు అప్పగించడం, బాల్య వివాహాన్ని అడ్డుకోవడం, ఇద్దరి చావుకు కారణమై పరారవుతున్న ఆటోడ్రైవర్‌ను పట్టుకోవడం, బెల్టు దుకాణాలపై దాడులు, పేకాటరాయుళ్ల అరెస్టులే ఇందుకు నిదర్శనం. ఈ నేపథ్యంలో డయల్-100, 9989819191 నెంబర్లకు ప్రజల నుంచి వచ్చిన కాల్స్, పోలీసుల పనితీరుపై ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ సంబంధిత అధికారులతో మంగళవారం తన చాంబర్‌లో సమీక్షించారు. జూలైలో డయల్-100 ద్వారా 2306 కాల్స్ వచ్చాయన్నారు. ఈ లెక్కన రోజుకు సగటున 73కాల్స్ వచ్చాయన్నారు. వాటిలో దేహానికి హాని కలిగించినవి 236, రోడ్డు ప్రమాదాలు 975, చోరీలు 27, ఆత్మహత్యలు, ఆత్మహత్యాయత్నాలకు సంబంధించి 73, మహిళలపై జరిగిన నేరాలపై 151కాల్స్ వచ్చాయన్నారు. వీటన్నింటిపై సిబ్బంది తక్షణమే స్పందించి 108 కేసులు నమోదు చేశారన్నారు. ఇందులో 48రోడ్డు ప్రమాదాల కేసులు కాగా, దేహానికి హాని కలిగించిన కేసులు 18, చోరీలు 5, ఆత్మహత్యలు 13, మిగిలినవన్నీ ఇతర నేరాలకు సంబంధించిన కేసులు నమోదు చేసినట్లు ఎస్పీ వివరించారు. డయల్-100, 9989819191 నెంబర్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే అసాంఘిక శక్తుల సమాచారం అందించి పోలీసులకు సహకరించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

మచ్చుకు కొన్ని కేసులు పరిశీలిస్తే..

➡ జూలై 12న గార్లదిన్నె మండలం తిమ్మంపేట సమీపంలో ఆటో బోల్తా పడి ఐదుగురికి గాయాలయ్యాయి. డయల్-100కు సమాచారం వచ్చిన వెంటనే.. ఐదు నిమిషాల్లో క్షతగాత్రులను చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు.

➡ జూలై 14న తాడిపత్రి బస్టాండులో తప్పిపోయిన చిన్నారిని 15నిమిషాల వ్యవధిలోనే తల్లిదండ్రులకు అప్పగించారు.

➡ జూలై 19న కంబదూరు మండలం ఒంటారెడ్డిపల్లికి చెందిన డ్రైవర్ మహేష్ ఓ అమ్మాయికి ఈవ్‌టీజింగ్‌తో పాటు అసభ్యకర సందేశాలు పంపుతున్నాడనే సమాచారంతో అతడిపై చర్యలు తీసుకున్నారు.

➡ జూలై 26న గుత్తి మండలం కరిడికొండ వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన ఆరుగురిని స్థానిక సీఐ తన జీపులోనే జిల్లా కేంద్రంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అదేరోజు పామిడి రైల్వే గేటు సమీపంలోని పట్టాలపై ఆత్మహత్యాయత్నం చేసిన సొరకాయలపేట తిరుపతయ్యను కాపాడారు.

➡ జూలై 31న రాయదుర్గం మండలం బొమ్మక్కపల్లి సమీపంలో ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొనగా ఇద్దరు మృతి చెందారు. ఆ ఆటో డ్రైవర్ పరారవుతుండగా స్థానిక పోలీసులు వెంబడించి పట్టుకున్నారు.

సివిల్ పంచాయతీలు, అవినీతికి..

దూరంగా ఉండండి

ప్రజల్లో విశ్వాసం చూరగొనేలా పనిచేయాలి

అధికారులకు ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ హితబోధ



మాట్లాడుతున్న ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్

ఆంధ్రజ్యోతి, అనంతపురం: సివిల్ పంచాయితీలు, అవినీతికి దూరంగా ఉంటూ.. ప్రజల్లో విశ్వాసం చూరగొనేలా సమర్థవంతంగా పనిచేయాలని జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ ఆ శాఖాధికారులను ఆదేశించారు. తద్వారా పోలీసుల ప్రతిష్ఠ మరింత పెంపొందించాలని ఆయన హితబోధ చేశారు. ముఖ్యంగా పోలీస్‌స్టేషన్‌కు వచ్చేవారి పట్ల మర్యాదగా వ్యవహరించాలని సూచించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని తన చాంబర్‌లో అనంతపురం సబ్ డివిజన్ అధికారులతో సమావేశమయ్యారు. బాధితులు పోలీస్‌స్టేషన్‌కు వచ్చి చెప్పే విషయాలను సావధానంగా ఆలకించాలన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయాలన్నారు. పరిధి తమది కాదంటూ బాధితులను స్టేషన్ చుట్టూ తిప్పించుకోరాదన్నారు. సివిల్ పంచాయితీలు, అవినీతికి దూరంగా ఉండాలన్నారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ తదితర అసాంఘిక కార్యకలాపాలు ఎట్టి పరిస్థితుల్లోనూ జరగడానికి వీల్లేదన్నారు. వాహనాల తనిఖీలు, కార్డినల్ అండ్ సెర్చ్ ఆపరేషన్స్ పక్కాగా జరగాలన్నారు. రోడ్డు భద్రత కోసం స్పెషల్ డ్రైవ్ ప్రతినిత్యం జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కేసుల్లో శిక్షలు పడేలా దర్యాప్తులు కొనసాగాలన్నారు. ఈ క్రమంలో పోలీసు సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ ప్రజల్లోకి చొచ్చుకెళ్లాలన్నారు. ఎవరికి వారు గర్వపడేవిధంగా ఉద్యోగం చేయాలన్నారు. బావి తరాల పోలీసులకు స్ఫూర్తిగా నిలిచేలా పనిచేయాలన్నారు. అవసరమున్న ప్రాంతాల్లో సీసీ టీవీలు ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో డీఎస్పీ మల్లికార్జునవర్మ, సీఐలు సాయిప్రసాద్, యల్లంరాజు, మురళీకృష్ణ, శ్యామ్‌రావు, శివనారాయణస్వామితో పాటు పలువురు ఎస్ఐలు పాల్గొన్నారు.



కాటమయ్య స్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న యామినీబాల

వర్షం కోసం ప్రభుత్వ విప్ ప్రత్యేక పూజలు

నాగులగుడ్డం (శింగనమల): వర్షాలు బాగా కురిసి రైతులకు పంటలు దిగుబడులు బాగా రావాలని శింగనమల శాసనసభ్యురాలు, ప్రభుత్వ విప్ యామినీబాల ఆకాంక్షించారు. ఈ మేరకు మంగళవారం మండలంలోని నాగులగుడ్డంలో కాటమయ్యస్వామికి ఆమె ప్రత్యేక పూజలు చేశారు. గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రామంలోని బొడ్రాయికి 1001 బిందెల నీటి తో జలాభిషేకం చేశారు. అనంతరం గ్రామ శివార్లలో కాటమయ్యస్వామికి యామినీబాల ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. గ్రామంలో బొడ్రాయి, కాటమయ్య స్వామికి పూజలు చేయడం ద్వారా వర్షాలు కురుస్తాయని గ్రామస్థుల నమ్మకం. ప్రత్యేక పూజలు చేసిన వారిలో దాసరి గంగాధర్, లక్ష్మీనారాయణ, దనచర్ల ఆంజనేయులు, కదిరప్ప, లోకేష్, డేగల కృష్ణమూర్తి, మసూల చంద్రమోహన్, చితంబర దొర, రవీంద్రరెడ్డి, తహసీల్దార్ నాగేంద్ర, ఎంపీడీఓ ఆర్ జయరాములు ఉన్నారు.

గోవధ నిలిపివేస్తాం: ఆవాజ్

అనంతపురం ప్రెస్‌క్లబ్: హిందువుల ఆచారాలు గౌరవిస్తూ వారి పవిత్ర జంతువు గోవులను వధించే పద్ధతిని నిలిపివేస్తున్నట్లు ముస్లిం మత పెద్దలు, గురువులు తీర్మానించినట్లు ఆవాజ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇంతియాజ్ పేర్కొన్నారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం సంఘం ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 2వ తేదీ దేశవ్యాప్తంగా ముస్లిలు బక్రీద్ పండుగ జరుపుకుంటారని, అయితే కుర్బాని పేరుతో జంతువులను బలి ఇవ్వడం సంప్రదాయ ఆచారంగా వస్తోందన్నారు. అయితే గోవధను నిషేధించారు కాబట్టి ఆవులను బలి ఇవ్వకుండా ఇతర జంతువులతో కుర్బాని నిర్వహిస్తామన్నారు. గోవధ పేరుతో 28 మంది ముస్లింలను హతమార్చడం దుర్మార్గపు చర్య అన్నారు. కుర్బాని శాంతియుత పద్ధతిలో జరిగే విధంగా పోలీసులు, రెవెన్యూ అధికారులు జిల్లా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు మహమ్మద్ జాఫర్, జిల్లా ప్రధాన కార్యదర్శి ముష్కిన్, అమ్మ సంస్థ అధ్యక్షులు షేక్షావలి, ఫక్రుద్దీన్, రసూల్, జక్రియా, మాబ్బాషా, బహీర్ అహ్మద్ పాల్గొన్నారు.

చౌకధరలకే ఎల్ఈడీ బల్బులు

అనంతపురం జిల్లాపరిషత్తు: జిల్లాలో చౌక దరలకే ఎల్ఈడీ బల్బులు అందుబాటులో ఉంచినట్లు కేంద్ర ప్రభుత్వ సంస్థ ఎనర్జీ ఎఫిషియెన్సీ సర్వీసెస్ లిమిటెడ్(ఈఈఎస్ఎల్)ప్రాజెక్టు ఇంజనీర్ రాజశేఖర్ తెలిపారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎల్ఈడీ బల్బులు (9 వాట్స్), ట్యూబ్‌లైట్లు(20 వాట్స్) మూడు సంవత్సరాల గ్యారెంటీతో అందుబాటులోకి వచ్చాయన్నారు. వీటి వినియోగం ద్వారా డబ్బు ఆదాతో పాటు విద్యుత్ చార్జీలు గణనీయంగా తగ్గుతాయన్నారు. నగరంలోని బళ్లారి బైపాస్‌లో గల రాజహంస(బీఎల్‌టీ) విల్లాస్‌లో అవి లభ్యమవుతున్నాయన్నారు. ఇతర వివరాలకు 08554-271029, 8886781029నెంబర్లలో సంప్రదించాలని కోరారు.

గ్రామ నౌకర్లకు రేషన్‌కార్డుల

పునరుద్ధరణ

ప్రభుత్వానికి రెవెన్యూ ఉద్యోగుల సంఘం నాయకుల కృతజ్ఞతలు

అనంతపురం కలెక్టరేట్: గ్రామనౌకర్లకు రేషన్‌కార్డులు పునరుద్ధరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. గతంలో వారి రేషన్‌కార్డులను రద్దు చేస్తూ నిర్ణయం తీసుకున్న విషయం విదితమే. తక్కువ వేతనం వస్తున్న ఒదున కుటుంబ పోషణ భారమై గ్రామనౌకర్లు ఇబ్బందులు పడుతున్నారని, దీన్ని దృష్టిలో ఉంచుకుని వారి రేషన్‌కార్డుల రద్దు నిర్ణయాన్ని విరమించుకోవాలని రెవెన్యూ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో ప్రభుత్వానికి విన్నవించినట్లు రెవెన్యూ ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షప్రధాన కార్యదర్శులు జయరామప్ప, నీలకంఠారెడ్డి, కుళ్లాయప్ప తెలిపారు. తమ యూనియన్ విన్నపం మేరకు గ్రామ నౌకర్లకు రేషన్‌కార్డు రద్దు నిర్ణయాన్ని ప్రభుత్వం ఉపసంహరించుకుంటూ ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ఇందుకు సీఎం చంద్రబాబునాయుడు, ఉన్నతాధికారులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

ఉపాధి మరుగుదొడ్లు వంద శాతం కావాలి

సిబ్బందికి డ్వామా పీడీ ఆదేశం

అనంతపురం అర్బన్: ఉపాధి పథకం ద్వారా మంజూరైన మరుగుదొడ్ల నిర్మాణాలు వందశాతం పూర్తి కావాలని డ్వామా పీడీ నాగభూషణం ఆదేశించారు. మంగళవారం ఆయన ఏపీడీ, ఏపీఓ, టెక్నికల్ అసిస్టెంట్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 100 శాతం మరుగుదొడ్ల నిర్మాణమే లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. జిల్లాలో 306 పంచాయతీలకు ఉపాధి పథకం ద్వారా 15,200 మరుగుదొడ్లు మంజూరు చేశామన్నారు. ఇప్పటివరకు 11,177 మరుగుదొడ్లు పూర్తయ్యాయని.. రాష్ట్రంలో ప్రథమ స్థానంలో ఉన్నామన్నారు. మిగిలిన వాటిని పూర్తి చేసేందుకు ప్రతిఒక్కరూ శ్రద్ధ చూపాలన్నారు. మంజూరైన లబ్ధిదారులు ఆయా గ్రామాల్లో ఉన్నారా..? ఉంటే ఎందుకు నిర్మించుకోలేకపోతున్నారు?, సమస్య ఏమిటి? అని ఆరా తీశారు. ఏమైనా సమస్యలుంటే ప్రతి క్లస్టర్‌కు ఒకరిని నియమించినందున.. వారికి తెలియజేయాలని సూచించారు. టార్గెట్ వందశాతం.. వచ్చే శనివారం నాటికి పూర్తి చేసేందుకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని సూచించారు.

సరస్వతీ నిలయాల్లో సన్మానాల సందడి

నేడు కొత్త పాఠశాలల్లోకి ఉపాధ్యాయుల అడుగులు

అనంతపురం అర్బన్: సర్కారు సరస్వతీ నిలయాల్లో మంగళవారం సన్మానాల సందడి కనిపించింది. బదిలీల సందర్భంగా పెద్దఎత్తున ఉపాధ్యాయులు స్థానచలనం పొందారు. కొన్ని పాఠశాలల్లో అయితే 80 శాతం మంది ఇతర పాఠశాలలకు బదిలీలపై వెళ్లారు. వారంతా మంగళవారం రిలీవ్ అయి బుధవారం కొత్త పాఠశాలల్లో జాయిన్ కానున్నారు. ఈ నేపథ్యంలో ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల్లో హెచ్ఎం స్కూల్ అసిస్టెంట్లు, పండిట్లకు సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆయా పాఠశాలల యాజమాన్య కమిటీలు, స్థానిక ప్రజాప్రతినిధులు, విద్యార్థులు కలిసి ఉపాధ్యాయులను సత్కరించి గౌరవంగా రిలీవ్ చేసి పంపారు.

బ్లడ్ బ్యాంకులో కాంట్రాక్టు
ప్రాతిపదికన పోస్టుల భర్తీ
ఐదింటికి దరఖాస్తుల స్వీకరణ

అనంతపురం వైద్యం: జాతీయ ఆరోగ్య మిషన్ పరిధిలోని నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ కార్యక్రమం ఆధ్వర్యంలో నడుస్తున్న బ్లడ్‌బ్యాంకులో ఐదు పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు డీఎంహెచ్ఓ వెంకటరమణ పేర్కొన్నారు. ఇందులో భాగంగా స్థానిక ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో కాంపొనెంట్ ల్యాబ్‌టెక్నీషియన్ పోస్టులు-2, హిందూపురం ప్రభుత్వాస్పత్రిలోని బ్లడ్ బ్యాంకులో ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు-3 భర్తీ చేయనున్నామన్నారు. అర్హులయిన అభ్యర్థులు వీటి కోసం దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. అభ్యర్థులు www.anantapuramu .ap.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు ఫారాలు పొంది ఈ నెల 10వతేదీ సాయంత్రం 5గంటల్లో గా నేరుగా గానీ, లేదా పోస్ట్ ద్వారా గానీ నగరంలోని జిల్లా వైద్యఆరోగ్యశాఖాధికారి కార్యాలయానికి చేరేలా పంపాలని సూచించారు. గడువు ముగిసిన తరువాత వచ్చిన దరఖాస్తులను స్వీకరించబోన్నారు. అర్హులైన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకుని ఈ అవకాశాలన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

నేడు జిల్లాకు పలువురు ఆర్టీసీ
ఉన్నతాధికారుల రాక

అనంతపురం సప్తగిరిసర్కిల్: ఏపీఎస్ఆర్టీసీ విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి పలువురు ఉన్నతాధికారులు బుధవారం జిల్లాకు రానున్నారు. ఈ మేరకు జిల్లా అధికారులకు కడప ఈడీ కార్యాలయం నుంచి సమాచారం అందింది. విజయవాడ ప్రధాన కార్యాలయం నుంచి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్(ఆపరేషన్స్, మార్కెటింగ్)జయరావు, చీఫ్ ట్రాఫిక్ మేనేజర్(సీటీఎం)బ్రహ్మానందరెడ్డి, డిప్యూటీ సీటీఎం(బస్‌పాస్)రాజారావు, డిప్యూటీ సీటీఎం(మార్కెటింగ్)సత్యనారాయణ, డిప్యూటీ సీటీఎం(సెంట్రల్ షెడ్యూల్ సెక్షన్) ఎన్‌కే నాథ్ రానున్నారు. ఐదుగురు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి జిల్లాలోని డిపోలను పరిశీలించనున్నట్లు తెలిసింది. ప్రయాణికులకు జిల్లా అధికారులు కల్పిస్తున్న సౌకర్యాలు, బస్సుల నిర్వహణ, బస్టాండ్లు, డిపోల్లో సౌకర్యాలు తదితర వాటిని పరిశీలించనున్నట్లు ఆ శాఖాధికారులు తెలియజేశారు.

ఫీజు గడువు పొడిగింపు

ఎస్కేయూ: రెండవ దశలో పీజీ ప్రవేశాలు పొందిన విద్యార్థుల ఫీజు చెల్లింపు గడువును గురువారం వరకూ పొడిగించినట్లు వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ఆచార్య ఏవీ రమణ తెలిపారు.

సినిమా గైడ్
అనంతపురం

గంగ	: శమంతకమణి
గౌరి	: ఫిదా
గాయత్రి	: దండుపాళ్యం-2
గౌతమి	: వాసుకి
త్రివేణి	: ముబారకన్ (హిందీ)
తరంగిణి	: మాయామాల్
తేజస్విని	: నిన్ను కోరి
శాంతి	: వార్ ఫర్ ది ప్లానెట్ ఆఫ్ ది ఏప్స్ (ఇంగ్లీషు)
సుధ	: గౌతమ్‌నంద
స్వప్న	: ఫారెన్ గర్ల్
శ్రీవెంకటేశ్వర	: గౌతమ్‌నంద
నీలిమా	: బాహుబలి-2

రసవత్తరంగా...
రైల్వే ఇన్‌స్టిట్యూట్ ఎన్నికలు

ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్న కార్మిక సంఘాలు
నేడు పోలింగ్.. రాత్రికి ఫలితాలు



గుంతకల్లు: పట్టణంలోని రైల్వే ఇన్‌స్టిట్యూట్ పాలకవర్గ ఎంపిక కోసం నిర్వహిస్తున్న ఎన్నికల ప్రక్రియ అంతిమదశకు చేరుకుంది. రానున్న రెండేళ్ల కాలానికి రైల్వే ఇన్‌స్టిట్యూట్‌ను నిర్వహించి, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడానికి రైల్వే యాజమాన్యం ఎన్నికలు నిర్వహిస్తోంది. సహజంగానే ఈ ఎన్నికలను రైల్వే మజ్దూర్ యూనియన్, ఎంప్లాయిస్ సంఘ్ కార్మిక సంఘాలు సవాలుగా తీసుకున్నాయి. సంయుక్త కార్యదర్శి, కోశాధికారి పదవులకు ఏకాభిప్రాయం కుదిరి పోటీ లేకుండా పోగా, అతి కీలకమైన కార్యదర్శి పదవికి ఈ రెండు సంఘాలు బలపరుస్తున్న ఇద్దరు ఉద్యోగులు బరిలో నిలిచారు. బుధవారం ఉదయం ఓటింగ్ కార్యక్రమం చేపట్టి.. రాత్రికల్లా ఫలితాలు ప్రకటించనున్నారు.

గుంతకల్లు రైల్వే ఇన్‌స్టిట్యూట్‌లో 1,253 మంది సభ్యులుండగా, ఆ మేరకు ఓటర్లున్నాయి. కిందటి నెల వరకూ అవిచ్ఛిన్నంగా సభ్యత్వ రుసుం చెల్లించిన వారికి ఓటు హక్కు కల్పించారు. కాగా, బరిలో నిలవదలచిన వారు రానున్న ఆరునెలల కాలానికి ముందే సభ్యత్వాలు చెల్లించాలనే నిబంధన ఉంది. కాగా, ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శి, సంయుక్త కార్యదర్శి, కోశాధికారి, ఆరుగురు కార్యవర్గ సభ్యుల పదవుల కోసం అభ్యర్థులు రంగంలోకి దిగారు. ఇందులో కార్యదర్శి, ఇద్దరు కార్యవర్గ సభ్యుల పదవులు మినహా మిగతా పోస్టులకు అభ్యర్థుల మధ్య సయోధ్య కుదరడంతో ఏకగ్రీవమయ్యాయి. కోశాధికారి పదవికి టికెట్ చెకింగ్ బ్రాంచ్ నుంచి డీ మల్లికార్జున, కే గిరిమోహన్‌రావు పోటీలో నిలిచారు. ఒకే బ్రాంచి నుంచి ఇద్దరు పోటీ చేయడం వల్ల సంఘంలో అనైక్యత ఏర్పడుతుందంటూ.. ఒకరిని విత్‌డ్రా చేసుకోవాల్సిందిగా ఇండియన్ రైల్వే టికెట్ చెకింగ్ స్టాఫ్ ఆర్గనైజేషన్ (ఐఆర్‌టీసీఎస్ఓ) సంఘ నాయకులు కోరారు. ఈ మేరకు చర్చలు సఫలం కావడంతో పోటీ నుంచి తప్పుకోవడానికి మల్లికార్జున సిద్ధపడ్డారు. అయితే అప్పటికే విత్‌డ్రా సమయం ముగియడంతో సాంకేతికంగా ఆ పదవికి పోటీ ఉన్నట్లుగానే భావించాల్సి వచ్చినా అభ్యర్థులు మాత్రం ప్రచారం నిలిపివేశారు. అత్యంత కీలకమైన కార్యదర్శి ఎన్నిక రసకందాయంలో పడింది. ఈ పదవికి టికెట్ చెకింగ్ బ్రాంచి నుంచి ఆర్ సోమశేఖర్ రావు, రైల్వే ఆసుపత్రి విభాగం నుంచి ఫార్మాసిస్టు జె మేషుశ్యాం బరిలో నిలిచారు. వీరికి యూనియన్, సంఘ్ నాయకులు మద్దతుగా నిలిచి.. ఎన్నికలను ప్రతిష్ఠాత్మకంగా తీసుకున్నారు. తమ బలాబలాలను బేరీజు వేసుకుని ప్రచార కార్యక్రమం చేపట్టారు. యూనియన్ బలపరుస్తున్న మేషుశ్యాం, సంఘ్ బలపరుస్తున్న సోమశేఖర్‌రావు తాము గెలిస్తే చేపట్టబోయే కార్యక్రమాలను విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. కొన్నేళ్లుగా ఇన్‌స్టిట్యూట్ కార్యదర్శిగా టికెట్ చెకింగ్ బ్రాంచ్ ఉద్యోగులే కొనసాగుతుండగా, వారి జోరుకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో మెడికల్ బ్రాంచి నుంచి మేషుశ్యాంను నిలిపారు. ఈసారి టికెట్ చెకింగ్ బ్రాంచ్ ఆధిపత్యానికి చెక్ పడుతుందా? లేక మరోసారి సత్తా చాటుతుందా? అనే విషయమై ఉద్యోగుల్లో ఉత్కంఠ నెలకొంది. బుధవారం రాత్రికల్లా ఈ ఉత్కంఠకు తెరపడనుంది.

ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం

మంచివారినే ఎన్నుకోండి
రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్



భన్వర్‌లాల్‌ను సన్మానిస్తున్న దృశ్యం

గుంతకల్లుటౌన్: ప్రజాస్వామ్యంలో ప్రజలే సుప్రీం కాబట్టి 2019 ఎన్నికల్లో మంచి నాయకులను ఎన్నుకోవాలని ఉమ్మడి రాష్ట్రాల ఎన్నికల అధికారి భన్వర్‌లాల్ పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మంగళవారం ఓటు హక్కుపై విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ భవిష్యత్తు ఓటు హక్కుపై ఆధారపడి ఉంటుందన్నారు. మన దేశంలో ఎన్నికలు జరిగినప్పుడు కొందరు రాజకీయ నాయకులు, కొన్నిపార్టీలు డబ్బు, మద్యం, బహుమతులు, జాతి, మతం, కులం పేర్లతో ఓట్లు అడుగుతుంటాయన్నారు. అలాంటి ప్రలోభాలకు గురికాకుండా యువతీయువకులు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. భారత రాజ్యాంగానికి మహోన్నతమైన స్థానం ఉందన్నారు. ఓటు నమోదు నిరంతర ప్రక్రియ అన్నారు. ఇదే క్రమంలో ప్రతి ఒక్కరూ ఓటు నమోదు చేసుకునేలా చేయాల్సిన బాధ్యత యువతపై ఉందన్నారు. ఈ మేరకు ప్రజల్లో చైతన్యం నింపేందుకు కృషి చేయాలన్నారు. ప్రజాస్వామ్యబద్ధంగా ప్రజలు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. ఎలాంటి ప్రలోభాలకూ లొంగకుండా మనస్సాక్షిని నమ్మి ఓటు వేస్తేనే మంచి ప్రజాప్రతినిధులను ఎన్నుకోవడం సాధ్యమవుతుందన్నారు. అనంతరం పలువురు విద్యార్థులు భన్వర్‌లాల్‌తో ముఖాముఖి మాట్లాడారు. ఈవీఎంలలో లోపాలున్నాయని పార్లమెంటులో చర్చ జరిగింది కదా అని సెకండియర్ బైపీసీ విద్యార్థి త్రిలోక్ అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ ఈవీఎంలలో ఎలాంటి లోపాలు లేవని ఎన్నికల కమిషన్ నిరూపించిందన్నారు. కాబట్టి ఎన్నికల్లో నిర్భయంతరంగా ఈవీఎంల ద్వారా ఓటు హక్కు వినియోగించుకోవచ్చునన్నారు. ఓటు వేసేటప్పుడు ఎలక్ట్రానిక్ మిషన్ చివర నోటా అని ఎందుకు పెట్టారంటూ చంద్రశేఖర్ అనే విద్యార్థి అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ 2013లో సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మేరకు అలా పెట్టామన్నారు. పది పార్టీల నుంచి పదిమంది అభ్యర్థులుంటే వారందరూ కొంతమందికి నచ్చకపోవచ్చునని, అలాంటి సమయాల్లో ఎవరికీ ఓటివ్వనంటూ నోటాను ఎంచుకోవచ్చునన్నారు. పార్టీ మారుతున్న ప్రజాప్రతినిధులపై రాజ్యాంగ పరంగా చర్యలు తీసుకుంటున్నారా అని ఎం పావని అనే విద్యార్థిని అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానమిస్తూ.. అది ఎన్నికల సంఘం పరిధిలోకి రాదన్నారు. శాసనసభలో ఫిర్యాదు చేయాలని, వారిపై చర్యలు తీసుకునే అవకాశం సభాపతికి ఉంటుందన్నారు. ప్రశ్నలడిగిన విద్యార్థులకు భన్వర్‌లాల్ చేతుల మీదుగా సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం ఎన్నికల అధికారి భన్వర్‌లాల్‌ను కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ రమామణి, ఆర్డీఓ మలోలా, జడ్పీ సీఈఓ సూర్యనారాయణ, తహసీల్దారు హరిప్రసాద్, డీటీ మునివేలు, ఎంపీడీఓ శంకర్, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసులు, మున్సిపల్ ఎంఈ ఎన్ ఈశ్వరయ్య, అసిస్టెంట్ సిటీ ప్లానర్ శివన్నారాయణ, అర్బన్ సీఐ రాజ తదితరులు పాల్గొన్నారు.

దినఫలాలు

అదృష్టసంఖ్యలు : 2, 5



మేషరాశి: (మార్చి21-ఏప్రిల్20): చిన్నారులు, ప్రియతముల విషయాల్లో ప్రోత్సాహకరం. ఉన్నత విద్యా విషయాలు, సమావేశాలు, చర్చల్లో సత్ఫలితాలు సాధిస్తారు. ప్రయాణాలు, వ్యాపారచర్చలకు అనుకూలం.



వృషభరాశి: (ఏప్రిల్21-మే20): కుటుంబ సభ్యుల ఆరోగ్యం మెరుగవుతుంది. ఆర్థిక విషయాల్లో సన్నిహితుల సహకారం లభిస్తుంది. ఇంటి అవసరాలకు సకాలంలో డబ్బు చేతికి అందుతుంది. ఇంటి కోసం విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు.



మిథునరాశి:(మే21-జూన్21): శ్రీవారు, శ్రీమతి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది. బంధుమిత్రులతో సమావేశాలు ఫలిస్తాయి. ప్రియతముల నుంచి కీలక సమాచారం అందుకుంటారు. సమావేశాల్లో, బృందకార్యక్రమాల్లో కీలకపాత్ర పోషిస్తారు.



కర్కాటకరాశి:(జూన్22-జూలై23): విందు వినోదాల్లో పాల్గొంటారు. ఆర్థిక విషయాల్లో సహోద్యోగుల సహకారిస్తారు. అదనపు ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. క్యాటరింగ్, రిటైల్ రంగం, హోటల్, వైద్య రంగాల వారికి ప్రోత్సాహకరం.



సింహరాశి:(జూలై24-ఆగస్ట్23): పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభిస్తాయి. విద్యార్థులకు ప్రోత్సాహకరంగా ఉంటుంది. సృజనాత్మక రంగాల వారికి ప్రోత్సాహకరం. చిన్నారుల విషయంలో శుభపరిణామాలు చోటుచేసుకుంటాయి.




కన్యారాశి: (ఆగస్ట్24-సెప్టెంబర్23): సోదరీసోదరుల విషయంలో శుభపరిణామాలు సంభవం. ప్రయాణాలు ఆనందం కలిగిస్తాయి. అగ్రిమెంట్లపై ఒక నిర్ణయానికి వస్తారు. విలువైన సమాచారం అందుకుంటారు. విద్యార్థులకు శుభప్రదం.




తులారాశి: (సెప్టెంబర్24-అక్టోబర్23): రియల్ ఎస్టేట్, నిర్మాణ రంగాల వారికి శుభప్రదం. బదిలీలు, మార్పులకు సంబంధించి ముఖ్య సమాచారం అందుకుంటారు. సంస్మరణలు, ఆధ్యాత్మిక కార్యక్రమాలు సాంత్వన కలిగిస్తాయి.



వృశ్చికరాశి: (అక్టోబర్24-నవంబర్22): ఆర్థిక విషయాల్లో పెద్దల సహకారం లభిస్తుంది. వృత్తి, వ్యాపారాల్లో అదనపు ఆదాయం అందుకుంటారు. పెట్టుబడులు, పొదుపు పథకాల విషయంలో పెద్దల నుంచి మంచి సలహాలు లభిస్తాయి.



ధనూరాశి: (నవంబర్23-డిసెంబర్21): అంచనాలు ఫలించడంతో మనసు ఉల్లాసంగా ఉంటుంది. కొత్త పనులు ప్రారంభిస్తాయి. సమావేశాల్లో కీలక పాత్ర పోషిస్తారు. ప్రణాళికాబద్ధంగా వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రయాణాలు ఉల్లాసం కలిగిస్తాయి.



మకరరాశి(డిసెంబర్22-జనవరి21): ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల కోసం నిధుల సేకరణకు ప్రయత్నిస్తారు. ప్రయాణాలు, సమావేశాల్లో సత్ఫలితాలు సాధిస్తారు. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.



కుంభరాశి: (జనవరి22-ఫిబ్రవరి18): పందాలు, పోటీల్లో విజయం సాధిస్తారు. సమావేశాలు, వేడుకల్లో పాల్గొంటారు. పెట్టుబడులు ప్రోత్సాహకరం. బృందకార్యక్రమాల్లో పాల్గొంటారు. భాగస్వామి వైఖరి ఉల్లాసం కలిగిస్తుంది.



మీనరాశి: (ఫిబ్రవరి19మార్చి20): వృత్తిపరమైన సమావేశాలు, ప్రయాణాలకు అనుకూలం. సహోద్యోగులతో చర్చలు ఫలిస్తాయి. ఉద్యోగ, వ్యాపారాల్లో లక్ష్య సాధనకు వ్యూహాత్మకంగా అడుగులు వేస్తారు. సంకల్పం నెరవేరుతుంది.

-విజయమళ్ళ బిందుమాధవ శర్మ

సూక్తి

లక్ష్య సాధనలో ఎన్నిసార్లు ఓడినా సరే.. మరోసారి ప్రయత్నించు.



వావ్.. చార్లెస్ వంతెన

స్విట్జర్లాండ్‌లోని ఆల్ప్స్ పర్వతాల్లో పచ్చదనం పరుచుకున్న అందాలతో, ప్రకృతి శోభతో అలరారే రెండు కొండ ప్రాంత గ్రామాలే.. జెర్మట్, గ్రెచెన్. వాటి మధ్యలో లోతైన గ్రాబెంగూఫర్ లోయ. గ్రెచెన్ నుంచి జెర్మట్‌కు చేరుకోవాలంటే ఆ లోయతో పాటు, చిన్న చిన్న కొండలూ ఎక్కి దిగాల్సిందే. మొత్తంగా మూడు గంటల సమయం పడుతుంది. అక్కడి ప్రజలకు ఇప్పుడు ఆ సమస్య తీరిపోయింది. కేవలం పది నిముషాల్లోనే ఇరు గ్రామాలకు చకచకా వెళ్లిపోవచ్చు. ఎలానో తెలుసా? ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెన అక్కడ ప్రారంభించారు.



ఆల్ప్స్‌పర్వతాల్లోని రెండు కొండల మధ్య ఓ పొడవాటి వంతెన నిర్మించారు. దాని పేరు "చార్లెస్ కువోనెన్'. గాలికి ఊగుతూ, తూగుతూ ఉండే ఆ వంతెనను చూస్తుంటే.. కొందరికి కొండల మధ్య వెండి ఊయల్లా తోస్తుంది. ఇంకొందరికి నడిచే రోలర్ కోస్టర్‌లా కనిపిస్తుంది. ఇది సస్పెన్షన్ మోడల్ బ్రిడ్జి. వంతెనపై నడుస్తుంటే కాస్త ఊగుతూ ఉంటుంది.

జూలై 29న ప్రారంభమైన ఈ వంతెన ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనగా రికార్డుల్లోకి ఎక్కింది. దీని పొడవు 494 మీటర్లు.


ఈ వంతెన భూ ఉపరి తలానికి 85 మీటర్ల ఎత్తులో ఉంది.

ఇప్పటివరకు జర్మనీలోని 'టైటాన్-ఆర్‌టీ' వంతెనను అతి పొడవైనదిగా పేర్కొనేవారు.


ప్రపంచంలోనే అతి పొడవైన పాదచారుల వంతెనల్లో రష్యాలోని 'స్కైపార్క్ బ్రిడ్జ్' మూడో స్థానంలో ఉంది. 2016 సోచి ఒలింపిక్స్ సందర్భంగా దీన్ని నిర్మించారు.

ఎత్తయిన ప్రదేశాలను చూసి భయపడేవారు, 'చార్లెస్ కువోనెన్' వంతెన దాటాలంటే కళ్లు మూసుకోవాల్సిందేనని జెర్మట్ ట్రావెల్ బోర్డు ప్రతినిధి అంటున్నారు.

రోడ్డు మార్గంలో వంతెన కట్టాలంటేనే ఓ నెల రోజుల సమయం పడుతుంది. కానీ రెండు కొండల మధ్యలో నిర్మించిన ఈ బ్రిడ్జిని కేవలం 10 వారాల్లోనే పూర్తి చేయడం విశేషం.



బొమ్మ గీయండి



టంగ్ ట్విస్టర్స్



1. I would if I could, and if I couldn't, how could I?You couldn't, unless you could, could you?
2. The crow flew over the river with a lump of raw liver.
3. National Sheepshire Sheep Association

ఒకే అక్షరం

1. TOTAL	మొ	
2. BUD	మొ	
3. PLANT	మొ	

చుక్కలు కలపండి



నవ్వుల్ నవ్వుల్

రాహుల్ : కుట్టేముందు దోమలు ఎందుకు శబ్దం చేస్తాయి?
రోహిత్ : దాడి చేయబోతున్నాను అని వర్తమానం ఇవ్వడం యుద్ధనీతిలో భాగం.




దారి కనుక్కోండి



చెప్పగలరా?

జాలిలో ఉన్నా కానీ గాలిలో లేను
బిరుదులో ఉన్నా కానీ అరుదులో లేను
లిపిలో ఉన్నా కానీ తాపిలో లేను
అయితే ఇంతకీ నేనెవర్నో చెప్పగలరా?


ఔనా!



వందలో డెబ్బై శాతం మంది 'హైపనిక్ జెర్క్' ఎదుర్కొన్నవారే. ఇదేదో కొత్త వ్యాధి అని అనుకుంటున్నారా? అదేం కాదు. మాంచి నిద్రలో ఉన్నప్పుడు ఎక్కడ నుంచో కింద పడుతున్నట్లు అనిపించి చటుక్కున మెలకువ వస్తుంది. అదే 'హైపనిక్ జెర్క్'.

మీకుతెలుసా?

మీకు చెట్లతో కూడిన అరణ్యాలే తెలుసు.. మరి శిలలతో ఉన్న అడవి తెలుసా? చైనాలోని యునాన్ ప్రావిన్స్‌లో ఉన్న పొడవైన శిలల సముదాయాన్నే 'స్టోన్ ఫారెస్ట్' అని పిలుస్తారు.



జంతర్‌మంతర్

ఈ కింది పదాలను సరిచేయండి

1. ఐత్యంకమ ▸ ....
2. సందనపా ▸ ....
3. పిగూడుట్ట ▸ ....

- పత్తిపాక అంకిత, కోరుట్ల

జంబ్లింగ్ వర్డ్స్

ఈ కింది పదాలను సరిచేయండి

1. IRAN ▸ ....
2. IDWE ▸ ....
3. DMBU ▸ ....

- గుర్రాల సాయిసుధ, మెట్‌పల్లి

జవాబులు

ఒకే అక్షరం : 1. మొత్తం 2. మొగ్గ 3. మొక్క. చెప్పగలరా? : జాబిలి జంతర్‌మంతర్ : 1. ఐకమత్యం 2. సంపాదన 3. పిట్టగూడు జంబ్లింగ్ వర్డ్స్ : 1.RAIN 2.WIDE 3.DUMB

ఎస్ఎస్ఏలో...

అద్దె రగడ

బిల్లుల కోసం డ్రైవర్ల నిరసన

పీఓతో చర్చలు



డ్రైవర్లపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న పీఓ సుబ్రహ్మణ్యం

అనంతపురం అర్బన్: కాసులతో కళకళలాడే సర్వశిక్ష అభియాన్ (ఎస్ఎస్ఏ) ఇప్పుడు కటకటలాడుతోంది. చివరికి అధికారులు నిత్యం తిరిగే వాహనాలకు సైతం బిల్లులు చెల్లించలేని దుస్థితిలో ఉంది. ఐదు నెలలుగా అద్దె చెల్లించలేదంటూ డ్రైవర్లు నిరసనకు దిగడమే ఇందుకు నిదర్శనం. బిల్లులు చెల్లిస్తేనే కార్లు కదిలిస్తామంటూ మంగళవారం కార్యాలయ ఆవరణలో కార్లు నిలబెట్టి డ్రైవర్లు నిరసన తెలిపారు. క్షేత్రస్థాయి పరిశీలనకు వెళ్లేందుకు రావాలని అధికారులు కోరినా డ్రైవర్లు ససేమిరా అన్నారు. చివరికి ఎస్ఎస్ఏ పీఓ సుబ్రహ్మణ్యంను కలిసి తమ గోడు వెల్లబోసుకున్నారు. 'సర్..! ఈ ఏడాది మార్చి నుంచి ఇప్పటివరకు ఐదు నెలలుగా అద్దె బిల్లులు రాలేదు..మీరేమో నిధులు లేవంటున్నారు. మా ఓనర్లు అద్దె వస్తేనే జీతాలు ఇస్తామంటున్నారు. ఇలాగైతా తాము కుటుంబాలను ఎలా పోషించుకోగలం?' అని ఆవేదనతో ప్రశ్నించారు. 'ఉదయం వస్తాం.. రాత్రి వరకూ ఉంటాం.. అయినా జీతాలు రాకపోతే మా పరిస్థితి ఏమిటి' అని వాపోయారు. 'తలచుకుంటేనే కళ్లల్లో నీళ్లొస్తాయ్.. అడిషనల్ ఎస్పీడీ ఇక్కడికి వచ్చినప్పుడు కలిసి మా గోడు చెప్పుకున్నాం.. బిల్లులు ఇస్తామన్నారు. నెలన్నరైనా పట్టించుకునే వారేలేరు. అందుకే ఈరోజు బిల్లుల కోసం నిరసనకు దిగాల్సి వచ్చింది' అని చెప్పుకున్నారు. ఇందుకు పీఓ సుబ్రహ్మణ్యం స్పందిస్తూ.. డ్రైవర్ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. 'నేను వచ్చి నెలకుపైగా అయింది. ఏ రోజైనా వచ్చి నన్ను కలిశారా..? మీ సమస్య గురించి చెప్పుకున్నారా..? ఇప్పుడేమో ఇలా గొడవ చేస్తారా?' అని ప్రశ్నించారు. 'పైగా నేను (పీఓ) చెప్పినా మీరు వినిపించుకోరు. అలాంటప్పుడు మీ కార్లే మాకవసరం లేదు. బిల్లులిస్తాం.. వెళ్లిపోండి.. లేదు.. శాఖ నిబంధనల ప్రకారం నడుచుకుంటామంటే ఉండండి' అన్నారు. దీంతో డ్రైవర్లు దిగివచ్చారు. 'మీరు చెప్పినట్లుగానే నడుచుకుంటాం.. మా సమస్యలు మీరే పరిష్కరించాలి' అని కోరారు. ఇందుకు పీఓ సానుకూలంగా స్పందించారు. త్వరలోనే బిల్లుల చెల్లింపునకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. దీంతో డ్రైవర్లు తిరిగి విధులకు హాజరయ్యారు.

సంపూర్ణ ఆరోగ్యం కోసం అన్నఅమృతహస్తం

ప్రభుత్వ బడుల్లో సౌకర్యాలతో కూడిన విద్య

పలు భవనాల ప్రారంభోత్సవంలో మంత్రి పరిటాల సునీత

కనగానపల్లి/చెన్నేకొత్తపల్లి: పౌష్టికాహార లోపంతో తల్లీబిడ్డలు మరణించకుండా సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్న అమృతహస్తం పథకం అమలు చేస్తోందని స్త్రీ,శిశుసంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి మండల కేంద్రాల్లో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో మంగళవారం ఆమె పాల్గొన్నారు. ముందుగా చెన్నేకొత్తపల్లిలో రూ.80లక్షల వ్యయంతో నిర్మించిన సీడీపీఓ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం అంగన్‌వాడీలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను పరిశీలించారు.అనంతరం కనగానపల్లిలో రూ.1.30కోట్లతో నిర్మించిన వసతి గృహం, జిల్లా పరిషత్ పాఠశాలలో రూ.42.85లక్షలతో నూతనంగా నిర్మించిన అదనపు తరగతుల భవనాలను మంత్రి ప్రారంభించారు. అలాగే ఆదర్శపాఠశాలలో కంప్యూటర్ ల్యాబ్ ప్రారంభించిన మంత్రి విద్యార్థులకు ల్యాప్‌ట్యాప్‌లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..పౌష్టికాహార లోపంతోనే మాతృమరణాలు సంభవిస్తున్నాయని గుర్తించిన ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల్లో అన్నఅమృత హస్తం అమలుచేస్తూ పోషకాహారం అందిస్తోందన్నారు. 9 నెలల గర్భవతులు అంగన్‌వాడీ కేంద్రానికి వచ్చి భోజనం చేసేందుకు ఇబ్బందులు పడుతున్నట్టు తమ దృష్టికి వచ్చిందని, ఆ సమస్యను పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. అంగన్‌వాడీల్లో ప్రీస్కూల్స్ ఏర్పాటుచేసి పిల్లలకు ఆంగ్లమాధ్యమంలో విద్యాబోధన అందిస్తున్నామన్నారు. అంగన్‌వాడీ సిబ్బంది సమస్యలను విడతల వారీగా పరిష్కరిస్తున్నామన్నారు.



కనగానపల్లిలో ఆదర్శవసతి గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పరిటాల సునీత

సౌకర్యాలతో కూడిన విద్య

ప్రభుత్వ పాఠశాలల్లో సకల సౌకర్యాలతో కూడిన నాణ్యమైన విద్యనందిస్తున్నామని మంత్రి పరిటాల సునీత పేర్కొన్నారు. కనగానపల్లి ఆదర్శపాఠశాల వసతి గృహ ప్రారంభోత్సవంలో ఆమె మాట్లాడుతూ కార్పొరేట్ స్థాయి విద్యనందించేందుకు ప్రభుత్వం ఆదర్శపాఠశాలలను ప్రవేశపెట్టి.. వసతి గృహాలు నిర్మించిందన్నారు. కార్యక్రమంలో ఆర్డీఓ బాలానాయక్, తహసీల్దార్ సుధామణి, జడ్పీటీసీ వెంకటరామిరెడ్డి, మార్కెట్‌యార్డ్ వైస్ చైర్మన్ దండుఓబులేశు, ఎంపీపీ అంకే అమరేంద్ర, ముకుందనాయుడు, టీడీపీజిల్లా ఉపాధ్యక్షుడు నెట్టెం వెంకటేశ్, సర్పంచ్ బాలయ్య, కన్వీనర్లు జోగి అంజినప్ప, రామక్రిష్ణారెడ్డి,రాజాక్రిష్ణ, దామోదర్,సీడీపీఓ గాయత్రి, నాయకులు మనోహర్‌నాయుడు,శ్రీరాములు, యజ్ఞేశంకర్, కాంట్రాక్టర్లు బట్టానాగేంద్ర, ముత్యాలు, ప్రిన్సిపాల్ రజనీప్రియ, సర్పంచ్‌లు తదితరులు పాల్గొన్నారు.

మీజిల్స్-రుబెల్లా వ్యాధులను సమూలంగా నిర్మూలిద్దాం: మంత్రి పరిటాల సునీత

కనగానపల్లి/చెన్నేకొత్తపల్లి: చిన్నారులకు సంక్రమించే ప్రాణాంతక వ్యాధుల్లో మీజిల్స్-రుబెల్లా ముఖ్యమైనవని, వాటిని సమష్టి కృషితో సమూలంగా నిర్మూలిద్దామని స్త్రీ,శిశుసంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత పిలుపునిచ్చారు. చెన్నేకొత్తపల్లి, కనగానపల్లి జిల్లాపరిషత్ పాఠశాలల్లో మంగళవారం ఎంఆర్ వ్యాక్సినేషన్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తట్టు, రుబెల్లా వ్యాధులు ప్రాణాంతకమైనవన్నారు.ఈ వ్యాధులతో ప్రతిఏటా దేశవ్యాప్తంగా 49వేల మంది చిన్నారులు చనిపోతున్నారన్నారు. వాటిని సమూలంగా నిర్మూలించాలనే ఉద్దేశంతో పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్ వేయిస్తున్నామన్నారు. ఈ వ్యాక్సిన్ వేయించాలంటే బయట రూ.2వేల వరకు ఖర్చు అవుతుందని, అలాంటిది ప్రభుత్వం ఉచితంగా అందిస్తోందన్నారు. 9నెలల నుంచి 15ఏళ్ల లోపు పిల్లలకు వ్యాక్సిన్ తప్పని సరిగా వేయించాలన్నారు.వైద్య, అంగన్‌వాడీసిబ్బంది గ్రామాల్లో ర్యాలీలు నిర్వహించి ఎంఆర్ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆర్డీఓ బాలానాయక్, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్ఓ యుగంధర్, వైద్యులు నారాయణస్వామి నాయక్, శ్రీహర్ష, ఎంపీటీసీ శకుంతల, టీడీపీ నాయకులు చల్లాబాలక్రిష్ణ, టీసీ సుబ్రహ్మణ్యం, దబ్బర చలపతి, సుధాకర్‌చౌదరి, సర్పంచ్‌లు బాలయ్య, ఆంజనేయులు, రామసుబ్బయ్య,సూర్యశేఖర్‌రెడ్డి, మల్లేశ్, యజ్ఞేశంకర్,సుబ్రహ్మణ్యం,కుళ్లాయప్ప, తమ్మినేని శ్రీరామ్, ఆది, భాస్కర్, సింగిల్‌విండో అధ్యక్షుడు తలారి రాజప్ప, చంద్ర తదితరులు పాల్గొన్నారు.



ఎంఆర్‌వ్యాక్సిన్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మంత్రి పరిటాల సునీత

పెట్టెండ్లు, పగ్గాలు లేకుండా వేరుశనగ విత్తన సాగు

గుంతకల్లురూరల్: మండల పరిధిలోని నల్లదాసరపల్లిలో యువరైతులు సురేశ్, లింగమయ్య ఎద్దులకు పట్టెండ్లు, పగ్గాలు లేకుండా 10 ఎకరాల్లో మంగళవారం వేరుశనగ విత్తనం వేశారు. గ్రామానికి చెందిన వెంకటరాముడు, నారాయణప్పలకు చెందిన 10 ఎకరాల భూమిలో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 3.20 గంటల వరకూ 9గంటల వ్యవధిలో విత్తనం విత్తడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. యువరైతులను, ఎద్దులను గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.



వైద్యకళాశాలలో 80 మందికి ప్రవేశం

నేటి సాయంత్రం 5 గంటల వరకు గడువు

తదుపరి సీట్ల తరువాత కౌన్సెలింగ్‌లో భర్తీ

అనంతపురం వైద్యం: 2017-18 వైద్య విద్యాసంవత్సరానికి సంబంధించి స్థానిక ప్రభుత్వ వైద్యకళాశాలలో 100 సీట్లకు గాను మంగళవారం సాయంత్రానికి 80 మంది విద్యార్థులు ప్రవేశం పొందారు. అయితే బుధవారం సాయంత్రం 5 గంటల వరకూ గడువు ఉండడంతో మిగిలిన 20 సీట్లు కూడా భర్తీ అయ్యే అవకాశమున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఒకవేళ గడువులోపు చేరకపోతే తదుపరి కౌన్సెలింగ్‌లో సీటు పొందిన వారు కళాశాలలో ప్రవేశం పొందవచ్చునన్నారు.

నవత ట్రాన్స్‌పోర్టుకు ఫోరం షాక్

అనంతపురం లీగల్: నవత ట్రాన్స్‌పోర్టుకు ఫోరం షాక్ ఇచ్చింది. ఆ ట్రాన్స్‌పోర్టులో పంపిన సరుకు డ్యామేజీ కావడంతో అందుకు సంబంధించిన ధర మొత్తం, మానసిక వేదన, కోర్టు ఖర్చులు చెల్లించాలని ఆదేశిస్తూ జిల్లా వినియోగదారుల ఫోరం మంగళవారం ఆదేశాలు జారీ చేసింది. కేసు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన న్యూచంద్ర ఎమిరి స్టోన్ వర్క్స్‌కు చెందిన 42 పిండిమిషన్ రాళ్లను కర్ణాటక రాష్ట్రం రాణిబెన్నూరుకు చెందిన భవానీ ట్రేడర్స్‌కు నవతా ట్రాన్స్‌పోర్టు ద్వారా పంపారు.. వాటిలో కొన్ని డ్యామేజీ కాగా, వాటిని వెనక్కు పంపారు.. డ్యామేజీ అయిన వాటికి సంబంధించి బ్రేకేజీ సర్టిఫికెట్ ఇవ్వవలసిందిగా చంద్రవర్క్స్ అనంతపురంలోని నవతా ట్రాన్స్‌పోర్టు వారిని కోరగా.. అందుకు వారు నిరాకరించారు. దీంతో చంద్ర స్టోన్ వర్క్స్ వారు జిల్లా వినియోగదారుల ఫోరంను ఆశ్రయించగా.. నవతా ట్రాన్స్‌పోర్టు వారు తమ వద్ద ఎలాంటి డ్యామేజీ కాలేదని, అంతేకాకుండా వాణిజ్య అవసరాలకు సంబంధించిన లావాదేవీ కాబట్టి వినియోగదారుల ఫోరం పరిధిలోకి ఈ కేసు రాదని వాదించారు. కాగా, విచారణ దశలో న్యాయవాద కమిషన్‌ను నియమించి రవాణా వాపసు వస్తువుల డ్యామేజీని పరిశీలించి రవాణాలోనే డ్యామేజీ జరిగిందని నిర్ధారించారు. రవాణాలో నిర్లక్ష్యం వహించి డ్యామేజీకి కారణమయినందున ఆ వస్తువు విలువ మొత్తం రూ.21,620లు చెల్లించాలని, మానసిక వేదనకు గురిచేసినందుకుగానూ రూ. 10 వేలు, కోర్టు ఖర్చుల కింద మరో రూ. 3 వేలు చెల్లించాలని ఫోరం చైర్మన్ ప్రమీలారెడ్డి నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల బెంచ్ తీర్పు చెప్పింది.

రానున్న ఐదురోజుల్లో

తేలిక పాటి వర్షాలు

బుక్కరాయసముద్రం: జిల్లాలో రానున్న ఐదు రోజుల్లో తేలిక పాటి నుంచి ఒక మాదిరి వర్షాలు కురిసే అవకాశం ఉందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ పరిశోధన కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. గడిచన ఐదు రోజుల్లో జిల్లాలోని పలు మండలాల్లో తేలికపాటి నుంచి ఒక మాదిరి వర్షాలు కురిసినట్లు తెలిపారు. రానున్న ఐదు రోజుల్లో పలు ప్రాంతాల్లో 2.5 నుంచి 35.5 మి.మీ వర్షాలు పడే అవకాశముందన్నారు. పగటి ఉష్ణోగ్రతలు 34-35 డిగ్రీల సెల్సియస్‌గా, రాత్రి ఉష్ణోగ్రతలు 25-26 డిగ్రీల సెల్సియస్‌గా నమోదు కావచ్చునని తెలిపారు. గాలులు గంటకు 09-12 కి.మీ వేగంతో వీచే అవకాశముందన్నారు. గాలిలో తేమశాతం 72-80-శాతం, మధ్యాహ్నం పూట 51-53 శాతం ఉండే అవకాశముందన్నారు.

ఎస్ఈగా నాగమోహన్ నియామకం

అనంతపురం కార్పొరేషన్ : నగరపాలక సంస్థ సూపరింటెండెంట్ ఇంజనీరు(ఎఫ్ఏసీ)గా నాగమోహన్ నియమితులయ్యారు. ఈ మేరకు పబ్లిక్ హెల్త్ ఈఎన్సీ నుంచి గత నెల 28న ఉత్తర్వులు విడుదలయ్యాయి. మంగళవారం ఉత్తర్వుల కాపీ నగరపాలక సంస్థ అధికారులకు చేరింది. ఇక్కడ ఎస్ఈగా పనిచేస్తున్న సత్యనారాయణ గత నెల 15న దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిపోయారు. దీంతో ఆ యన స్థానంలో ధర్మవరం మున్సిపల్ కార్యాలయంలో ఈఈగా పనిచేస్తున్న నాగమోహన్‌ను నియమించారు. తదుపరి ఉత్తర్వులు వచ్చే వరకూ నాగమోహన్ ఎఫ్ఏసీ ఎస్ఈగా కొనసాగనున్నారు.

ఉచిత బీమా సౌకర్యం

జేఎన్‌టీయూ: జేఎన్‌టీయూ నాన్ టీచింగ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్టేట్‌బ్యాంకు ద్వారా బోధనేతర ఉద్యోగులకు ఉచితంగా బీమా సౌకర్యం కల్పిస్తున్నట్లు నాన్ టీచింగ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎండీ నాగభూషణం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీమా చేసేందుకు అసోసియేషన్ చర్యలు తీసుకుంటుందన్నారు. కావున ప్రతి ఒక ఉద్యోగి ఈ నెల 10వ తేదీలోపు తమ వివరాలతో దరఖాస్తు అందజేయాలన్నారు.

9న ప్రపంచ గిరిజన ఆదివాసీ సభ

ఎస్కేయూ: గిరిజనులకు అన్ని రంగాలలో సమాన ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 9న అనంతపురం లిటిల్ ఫ్లవర్ ఫంక్షన్ హాల్ నందు ప్రపంచ గిరిజన ఆదివాసీ సభను నిర్వహిస్తున్నట్లు ఎస్కేయూ అధ్యక్షుడు హనుమంతు నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్కేయూ వైస్ చాన్సలర్ చాంబర్‌లో వాల్‌పోస్టర్లను వీసీ ఆచార్య రాజగోపాల్, రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు విడుదల చేశారు.

విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు అవసరం

అనంతపురం అర్బన్: చదువుతో పాటు విద్యార్థికి నాయకత్వ లక్షణాలు కూడా ముఖ్యమని శ్రీచైతన్య విద్యాసంస్థల ఏజీఎం సుబ్బారెడ్డి సూచించారు. మంగళవారం రుద్రంపేట సమీపంలో గల శ్రీచైతన్య పాఠశాలలో కేబినెట్ నిర్వహించారు. నాలుగు హౌజ్‌లు ఏర్పాటు చేసి ప్రతి హౌజ్‌కు ఒక నాయకుడు, ఉపనాయకుడిని ఎన్నుకున్నారు. పాఠ్యాంశాలు, క్రీడలు, పాఠశాల విధులు నిర్వహణకు కమిటీలను ఎన్నుకున్నారు. అనంతరం ఏజీఎం మాట్లాడుతూ నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవడం పై అవగాహన కల్పించేందుకు ఈ కేబినేట్ నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డీన్స్ రాధాకృష్ణ, అప్పలరెడ్డి, హెచ్ఎం రంగారావు, పాల్గొన్నారు.

లైబ్రేరియన్ సైన్స్ విభాగంలో డాక్టరేట్ ప్రదానం



ఎస్కేయూ: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలో లైబ్రరీ, ఇన్ఫర్మేషన్ సైన్స్ విభాగం నందు పరిశోధనలకుగాను మంగళవారం మలగిరి ఎర్రాకు డాక్టరేట్ ప్రదానం చేశారు. ఈయన ఆచార్య దాశరథి రవీంద్ర పర్యవేక్షణలో 'బైబిలో మెట్రిక్ ఎనాలసిస్ ఆఫ్ రైస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్' అన్న అంశంపై పరిశోధనలు చేశారు. ఆ మేరకు వర్సిటీ ఆయనకు డాక్టరేట్ ప్రదానం చేసింది.

గ్యాస్ సబ్సిడీ ఎత్తివేత తగదు

సీపీఎం ఆధ్వర్యంలో కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

అనంతపురం టౌన్ : కేంద్రప్రభుత్వం వంటగ్యాస్‌పై ఇస్తున్న సబ్సిడీని దశలవారీగా ఎత్తివేసేందుకు నిర్ణయం తీసుకోవడం దారుణమైన చర్య అని సీపీఎం నగర కార్యదర్శి నాగేంద్రకుమార్ అన్నారు. మంగళవారం సాయంత్రం సీపీఎం నగర కమిటీ ఆధ్వర్యంలో క్లాక్‌టవదర్ వద్ద కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా నాగేంద్రకుమార్ మాట్లాడుతూ... కేంద్రం అందరికీ సామాజిక భద్రత కల్పించే బాధ్యతను విస్మరించి గ్యాస్‌పై అందుతున్న రాయితీని తొలగించాలని చూడడం అన్యాయమన్నారు. ప్రతినెలా రూ.4 చొప్పున పెంచి సబ్సిడీని ఎత్తివేస్తే పేదలకు ఇబ్బందులు తప్పవన్నారు. ఓవైపు పేదల సబ్సిడీలను రద్దు చేస్తూ, మరోవైపు బడాబాబులు, కార్పొరేట్లకు రాయితీలను కల్పించడం బీజేపీ ద్వందవైఖరికి నిదర్శనమన్నారు. రిలయన్స్ గ్యాస్ నిక్షేపాలు ఆంధ్రరాష్ట్రంలో వున్నాయని, వాటిని వినియోగిస్తే రాష్ట్ర ప్రజలందరికీ ఉచితంగా గ్యాస్‌ను ఇవ్వొచ్చన్నారు. కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి వర్గసభ్యులు వెంకటనారాయణ, బాబు, నూరుల్లా, బాబా, నాగప్ప, ఓబులేసు, బాలక్రిష్ణ, శ్రీనివాసులు, నాగభూషణం, రఘు, లక్ష్మిదేవి, చంద్రిక, ఆంజనేయులు పాల్గొన్నారు.



కేంద్రప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

'ఎంఆర్ వ్యాక్సిన్‌తో పిల్లల ఆరోగ్యానికి భద్రత'

అనంతపురం వైద్యం : మీజిల్స్, రుబెల్లా వ్యాక్సిన్ వేయడంతోనే పిల్లల ఆరోగ్యానికి భద్రత లభిస్తుందని నగర మేయర్ స్వరూప పేర్కొన్నారు. జిల్లా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శ్రీకృష్ణదేవరాయ నగరపాలక ఉన్నత పాఠశాలలో మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా నగర మేయర్ స్వరూప, డిప్యూటి మేయర్ గంపన్న, డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్, ఏడీ గణపతిరావు హాజరయ్యారు. మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్ ఆవశ్యకతపై విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న వ్యాక్సిన్ వేయడంతో పిల్లలకు ఒకే టీకాతో రెండు వ్యాధులను అరికట్టవచ్చునన్నారు. డీఎంహెచ్ఓ వెంకటరమణ, డీసీహెచ్ఎస్ రమేష్‌నాథ్ మాట్లాడుతూ జిల్లాలో 9నెలల నుంచి 15 సంవత్సరాల పిల్లలు 10,69,735 మంది ఉన్నారని.. వీరందరికి పీహెచ్‌సీ పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలలోని పిల్లలందరికి వ్యాక్సిన్ వేస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి పురుషోత్తం, ప్రపంచ ఆరోగ్య సంస్థ కన్సల్టెంట్ రీతీష్ బజాజ్, దిలీప్, పీఓడీటీటీ సుజాత, ఎంహెచ్ఓ ఆదిశేషు పాల్గొన్నారు.



వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

పేదల సమస్యలు పరిష్కరించండి

సీపీఐ జిల్లా కార్యదర్శి జగదీష్...తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

అనంతపురం సప్తగిరిసర్కిల్: ఏళ్లు గడుస్తున్నా... పేదల తలరాతలు మాత్రం మారడం లేదు... నిత్యం పాలకులు నిర్లక్ష్యానికి గురవుతూ అభివృద్ధికి ఆమడదూరంలో నిలిచిపోతున్నారని సీపీఐ జిల్లా కార్యదర్శి జగదీష్ పేర్కొన్నారు. మంగళవారం సీపీఐ రూరల్ మండల సమితి కార్యదర్శి రమేష్ అధ్యక్షతన స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ప్రజల సమస్యలపై ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీపీఐ జిల్లా కార్యదర్శి జగదీష్ హాజరై మాట్లాడారు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిరిగినా పదేళ్ల సమస్యలు పరిష్కారం కాలేదన్నారు. కనీస అవసరాలైన రేషన్‌కార్డు, ఇంటిస్థలం, పింఛన్ ఇవ్వడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. పేదల ఓట్లతో గెలిచిన ప్రజాప్రతినిధులు తమ స్వార్థ ప్రయోజనాలకై ఉన్న ఆసక్తి పేద ప్రజల సమస్యల పరిష్కరించడంలో చూపడం లేదని విమర్శించారు. 8వ తేదీన ఎమ్మెల్యే నివాసం వద్ద పేదలతో కలిసి సమస్యలు విన్నవించేందుకు ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శిజాఫర్, నాయకులు మల్లికార్జున, రామకృష్ణ, కాటమయ్య, కేశవరెడ్డి, పద్మావతి, చియ్యేడు రామకృష్ణ, రైతు సంఘం జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి వన్నారెడ్డి, రాప్తాడు మండల కార్యదర్శి నాగరాజు, రఘురామయ్య, పోతులయ్య, నాగరాజు, వెంకటనారాయణ, నారాయణస్వామి, కుళ్లాయప్పలు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఐ జిల్లా కార్యదర్శి జగదీష్

అనాథ, వీధి బాలల సంక్షేమానికి సమష్టి కృషి : ఎస్పీ

ఆంధ్రజ్యోతి, అనంతపురం : అనాథ, వీధి బాలల సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేద్దామని ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు బాలల పరిరక్షణ కమిటీలకు ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆ వర్గాలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పోలీస్ శాఖ నేతృత్వంలో బాలల సంక్షేమ విభాగం, కార్మిక శాఖ, బాలల సంక్షేమ కమిటీ, చైల్డ్‌లైన్, హ్యాండ్స్ రెడ్స్, బర్డ్స్ తదితర స్వచ్ఛంద సంస్థలతో పాటు ఐసీడీఎస్ అధికారులు సంయుక్తంగా జిల్లాలో ముస్కాన్ ఆపరేషన్ ద్వారా 97 మంది చిన్నారులకు విముక్తి కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఇందులో 57 మంది బాలురు, 40 మంది బాలికలు ఉన్నారన్నారు. కొందరిని వారి తల్లిదండ్రులు, బంధువులకు అప్పజెప్పామన్నారు. మరోసారి వారు వీధుల్లోకి రాకుండా పెద్దలకు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. మరికొందరిని హాస్టళ్లు, హోమ్స్‌కు పంపామన్నారు. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన ముగ్గురు చిన్నారులను ఆయా సంక్షేమ విభాగాలకు పంపించామన్నారు. జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్‌లో బాలల రక్షణ విభాగాన్ని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మాల్యాద్రి, డీసీఆర్‌బీ సీఐ ప్రసాద్‌రావు, బాలల పరిరక్షణా విభాగం అధికారి హుస్సేన్‌బాషా, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ రంగరాజు, బాలల సంక్షేమ కమిటీ ఇన్‌చార్జ్ చైర్మన్ విజయశ్రీ, బా లల పరిరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమాచారితో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కొండప్ప, భానుజా, కుళ్లాయమ్మ, బాలాజీ, శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్

నేడు వైద్యకళాశాలలో ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు

-హాజరుకానున్న కలెక్టర్, ఎస్పీ

అనంతపురం వైద్యం: ప్రభుత్వ వైద్యకళాశాలలో బుధవారం ఉదయం 10 గంటలకు ర్యాగింగ్‌పై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు వైద్యకళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా జిల్లా కలెక్టర్ వీరపాండియన్, ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ హాజరవుతారని, కావున వైద్యకళాశాలలో మొదట, సెకండ్, మూడవ సంవత్సరపు వైద్యవిద్యార్థులందరూ హాజరుకావాలని ఆయన తెలిపారు.

రూసా నిధులతో వర్సిటీలో మౌలిక సదుపాయాలు

ఎస్కేయూ: రూసా నిధులతో వర్సిటీలో మౌలిక సదుపాయాలు మెరుగుకు కృషి చేస్తున్నట్లు వీసీ ఆచార్య రాజగోపాల్ పేర్కొన్నారు. ఎస్కేయూ పరిపాలన భవనంలోని కాన్ఫరెన్స్ హాల్‌లో సోమవారం రూసా అడ్వైజరీ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య రాజగోపాల్ మాట్లాడుతూ.... రూసా నిధులు వర్సిటీ అభివృద్ధి కోసం రూ. 20 కోట్లు కేటాయించారని, మొదటి విడతగా రూ. 7 కోట్లు త్వరలో రానున్నాయన్నారు. వర్సిటీలో మౌళిక సదుపాయాల కల్పనకు ఈ నిధులను ఖర్చు చేస్తామన్నారు. సమావేశంలో రిజిస్ట్రార్ ఆచార్య సుధాకర్‌బాబు, రూసా కన్వీనర్ ఆచార్య బావయ్య, ఆచార్య మల్లికార్జునరెడ్డి, ఫైనాన్స్ ఆఫీసర్ ఆనంద్, వర్సిటీ ఇంజనీర్ మధుసూదన్‌రెడ్డిలు పాల్గొన్నారు.

తల్లిపాలే చిన్నారులకు శ్రేయస్కరం

అనంతపురం వైద్యం: జన్మించిన శిశువుకు తల్లిపాలను పట్టించడంతోనే ఆ చిన్నారుల ఆరోగ్యం శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్‌లు లలితమ్మ, ఝాన్సీరాణి పేర్కొన్నారు. ఈ మేరకు అనంతపురం అర్బన్ ప్రాజెక్ట్ పరిధిలోని 5,4 సెక్టార్ పరిధిలో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ముందుగా ఆయా కేంద్రాల పరిధిలో తల్లిపాల వారోత్సవాల ఆవశ్యకతపై ర్యాలీ నిర్వహించి ప్రజలకు అంగన్‌వాడీ సేవలపై అవగాహనకల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... జన్మించిన శిశువుకు డబ్బాపాలను పట్టకుండా తల్లిపాలను పట్టడంతోనే ఎలాంటి అనారోగ్యానికి గురికాకుండా ఆరోగ్యవంతులుగా ఎదుగుతారన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే పౌష్టికాహారాన్ని అర్హులైన గర్భవతులు, బాలింతలు, చిన్నారులు, కిశోర బాలికలందరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆయా కేంద్రాల అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు తదితరులు పాల్గొన్నారు.

బోగస్ బీపీఎల్ కనెక్షన్లు ఎలా ఇస్తారు...!

- అధికారులపై ఈఈ రామ్మోహన్‌రెడ్డి ఆగ్రహం

అనంతపురం కార్పొరేషన్ : బోగస్ పత్రాలపై బీపీఎల్ ట్యాప్ కనెక్షన్లు ఎలా ఇస్తారంటూ నీటి సరఫరా విభాగం ఈఈ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం ఆగ్రహం వ్యక్తంచేశారు. ఏఈ మహదేవ ప్రసాద్, ట్యాప్ ఇన్‌స్పెక్టర్ ఖాదర్‌బాషాను ఈఈ రామ్మోహన్ రెడ్డి తన చాంబర్‌కు పిలిపించారు. రూ. 200 బీపీఎల్ కనెక్షన్లను కూడా ఇష్టానుసారం ఇచ్చారని, రేషన్ కార్డులు పరిశీలించకుండా ఎలా కనెక్షన్లు మంజూరు చేస్తారంటూ ఆయన మండిపడ్డారు. కనెక్షన్లు ఇచ్చే ముందుకు కనీసం రేషన్ కార్డులను పరిశీలించకుంటే ఎలాగని మండిపడ్డారు. మూడు నాలుగు ఫ్లోర్లు కట్టిన వారికి కూడా ఇష్టానుసారం కనెక్షన్లు ఇస్తారా అని ప్రశ్నించారు. దీని వల్ల నగరపాలక సంస్థ ఆదాయానికి భారీగా గండి పడుతుందన్నారు. నిబంధనల మేరకే ట్యాప్ కనెక్షన్లు మంజూరు చేయాలని, బోగస్ పత్రాలపై కనెక్షన్ల మంజూరు చేస్తే...కఠిన చర్యలు తప్పవని ఆయన వారిని హెచ్చరించారు.

అనాథ మృతదేహానికి 'సంజీవిని' అంత్యక్రియలు

అనంతపురం కలెక్టరేట్ : సంజీవిని హెల్పింగ్ హ్యాండ్స్ ఆధ్వర్యంలో మంగళవారం అనాథ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించారు. అనంతపురం నగరంలోని సూర్యనగర్ రోడ్డులో మంగళవారం ఉదయం 50 సంవత్సరాల వయస్సున్న గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. స్థానిక ద్వారా సమాచారం అందుకున్న వన్‌టౌన్ ఎస్ఐ వెంకటరమణ, హెడ్ కానిస్టేబుల్ నగేష్, కానిస్టేబుల్ రవి కమల్‌లు సంఘటనా స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతి చెందిన వ్యక్తి అనాథగా గుర్తించి అంత్యక్రియల చేసేందుకు సంజీవిని స్వచ్ఛంధ సంస్థ నిర్వాహకులు రమణారెడ్డిని సంప్రదించారు. దీంతో సంస్థ నిర్వాహకులు రమణారెడ్డి కమిటీ సభ్యులు సూర్యశేఖర్, శ్రీనివాసులు, రామాంజినేయులుతో కలిసి అనాథ మృతదేహాన్ని స్మశాన వాటికకు తీసుకువెళ్లి అంత్యక్రియలు నిర్వహించారు.

ట్రాఫిక్ విధుల శిక్ష..

ఆంధ్రజ్యోతి, అనంతపురం: మద్యం తాగి వాహనాలు నడిపిన ఐదుగురు మంగళవారం ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విధులు నిర్వర్తించారు. ఆ మేరకు స్పెషల్ జ్యుడిషియల్ సెకండ్‌క్లాస్ మెజిస్ట్రేట్ కృష్ణమూర్తి తీర్పు వెలువరించిన విషయం విదితమే. న్యాయమూర్తి ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు తీర్పును అనుసరించి ఆ ఐదుగురిని ట్రాఫిక్‌లో విధులు నిర్వర్తించేలా చర్యలు తీసుకున్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నిందితులు నగరానికి చెందిన బండెప్ప, బషీర్, సాదిక్‌వలి, నాగభూషణం, ఇక్బాల్‌తో మంగళవారం ట్రాఫిక్ పోలీసులు టవర్‌క్లాక్, సప్తగిరి సర్కిల్‌లో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ విధులు నిర్వర్తింపజేశారు.

'ఎస్సీ వర్గీకరణ బిల్లు పార్లమెంటులో ప్రవేశపెట్టాలి'

అనంతపురం సప్తగిరిసర్కిల్: ఎస్సీ వర్గీకరణ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టాలని ఎమ్మార్పీఎస్ జాతీయ ప్రధాన కార్యదర్శి కేబీ మధు మాదిగ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయన ఆధ్వర్యంలో నిరవధిక నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ కార్యక్రమానికి సోషియల్ వర్కర్స్ రాష్ట్ర నాయకుడు జాకీర్ హుస్సేన్, ఐఎంఎం జిల్లా అధ్యక్షుడు మహబూబ్‌బాషా, ఎంఎస్ఎస్ నిషార్ హాజరై దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా మధు మాదిగ మాట్లాడుతూ.... ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడానికి రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష కమిటీని ఢిల్లీకి తీసుకెళ్లాలన్నారు. కార్యక్రమంలో నాయకులు హనుమంతు, కదిరప్ప, అరవిందరమేష్, చంద్రశేఖర్, శ్రీనివాసులు, నరేష్, చిన్నపుల్లన్న, శ్రీరాములు, పెద్ద పుల్లన్న, వెంకటేష్, గణేష్, ఈశ్వరయ్య పాల్గొన్నారు.

అదృశ్యమైన మహిళ ప్రత్యక్షం

ఆంధ్రజ్యోతి, అనంతపురం : నగరంలో మూడు రోజుల క్రితం ఇంటి నుంచి అదృశ్యమైన ఓ మహిళ తిరిగి వచ్చింది. నాలుగో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల మేరకు... ఇందిరాకాలనీలో చెందిన శివకిషోర్, రాజకుమారి దంపతులు నివసిస్తున్నారు. ఈ క్రమంలో గతనెల 30వతేదీ రాజకుమారి మార్కెట్‌కు వెళుతున్నట్లు భర్తతో చెప్పి బయటకు వెళ్లింది. అయితే ఇంటికి తిరిగి రాలేదు. దీంతో ఆందోళన చెందిన భర్త నాలుగోపట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అయితే బయటకు వెళ్లిన రాజకుమారి అనారోగ్యంతో బాధపడుతూ తడకలేరులోని పెద్దమ్మ ఆలయానికి వెళ్లింది. మంగళవారం ఆమె తిరిగి భర్త వద్దకు చేరుకుంది.

మెన్స్ పార్లల్‌లో అగ్ని ప్రమాదం

ఆంధ్రజ్యోతి అనంతపురం : నగరంలోని సాయినగర్ నాలుగో క్రాస్‌లోని రాకేష్ మెన్స్ పార్లల్‌లో మంగళవారం ఉదయం అగ్ని ప్రమాదం జరిగింది. షార్ట్ సర్క్యూట్‌కావడంతో షాపులోని పర్నీచర్, బ్యూటీ సామాగ్రి పూర్తిగా కాలిబూడిదయ్యాయి. అద్దాలు పగిలిపోయాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక శాఖాధికారులు సంఘటనా స్థలానికి చేరుకొని మంటలను ఆర్పారు. కాగా అగ్ని ప్రమాదం మూలంగా రూ.లక్ష మేరకు నష్టం వాటిల్లిందని రాకేష్ మెన్స్ పార్లల్ నిర్వాహకుడు వెంకటేష్ ఆవేదన వ్యక్తం చేశాడు.

అదనపుకట్నం వేధింపులపై ఫిర్యాదు

ఆంధ్రజ్యోతి అనంతపురం : తన కూతుర్ని అదనపు కట్నం కోసం అల్లుడు వేధిస్తున్నాడంటూ నగరంలోని అరవిందనగర్‌కు చెందిన తిరుపతయ్య మంగళవారం టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదుకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాల మేరకు... తిరుపతయ్య తన కుమార్తె హిమజను ఆర్నెళ్ల క్రితం పుట్టపర్తి మండలం కప్పల బండకు చెందిన విశ్వనాథ్‌కిచ్చి వివాహం చేశాడు. ఆ దంపతులకు ఇద్దరు పిల్లలు. కాగా గత కొంత కాలంగా అదనపు కట్నం కోసం వేధిస్తుండటంతో హిమజ పుట్టింటికి వచ్చింది. అయినప్పటికీ వేధింపులు ఆపలేదు. దీంతో టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంధకారంలో రైతు బజార్

అనంతపురం సప్తగిరిసర్కిల్: జిల్లా కేంద్రంలోని రైతు బజార్ అంధకారంలో కూరుకుపోయింది. గత మూడు రోజులుగా విద్యుత్ సరఫరా లేకపోవడంతో స్థానికంగా ఉండే వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యుత్‌శాఖాధికారులు పట్టించుకోకపోవడంతో పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. గత నెల 29 నుంచి ఇదే పరిస్థితి ఉండటంతో స్థానికంగా ఉండే వ్యాపారుల అవస్థలు వర్ణనాతీతంగా మారాయి. దీనికి తోడు గత వారం రోజులుగా ఎండలు మండిపోతున్నాయి. పగటి వేళల్లో వ్యాపారులు విద్యుత్ సరఫరా లేని కారణంగా నానా అవస్థలు పడుతున్నారు. ఉక్కపోత నడుమ అల్లాడిపోతున్నారు. దీనికి తోడు విద్యుత్ సరఫరా లేని కారణంగా రాత్రి 8 గంటల వరకూ ఉండే వ్యాపారులు సాయంత్రం 6 గంటలకే దుకాణాలను కట్టేస్తున్నారు. సమస్యను విద్యుత్ అధికారుల దృష్టికి తీసుకెళ్ళాల్సిన ప్రయోజనం లేదని వ్యాపారులు ఆవేదన చెందారు. ఇప్పటికైనా అధికారులు స్పందించాలని కోరారు.

బకాయిలు చెల్లించనందుకే... నారాయణ నాయక్, ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈ విద్యుత్ బిల్లులు చెల్లించని కారణంగానే విద్యుత్ సరఫరా నిలిపివేశాం. దాదాపు రూ. 80 వేలు బకాయిలున్నాయి. ఈ నేపథ్యంలో విద్యుత్ బంద్ చేశాం. బకాయిలు చెల్లిస్తే.... విద్యుత్ సరఫరా చేస్తాం.

జీవో 279పై మొండి వైఖరి వీడాలి : జేఏసీ

అనంతపురం కార్పొరేషన్ : రాష్ట్ర ప్రభుత్వం జీవో 279పై మొండి వైఖరిని వీడాలని, వెంటనే జీవోను ఉపసంహరించుకోవాలని మున్సిపల్ కార్మిక జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం జీవో 279కు వ్యతిరేకంగా జేఏసీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. మున్సిపల్ కార్పొరేషన్ నుంచి ర్యాలీగా వెళ్లి సప్తగిరి సర్కిల్‌లో మానవహారం నిర్వహించారు. అనంతరం సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేసులు, ఏఐటీయూసీ ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున, ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి ఉపేంద్ర మాట్లాడుతూ....కార్మికుల పట్ల ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. కార్యక్రమంలో జేఏసీ నాయకులు నరసింహులు, గోపాల్, నాగభూషణం, సురేష్, తిప్పయ్య, నాగేంద్రబాబు, లక్ష్మీదేవి, వరలక్ష్మి పాల్గొన్నారు.



నిరసన తెలుపుతున్న మున్సిపల్ జేఏసీ నాయకులు

వైద్య సేవల్లో ఇబ్బంది కలిగించొద్దు

క్యాంటిన్‌లను పరిశీలించిన జిల్లా సైనిక సంక్షేమాధికారి చంద్రశేఖర్

అనంతపురం వైద్యం: సైనికుల ప్రభుత్వాస్పత్రిలో మాజీ సైనికులు, సైనిక రంగంలో పనిచేస్తున్న సైనికుల కుటుంబ సభ్యులు అనారోగ్యంతో వచ్చే వారికి ఇబ్బంది కలిగించకుండా సకాలంలో తగిన వైద్యమందించాలని జిల్లా సైనిక సంక్షేమశాఖాధికారి చంద్రశేఖర్ పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన నగర సమీపంలోని సైనికుల ప్రభుత్వాస్పత్రి, సైనికుల క్యాంటిన్ పనితీరును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... అనారోగ్యంతో వచ్చే వారికి వైద్యమందించడంలో ఎలాంటి అంతరాయం కలగకుండా వైద్యమందించాలన్నారు. అదే విధంగా క్యాంటిన్‌లో సరుకుల విషయాలల్లో కూడా సమస్య లేకుండా చూడాలని ఆదేశించారు. ఆస్పత్రికి, క్యాంటిన్‌కు వచ్చే సమయంలో మాజీ సైనికులు, సైనిక రంగంలో పనిచేస్తున్న వారి కుటుంబ సభ్యులుగానీ తమకు సంబంధించిన ఈసీహెచ్ఎస్, సీఎస్‌డీ కార్డులను తప్పనిసరిగా తీసుకుని రావాలన్నారు. ఏదైనా సమస్యలుంటే తమ దృష్టికి తెస్తే పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది, క్యాంటిన్ సిబ్బంది పాల్గొన్నారు.



క్యాంటిన్‌ను పరిశీలిస్తున్న అధికారి చంద్రశేఖర్

'ఎన్టీఆర్ వైద్యసేవలను విస్తృతం చేయాలి'

అనంతపురం వైద్యం: ప్రభుత్వ సర్వజనాస్పత్రికి వచ్చే రోగుల్లో అర్హులైన వారందరికీ ఎన్టీఆర్ వైద్యసేవలందించి వైద్య సేవలను విస్తృతం చేయాలని సూపరింటెండెంట్ జగన్నాథ్, వైద్యకళాశాల ప్రిన్సిపాల్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. ఈ మేరకు మంగళవారం వారు సర్వజనాస్పత్రిలోని సూపరింటెండెంట్ చాంబర్‌లో విభాగాల హెచ్‌ఓడీలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా విభాగాల వారీగా అందిస్తున్న ఎన్టీఆర్ వైద్యసేవలు-రోగులకు అందించే సదుపాయాలు, సౌకర్యాలపై చర్చించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..... ప్రధానంగా ఆర్థోపెడిక్, జనరల్ మెడిసిన్, సైక్రొమెట్రిక్ తదితర విభాగాల్లో ఎన్టీఆర్ వైద్యసేవలపై ప్రత్యేక దృష్టి సారించి సేవలను వేగవంతం చేయాలన్నారు. అదే విధంగా ఆయా విభాగాల వారీగా రోగుల వివరాలు, వైద్యసేవలను ఆస్పత్రిలో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. సిబ్బంది విధుల్లో సమయపాలన పాటించాలన్నారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై చర్యలు తప్పవన్నారు. ప్రభుత్వం అందించిన మహాప్రస్థానం వాహనాల ద్వారా ఆస్పత్రిలో మృతి చెందిన మృతదేహాలను తరలించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ లలిత, డిప్యూటీ ఆర్ఎంఓ విజయమ్మ, పలు విభాగాల హెచ్ఓడీ వైద్యులు, శ్వేత, ఎన్టీఆర్ వైద్యసేవ సమన్వయకర్త సౌజన్యకుమార్‌లు పాల్గొన్నారు.

వైద్యమందించడంలో నిర్లక్ష్యం చేయకండి

ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో చికిత్సలు పొందుతున్న రోగులకు వైద్యమందించడంలో నిర్లక్ష్యం చేయరాదని సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ జగన్నాథ్ పేర్కొన్నారు. ఆయన మంగళవారం స్థానిక సర్వజనాస్పత్రిలోని లెక్చరర్ గ్యాలరీలో స్టాఫ్‌నర్సులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ముందుగా ఆయా వార్డుల్లో రోగులకు అందించే వైద్యసేవలు తదితర రికార్డుల విషయాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..... విధుల్లో సమయపాలన పాటించి రోగులకు తగిన వైద్యమందేలా చూడాలన్నారు. వార్డుల్లో మృతి చెందిన వెంటనే ఆ వాహనాల ఇన్‌చార్జ్‌కు సమాచారం అందించి డాక్టర్ అనుమతితో మృతదేహాన్ని తరలించేలా చూడాలన్నారు. ఎవరైనా డబ్బులు వసూలు చేసినట్టు రుజువైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ లలిత, డిప్యూటీ ఆర్ఎంఓ విజయమ్మ, నర్సింగ్ సూపరింటెండెంట్ షాహిదాబేగం, స్వర్ణలత, మేనేజర్ శ్వేత, శానిటరీ ఇన్‌స్పెక్టర్ లక్ష్మన్న పాల్గొన్నారు.

32 శాతం పింఛన్ల పంపిణీ

అనంతపురం కార్పొరేషన్ : నగర వ్యాప్తంగా 32 శాతం పింఛన్లు పంపిణీ చేసినట్లు డెలిగేషన్ కమిషనర్ కృష్ణమూర్తి తెలిపారు. మంగళవారం ఆయన నగరంలో జరుగుతున్న పింఛన్ల పంపిణీని ఆయన పరిశీలించారు. నగరంలో 42, 43 44, 45, 46 డివిజన్లలో వివిధ పంపిణీ కేంద్రాల్లో సాగుతున్న పింఛన్ల పంపిణీని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ....పింఛన్ల పంపిణీ సజావుగా సాగేలా చూడాలని సిబ్బందికి సూచించారు. అవకతవకలకు అవకాశం ఇవ్వకుండా, అర్హులైన లబ్ధిదారులందరికీ పింఛన్ సొమ్ము చేరేలా చూడాలని సూచించారు. ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

మెమోలు జారీ చేయండి

అనంతపురం కార్పొరేషన్: నీటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వాటర్ సప్లై విభాగం అధికారులకు మెమోలు జారీ చేయాలని ఈఈ రామ్మోహన్‌రెడ్డి మంగళవారం అధికారులను ఆదేశించారు. నీటి పన్ను వసూళ్ల టార్గెట్ ఏ మాత్రం వసూళ్లు కావడం లేదన్నారు. చాలా మందకొడిగా ట్యాక్స్ పనులు చేస్తున్నారన్నారు. ఇంత నిర్లక్ష్యం తగదని ఆయన తెలిపారు. నీటి పన్ను వసూళ్లలో నిర్లక్ష్యం చేస్తున్న ఏఈ మహదేవప్రసాద్, ట్యాప్ ఇన్‌స్పెక్టర్లు ఖాదర్‌బాషా, మహబూబ్‌బాషా, రామ్మోహన్‌లకు మెమోలు ఇవ్వాలని ఈఈ సిబ్బందిని ఆదేశించారు.

బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

అనంతపురం సెంట్రల్: బీసీ హాస్టళ్లలో మౌలిక సదుపాయాలు కల్పించాలని బీసీఎస్సీఎస్టీమైనార్టీ విద్యార్థి సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాకే నరేష్ డిమాండ్ చేశారు. మంగళవారం సమాఖ్య ఆధ్వర్యంలో బీసీ హాస్టళ్లను పరిశీలించారు. అందులో భాగంగా పలు సమస్యలు వెలుగులోకి వచ్చాయి. ప్రధానంగా భోజనం సరిగ్గాలేదని... బాత్‌రూమ్‌లు శుభ్రంగా లేకపోవడం, నిద్రించడానికి సరైన వసతులు లేకపోవడం తాగడానికి మంచినీటి సౌకర్యం కూడా లేక, ఉడకని అన్నం, నీళ్ల రసం, మెనూ సరిగ్గా పాటించక విద్యార్థులకు కడుపునిండా అన్నం పెట్టని పరిస్థితి వెలుగులోకి వచ్చింది. దీంతో పాటు పలు సమస్యలపై విద్యార్థులు సమాఖ్య నాయకులకు వివరించి ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం నరేష్ మాట్లాడుతూ.. అన్నం చాలా అధ్వాన్నంగా ఉందన్నారు. వెంటనే అక్కడ నెలకొన్న సమస్యను ఏబీసీడబ్ల్యూఓ మల్లికార్జునకు ఫోన్ చేసి వివరించారు. వెంటనే స్పందించిన ఆయన హాస్టల్ వద్దకు చేరుకున్నారు. దీంతో విద్యార్థులు తమ సమస్యలను వివరించి ఆవేదన వ్యక్తం చేశారు. మరోసారి ఇలా జరగకుండా జాగ్రత్తలు చేపడుతామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో సమాఖ్య నాయకులు సురేష్, హరి, శివ, గురుశేఖర్, సతీష్, క్రిష్ణకుమార్, మంజు, వినయ్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

బోదలమ్మకు ప్రత్యేక పూజలు

ముదిగుబ్బ: మండల పరిధిలోని బోదనాంపల్లిలోవెలసిన బోదలమ్మకు మంగళవారం ప్రత్యేక పూజలు చేశారు. శ్రావణ మాస మంగళవారాన్ని పురస్కరించుకుని అమ్మవారి మూలవిరాట్‌ను ప్రత్యేకంగా అలంకరింపచేసి పూజలు, అర్చనలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో దర్శనం ఇస్తున్న బోదలమ్మ ←

ఎంఆర్ వ్యాక్సిన్‌తో సంపూర్ణ ఆరోగ్యం

చిన్నారులకు తప్పక వేయించండి : పిలుపునిచ్చిన ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ







ధర్మవరంలో ఎంఆర్ వ్యాక్సిన్ వేయిస్తున్న ఎమ్మెల్యే గోనుగుంట్ల - ముదిగుబ్బ, తాడిమర్రిలో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

ధర్మవరంఅర్బన్: మీజిల్స్-రుబెల్లా(ఎంఆర్) వ్యాక్సిన్‌తో పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని సుందరయ్య నగర్‌పాఠశాలలో మంగళవారం మీజిల్స్-రుబెల్లా టీకా పిల్లలకు వేసి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మీజిల్స్-రుబెల్లా టీకా పిల్లలకు వేయించడం ద్వారా ప్రాణాంతక వ్యాధులు దరిచేరవన్నారు. ఈ కార్యక్రమం సెప్టెంబర్ 8వతేదీ వరకు కొనసాగుతుందన్నారు. ప్రతి వార్డులో 9నెలల నుండి 15 సంవత్సరాల పిల్లలను గుర్తించి తప్పని సరిగా ఈ టీకా వేయించుకునేలా తల్లిదండ్రులకు కల్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేసేలా వైద్యాధికారులు, సిబ్బంది కృషిచేయాలన్నారు. అనంతరం ఆ పాఠశాలలో నిర్వహించే మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకు ఎక్కువగా ఉంటే కూరగాయలు తక్కువగా ఉండటంతో హెచ్‌ఎం, ఏజెన్సీలపై ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలోమున్సిపల్ చైర్మన్ బీరేగోపాలక్రిష్ణ, ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ యుగంధర్ , మున్సిపల్ కమీషనర్ గుర్రంరవి, తహసీల్దార్ మహబూబ్‌బాషా, నాయకులు శ్యామరావు, ఇనయ్‌తుల్లా, చిన్నిక్రిష్ణ, రాంపురం శీన, ముల్లాషెక్షావలి, పఠాన్‌బాబూఖాన్, మార్కెట్ రహీం తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ముదిగుబ్బలో మంగళవారం విద్యార్థులకు ఎంఆర్ టీకాలు వేశారు. సాయిపాఠశాలలో ఎంఈఓ సుధాకర్‌నాయక్, డాక్టర్‌జమీల్‌బాషా, ఏఎన్ఎంలు ఈ టీకాల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్ర మంలో ఎంపీహెచ్‌ఓలు సుబ్రహ్మణ్యం, కిశోర్‌రాజు, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

బత్తలపల్లి: బత్తలపల్లిలో మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్‌ను ప్రారంభించారు. అన్ని ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు వైద్యసిబ్బంది వెళ్లి ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. మండల వ్యాప్తంగా 9 నెలల నుండి 15ఏళ్లలోపు పిల్లలు 7వేల మంది ఉండ గా బత్తలపల్లిలో ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు వచ్చే విద్యార్థులు 4వేల మంది ఉన్నారని డాక్టర్ రవీకాంత్ తెలిపారు.

తాడిమర్రి: మీజిల్స్-రుబెల్లా వ్యాక్సిన్ వేసే కార్యక్రమాన్ని తాడిమర్రి ఉన్నత పాఠశాలలో ఎంఈఓ క్రిష్ణమోహన్, ఎస్‌ఐ రాంభూపాల్, డాక్టర్ గిరిధర్‌లు ప్రారంభించారు. మొదటి పదిరోజులు మండలంలోని అన్ని పాఠశాలలకు వెళ్లి వ్యాక్సిన్ వేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్‌డీ గంగావతి, హెచ్‌ఎం చంద్రమౌళి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం బొడ్రాయికి పూజలు

ముదిగుబ్బ: వర్షం కోసంబొడ్రాయిలకు గ్రామస్థులు జలాబిషేకాలు చేస్తున్నారు. మంగళవారం మండల పరిధిలోని పూజారితాండాలో మారెమ్మస్వామి బొడ్రాళ్లకు 108కడవళ్లతో జలాభిషేకం చేసి వరుణి కటాక్షం కోసం మొక్కుకున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు రామచంద్ర నాయక్, నాగరాజునాయక్, బోజునాయక్, ఆది నాయక్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

ధర్మవరంఅర్బన్: ధర్మవరం చైతన్య విద్యాసంస్థ అధ్యాపకులు ప్రతాప్‌రెడ్డి, శ్రీలత దంపతుల కుమార్తె హసిని పుట్టినరోజు సందర్భంగా మండలంలోని గొట్లూరు అనాధాశ్రమంలోని వృద్ధులకు మంగళవారం అన్నదానం చేపట్టారు. అనంతరం కేక్‌కట్‌చేసి స్వీట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలోచంద్రశేఖర్, ఉదయ్, మహేశ్ తదితరులు పాల్గొన్నారు. దాతలకు ఆశ్రమ నిర్వాహకులు ఎల్‌పీ చంద్ర కృతజ్ఞతలు తెలిపారు.

'పండిట్ల కౌన్సెలింగ్ రద్దు తగదు'

ముదిగుబ్బ: ఉపాధ్యాయుల బదిలీలలో భాగంగా తెలుగు, హిందీ పండిట్‌లకు కౌన్సెలింగ్ ఇచ్చి రద్దుచేయడం తగదని తెలుగునాడు ఉపాధ్యాయ అధ్యక్షుడు శ్రీనివాసులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పకడ్బందీగా కౌన్సిలింగ్ నిర్వహించకుండా అధికారులు తప్పిదాలు చేసి మళ్లీ రీ కౌన్సిలింగ్ చేయాలనుకోవడం ప్రభుత్వానికి చెడ్డ పేరువస్తోందని, ఇలాంటివి భవిష్యత్తులో జరగకుండా మొదటి కౌన్సిలింగ్ నిర్వహించాలన్నారు.

అనారోగ్యంతో వీఆర్‌ఏ మృతి

తాడిమర్రి: మండలంలోని పెద్దకోట్ల గ్రామానికి చెంది వీఆర్‌ఏ నరసమ్మ(59)అనారోగ్యంతో మృతిచెందారు. అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె సోమవారం పెద్దకోట్లలో మృతిచెందింది.

గర్భిణీలను సొంత ఆడపడుచుల్లా చూసుకోండి

అంగన్‌వాడీ కార్యకర్తలకు ఎమ్మెల్యే గోనుగుంట్ల పిలుపు

బత్తలపల్లి: ప్రతి అంగన్‌వాడీలకు వచ్చే ప్రతి గర్భిణీని సొంత ఆడపడుచుల్లా చూసుకోవాలని ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ పేర్కొన్నారు.స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు వంట సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ మాట్లాడుతూ అంగన్‌వాడీ పాఠశాలలకు వచ్చే గర్భవతులకు గతంలో పంపిణీ చేస్తున్న బియ్యం వారికి సక్రమంగా అందక చాలా మంది పస్తులు ఉంటున్నారన్న ఉద్దేశ్యంతో సీఎం చంద్రబాబునాయుడు అన్న అమృతహస్తం అనే కార్యక్రమాన్ని ప్రారంభించారన్నారు. వీటిద్వారా చాలా అంగన్‌వాడీ కేంద్రాల్లో వంటసామగ్రి లేక అంగన్‌వాడీ కార్యకర్తలు చాలా ఇబ్బందులుపడుతున్నారని, వారి సమస్యలు పరిష్కరించేందుకు పంచాయతీ నిదులతో వంటసామాగ్రి కొనుగోలు చేసి పంపిణీ చేశామన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే గర్భిణీని సొంత ఆడపడచులా చూసుకొని గౌరవించాలన్నారు. బీఎల్‌ఓలుగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్తలు అందరూ పార్టీలకు అతీతంగా ఓటరు నమోదు కార్యక్రమాన్ని చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ పద్మావతమ్మ, సూపర్‌వైజర్ భారతి, తహసీల్దార్ సురేశ్‌బాబు, ఎంపీడీఓ లక్ష్మీబాయి, కరణం సూర్యప్రకాశ్‌రావు, మండల కన్వీనర్ వీరనారప్ప, జక్కంపూటి వెంకటేశ్వరచౌదరి, ఉపసర్పంచ్ హరికుమార్, బోయపాటి ఈశ్వరయ్య, బెస్త నాగార్జున తదితరులు పాల్గొన్నారు.



వంట సామగ్రిని అందజేస్తున్న ఎమ్మెల్యే

పారిశుధ్య కార్మికుల నిరసన

ధర్మవరంఅర్బన్: కార్మికుల పొట్టకొట్టే జీఓ279ను రద్దుచేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులు మంగళవారం కాలేజ్ సర్కిల్‌లో రాస్తారోకో నిర్వహించారు. కాలేజ్ సర్కిల్‌లో మానవ హారంగా ఏర్పడి జీఓకు వ్యతిరేకంగా నినాదాలు చేసి రాస్తారోకో చేపట్టారు. జీఓ రద్దు చేసే వరకు నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. ఇందులో భాగంగా 4వ తేదీన ర్యాలీ నిర్వహిస్తామన్నారు. 22న చలో విజయవాడ కార్యక్రమం కూడా చేపడుతామన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆదినారాయణ, జేవీ రమణ, రైతుసంఘం నాయకులు జంగాలపల్లిపెద్దన్న, సీపీఎం నాయకులు పోలా లక్ష్మీనారాయణ, నాగార్జున, పుల్లన్న, వెంకటరాముడు, ఓబుళేశు, వెంకటేశ్ పాల్గొన్నారు.



రాస్తారోకో చేస్తున్న పారిశుధ్య కార్మికులు

లోకల్ గైడ్

ఎమ్మెల్యే డైరీ

ధర్మవరం: నియోజకవర్గ ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ ప్రజలకు అందుబాటులో ఉంటారు. బత్తలపల్లిలో జరిగే కార్యక్రమాల్లో పాల్గొంటారు. అనంతరం జిల్లా కేంద్రానికి ఆయన చేరుకుంటారు.

ధర్మవరం మార్కెట్‌లో కూరగాయల ధరలు



పచ్చిమిర్చి 80, వంకాయలు 40, కాకర 60 టమోట 100, క్యారెట్ 80, బీన్స్ 50, ఎర్రగడ్డలు 20, బంగాళాదుంప 20, ముల్లంగి 20, క్యాబేజి 40, చౌడేకాయలు 30, బీరకాయలు 40, బీట్‌రూట్ 30, బెండ 40.

ధర్మవరం సినిమాలు

సిద్దార్థ: ఫిదా, **లక్ష్మీనారాయణ:** వాసుకి, **లక్ష్మీచక్రవర్తి:** వైశాఖి, **వరలక్ష్మి:** డీజే, **విజయలక్ష్మి:** బాహుబలి-2, **రంగా సెంట్రల్:** నిన్నుకోరి, గౌతమ్‌నంద దండుపాళ్యం-2, పిశాచి

ధర్మవరం డిపో నుంచి ఆర్టీసీ బస్ సర్వీస్‌లు

ధర్మవరం-హైదరాబాద్ : ఉదయం 11.30 గంటలకు, మధ్యాహ్నం 1.30, 3.30, రాత్రి 8.30, 9.30,
ధర్మవరం-చెన్నై: రాత్రి 8 గంటలకు,
ధర్మవరం-విజయవాడ: సాయంత్రం 4.30, 6.30 గంటలకు, ధర్మవరం-నెల్లూరు: సాయంత్రం 6.15కు,
ధర్మవరం-ఒంగోలు : మధ్యాహ్నం 3.30గంటలకు,
ధర్మవరం-తిరుపతి : సాయంత్రం 4.30గంటలకు

జీఎస్టీతో చిరువ్యాపారులకు నష్టం : సీఐటీయూ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకులు

ధర్మవరంఅర్బన్: కేంద్ర ప్రభుత్వం విధించిన జీఎస్టీ వల్ల చిరువ్యాపారులకు, పేదప్రజలకు తీవ్ర నష్టం కల్గిస్తోందని సీఐటీయూ డివిజన్ అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు ఎల్ ఆదినారాయణ, జేవీ రమణ, రైతుసంఘం డివిజన్ ప్రధానకార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న లు పేర్కొన్నారు.స్థానిక సీపీఎం కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ... జీఎస్టీతో దేశంలో చిరువ్యాపారులపైన,పేద మధ్యతరగతి ప్రజలపైన విపరీతంగా భారం పడుతోందన్నారు.జీఎస్టీ చట్టాన్ని ఒకవర్గానికి చెందినవారు రూపొందిస్తే, దీన్ని పర్యవేక్షించేవారు, అమలుచేసే వారు వేరువేరు వర్గాలకు చెందినవారన్నారు. జీఎస్టీ వల్ల నల్లధనంతో తగ్గుతుందని, పన్నుఎగవేతదారులకు చెక్ పెడతామనిప్రజల్నీ మభ్యపెడుతోందన్నారు. కావున జీఎస్టీని ప్రజలకు ఇబ్బందులు కల్గకుండా రద్దుచేయాలని డిమాండ్‌చేశారు. లేదంటే భవిష్యత్తులో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో నాయకులు శ్రీనివాసులు, అయుబ్‌ఖాన్, ఇర్ఫాన్, మారుతి, హుస్సేన్, రవూఫ్,సాలేహ, రెడ్డిబాషా, మురళీ, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

వేరుశనగకు పైపాటి ఎరువులు వేయొద్దు

తాడిమర్రి: వేరుశనగపంటకు పైపాటిగా ఎరువులు వేయాల్సిన అవసరం లేదని వ్యవసాయశాఖాధికారిణి కాత్యాయని తెలిపారు. పంటసాగు చేసి 30-45 రోజుల మధ్యలో ఉందని, దానికి ఇప్పుడు జిప్సం చల్లుకోవాలని తెలిపారు. ప్రభుత్వం జిప్సంను ఉచితంగా పంపిణీ చేస్తోందన్నారు. ఎకరాకు కనీసం నాలుగు బస్తాలైనా జిప్సంను వాడటం వల్ల నాణ్యమైన దిగుబడి పొందవచ్చన్నారు.

ఆంధ్రజ్యోతి ధర్మవరం
బుధవారం 02, ఆగస్టు 2017
5
● ధర్మవరం ● బత్తలపల్లి ● ముదిగుబ్బ ● తాడిమర్రి

రాష్ట్రస్థాయిలో సత్తా చాటిన వలిమిచెరోపల్లి విద్యార్థిని

ముదిగుబ్బ: మండల పరిధిలోని వలిమి చెర్లోపల్లి గ్రామానికి చెందిన లింగుట్ల ఆదినా రాయణ కుమార్తె గీతాంజలి ఎంఎస్‌సీ ప్రవేశ పరీక్షలో రాష్ట్ర స్థాయిలో రెండవ ర్యాంకు సా. దించినట్టు ఆదినారాయణ తెలిపారు. గుం టూరులో కౌన్సిలింగ్‌కు వెళ్లగా ఆచార్య ఎంజీ రంగ విశ్వవిద్యాలయం వైస్‌చాన్సలర్ దామో దర్ నాయుడు ప్రశంసించారన్నారు. గీతాంజ లికి రాష్ట్రస్థాయిలో రెండవ ర్యాంకు రావడం తో ఆనందం వ్యక్తం చేశారు.



విద్యార్థిని గీతాంజలి

నెలాఖరులోగా 'అన్నా క్యాంటీన్'

భవనాన్ని పరిశీలించిన ఎమ్మెల్యే గోనుగుంట్ల - ఏర్పాట్లపై అధికారులతో సమీక్ష

ధర్మవరంఅర్బన్: పేదల కోసం అన్నక్యాంటిన్‌ను ప ట్టణంలో ఏర్పాటు చేస్తున్నట్టు ఎమ్మెల్యే గోనుగుంట్ల సూ ర్యనారాయణ పేర్కొన్నారు. పట్టణంలోని కోటాస్కూల్ ఆవరణంలో ఉన్న భవనాన్ని అన్నక్యాంటిన్ ఏర్పాటుకు ఆ యనతోపాటు మున్సిపల్‌చైర్మన్ బీరేగోపాలక్రిష్ణ, కమిష నర్ గుర్రం రవికుమార్, డీఈ మురళిలు పరిశీలించారు. అన్నక్యాంటిన్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేసి బుధవారం నుంచే పనులు ప్రారంభించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. ఈ నెలలోగా పనులు పూర్తీ చేయాలన్నారు. ఈ క్యాంటిన్ ఉదయం 6గంటల నుండి రాత్రి 9గంటల వరకు ఉంటుందన్నారు. ఆధార్ అను సంధానం చేసి బయోమెట్రిక్ ద్వారా అన్నం,పప్పు, రసం, మజ్జిగ, టిఫెన్ రూ.5లకే అందించడం జరుగుతుంద న్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 200 అన్నక్యాంటిన్‌లు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. నిరుపేదల కోసం ముఖ్య మంత్రి చంద్రబాబునాయుడు ఈ అన్నక్యాంటిన్లను ఏర్పా టు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ ఏఈ వాణి, శానటరీ ఇన్‌స్పెక్టర్‌లు లక్ష్మీనారాయణశర్మ, బాబ్జాన్, నాయకులు ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.



భవనాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే గోనుగుంట్ల

గ్యాస్‌పై సబ్సిడీ తొలగించరాదు

కాంగ్రెస్ నాయకుల డిమాండ్

ముదిగుబ్బ: ప్రజలకు నిత్యావసర వస్తువుఅయిన గ్యాస్ సిలిండర్‌పై కేంద్ర ప్రభుత్వం తొలగించాలని చూ స్తోందని, సబ్సిడీ తొలగించరాదని కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం ముదిగుబ్బలో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కాంగ్రెస్‌నాయకులు బాసినేని ప్రభాకర్, నిషార్‌అహమ్మద్, నాగరాజులు మా ట్లాడుతూ ప్రతి ఇంటికి గ్యాస్ కనెక్షన్ ఇస్తామని పేదలం దరికి గ్యాస్ కనెక్షన్‌లు ఇచ్చి ప్రస్తుతం ఎన్డీఏ ప్రభుత్వం సబ్సిడీని ఎత్తివేయాలని అనుకోవడం పేదల కడుపు కొట్ట డానికే అని వారు అన్నారు. దశల వారిగా సబ్సిడీ ని తొల గిస్తానని అనడం మంచి పద్ధతి కాదన్నారు. అలాగే గ్రామాలలో సంక్షేమ పథకాలు అర్హులకు అందకుండా గుదిబండలా తయారైన జన్మభూమికమిటీలను రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. జన్మభూమి కమిటీ సభ్యులు తన సొంత కక్షలతో అర్హులైన వారికి సంక్షేమ పథకాలు అందకుండా సైందవుల్లా అడ్డుపడుతున్నారని ఆ కమిటీలను రద్దుచేస్తేనే అర్హులందరికి అందుతా యన్నారు. కమిటీలను రద్దుచేయకపోతే కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు.

ఘనంగా శ్రీరామ సప్తాహ అఖండ భజన కార్యక్రమం

ధర్మవరంఅర్బన్: శ్రావణ మాసంసందర్భంగా స్థా నిక శ్రీసిద్దరామింగేశ్వరస్వామి దేవాలయంలో మంగళ వారం శ్రీరామసప్తాహ అఖండ భజన కార్యక్రమాలు వైభవంగాజరిగాయి. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యే క పూజలు నిర్వహించారు. వర్షం కోసం భజనలు చేశా రు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. భక్తు లు అధిక సంఖ్యలో పాల్గొని స్వామికి పూజలు నిర్వ హించారు. ప్రజలు సుభిక్షంగా ఉండాలని వరుణ దేవుడు కరుణించాలని కోరుతూ చెరువు కట్టపై ప్రతి ఏడాది శ్రీరామ సప్తాహ అఖండ భజన చేపడుతారు.ఈ ఏడాది కూడా అఖండ భజన ప్రారంభించారు. గత నెల 27న ప్రారంభమైన ఈ భజన 2వ తేదీన ముగుస్తుంది వారం రోజుల పాటు 14 బృందాలు ఏర్పాటుచేసి ఒక్కొక్క బృం దం 2గంటల పాటు మొదటి మరువ నుంచి చివరి మరువ వరకు భజన యాత్ర సాగింది. ఈ విధంగా ప్రతి రోజు ఏడుగురితో కూడిన ఈ బృందం ఈ భజ నలో పాల్గొంటారు. మంగళవారం గుంజర రాము, మేక ల పోతలయ్య, అడ్డ మల్లన్న, పెద్దనారాయణ, ఎస్ వెంక టనారాయణ, కేశవ, కిష్టప్పలు శ్రీరామసప్తాహ అఖండ భజన తరువాత 7న అన్నదానం చేపడుతారు.

హాస్టల్ సమస్యలను పరిష్కరించండి

బత్తలపల్లి: ప్రభుత్వ హాస్టల్‌లోనెల కొన్న సమస్యల ను పరిష్కరించాలని ఐక్యవిద్యార్థిసంఘాల నాయకులు బీ సీ వెల్ఫేర్‌అధికారి చిన్నపుల్లన్నకు మంగళవారం వినతి ప త్రం అందించారు. హాస్టల్‌లను సందర్శించి వెంటనే సమ స్యలను పరిష్కరించాలని వారు వినతి పత్రంలో కోరారు. వినతి పత్రం అందించిన వారిలో విద్యార్థిసంఘాల నా యకులు బాలాజీనాయక్, వినయ్‌తేజగౌడ్‌లు పాల్గొన్నారు.

9న ప్రపంచ గిరిజన ఆదివాసీ సభ

ఎస్కేయూ: గిరిజనులకు అన్ని రంగాలలో సమాన ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వ ర్యంలో ఈనెల 9న అనంతపురం లిటిల్ ఫ్లవర్ ఫంక్షన్ హాల్ నందు ప్రపంచ గిరిజన ఆదివాసీ సభను నిర్వహి స్తున్నట్లు ఎస్కేయూ అధ్యక్షుడు హనుమంతు నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్కేయూ వైస్ చాన్సలర్ చాంబర్‌లో వాల్‌పోస్టర్లను వీసీ ఆచార్య రాజగోపాల్, రిజి స్ట్రార్ సుధాకర్‌బాబు విడుదల చేశారు.

చురుకుగా సాగుతున్న కోర్టు పనులు

పుట్టపర్తిరూరల్: ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న పుట్టపర్తి సమీప మండల వాసులకు త్వరలో కోర్టు ప్రా రంభం సహకారం కాబోతోంది. ఇందుకుగాను స్థానిక ఎంపీడీఓ కార్యాలయం వద్ద కోర్టు భవనానికి మరమత్తు లు వేగవంతంగా జరుగుతున్నాయి.



మాట్లాడుతున్న ఉపాధ్యాయుడు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

ముదిగుబ్బ: మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు మంగళ వారం ప్రధానోపాధ్యాయుడు రామలింగారెడ్డి అధ్యక్షతన ఆత్మీయ సన్మానం చేశారు.పాఠశాలలో వీరు చేసిన సేవ లను కొనియాడారు. ఈ కార్యక్రమంలో బదిలీ ఉపాధ్యా యులు చంద్రశేఖర్‌రావు, సత్యనారాయణ, బాలాజీ కుమార్, ముజఫర్, సుందరయ్య, లక్ష్మీపతి, చెన్నా క్రిష్ణా రెడ్డి, వసంతరాణి తదితరులు ఉన్నారు.

అనాథ, వీధి బాలల సంక్షేమానికి సమష్టి కృషి

జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్ కుమార్

ఆంధ్రజ్యోతి, అనంతపురం : అనాథ, వీధి బాలల సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేద్దామని ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు బాలల పరిరక్షణ కమిటీ లకు ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆ వర్గాలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పోలీస్ శాఖ నేతృత్వంలో బాలల సంక్షేమ విభాగం, కార్మిక శాఖ, బాలల సంక్షేమ కమిటీ, చైల్డ్‌లైన్, హ్యాండ్స్ రెడ్స్, బర్డ్ తదితర స్వచ్ఛంద సంస్థలతో పాటు ఐసీడీఎస్ అధికా రులు సంయుక్తంగా జిల్లాలో ముస్కాన్ ఆపరేషన్ ద్వారా 97మంది చిన్నారులకు విముక్తి కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఇందులో 57 మంది బాలురు, 40 మంది బాలికలు ఉన్నారన్నారు. కొందరిని వారి తల్లి దండ్రులు, బంధువులకు అప్పజెప్పామన్నారు. మరో సారి వారు వీధుల్లోకి రాకుండా పెద్దలకు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. మరికొందరిని హాస్టళ్ల, హోమ్స్‌కు పంపామన్నారు. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన ముగ్గురు చిన్నారులను ఆయా సంక్షేమ విభాగాలకు పంపించామన్నారు. జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్‌లో బాలల రక్షణ విభాగాన్ని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మాల్యాద్రి, డీసీఆర్‌బీ సీఐ ప్రసాద్‌రావు, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ రంగరాజు, చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమాచారితో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు భానుజా, నాయుడు పాల్గొన్నారు.

టీబీఆర్ ద్వారా చిత్రావతికి తాగునీరు

ప్రకటించిన మున్సిపల్ చైర్మన్ గోపాలకృష్ణ - డ్యాంను పరిశీలించిన అధికారులు

ధర్మవరంఅర్బన్: చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయ ర్‌లో నీరు తగ్గుముఖం పట్టిందని, నెలాఖరులోగా టీబీ ఆర్ ద్వారా చిత్రావతికి నీరు వస్తుందని మున్సిపల్ చైర్మ న్ బీరే గోపాలక్రిష్ణ సూచించారు. మంగళవారం మున్సిప ల్ చైర్మన్ బీరే గోపాలక్రిష్ణ, కమిషనర్ గుర్రంరవి, ఈఈ నాగమోహన్, డీఈ మురళి, ఏఈ వాణిలు విలేఖరులతో కలిసి చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పరిశీలించా రు. అక్కడ తగ్గుముఖం పట్టిన నీటిని పరిశీలించారు. ఇసుక పూడిక తీత పనులను ప్రారంభించారు.అనంతరం వారు మాట్లాడుతూ సీబీఆర్‌లో ఉన్ననీరు నెల రోజులు మాత్రమే వస్తాయన్నారు. కావున తాగునీటిని చాలా పొ దుపుగా వాడాలని పట్టణ వాసులకు నెలాఖరులోగా తుంగభద్రడ్యాం నుంచి నీరు వస్తుందని, కావున అప్పటి వరకు పట్టణ వాసులు నీటిని వృధా చేయకుండా చాలా పొదుపుగా వాడాలన్నారు. అదే విధంగా నీరు ఎర్రగా వస్తే వాటిని కాచి వడగొట్టుకుని తాగాలన్నారు.ఈ విష యాన్ని ఎమ్మెల్యే గోనుగుంట్ల సూర్యనారాయణ దృష్టికి తీ సుకెళ్లామని, ఆయన కూడా వీటిపై సమీక్షలు జరిపి ఎ లాగైనా పట్టణంలో నీటి సమస్యతలెత్తకూడదని, ప్రజల కు నీటి అందేలా కృషిచేయాలని తెలిపారన్నారు. ఈ కార్య క్రమంలో శానటరీ ఇన్‌స్పెక్టర్‌లు లక్ష్మీనారాయణ, బాబ్జాన్, టీడీపీ నాయకులు రాంపురంశీన, ఖాదర్‌వలీ తదితరులు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్

ధర్మవరంఅర్బన్: పరిసరాలను ప్రతి ఒక్కరూ పరి శుభ్రంగా ఉంచుకున్నప్పుడే స్వచ్ఛభారత్ మిషన్ లక్ష్యం నెరవేరుతుందని కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల సురేశ్ పిలుపునిచ్చారు. పట్టణసమీపంలోని గుట్టకిందపల్లిలో గ ల కెహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల్లో స్వచ్ఛభారత్ పక్షో త్సవాలను మంగళవారం అధ్యాపకులు, విద్యార్థులు ఘ నంగా నిర్వహించారు. ఉన్నత విద్యాకమీషనర్ ఆదేశాల మేరకు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని కళాశాల ప్రిన్సిపాల్ సురేశ్ తెలిపారు. అనంతరం అధ్యాపకులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేయించా రు. ప్రతి ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకో వాలన్నారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ పర్యావ రణ ప్రేమికులుగా మారాలన్నారు. మొక్కలను సంరక్షిం చాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్ర మంలో వైస్‌ప్రిన్సిపాల్ చాంద్‌బాషా, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ క్రిష్ణయ్య, శివప్రసాద్, రఘురామ మూర్తి, విశ్వనాథ్‌రెడ్డి, షామీర్‌బాషా, శ్రీరాం, ఉషారాణి, పుష్పా వతమ్మ, శశాంక మౌళి, ఆదినారాయణ, రామ్మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రతిజ్ఞ చేస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

ఐకమత్యంతోనే సమస్యల పరిష్కారం

ఎస్సీ సంక్షేమ సంఘం నాయకులు

ధర్మవరంఅర్బన్: ఐక్యమత్యంతోనే సమస్యను పరి ష్కరించుకోవచ్చని ఎస్సీ సంక్షేమసంఘం వ్యవస్థాపకుడు చామలూరు రాజగోపాల్, జిల్లా అధ్యక్షుడు ఓబుళపతి తెలిపారు. మండల పరిధిలోని చిగిచెర్ల గ్రామంలోని ఆర్టీటీ పాఠశాలలో మంగళవారం ఎస్సీచైతన్య సదస్సు నిర్వహించారు.ఈ సదస్సుకు ముఖ్యఅతిధిగా హాజరైన రాజగోపాల్ మాట్లాడుతూ..ఐక్యమత్యంగా ఉంటేనేప సమస్య సాధించుకోవచ్చన్నారు. రాజ్యాంగంలో అనేక హ క్కులు మనకు కల్పించబడ్డాయన్నారు. వాటిని మనం సాధించుకుని పిల్లల భవిష్యత్తుకు బాటలు వేసుకోవా లని ఆయన పిలుపునిచ్చారు. అంబేద్కర్ విధానమే మ నకు మార్గమన్నారు. విద్య ఒక్కటే బడుగు బలహీన వ ర్గాల ప్రజలకు సకల కష్టాలకు సంజీవని దాన్ని మనం ఆచరించాలన్నారు. అనంతరం గ్రామ కమిటీని ఎంపిక చేశారు. ఈ కార్యక్రమంలో రామాంజినేయులు, హరి, శీన తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ కోరుతూ నిరాహార దీక్ష

పామిడి : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ బిల్లును ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ఆమోదించాలని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ మందక్రిష్ణ వర్గం ఆధ్వర్యంలో తహసీల్దార్ కార్యాలయం ముందు మంగళవారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జిల్లా ఉపాధ్యక్షులు నరసింహులు, మండల గౌరవాధ్యక్షుడు మల్లేష్, మండల అధ్యక్షుడు శంకర్, కార్యదర్శి సూర్యనారాయణ, నాయకులు శేఖర్, రవి, మోహన్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

నెట్టికంటిని దర్శించుకున్న భన్వర్‌లాల్

గుంతకల్లురూరల్: కసాపురం శ్రీనెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయాన్ని రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్, ఆయన సతీమణి మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనకు ఆలయ అధికారులు, ట్రస్టుబోర్డు సభ్యులు, అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఆయనతో పాటుగా జేసీ రమామణి, ఆర్డీఓ మలోలాలు మూలవిరాట్టును దర్శించుకున్నారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. సంప్రదాయ ప్రకారం వారికి పట్టువస్త్రాలను, స్వామి వారి లడ్డూ ప్రసాదాన్ని అందజేసి ఆశీర్వదించారు. ముందుగా స్వామి చరిత్ర గురించి ట్రస్టుబోర్డు సభ్యులను, అధికారులను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇందుకు ట్రస్టీలు శ్రావణమాసం ప్రత్యేకతను గురించి తెలియజేయడంతో మరోసారి అవకాశం ఉంటే ఆలయాన్ని సందర్శిస్తామన్నారు. అనంతరం గుంతకల్లులోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగు ఓటు నమోదు అంశం అనే కార్యక్రమంలోన పాల్గొనేందుకు వెళ్లారు. ఆయనతో పాటుగా ఆలయ ఈఏ ముత్యాలరావు, ఏఈఓ మధు, సూపరింటెండెంట్ వెంకటేశ్వర్లు, ట్రస్టుబోర్డు ఛైర్మన్ సుగుణమ్మ, ట్రస్టుబోర్డు సభ్యులు తలారి రామలింగ, జగదీశ్‌ప్రసాద్, కందుల ప్రసాద్‌రెడ్డి, నారాయణస్వామి, విజయలక్ష్మి, తహసీల్దారు హరిప్రసాద్, అదనపు డీఎం,హెచ్ఓ అనిల్‌కుమార్, డాక్టర్ గంగన్న, మండల వైద్యాధికారి రోహినాథ్ తదితరులు ఉన్నారు.



ట్రస్టుబోర్డు సభ్యులతో మాట్లాడుతున్న భన్వర్‌లాల్

లోకల్ గైడ్

ఎమ్మెల్యే డైరీ

గుంతకల్లు: స్థానిక ఎమ్మెల్యే ఆర్ జితేంద్రగౌడ్ నంద్యాలకు వెళ్లారు. కనుక బుధవారం ఆయన ప్రజలకు, కార్యకర్తలకు అందుబాటులో ఉండరు.

కూరగాయల ధరలు



కిలో.. టమోట రూ. 40, మిరప రూ. 60, బీరకాయ రూ. 30, ఉర్లగడ్డ రూ. 20, వంకాయ రూ. 40, బెండకాయ రూ. 30, క్యారెట్ రూ. 60, ఉల్లిగడ్డ రూ. 20

సినిమా గైడ్

గుంతకల్లు

వాసవి : గౌతమ్‌నందా
చైతన్య : స్పైడర్‌మ్యాన్
కేపీఎస్ : ఫిదా

గుత్తి

అమృత్: ఫిదా
కేపీఎస్ : గౌతమ్‌నంద

పామిడి

మంజు: ఫిదా
హనుమాన్ : గౌతమ్‌నందా






కసాపురంలో కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న భన్వర్‌లాల్, గుంతకల్లులో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ, గుంతకల్లురూరల్ రజాపురంలో, ఉరవకొండలో టీకాలు వేస్తున్న వైద్య సిబ్బంది

ఎమ్మార్ వ్యాక్సిన్ తప్పనిసరి

కార్యక్రమాన్ని ప్రారంభించిన రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్

గుంతకల్లురూరల్: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్ కసాపురం ఆంజనేయస్వామి దర్శనం అనంతరం గ్రామంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు మిజిల్స్ రుబెల్లా టీకాల కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మీజిల్స్, రూబెల్లా టీకాలను విద్యార్థులకే కాకుండా 9 నెలల నుంచి 15 సంవత్సరాల చిన్నారులకు తప్పనిసరిగా వేయించి టార్గెట్ పూర్తి చేయాలని సూచించారు. అనంతరం చిన్నారులతో కాసేపు ముచ్చటించారు. ఆయన వెంట అదనపు డీఎంఅండ్‌హెచ్ఓ అనీల్‌కుమార్, మండల వైద్యాధికారి రోహినాథ్, మండల వైస్‌ఎంపీపీ వైదేహీ, సర్పంచు తిక్కస్వామి, ఆరోగ్య సిబ్బంది రామలక్ష్మి, ఆశాకార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు, పాఠశాల హెచ్‌ఎం, ఉపాధ్యాయులు తదితరులు ఉన్నారు.

గుంతకల్లుటౌన్: స్థానిక పాతగుంతకల్లులోని డాక్టర్ రాజేంద్రప్రసాద్ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో మున్సిపల్ చైర్‌పర్సన్ అపర్ణ, వైస్‌చైర్మన్ శ్రీనాథ్‌గౌడ్ మీజిల్స్, రూబెల్లా టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ కమలమ్మ, ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ఇజంతకర్ చంద్రశేఖర్, రూబెల్లా వ్యాక్సిన్ జిల్లా చైర్మన్ నాగార్జున, కౌన్సిలర్ లక్ష్మీయనారాయణ, ఉపాధ్యాయులు, ఆసుపత్రి సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

గుత్తి: స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఏపీ రెసిడెన్సియల్ బాలికల ఉన్నత పాఠశాల, తదితర పాఠశాలలో డాక్టర్ శ్రీనివాసబాబు ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది వ్యాక్సిన్ వేసే కార్యక్రమం చేపట్టారు.

గుత్తిరూరల్: మండలంలోని రజాపురం, సేవాఘడ్, చెర్లోపల్లి, కొజ్జేపల్లి, లచ్చానుపల్లి, మార్నేంపల్లి గ్రామాల్లోని పిల్లలకు ఎమ్మార్ వ్యాక్సిన్‌ను బేతాపల్లి వైద్యులు సందీప్ యాదవ్, ఎంపీడీఓ జలజాక్షి వేశారు. కార్యక్రమంలో వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఉరవకొండ: స్థానిక మండల పరిషత్ సెంట్రల్ పాఠశాలలో ఎమ్మార్‌వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఆసుపత్రి కమిటీ చైర్మన్ యేళ్ల శంకరప్ప, సర్పంచు నర్రాసుజాత ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు మంజుల, టీడీపీ నాయనకులు రామాంజినేయులు, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు. కాగా, స్థానిక ప్రభుత్వ వైద్యావిధాన పరిషత్ ఆసుపత్రిని జిల్లా అదనపు వైద్యాధికారి అనిల్ కుమార్ తనిఖీ చేశారు. మీజిల్స్ టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు.

కూడేరు: స్థానిక జిల్లాపరిషత్ హైస్కూల్, ప్రాథమిక పాఠశాలలు, కెజీబీవీ స్కూల్, ప్రైవేట్ పాఠశాలలోని విద్యార్థులకు, ముద్దలాపురం పాఠశాల విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేశారు. కార్యక్రమంలో డాక్టర్ తిప్పయ్య, ఐసీడీఎస్ సీడీపీఓ శామలమ్మ, కేజీబీవీ ఎస్ఓ అరుణ, సీహెచ్ఓ శ్రీనివాసులు, సూపర్‌వైజర్లు నాగేంద్రప్రసాద్, సరోజమ్మ, శాంతకుమారి, వైద్య బృందం పాల్గొన్నారు.

పామిడి : స్థానిక టీసీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ (సీహెచ్ఓ) రామలక్ష్మమ్మ ఆధ్వర్యంలో చిన్నారులకు టీకాలు వేశారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ శివారెడ్డి, హెల్త్ అసిస్టెంట్లు కృష్ణమోహన్, అరుణకుమారి, ఏఎన్‌ఎంలు అంజినమ్మ, నాగమణి, నాగమ్మ, కృష్ణకుమారి, మహేశ్వరి, కల్పణ, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

విడపనకల్లు: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వైద్య సిబ్బంది ఎమ్మార్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సీహెచ్ఓ నాగరంగయ్య, ఎంఈఓ చలపతి, హెచ్‌ఎం వసుంధర, సూపర్‌వైజర్ శర్మాస్ వలి, వైద్య సిబ్బంది, అంగనవాడీ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వజ్రకరూరు: మండలంలోని వివిధ గ్రామాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆరోగ్యసిబ్బంది ఎమ్మార్ టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు.స్థానిక కాటా వెంకటప్ప జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని అడిషనల్ డీఎంఅండ్‌హెచ్ఓ అనిల్‌కుమార్, జిల్లా లెప్రసీ యూనిట్ అధికారి ఇర్షాద్ అహమ్మద్ పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారిణి జ్యోతిర్మయి, ఎంఈఓ ఎర్రిస్వామి, హెచ్‌ఎం నాగేంద్రయ్య, ఎంపీహెచ్‌ఈఓలు శ్రీరాములు, వెంకటేశ్వర్లు, హెల్త్ ఎడ్యుకేటర్ చంద్రశేఖర్‌రెడ్డి, సీహెచ్ఓ గంగాధర్, ఏపీఎంఓ మరియాదాసు, సూపరవైజర్లు మెహరున్నీసా, శ్రీనివాసులు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

బెళుగుప్ప : కేజీబీవీలో నిర్వహించిన కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎంపీహెచ్‌ఈఓ గురుప్రసాద్, ఎంపీటీసీ కెంచిరాముడు, పీహెచ్‌ఎన్ పద్మావతి, ఎస్ఓ నాగరత్నాభాయి, ఏఎన్‌ఎంలు సరోజమ్మ, భాగ్యమ్మ, వైద్య సిబ్బంది రవిరాజులు పాల్గొన్నారు. అలాగే బెళుగుప్పలోని ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఈఓ తిరుపాల్‌రెడ్డి, ప్రైవేట్ పాఠశాలల్లో కరస్పాండెంట్ శ్రీనివాసులు, మారెన్న, ఉపాధ్యాయులు కె. నాగరాజు, శ్రీనివాసులు, ఎస్.నాగరాజు పాల్గొన్నారు. మండలంలోని ఎర్రగుడి, బెళుగుప్ప, బెళుగుప్ప తండా గ్రామాల్లోని ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలలతో పాటు స్థానిక కేజీబీవీ, శ్రీనివాస విద్యానికేతన్, సన్‌రైజర్ పాఠశాలల్లోని విద్యార్థులకు ఈ వ్యాక్సిన్‌ను వేశారు. ఎర్రగుడిలో సర్పంచ్ అనిత, ఏఎన్ఎం నారమ్మ పాల్గొన్నారు.







విడపనకల్లులో, కూడేరు మండలం ముద్దలాపురంలో, గుత్తిలో, బెళుగుప్పలో , పామిడిలో ఎమ్మార్ వ్యాక్సిన్ వేస్తున్న వైద్య సిబ్బంది

ఉపాధి కూలీలంతా ఆధార్ లింక్ చేసుకోవాలి

గుత్తిరూరల్: మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో ఉపాధి పనులకు వేళ్లే ఉపాధి కూలీలంతా ఆధార్ లింకు చేసుకోవాలని ఎంపీడీఓ జలజాక్షి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని బేతాపల్లి గ్రామంలో ఉపాధి హామీ కూలీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మండల వ్యాప్తంగా 111 మందికి ఆధార్ లింకు కాలేదని, 280 మందివి ఇన్‌యాక్టివ్‌లో ఉన్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ రమేశ్, పీల్డ్ అసిస్టెంట్ అగ్గిరాముడు పాల్గొన్నారు.

బస్సుల తరలింపును అడ్డుకున్న 'యూనియన్'

గుంతకల్లుటౌన్: స్థానిక ఆర్టీసీ డిపోలోని బస్సులను ఇతర డిపోలకు తరలిస్తుండటాన్ని యూనియన్ నాయకులు మంగళవారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు నాగరాజు, రామాంజనేయులు, శ్రీనివాసులు, ఈరన్న మాట్లాడుతూ.. డిపోలో సర్వీసులను, కార్మికులను తగ్గించి డిపోను మూసివేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. గతంలో 8 బస్సులను ఇతర డిపోలకు తరలించారన్నారు. ప్రస్తుతం ధర్మవ రానికి 3, పుట్టపర్తికి 1, హిందూపురానికి 2 బస్సులను తరలిస్తుండగా ఎన్‌ఎంయూ, ఈయూ నాయకులు అడ్డుకున్నారు. దీంతో రెండు బస్సులను మాత్రమే అధికారులు తరలించారు.

బీడీ బంకులో చోరీ

గుంతకల్లుటౌన్: స్థానిక చైతన్య థియేటర్ ఎదురుగా ఉన్న బీడీ బంకులో మంగళవారం చోరీ జరిగింది. గోపీ అనే వ్యక్తి గత కొన్నేళ్లుగా బీడీ బంకు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. సోమవారం రాత్రి బంకుకు తాళాలు వేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి గుర్తు తెలియని దుండగులు బంకు వెనుక నుంచి రేకును తొలగించి లోపలకి చొరబడ్డారు. మంగళవారం ఉదయం బంకు తెరవగా లోపల రేకును తొలగించి ఉండటాన్ని గుర్తించాడు. బంకులో ఉన్న రూ. 3వేలు విలువ చేసే సిగరెట్లు, చిల్లర డబ్బును ఎత్తుకెళ్లారని గోపీ తెలిపాడు.

పాఠశాలల తనిఖీ

గుత్తి: పట్టణంలోని కస్తూర్బా పాఠశాల, కొత్తూరు ప్రాథమికోన్నత పాఠశాల, భవితా వికలాంగుల కేంద్రం, ఎమ్మార్సీ భవనాలను సర్వశిక్షా అభియాన్ సామిజిక చైతన్య అధికారి (సీఎంఓ) ఆనందబాబు సహాయ సీఎంఓ క్రిష్టప్ప మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆరు నుంచి 14 సంవత్సరాల పిల్లల వివరాలను గతంలో జరిగిన స్మార్ట్ పల్స్ సర్వేలో మండల వ్యాప్తంగా 1,470 మంది పిల్లలు బడి బయట ఉన్నట్లు తేలిందన్నారు. ప్రస్తుతం ఇంకా 964 మంది పిల్లలు బడిబయటే ఉన్నట్లు గుర్తించామన్నారు. వీరిని కూడా పాఠశాలల్లో చేర్పించేందుకు ఉపాధ్యాయులకు సూచనలు ఇస్తున్నామన్నారు. అనంతరం పాఠశాలలోని విద్యార్థుల హాజరుపట్టిక, మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ వేణుగోపాల్, తదితరులు పాల్గొన్నారు.

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోండి

గుత్తిరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని ఈఓఆర్డీ శశికళ పేర్కొన్నారు. మంగళవారం తురకపల్లి గ్రామంలో ఆమె పర్యటించారు. గ్రామంలోని మురుగు కాలువలను, వాటర్ ట్యాంకులను శుభ్రం చేయించారు. వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఆమె వెంట పంచాయతీ కార్యదర్శి ఇబ్రహీం, సర్పంచు సరోజమ్మ తదితరులు ఉన్నారు.

రేపు యాదవుల సమావేశం

గుత్తి: స్థానిక నిజామి ఫంక్షన్ హాల్‌లో యాదవుల సంఘం సమావేశాన్ని గురువారం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం ఆధ్యక్షుడు రాము, రంగస్వామి యాదవ్ మంగళవారం పత్రకటనలో తెలిపారు. కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించడానికి ఈ సమావేశం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. యాదవులందరూ సమావేశానికి హాజరు కావాలని ఈ ప్రకటనలో కోరారు.

స్మార్ట్‌డోర్ నెంబరింగ్ సిస్టంపై అవగాహన

గుంతకల్లుటౌన్: స్మార్ట్‌డోర్ నెంబరింగ్ సిస్టంపై రెవెన్యూ, టౌన్‌ప్లానింగ్, జీఐఎస్ సర్వే టీం సిబ్బందికి అవగాహన కల్పించారు. సానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి డీఎంఓ అసిస్టెంట్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... జీఐఎస్ ద్వారా మున్సిపల్, రెవెన్యూ ఆదాయాన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. అభివృద్ధి పనులకు జీఐఎస్ మ్యాపింగ్ ద్వారా సులువుగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ ఈశ్వరయ్య, అసిస్టెంట సీటీ ప్లానర్ శివన్నారాయణ, మున్సిపల్ మేనేజర్ వెంకటరెడ్డి పాల్గొన్నారు.

'సర్వర్' డౌన్.. పింఛన్ పంపిణీలో జాప్యం

బెళుగుప్ప : సర్వర్ మొరాయించడంతో మంగళవారం పింఛన్ల లబ్ధిదారులు అవస్థలు పడ్డారు. ఆలస్యంగా ప్రాంభమైంది. మండల వ్యాప్తంగా 5,004మందికి రూ. 54లక్షల 50వేలు పంపిణీ చేస్తున్నట్లు ఎంపీడీఓ సుధామణి తెలిపారు. సాంకేతిక కారణాలతో పింఛన్ల పంపిణీలో జాప్యమైందన్నారు. జిల్లా అధికారులు నిర్దేశించిన గడువులోగా పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు.

రోగులతో ఆసుపత్రి కిటకిట



రోగులతో కిటకిటలాడుతున్న ఆసుపత్రి, బెడ్లు ఖాళీ లేకపోవడంతో అరుగులపైనే సెలైన్‌ను ఎక్కించుకుంటున్న రోగులు

గుత్తి: సీజనల్ వ్యాధులు వ్యాపించడంతో అధిక సంఖ్యలో రోగులు స్థానిక ప్రభుత్వాసుపత్రికి వస్తున్నారు. టైఫాయిడ్, మలేరియాలతో పాటు జ్వరాలు, దగ్గు, జలుబు ప్రజలను పట్టి పీడిస్తున్నాయి. దీంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. ఆసుపత్రిలో ఐదుగురు వైద్యులకు గాను కేవలం ఇద్దరు మాత్రమే విధులు నిర్వహిస్తుండటంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. మంగళవారం ఉదయం ఏకంగా 500 మందికి పైగా రోగులు వచ్చారు. వాంతులు, విరోచనాలతో భాపడుతున్న వారికి నర్సులు సెలెన్ ఎక్కించడంలో బిజీగా ఉండిపోయారు. తొండపాడు, జక్కల చెరువు, కొత్తపేట, బసినేపల్లి, గుత్తి, గుత్తి ఆర్ఎస్‌కు చెందిన దాదాపు 40 మంది దాకా డయేరియాతో ఆసుపత్రికి వచ్చారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వ ఉండటంతో దోమలు అభివృద్ధి చెంది వ్యాధులు వ్యాపిస్తున్నాయని బాధితులు తెలిపారు.

పెరుగుతున్న రోగుల సంఖ్య

సీజనల్ వ్యాధులతో పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో రోగుల సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. దీనికి తోడు వైద్యుల కొరత ఉండటంతో రోగులు తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రోగులు ఎక్కువ మంది వస్తుండటంతో ఆసుపత్రిలో వైద్యుల కొరత కొట్టొచ్చినట్లు కనబడుతోంది. ప్రస్తుత మున్న సూపరిటెండెంట్ మాధవకృష్ణ పదోన్నతిపై కర్నూలుకు బదిలీ అయ్యారు. గైనకాలజిస్ట్ రమ్యప్రియ సెలవులో ఉన్నారు. ముగ్గురు వైద్యులలో ఒకరు నైట్ డ్యూటీ చేయగా మరో ఇద్దరు వైద్యులు మాత్రమే రోగులకు వైద్య సేవలందిస్తున్నారు. వారిలో ఏ ఒక్కరు సెలవు పెట్టినా రోగుల ఇబ్బందులు అంతాఇంతా కాదు. జిల్లా ఉన్నతాధికారులు గుత్తి ప్రభుత్వ ఆసుపత్రిలో పూర్తి స్థాయిలో వైద్యులను నియమించేలా చర్యలు తీసుకోవాలని రోగులు కోరుతున్నారు.

వారం రోజులుగా ఆస్పత్రికి వస్తున్న రోగుల సంఖ్య

తేదీ	రోగుల సంఖ్య
24న	585మంది
25న	435మంది
26న	395మంది
27న	360మంది
28న	498మంది
29న	353మంది
31న	455మంది
1న	400మంది

'ఉర్దూ'ను కాపాడుకుందాం

గుంతకల్లుటౌన్: ఉర్దూ భాషను కాపాడుకుందామని ముస్లిం ప్రజా హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు ఎస్ఎండీ అరిఫ్ పేర్కొన్నారు. స్థానిక కమిటీ కార్యాలయంలో మంగళవారం ఉర్దూ పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... మనిషి ఎదుగుదలకు భాష దోహదం చేస్తుందన్నారు. ముస్లింలకు ఉర్దూ భాష చాలా అవసరమన్నారు. ఉర్దూ భాషను ప్రభుత్వాలు విస్మరించడం సమంజసం కాదన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలలో ఉర్దూ సబ్జెక్టును తప్పనిసరిగా బోధించేలా చూడాలన్నారు. పాఠశాలలో ఉర్దూ ఉపాధ్యాయులను నియమించి ముస్లిం సంస్కృతి సంప్రదాయలను కాపాడాలని డిమాండ్ చేశారు. అనంతరం పోస్టర్లను విడుదల చేశారు. సమావేశంలో కమిటీ గౌరవ సలహాదారులు దేవేంద్రప్ప, గౌరవ అధ్యక్షుడు మహబుబ్‌పీరాన్, కార్యదర్శి నజిర్‌ఆహ్మద్, సభ్యులు సయ్యద్ మహబుబ్, రహంతుల్లా, అల్లాబకాష్, ఏరూరు బాష, పీరా తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు

గుంతకల్లురూరల్: మండల పరిధిలోని గొల్లలదొడ్డి గ్రామంలో వర్షం కోసం పెద్దమ్మ, చౌడమ్మ, బొడ్రాయికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మూడు రోజులుగా ఈ పూజలను నిర్వహిస్తున్నారు. మంగళవారం బోనాలను ఊరేగించారు. వివాహం కాని యువతీయువకులు బొడ్రాయికి 101 బిందెల నీటితో అభిషేకాలు చేశారు.

దాడి కేసులో దంపతులకు ఏడాది జైలు

గుంతకల్లుటౌన్: దాడి కేసులో భార్య, భర్తలకు ఏడాది జైలు శిక్షను విధిస్తూ గుంతకల్లు పస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి కే వాసుదేవరావు తీర్పు వెల్లడించారని టూటౌన్ ఎస్ఐ మంగళవారం తెలిపారు. 2009లో పాతగుంతకల్లుకు చెందిన ఉడుతల గోపాల్, అతని భార్య అనంతలక్ష్మి ఇంటి గోడ విషయమై ఇంటి పక్కన నివాసముంటున్న సురేష్, క్రిష్ణమూర్తిపై దాడి చేశారు. ఈ విషయంపై టూటౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. ఈ కేసు తుది విచారణకు రాగా వీరిపై నేరం రుజువు కావడంతో ఉడుతల గోపాల్, అనంతలక్ష్మీకి ఏడాది జైలు శిక్ష, ఒక్కోకరికి రూ. 1,500లు జరిమానా విధించినట్లు ఎస్ఐ వలిబాషు తెలిపారు.

గుంతకల్లులో పాలిటెక్నిక్ కళాశాలను ఏర్పాటు చేయండి

గుంతకల్లుటౌన్: పట్టణంలో పాలిటెక్నిక్ కళాశాల ఏర్పాటు చేయాలని జాయింట్ కలెక్టర్ రమామణికి ఎస్ఎఫ్ఐ, వైఎస్ఆర్ఎస్‌యూ, విద్యార్థి సేన నాయకులు వినతి పత్రాన్ని అందజేశారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన విద్యార్థుల ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొనడానికి వచ్చిన ఈమెను విద్యార్థి సంఘాల నాయకులు విన్నవించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో వైఎస్ఆర్ఎస్‌యూ రాష్ట్ర నాయకులు ఖలీల్, పట్టణ కన్వీనర్ సూరి, మండల కన్వీనర్ వంశీయాదవ్, ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు పరమేశ్, వై రమేశ్, సహాయ కార్యదర్శి శ్రీనివాసులు, నాయకులు గణేశ్, హరీష్, విద్యార్థి సేన నాయకులు అబ్దుల్ బాసిద్, మహేశ్‌గుప్తా, ఎస్ఎం బాష, రాము, సుదీర్, సద్దాం, తహెర్ హుసేన్ తదితరులు పాల్గొన్నారు.

సీఓ బదిలీ ఆపండి



కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

పామిడి : నగర పంచాయతీలో మెప్మా సీఓ చంద్రశేఖర్ బదిలీని నిలిపివేయాలని మెప్మా సిబ్బంది మున్సిపల్ కమిషనర్ నాసీర్‌హుసేన్‌కు మంగళవారం వినతిపత్రం అందజేశారు. డిప్యుటేషన్‌పై మెప్మా సీఓగా చంద్రశేఖర్ సేవలతో డ్వాక్రా సంఘాలు చాలా అభివృద్ధి సాధించారని, ఇలాంటి తరుణంలో సీఓను బదిలీ చేస్తే డ్వాక్రా సంఘాల అభివృద్ధి కుంటుపడే ప్రమాదముందని వాపోయారు. రెగ్యులర్ సీఓగా చంద్రశేఖర్‌ను పామిడికే నియమించాలని టీఎల్ఎఫ్ అధ్యక్షురాలు వెంకటలక్ష్మి, కార్యదర్శి మాబున్ని, కోశాధికారి సరస్వతి వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎల్ఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు, సీఎల్ఆర్‌పీలు, ఆర్‌పీలు పాల్గొన్నారు.

'నగదు రహితం' నుంచి వెసలుబాటు

పరిగి : రేషన్‌కార్డు ద్వారా ఎఫ్‌పీ షాపుల్లో నిత్యావసర సరుకులు పొందేందుకు ప్రభుత్వం చేపట్టిన నగదు రహిత లావాదేవీలతో కలుగుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం వెసలుబాటు కల్పించింది. నగదు రహితం తప్పనిసరిగా కాకుండా ఇష్టం ఉంటేనే నగదు రహిత లావాదేవీలు చేయాలని ప్రభుత్వం ప్రకటించింది. దీంతో మండలంలోని 36ఎఫ్‌పీ షాపుల్లో మంగళవారం డీలర్లు నగదు తీసుకుని లావాదేవీలు నిర్వహించారు.. మండలంలో 17,022 రేషన్‌కార్డులున్నాయి. కొంతకాలంగా నగదు రహితంతో ఏర్పడుతున్న ఇబ్బందులు తొలగిపోవడంతో రేషన్ డీలర్లు ఊపిరిపీల్చుకున్నారు.

నీరే లేదు.. రక్షక తడిఎలా..?

- సాగులెక్కలులేని వ్యవసాయశాఖ
- అయోమయంలో రైతులు
- తలలుబాదుకుంటున్న అధికారులు



ఎండుతున్న వేరుశనగ



మొక్కజొన్న

హిందూపురం టౌన్ : ఖరీఫ్ సీజన్‌లో సాగుచేసిన పంటలు వర్షం లేక ఎండి పోతున్నాయి. దీంతో ప్రభుత్వం వాటిని ఎలాగైనా కాపాడాలని వ్యవసాయ శాఖను ఆదేశించింది. ఇదే తడవుగా పంటలకు రక్షక తడులు అందించేందుకు వ్యవసాయ శాఖాధికారులు సిద్ధమయ్యారు. అయితే ముఖ్యంగా హిందూపురం ప్రాంతంలో గువ్వ తాగడానికి గుక్కెడు నీరు దొరకని పరిస్థితి నెలకొంది. ఇలాంటి తరుణంలో వేల హెక్టార్లలో సాగుచేసిన పంటలను ఎలా తడుపుతారో తెలియని పరిస్థితి. ఈ నేపథ్యంలో సాగుచేసిన పంట పొలాల పక్కన ఉన్న బోరుబావులు, కుంటల్లోని నీటిని ట్యాంకర్ల ద్వారా తరలించి ఎండిపోతున్న పంటలకు అందించాలని వ్యవసాయశాఖ సంకల్పిస్తోంది. అయితే బోరుబావికింద సంబంధిత రైతులు ఇప్పటికే పంట సాగుచేసుకుని వాటిని కాపాడుకోవడానికే ఇబ్బందులు పడుతున్న తరుణమిది. అతడి పరిస్థితే ఇలా ఉంటే పక్క రైతుకు నీటిని ఎలా అందిస్తారో మరి. ఈ నేపథ్యంలో హిందూపురం వ్యవసాయశాఖ ఏడీ పరిధిలోని హిందూపురం, పరిగి, లేపాక్షి, చిలమత్తూరు, పరిగి మండలాల్లో ఎండుతున్న వేరుశనగ, మొక్కజొన్న తదితర పంటలకు రక్షక తడులు అందించాలని సంకల్పిస్తున్నారు. అయితే ఇక్కడ నీరు తాగడానికే దొరకడం లేదని, అలాంటిది పంటలను రక్షించడం ఎవరితరం కాదని రైతులు పేర్కొంటున్నారు. ఇదిలా ఉండగా ఈ యేడాది ఇప్పటి వరకు ఏ పంట ఎంత సాగుచేశారో వ్యవసాయ శాఖాధికారుల వద్ద లెక్కలు లేనట్లు తెలుస్తోంది. అయినాకానీ రక్షకతడులు అందిస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందని రైతులే విమర్శలు గుప్పిస్తున్నారు.. మరోపక్క వ్యవసాయాధికారులకు పంటలకు రక్షకతడులు అందించడం తలనొప్పిగా మారింది. పంటలు ఎలా రక్షిస్తారో వేచి చూడాల్సిందే.


లోకల్ గైడ్
localguide

హిందూపురం మార్కెట్‌లో కూరగాయల ధరలు



టమోట రూ.60, ఉల్లి 15, మిరప 60-80, బీరకాయ 40, ఉర్లగడ్డ 30, వంకాయ 20, బెండకాయ 60, క్యారెట్ 60, బీన్స్ 60, కోసు 30, మునగ 80, ముల్లంగి 30, బటాణి 120, సీమవంకాయ 60, నెమలికోసు 80, దొండకాయ 60, బీట్‌రూట్ 20, క్యాబేజీ 30, తెల్లగడ్డలు 120, కాకరకాయ 60, సొరకాయ 30, గోరు చిక్కుడు 60, చిక్కుడు 60, క్యాప్సికమ్ 60, అల్లం : 80

పట్టుగూళ్ల ధరలు



కనిష్ఠం (సీబీ) రూ.280.00, (బైవోల్టీన్) 272.00,గరిష్ఠం (సీబీ)364.00,(బైవోల్టీన్) 495.00, సగటు (సీబీ) 338.00, (బైవోల్టీన్) 428.00.

చింతపండు ధరలు

కర్పూలి 10 కిలోలు రూ.600-1575, ఫ్లవర్ రకం రూ.350-850, బోటురకం రూ.200-250

హిందూపురంలో సినిమాలు

శ్రీనివాస - దండుపాళ్యం -2, **విష్ణు -** ఫిదా, **గురునాథ్-** గౌతమ్‌నంద, **అమృత్** - రారండోయ్ వేడుక చూద్దా **లక్ష్మి -** డీజే దువ్వాడ జగన్నాథం, **బాలాజీ** - బాహుబలి -2

మొదటిరోజే మొండికేసిన సర్వర్

- 4జీ వచ్చినా తొలగని సాంకేతికసమస్యలు
- జిల్లాలో 3.3 శాతమే సరుకుల పంపిణీ

హిందూపురం టౌన్: ప్రభుత్వం చౌకదుకాణాలద్వారా నిత్యావసర సరుకులు అందజేసేందుకు 4జీ సేవలు తీసుకువచ్చినా సర్వర్ సమస్యలు మాత్రం తొలగిపోలేదు. ఆగస్టు 1నుంచి చౌకడిపోల్లో ఎయిర్‌టెల్ 4జీ సిమ్ముల ద్వారా 5వ తేదీ లోపే సాధ్యమయినంతవరకు నిత్యావసరాలందజేయాలని ప్రభుత్వం భావించింది. అందుకనుగుణంగానే ఆయా డీలర్లకు సిమ్ములు పంపిణీ చేశారు. అయితే మారిన ఆప్షన్స్‌తో మొదటిరోజు మంగళవారం సాంకేతిక లోపం తలెత్తడంతో చౌకడిపోలవద్ద కార్డుదారులు పడిగాపులు కాయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతనెలలో బయోమెట్రిక్ మిషన్ల ద్వారా 1న కనీసం 15నుంచి 20శాతం కార్డుదారులకు రేషన్ సరుకులు అందజేసేవారు. కానీ మంగళవారం జిల్లాలో 1,19,925కార్డులకు గాను 36,355కార్డులకే సరుకులందజేశారు. అంటే 3.3శాతంలోపు మాత్రమే మంగళవారం సాయంత్రానికి సరుకులు అందజేయగలిగారు. హిందూపురం పట్టణం, మండలంలో అయితే 51,225కార్డులకుగాను 3945కార్డులకు మాత్రమే పంపిణీ చేసినట్లు తెలిసింది. కాగా, బయోమెట్రిక్ యంత్రాలకు కొత్త ఆప్షన్లు ఎంపిక చేశారు. దీంతో చాలామంది డీలర్లు మంగళవారం ఉదయం వాటిని ఇన్‌స్టాల్ చేసుకోలేకపోవడంతో కొన్ని షాపుల్లో మొదటి రోజు రేషన్ సరుకులే అందజేయలేదు. మంగళవారం ఉదయం 6గంటలలోపు బయోమెట్రిక్ యంత్రాలు ఆన్‌చేసిన వారికి మాత్రమే ఆప్షన్ ఓకే అయింది. మిగిలినవి సర్వర్ సమస్యతో పనిచేయకుండా పోయాయి. దీంతో వాటికి సంబంధించి టెక్నికల్ అధికారులను సంప్రదించినా సరైన సమాధానం ఇవ్వకపోవడంతో డీలర్లు మొదటి రోజు సరుకులు ఇవ్వడంలో చేతులెత్తేశారు. 3జీ సేవలు పోయి 4జీ సేవలు వచ్చినా సాంకేతిక సమస్యలు పరిష్కారం కాలేదు. బుధవారం నుంచైనా సాంకేతిక సమస్యలు పరిష్కరిస్తే సరుకుల పంపిణీ సజావుగా జరిగే వీలుంటుందని డీలర్లు పేర్కొంటున్నారు.

విద్యార్థులకు అనుగుణంగా బస్సులు నడపాలి

హిందూపురం టౌన్: బస్‌పాసులు అందజేసిన విద్యార్థులందరికీ అనుగుణంగా ఆర్టీసీ బస్సులు నడపాలని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు డిమాండ్ చేశారు. పట్టణంలోని పాఠశాలు, కళాశాలల సమయానికి పల్లెల నుంచి విద్యార్థులు వచ్చేలా బస్సులు నడపాలని స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో మంగళవారం వినతిపత్రం అందజేశారు. బస్‌పాసులు ఇచ్చారుకానీ అందుకు అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కొన్ని పల్లెల నుంచి వచ్చే విద్యార్థులు పట్టణానికి మధ్యాహ్నం 12కు వస్తున్నారని దీంతో బోధన సరిగా చేరడంలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా ఉపాధ్యక్షుడు బాబావలి, పురుషోత్తం, జయ, మహేష్, మారుతి, జగన్నాథ్, బాబురెడ్డి, మంజు, గంగాధర్, నవీన్, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

కారు దూసుకెళ్లి ఐదు గొర్రెల మృతి





మృతిచెందిన గొర్రెలు, గాయపడ్డ వ్యక్తులు

చిలమత్తూరు : మండలంలోని కొడికొండ చెక్‌పోస్టు సమీపంలో ఉన్న ఇండియన్ హ్యూమ్ పైప్స్ ఫ్యాక్టరీ వద్ద మంగళవారం రాత్రి... ఏపీ9బిడీ 4535 నెంబరుగల టాటా ఇండిగో కారు అదుపుతప్పి గొర్రెల మందపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో ఐదు గొర్రెలు మృతిచెందగా కారులో ప్రయాణిస్తున్న ఇరువురు వ్యక్తులు గాయపడ్డారు. కొత్తచెరువు ప్రాంతానికి చెందిన కొంతమంది గొర్రెల కాపర్లు మేత నిమిత్తం 3వేల గొర్రెలు తీసుకుని చిలమత్తూరు ప్రాంతానికి వచ్చారు. వారు మంగళవారం సాయంత్రం చిలమత్తూరు వైపు నుంచి కొడికొండ చెక్‌పోస్టుకు గొర్రెలను తరలిస్తుండగా ఎదురుగా వస్తున్న కారు అదుపుతప్పి గొర్రెల మందపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న హిందూపురం వాసి సాయిప్రసాద్, మరో వ్యక్తి గాయపడ్డారు.

పేదలంటే ఇంత నిర్లక్ష్యమా..?

40 రోజులైనా నీరు వదల లేదు - రోడ్డుపై బైఠాయించి మహిళల ధర్నా



రహమత్‌పురం సర్కిల్‌లో బైఠాయించిన మహిళలు

హిందూపురం అర్బన్: పేదలంటే ఇంత నిర్లక్ష్యమా..? 40 రోజులైనా నీరు వదలరా..? అంటూ తాగునీటి కోసం మహిళలు రోడ్డెక్కారు. హిందూపురం పట్టణంలోని కల్లూరు సుబ్బరావు పార్కు ఎదురుగా ఉన్న కాలనీ మారెమ్మగుడి ప్రాంతానికి చెందిన మహిళలు మంగళవారం రహమత్‌పురం సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మా కాలనీకి 40 రోజులైనా మున్సిపల్ నీరు రాలేదని ఇలాగైతే ఎలా బతకాలని ఆగ్రహించారు. ఎన్నాళ్లు నీరు కొనుగోలు చేయాలని ఆవేదన వ్యక్తం చేశారు. నీటిని కొనుగోలు చేసి పిల్లలకు వారానికి ఒక మారు స్నానాలు చేయిస్తున్నామని ఆవేదన చెందారు. వారానికి ఒక్క ట్యాంకర్ వచ్చి ఐదు బిందెల నీరందిస్తే ఎలా సర్దుకోవాలని ప్రశ్నించారు. ఈ ధర్నాతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. ఉదయం కావడంతో పాఠశాల, కళాశాలలకు వెళ్లే విద్యార్థులకు ట్రాఫిక్ ఎస్ఐ రాజశైఖర్‌రెడ్డి అక్కడకు చేరుకుని సర్దిచెప్పినా మహిళలు వినలేదు. దీంతో ఎస్ఐ మున్సిపల్ డీఈ వన్నూరుస్వామి సిబ్బందిని అక్కడకు పిలిపించారు. కాలనీకి ట్యాంకర్‌ల ద్వారా నీరు సక్రమంగా అందిస్తామని డీఈ హామీ ఇచ్చారు. ధర్నా చేసినప్పుడు మాత్రం సముదాయించడం కాదని వెంటనే నీరివ్వాలని మహిళలన్నారు. పీఏబీఆర్ నీరు రాకపోతే తానేమి చేయలేనని డీఈ ఎదురుదాడికి దిగారు. దీంతో కమిషనర్‌నే అడుగుతామంటూ మహిళలు మున్సిపల్ కార్యాలయం వద్దకెళ్లి అక్కడ కూర్చుని నిరసన తెలిపారు. కమిషనర్ విశ్వనాథ్ స్పందించి పీఏబీఆర్ నీరు వచ్చి 22 రోజులు అయిందని దీంతో పట్టణంలో అన్ని ప్రాంతాలకు సరఫరా చేయాలేకపోతున్నామన్నారు. అయితే ట్యాంకర్లద్వారా కొరత లేకుండా నీరందిస్తామని ప్రజలు సహకరించాలని కోరారు.

వ్యక్తికి దేహశుద్ధి

హిందూపురం టౌన్ : పట్టణంలోని డీఎల్‌రోడ్డు సమీపంలో ఉన్న ఓ ప్రైవేట్ క్లినిక్ వద్దకు గౌరీబిదునూరుకు చెందిన శోభ అనే మహిళ బిడ్డను చికిత్సకోసం తీసుకొచ్చింది. మంగళవారం మధ్యాహ్నం నగరిగెరకు చెందిన ప్రసాద్ అనే వ్యక్తి శోభ మెడలో ఉన్న బంగారు గొలుసును లాక్కోవడానికి ప్రయత్నించాడు. ఆమె గట్టిగా కేకలు వేయడంతో అక్కడే ఉన్నవారు ప్రసాద్‌ను పట్టుకుని దేహశుద్ధిచేసి టూటౌన్ పోలీసులకు అప్పగించారు.

కల్లూరులో ఘనంగా పొలిమేర జాతర

లేపాక్షి : కరువుతో వర్షాలులేక అల్లాడిపోతున్న రైతులు ఆనవాయితీగా వస్తున్న పొలిమేర జాతరను మండలపరిధిలోని కల్లూరులో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఊరి చివరన వెలసిన పొలిమేర దేవతకు ప్రత్యే క పూజలు చేసి 101బిందెల నీటితో అభిషేకం చేశారు. అనంతరం పి ల్లలు, పెద్దలు, చెరువు వద్ద నుంచి తప్పెట్లతో జాతరను ప్రారంభిం చారు. చెరువు కట్టమీద నుంచి కరువు కేకలువేస్తూ చెరువు మొత్తం పరిగెత్తారు. కరువు ఏర్పడినప్పుడు ఇలా చేస్తే వర్షాలు వస్తాయని గ్రామస్థుల నమ్మకం.

జాతీయ రహదారిలో ప్రమాద స్థలాల పరిశీలన

చిలమత్తూరు : రోడ్డు ప్రమాదాల నివారణలో భాగంగా పెనుకొండ డీఎస్పీ కరీముల్లాషరీఫ్, నేషనల్ హైవే అథారిటీ అధికారులు మంగళవారం జాతీయ రహదారిలో తరచూ ప్రమాదాలు జరిగే స్థలాలను పరిశీలించారు. మండలంలోని కోడూరుతోపు, పెనుకొండ చెక్‌పోస్టు, కమ్మయ్యగారిపల్లి, లాలేపల్లి క్రాస్, అంజలీతాండా, జువారిస్టీల్ ఫ్యాక్టరీ, తదితర స్థలాలను వారు పరిశీలించారు. ఆయా స్థలాలలో ప్రమాదాల నివారణపై దృష్టి సారించారు. ఈ కార్యక్రమంలో పెనుకొండ సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ జనార్దన్, చిలమత్తూరు ఎస్ఐ జమాల్‌బాషా, నేషనల్ హైవే అథారిటీ అధికారులు పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం



కొట్నూరు నుంచి బదిలీ అయిన ఉపాధ్యాయులు వీరే

హిందూపురం టౌన్: స్థానిక కొట్నూరు ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు, ఇతర పాఠశాలలకు బదిలీ కావడంతో మంగళవారం వారిని ఘనంగా సత్కరించారు. పాఠశాలలో పనిచేస్తున్న వారిలో పార్వతమ్మ, ఉమాదేవి, బుసిరెడ్డి, సూర్యనారాయణమూర్తి, మురళీ, చంద్రశేఖర్, గోవిందప్ప, నాగమణి, షర్మీలా, రామాంజులమ్మ, దివాకర్ యాదవ్‌లను ఘనంగా సత్కరించారు.

పరిగిలో...



సేవామందిర్‌లో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

పరిగి : ఇటీవల ప్రభుత్వం నిర్వహించిన బదిలీల్లో మండలంలో నికొడగనహళ్లి సమీపంలో గల సేవామందిరం జడ్పీ ఉన్నత పాఠశాలలో 14మంది ఉపాధ్యాయులకు బదిలీ ఉత్తర్వులు వచ్చాయి. వీరందరినీ మంగళవారం విద్యార్థులు, తోటి ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం దిల్‌షాద్‌బేగం, తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి గృహనిర్మాణ లబ్ధిదారుల ఎంపిక

చిలమత్తూరు : ఎన్టీఆర్ గృహనిర్మాణ లబ్ధిదారుల ఎంపికకోసం గురువారం నుంచి 8వరకు ఉదయం 10గంటలకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శివానందనాయక్ తెలిపారు. గురువారం టేకులోడు, కొడికొండ, శెట్టిపల్లి, శుక్రవారం దేమకేతేపల్లి, పలగలపల్లి, 5న వీరాపురం, కోడూరు, చాగలేరు, 8న సోమగట్ట, మరుసలపల్లి, చిలమత్తూరు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

శెట్టిపల్లిలో గ్రామసభ

చిలమత్తూరు : ఉపాధిహామీ సిబ్బంది, బ్యాంక్ సిబ్బంది ఆధ్వర్యంలో మండలంలోని శెట్టిపల్లిలో మంగళవారం ఉపాధి కూలీలతో సమావేశం నిర్వహించారు. ఆధార్ అనుసంధానం కాని, యాక్టివేషన్‌లో లేనివారి బ్యాంక్ ఖాతాలు యాక్టివేట్ చేయడం కోసం కూలీల నుంచి ఆధార్, బ్యాంక్ పాసుపుస్తకాలు, జిరాక్స్ కాపీలను సేకరించారు. ఉపాధిహామీ ఏఈఓ అమరావతి, టెక్నికల్ అసిస్టెంట్ కెంచప్ప, సీనియర్ మేట్ మోపుర్‌రెడ్డి, వివిధ బ్యాంక్‌ల సిబ్బంది పాల్గొన్నారు.

పారిశుధ్యం పనులు

చిలమత్తూరు : స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా మండలకేంద్రమైన చిలమత్తూరు గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో మంగళవారం పారిశుధ్య పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామంలో చెత్తాచెదారం తొలగించారు. డ్రైనేజీల్లో పూడిక తొలగించి శుభ్రం చేశారు.



పురంలో విద్యార్థినికి టీకా వేయిస్తున్న రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ రంగనాయకులు



లేపాక్షిలో ఎంఆర్ వ్యాక్సిన్‌ను ప్రారంభ కార్యక్రమంలో ఎంపీపీ హనోక్

ఎంఆర్ టీకా పిల్లల ఆరోగ్యానికి రక్ష

హిందూపురం టౌన్ : మీజిల్స్, రూబెల్లా(ఎంఆర్) టీకాతో పిల్లల ఆరోగ్యానికి సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ రంగనాయకులు అన్నారు. ఎంఆర్ టీకాల కార్యక్రమాన్ని మంగళవారం ఎంజీఎం పాఠశాలలో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఒకే టీకాతో రెండు రోగాల నుంచి పిల్లలను కాపాడుకోవచ్చన్నారు. 9నెలల నుంచి 15సంవత్సరాలలో ఉన్న పిల్లలకు తప్పనిసరిగా ఈ టీకా వేయించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పిల్లల ఆరోగ్యాన్ని కాపాడటానికి ప్రతిష్ఠాత్మకంగా ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందన్నారు. ఈ నెల 1నుంచి సెప్టంబర్ 1వరకు టీకా వేస్తారన్నారు. దీనిని పిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ వెంకటస్వామి, హెచ్ఎం జీవరత్నమ్మ, వైద్యులు పద్మజ, శివకుమార్, కౌన్సిలర్ రహిమాన్, మాజీ కౌన్సిలర్ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి :
పిల్లలను ప్రాణాంతక వ్యాధుల నుంచి రక్షించే ఎంఆర్ వ్యాక్సిన్‌ను వైద్య సిబ్బంది మంగళవా రం స్థానిక అన్ని ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు వేశారు. నవోదయ పాఠశాలలో ఎంపీపీ హనోక్ టీకా మందును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారి శ్రీదేవి, ఎంపీటీసీ సభ్యులు చలపతి, చిన్న ఓబన్న, వైద్య సిబ్బంది గజేంద్రరెడ్డి, మల్లప్ప, ప్రసాద్, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

పరిగి :
15సంవత్సరాలలోపు పిల్లలకు ముందస్తుగా వ్యాధి నిరోధక శక్తికోసం ప్రభుత్వం చేపట్టిన ఎంఆర్ వ్యాక్సిన్ టీకాలు వేసే కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. సెప్టంబర్ 8వరకు జరిగే ఈ కార్యక్రమాన్ని మండలంలోని అన్ని పాఠశాలల్లోనూ నిర్వహించేందుకు మండల వైద్యశాఖ ఏర్పాట్లు చేసింది. అందులో భాగంగా మంగళవారం పరిగి జడ్పీహెచ్ పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్ టీకాలను అట్టహాసంగా ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సత్యనారాయణ, తహసీల్దార్ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ బాలమునయ్య, ఎస్ఐ శరత్‌చంద్ర, ఎంఈఓ లక్ష్మీదేవి, వైస్ ఎంపీపీ చౌడప్ప, హెచ్ఎం నాగరాజు, డాక్టర్ ఆదిశేషు, పీహెచ్ఓ శేషు, ఏఎన్ఎంలు, విద్యార్థులు పాల్గొన్నారు.

చిలమత్తూరు :
మండలకేంద్రలోని జడ్పీ ఉన్నత పా ఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ఎంపీపీ నౌజియా, జడ్పీటీసీ సభ్యుడు లక్ష్మీనారాయణరెడ్డి మంగళవారం ఉదయం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ శ్రీకాంతి, సీహెచ్ఓ ఫకృద్దీన్, హెచ్ఎం నాగరాజు, టీడీపీ నాయకులు అన్సార్‌అహ్మద్, మన్సూర్‌అహ్మద్, నందీశ్, ఉపాధ్యాయులు, వైద్య ఆరచోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు. తొలిరోజు చిలమత్తూరు గ్రామ పంచాయతీలోని విద్యార్థులకు 1684మందికి ఎంఆర్ వ్యాక్సిన్ వేసినట్లు మండల వైద్యాధికారి డాక్టర్‌శ్రీకాంతి తెలిపారు.



ఎంఆర్ వ్యాక్సిన్‌ప్రారంభిస్తున్న ఎంపీపీ సత్యనారాయణ తదితరులు



చిలమత్తూరులో ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

డబ్బా పాలు వద్దు... తల్లి పాలే ముద్దు





సూగూరు, పరిగిలో తల్లిపాల వారోత్సవాలపై ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్ : తల్లిపాల వారోత్సవాలపై మంగళవారం పట్టణంలోని అంగనవాడీ కేంద్రాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ తల్లిపాల విశిష్టత, బిడ్డకు కలిగే లాభాలు వివరించారు. ముఖ్యంగా పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రుపాలు తాగించాలని దీంతో రోగని రోధకశక్తిని పెంచుతాయన్నారు.

పరిగి : పిల్లలకు డబ్బాపాలు పట్టించడం, జబ్బుల ను కొనితెచ్చుకోవడమేనని, తల్లిపాలు శ్రేయస్కర మని సీడీపీఓ నాగమల్లీశ్వరి పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా అంగన్‌వాడీ కార్యకర్తలు మండలకేంద్రంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. తహసీల్దార్ సుబ్బారెడ్డి, ఎంపీడీఓ బాలమునయ్య, సూపర్‌వైజర్ విజయ పాల్గొన్నారు.

ఎన్ఎస్‌పీఆర్‌లో స్వచ్ఛ పక్వార్

హిందూపురం టౌన్ : ఎస్కేయూనివర్సిటీ ఆదేశాల మేరకు పట్టణంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో స్వచ్ఛ పక్వార్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ శంకరయ్య మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ ధ్యేయంగా పనిచేస్తున్న ప్రధానమంత్రి మోదీ కలలు నిజం చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు హేమలత, నాగమణి, శ్రీలక్ష్మి, శ్రీనివాసమూర్తి, నరసింహులు, పోలయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉద్యాన పథకాలకు దరఖాస్తు చేసుకోండి

తనకల్లు : ప్రభుత్వం మంజూరు చేసిన ఉద్యాన పథకాలకు మండల రైతులు దరఖాస్తులు చేసుకోవాలని ఉద్యాన శాఖాధికారి సునీల్ తెలిపారు. కావాల్సిన రైతులు ముందుకు వచ్చి రైతు మిత్రా సీడ్స్అండ్ పెస్టిసైడ్స్ పేరుమీద డీడీ తీసి ఇవ్వాలన్నారు. అలాగే మండలంలోని సీఆర్‌పల్లి, తనకల్లు, మండ్లిపల్లి, టీ సదుం, బాలసముద్రం, కొక్కంటి, ఈతోడు, అగ్రహారం, కొర్తికోట, తిరుమలయ్యగారిపల్లి రైతులు ఎంపీఈఓ అనీసాను ఫోన్ నెం.9676338271 కు సంప్రదించాలన్నారు. తవళం, ఎనిసీతండా, గేమేనాయక్‌తండా, కోటపల్లి, మల్లిరెడ్డిపల్లి, గుర్రంబైలు, గంగసానిపల్లి, చీకటిమానిపల్లి, బొంతలపల్లి రైతులు ఎంపీఈఓ రాజశేఖర్‌రెడ్డిని 9440546470 , 8074518065నెంబర్లకు సంప్రదించాలన్నారు.

పశువులకు అందని వైద్యసేవలు

● ఆందోళనలో యజమానులు
● సిబ్బంది కొరతే కారణమంటున్న ఏడీహెచ్

తనకల్లు : మండలంలో పశువులకు సరైన వైద్య సేవలు అందక చనిపోతున్నాయని వాటి యజమానులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి పాడి పశువులను తెచ్చుకుంటే వైద్య సేవలు అందక చనిపోతున్నట్లు మండలంలోని ఉస్మిని పల్లి, రెడ్డివారిపల్లి, గుంజువారిపల్లి, పరాకువాండ్లపల్లి గ్రామాలకు చెందిన పలువురు రైతులు, మహిళా రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలో కొక్కంటి, కోటపల్లి, బొంతలపల్లి, పరాకువాండ్లపల్లిలో పశువైద్య కేంద్రాలు ఉన్నాయి. పరాకువాండ్లపల్లి పశువైద్య కేంద్రంలో పనిచేస్తున్న డాక్టర్ శివప్రసాద్‌రాజును ఇటీవల అధికారులు పదోన్నతి కల్పించి ఏడీగా అక్కడే నియమించారు. ఆయన ఆధీనంలో మండలంలోని నాలుగు వైద్య కేంద్రాలతో పాటు అమడగూరు మండలంలోని పశువైద్య కేంద్రాలు పనిచేస్తున్నాయి. మండల వ్యాప్తంగా 16912 పెద్ద పశువులు, 90623 గొర్రెలు ఉన్నాయి. ఇవి జర్సీ ఆవులు 300కు పైగా ఉన్నట్లు గణాంకాల ద్వారా తెలుస్తోంది. వరుస కరువుతో అల్లాడి పోతున్న రైతులు జీవనం కోసం పాడి పశువులపై ఆధారపడుతున్నారు. ఇటీవల మండల వ్యాప్తంగా పాడి ఆవుల కొనుగోలు పెరిగింది. అలాగే వాటికి వచ్చే జబ్బుల నివారణకు వేలాది రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ప్రభుత్వ పశువైద్యులను గ్రామాలకు తీసుకెళ్లి పాడి ఆవులకు వైద్యం చేయించేందుకు మామూళ్లు ఇవ్వాల్సి వస్తోందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. అంతే కాకుండా ప్రభుత్వం సరఫరా చేస్తున్న మందులను రైతులకు ఉచితంగా ఇవ్వకుండా... లేబుళ్లు తొలగించి వాటికి డబ్బులు వసూలు చేస్తున్నట్లు రైతులు తెలిపారు. దీంతో పశువులు జబ్బులు వచ్చినా డాక్టర్ల వద్దకు వెళ్లడానికి రైతులు బెంబేలెత్తిపోతున్నారు. మండలంలో నెల రోజులలో 15కు పైగా పాడి ఆవులు చనిపోయినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా పరాకువాండ్లపల్లిలోని పశువైద్య కేంద్ర ఆవరణలో ఖాళీ మద్యం సీసాలు దర్శనమిస్తున్నాయి. ఆసుపత్రికి గేటులేక పోవడం వల్ల ఇక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నట్లు స్థానికులు అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి పశువైద్యులు సక్రమంగా పశువైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.


పరాకువాండ్లపల్లి పశు వైద్యకేంద్రం



పశువైద్యశాల ఆవరణలో ఖాళీ మద్యం బాటిళ్లు

సిబ్బంది కొరత వేధిస్తోంది.

ఈ విషయాలపై శివప్రసాద్ రాజు ఏడీహెచ్ ను ఆంధ్రజ్యోతి వివరణ కోరగా తగినంత సిబ్బంది లేనందువల్ల వైద్య సేవలు అందించడంలో ఆలస్యం అవుతోందన్నారు. ఇటీవల వస్తున్న కొన్ని జబ్బులకు మందులు బయట కొనుగోలు చేయమన్నది వాస్తవమేనన్నారు. ప్రభుత్వం కావాల్సినన్ని మందులు సరఫరా చేస్తోందన్నారు. ఏ సమయంలో నైనా అందుబాటులో ఉంటామని తెలిపారు.

\- శివప్రసాద్‌రాజు, ఏడీహెచ్, తనకల్లు

లోకల్ గైడ్

localguide

కదిరి మార్కెట్‌లో కూరగాయల ధరలు



వంకాయ కిలో రూ.30, టమోటా 50, బెండ 40, బీరకాయ 30, కాకరకాయ 50, క్యారెట్ 80, బీట్‌రూట్ 40, బీన్స్ 60, ముల్లంగి 40, పచ్చిమిర్చి 50, ఉర్లగడ్డ 22, కోసుగడ్డ 25, మునగ 60, క్యాప్సికమ్ 60

కదిరి సినిమాలు

సంగం - గౌతమ్‌నంద, రాధిక - మాయామహల్
వేమల - ఫిదా , మౌనిక - డీజే దువ్వాడ జగన్నాథం

ఎమ్మెల్యే డైరీ

కదిరిటౌన్ : స్థానిక ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాష బుధవారం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉండరు.

ఎంపీడీఓగా యోగానందరెడ్డి బాధ్యతల స్వీకరణ


ఎంపీడీఓ యోగానంద రెడ్డికి శుభాకాంక్షలు తెలుపుతున్న సిబ్బంది

నంబులపూలకుంట : మండల నూతన ఎంపీడీఓగా యోగానందరెడ్డి మంగళవారం బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పనిచేస్తున్న ఎంపీడీఓ యాదవేంద్ర లీవ్‌పై వెళ్లడంతో ఆయన స్థానంలో యోగానందరెడ్డి బాధ్యతలు చేపట్టారు. ఈయన గతంలో పుట్టపర్తి ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్‌డీగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై ఎంపీడీఓగా మండలానికి వచ్చారు. కార్యాలయ సిబ్బంది, శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీపీ నాగమ్మ, జడ్పీటీసీ సభ్యురాలు మహేశ్వరమ్మ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు మర్యాదపూర్వకంగా కలిశారు.

మండలానికి 2827 పక్కా గృహాల మంజూరు

తలుపుల : తలుపుల మండలంలోని 16 గ్రామ పంచాయతీలకు నూతనంగా 2827 ఎన్టీఆర్ పక్కా గృహాలు మంజూరైనట్లు ఎంపీడీఓ కే పోలప్ప తెలిపారు. అందులో ఎస్సీలకు 493, ఎస్టీలకు 235, బీసీలకు 1467 , ఇతరులకు 632 కేటాయించినట్లు తెలిపారు. లబ్ధిదారుల ఎంపికకు గ్రామసభలు నిర్వహిస్తామన్నారు. గ్రామ సభలు 4 న ఉడమలకుర్తి, గుండువారిపల్లి, కుర్లి, 5న ఓదులపల్లి, పెద్దన్నవారిపల్లి, ఓబుళరెడ్డిపల్లి, 7 నల్లకసముద్రం, బండ్లపల్లి, ఈదులకుంట్లపల్లి, 8 న బట్రేపల్లి, వేపమానిపేట, నూతన కాలువ, 9 న పొలతలవాండ్లపల్లి, తలుపుల, పెన్నబడివాండ్లపల్లి, 10న పులిగుండ్లపల్లి నిర్వహిస్తామని ఎంపీడీఓ తెలిపారు.

తల్లిపాల వారోత్సవాలు

కదిరిటౌన్ (గాండ్లపెంట) : మండలంలోని మల్లిమీదపల్లి పంచాయతీ గ్రామంలో అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని మం గళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్యకర్తలు మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు ఆరోగ్యంతో పాటు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారన్నారు. గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం తీసుకోవడం వల్ల ఉపయోగాలను వివరించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త లక్ష్మీదేవి, రమణమ్మ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్మశాన వాటికను కబ్జా నుంచి రక్షించండి

కదిరిటౌన్ : కదిరి మండలం కాళసముద్రం గ్రామంలో మైనార్టీలకు కేటాయించిన శ్మశాన వాటికను అదే గ్రామానికి చెందిన షేక్‌బాషా, టీ శ్రీనివాసులు, టీ చెండ్రాయుడు, మునెప్పలు ఆక్రమించుకున్నారని మంగళవారం కదిరి ఆర్డీఓ వెంకటేశుకు విన్నవించారు. సోమవారం తహసీల్దార్‌కు వినతి ఇచ్చిన విషయం తెలిపారు. అలాగే పట్టణ పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. భూకబ్జా చేసి, దాడులకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని మైనార్టీలు కోరారు.

ఆదివాసీ దినోత్సవ సభను జయప్రదం చేయండి..

కదిరిఅర్బన్ : గిరిజన విద్యార్థి సమాఖ్య (జీవీఎస్) ఆధ్వర్యంలో ఈ నెల 9 న అనంతపురంలోని లిటిల్‌ఫ్లవర్ ఫంక్షన్ హాలులో నిర్వహించే ప్రపంచ గిరిజన ఆదివాసీ దినోత్సవాన్ని జయప్రదం చేయాలని ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు రాంప్రసాద్‌నాయక్ , నాయకులు అంజినాయక్, హరికుమార్‌నాయక్, రమేష్‌నాయక్‌లు పిలుపునిచ్చారు.

పిల్లల్లో పోషకాల లోపాలపై అవగాహన

కదిరిటౌన్ : కదిరి పడమర ఐసీడీఎస్ ప్రాజెక్టులో కుటాగుళ్ల సెక్టార్ అంగన్‌వాడీ కార్యకర్తలకు మంగళవారం పిల్లల్లో పోషకాల లోపాలు ఎలా గుర్తించాలి? వాటి నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. అడపాలవీధిలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీడీపీఓ ఫర్జానా హాజర్రై పౌష్టికాహారంపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ లక్ష్మీదేవి, అంగన్‌వాడీ కార్యకర్తలు రామలక్ష్మి, సుజాత, సుమిత్ర, హరిప్రియ, ఆదెమ్మ, రజిని, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

మద్దాల రామారావు మరణం కళారంగానికి తీరని లోటు

కదిరిఅర్బన్ : ప్రముఖ రంగస్థల నటుడు , కళారంగానికి వన్నె తెచ్చిన మద్దాల రామారావు మరణం కళారంగానికి తీరని లోటని ఐక్యాప్స్ శారదాంబ కళాకారుల సంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గాలివీడు బాలరాజు , అనసూయమ్మ పేర్కొన్నారు. స్థానిక ఆ సంఘం కార్యాలయంలో మంగళవారం మద్దాల రంగారావు చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు గాలివీడు రమ్యశ్రీ, దిలీప్‌కుమార్, రాష్ట్ర కోఆర్డినేటర్ వై నాగయ్య, కల్చరల్ డైరెక్టర్ శివగంగాధర్, డిప్యూటీ కోఆర్డినేటర్ మంజాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

యువత పెడదోవ పట్టవద్దు : సీఐ

తలుపుల : మండలకేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రీడలకు ముఖ్య అతిథిగా రూరల్ సీఐ శ్రీధర్ హాజరయ్యారు. యువకులు అసాంఘిక కార్యకలాపాలకు ఆకర్షితులై పెడదోవ పట్టవద్దని సూచించారు. తలుపులలో మంగళవారం వాలీబాల్ పోటీలను నిర్వహించారు. విన్నర్‌గా కింగ్ లెవెన్ జట్టు కెప్టెన్ వసీంఅక్రమ్‌కు సీఐ ట్రోఫీ అందించారు. రన్నర్‌గా రాక్‌స్టార్ జట్టు కెప్టెన్ జిలాన్‌కు ఎస్ఐ చంద్రశేఖర్, పోలీసులు ట్రోఫీ అందించారు. పాఠశాల పీడీ చంద్రానాయక్ అంపియర్‌గా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విశ్వేశ్వరయ్య, పోలీసు సిబ్బంది ఆంజనేయులు, భాస్కర్, అనీల్ పాల్గొన్నారు.

అండర్ -16 జిల్లా జట్టుకు కదిరి క్రీడా కారులు

కదిరిఅర్బన్ : ఆంధ్రా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో గురువారం నుంచి ఒంగోలులో ప్రారంభం కానున్న అండర్ -16 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో పాల్గొనే అనంతపురం జిల్లా జట్టుకు కదిరికి చెందిన వెంకటరమణ ఎంపిక కాగా.. స్టాండ్‌బైలుగా సనావుల్లా, పవన్‌కళ్యాణ్‌లు ఎంపికయ్యారు. వారి ఎంపికపై ఆర్డీటీ రీజనల్ (కదిరి) డైరెక్టర్ ప్రమీలమ్మ, ఏటీఎల్ రుక్మాంగద, కదిరి క్రికెట్ సంఘం అధ్యక్షుడు కందికుంట వెంకటప్రసాద్, సభ్యులు సీనియర్ క్రీడాకారులు హర్షం వ్యక్తం చేస్తూ... టోర్నమెంట్‌లో మరింత రాణించాలని ఆకాంక్షించారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం


తనకల్లులో ఉపాధ్యాయులకు సన్మానం నిర్వహిస్తున్న దృశ్యం

తనకల్లు : మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన 15 మంది ఉపాధ్యాయులను మంగళవారం పాఠశాల ఘనంగా సన్మానించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, ఉపాధ్యాయులు ఆదినారాయణరెడ్డి, ఖాజావలి, లక్ష్మీనారాయణ, వెంకటాచలపతి, క్రిష్ణమూర్తిరాజు, మహమ్మద్‌షఫీ, అమరావతి, భాస్కర్, ప్రభాకర్, లీలావతి, భాస్కర్‌చంద్ర, నాగేంద్ర, నాగరాజు, నాగిరెడ్డి, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండలంలోని గూటిబైలు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విధులు నిర్వహిస్తూ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను మంగళవారం ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుడు తాహెర్‌వలి ఆధ్వర్యంలో వారికి దుశ్శాలువ, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. ప్రధానోపాధ్యాయుడు సురేష్‌బాబు, మురళి, క్రిష్టారెడ్డి, సూర్యశేఖర్‌రెడ్డి, రెడ్డిశేఖర్‌రెడ్డి, మహబూబ్‌బాషా, ఖాదర్‌బాష, ప్రసాద్, ఆంజనేయులు, రాజారెడ్డి, వెంకటరమణనాయక్, మార్టిన్, స్రవంతి, గౌసియాబేగం పాల్గొన్నారు.


గూటిబైలులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న గ్రామస్థులు

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

బుక్కపట్నం: నారశింపల్లి ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీ అయిన ఉపాధ్యాయులు మోతిలాల్, రామ్మోహన్‌రెడ్డి, రాజులను మంగళవారం గ్రామస్థులు ఘనంగా సన్మా నించారు.గత 8సంవత్సరాల పాటు పాఠశాలలో విధులు నిర్వర్తిస్తూ విద్యార్థులకు విద్యను అందించినందుకు కృతజ్ఞతతో ఉపాధ్యాయులను గ్రామస్థులు ఘనంగా సన్మానించారు.కార్యక్రమంలో ఉపాధ్యాయుడు నాయుడు, ఎస్ఎంసీ ఛైర్మన్ గంగాదేవి, చంద్రమోహన్, కేశప్ప,కిష్టయ్య పాల్గొన్నారు.

అంకిత భావంతో పనిచేయాలి

బుక్కపట్నం: బదిలీలలో మండలానికి వచ్చిన ఉపాధ్యాయులందరూ అంకితభావంతో పనిచేయాలని ఎంఈఓ గోపాల్‌నాయక్ తెలిపారు. మంగళవారం స్థానిక ఎమ్మార్సీ కార్యాలయంలో బదిలీలలో మండలం నుంచి వేరే మండలాలకు వెళ్లిన ఉపాధ్యాయులకు రిలీవింగ్ ఆర్డర్‌లను అందజేస్తూ వేరే మండలాల నుంచి వచ్చిన వారినుంచి జాయినింగ్ లెటర్‌లను ఎంఈఓ స్వీకరించారు. కార్యక్రమంలో హెచ్ఎంలు లక్ష్మీనరసప్ప, అంజినే యులు, గోపాల్, తిప్పన్న, ఓబిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

బుక్కపట్నం: మండల కేంద్రంలో మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు ప్రపంచ తల్లిపాలవారోత్సవాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.అంగన్‌వాడీ కార్యకర్తలు ర్యాలీ నిర్వహించి తల్లిపాల ప్రాము ఖ్యతను ప్రజలకు వివరించారు. తల్లిపాల వారోత్సవం ఆగస్టు 7 వరకు నిర్వహింస్తామని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనసూయమ్మ తెలిపారు.

వర్షం కోసం ఎర్రపల్లివాసుల పూజలు

కొత్తచెరువు: వర్షం కోసం ఎర్రపల్లి గ్రామస్థులు, భజన మండలి సభ్యులు మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలోని బొడ్రాయికి 101 బిందెలతో జలాభిషేకం చేసి కుంకుమ, పసుపులు సమర్పించి 101 టెంకాయలను కొట్టారు. వారు బండ్లపల్లి, నారాయణపురం, వన్నూరప్పపల్లి, భైరాపురం గ్రామాలలో భజనలు చేస్తూ ర్యాలీ చేపట్టారు.అనంతరం భక్తులకు గ్రామంలో అన్నదానం చేపట్టారు.

గ్యాస్‌పై సబ్సిడీ ఎత్తివేయడం దారుణం

పుట్టపర్తిరూరల్: నిత్యావసర వస్తువైన గ్యాస్‌పై సబ్సిడీ ఎత్తివేయడం దారుణమని బీసీ ఐక్యవేదిక నాయకులు పేర్కొన్నారు. మంగళవారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడు తూ ని త్యావసర వస్తువు అయిన గ్యాస్‌పై సబ్సిడీ ఎత్తివేయడమేకాక ప్రతి దినం రూ.4 పెంచుతూ పోవడం పేదల పట్ల గుదిబండ అవుతుందన్నారు. కార్యక్రమంలో బీసీ ఐక్యవేధిక నాయ కులు సామకోటి ఆదినారాయణ,జ్యోతిప్రసాద్, సూర్యాగౌడ్, రఘు,తి ప్పన్న, కౌన్సిలర్ సాయి , వెంకటసుబ్బయ్యతదితరులు పాల్గొన్నారు.

నూతన పింఛన్ల పంపిణీ

నల్లమాడ : మండలంలోని చౌటకుంటపల్లి గ్రామంలో లబ్ధిదా రులు వికలాంగులు, వితంతువులకు నూతనంగా మంజూరు అయిన పింఛన్లను మంగళవారం పంచాయతీ కార్యదర్శి సుమియా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కురుమాల పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో ఉన్నలబ్ధిదారులు ఆ పరిధిలోని గ్రామాల్లోకి వచ్చినప్పుడు బయోమెట్రిక్ ద్వారా పింఛన్‌లు తీసుకోవాలని ఆమె సూచించారు. మూడు నెలలు పింఛన్ తీసుకోక పోతే రద్దు చేస్తారని ఆమె తెలిపారు.

పిల్లలను ఆరోగ్య వంతులుగా చేద్దాం

ఓబుళదేవరచెరువు (అమడగూరు : పోషక లోపంగల పిల్లలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత అంగన్‌వాడీ కార్యకర్తల పై ఉందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ లక్ష్మీదేవమ్మ పేర్కొన్నారు. మంగళవారం అంగన్‌వాడీ -1 వ కేంద్రంలో ఐఎల్‌ఏ పై అంగన్‌వాడీ కార్యకర్తలకు , పిల్లల తల్లిదండ్రులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంగన్‌వాడీకి వచ్చే పిల్లలకు ప్రతి నెల బరువు , ఎత్తు వేసి , లోపపోషక పిల్లలను గుర్తించి వారికి స్థితిగతుల పై తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలన్నారు. బరువు తక్కువగా ఉండి , పొట్టిగా ఉన్న పిల్లలను వాటికి గల కారణాలను తల్లిదండ్రులకు తెలియజేసి పోషక పధార్థాలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, పిల్లల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు ప్రత్యేక పూజలు

తలుపుల : తలుపుల - గంజివారిపల్లి రహదారిలో పోలేరమ్మకు శ్రావణమాసంలో వర్షం కోసం నెల రోజుల పాటు ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నట్లు వేపమానిపేట సర్పంచు ఎం పురుషోత్తమ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ప్రత్యేక పూజలను ప్రారంభించారు.


కదిరిలో ఎంఆర్ వ్యాక్సిన్ లోగో ప్రారంభిస్తున్న ఆర్డీఓ వెంకటేశు


కదిరిలో.. చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ మధుసూదన్


నల్లచెరువులో ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

పిల్లలకు తప్పక 'ఎంఆర్' వేయించండి : ఆర్డీఓ

కదిరిటౌన్ : ఎంఆర్ వ్యాక్సిన్‌ను 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలకు తప్పక వేయించాలని కదిరి ఆర్డీఓ వెంకటేశు పేర్కొన్నారు. కదిరి ఏరియా ఆసుపత్రిలో ఆయన మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ వేయడాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ.. గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది చిన్నారులు తట్టు, రూబెల్లా వ్యాధుల బారిన పడుతున్నారని, వీటిని అరికట్టడానికి ఎంఆర్ వ్యాక్సిన్ చిన్నారులకు తప్పకుండా వేయించాలన్నారు. చిన్నారుల ఆరోగ్యానికి భరోసా కల్పించేందుకు ప్రభుత్వం ఈ ఎంఆర్ వ్యాక్సిన్ టీకాలు వేయిస్తోందన్నారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలను గుర్తించి వారికి ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లోనూ అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు విద్యార్థులకు వ్యాక్సిన్ వేయాలన్నారు. అనంతరం కదిరి ఏరియా సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్ ఎంఆర్ వ్యాక్సిన్‌ను చిన్నారులకు వేశారు. ఆర్డీఓ చిన్నారులకు బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది రవి, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

కదిరిటౌన్ (గాండ్లపెంట)లో... 9 నెలల నుంచి 15 సం వత్సరాలలోపు పిల్లలు ఎంఆర్ వ్యాక్సిన్ తప్పక వేయిం చుకోవాలని డాక్టర్ మాలతి, టీడీపీ నాయకుడు దామోదర్‌రెడ్డి పేర్కొన్నారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు తదితరులు పాల్గొన్నారు.

నల్లచెరువులో.. మండల కేంద్రంలోని జడ్పీహెచ్ పాఠశాలలో ఎంపీడీఓ మక్బుల్‌బాషా, ఎంఈఓ తిరుపాల్‌నాయక్, డాక్టర్ గణేనాయక్ మంగళవారం చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్ వేసి ప్రారంభించారు. పీహెచ్ఓ శ్రీనివాసయ్య, జానకమ్మ, సూపర్‌వైజర్ సుధాకర్, శారదమ్మ, ఏఎన్ఎం తదితరులు పాల్గొన్నారు.

తనకల్లులో.. మండల పరిధిలోని కస్తూర్బా గురుకుల పాఠశాలలో మంగళవారం ఎంపీడీఓ రమేష్ బాబు, ఎంఈఓ ఖాసీంఖాన్, డాక్టర్ వెంకటరమణనాయక్ మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్‌ను చిన్నారులకు వేసి ప్రారంభించారు. కస్తూర్బా పాఠశాల ప్రత్యేకాధికారి శ్రీలక్ష్మి, సూపర్‌వైజర్ ఇర్ఫాన్‌బాషా, ఎంపీహెచ్ఈఓ రమణ, ఏఎన్ఎం విజయమ్మ, ఆరోగ్య కార్యకర్తలు జయరాజారావు తదితరులు పాల్గొన్నారు.

నంబులపూలకుంట : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ దండేరవి ఎంఆర్ వ్యాక్సిన్ వేసే కార్యక్రమం ప్రాం భించా రు. కార్యక్రమంలో వైద్యాధికారి ప్రత్యూష, విస్తరణ అధికారులు దేవదానం, లక్ష్మేనాయక్, ఆరోగ్య కార్యకర్తలు రమేష్‌కుమార్‌రెడ్డి, మంజుల తదితరులు పాల్గొన్నారు.

కదిరిరూరల్ : మండలంలోని కాళసముద్రం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఎంఆర్ టీకాలు వేశారు. పట్నం వైద్యాధికారి డాక్టర్ క్రిష్ణయ్య, ప్రిన్సిపాల్ కృపాకరన్ బోధన, బోధనేతర సిబ్బంది పాల్గొన్నారు.

తలుపుల : మండలంలోని బత్రేపల్లి ప్రాథమిక పాఠశాలలో మంగళవారం ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మెన్ బీ వీరభార్గవరెడ్డి విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను లాంచనంగా ప్రారంభించారు. బత్రేపల్లి సర్పంచు రత్నమయ్య, ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ లక్ష్మీరామ్, ఎంఈఓ వెంకటరాముడు, ఎంపీహెచ్ఈఓ జోసఫ్, వీరనారాయణ తదితరులు పాల్గొన్నారు.


తనకల్లులోని కస్తూర్బా పాఠశాలలో...


నంబులపూలకుంటలో...


తలుపులలో...

గిరిజన సమస్యలపై ముఖ్యమంత్రికి వినతి


ముఖ్యమంత్రికి వినతి పత్రం ఇస్తున్న గిరిజన నాయకులు

తనకల్లు : గిరిజన సమస్యలు పరిష్కరించాలంటూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలసి వినతి పత్రం సమర్పించినట్లు తనకల్లు మండలానికి చెందిన గిరిజన నాయకుడు సుధాకర్‌నాయక్ తెలిపారు. గిరిజనుల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తున్నా.. ఆచరణలో అవి అమలు కావడం లేదన్నారు. గత ఎన్నికల్లో ప్రభుత్వం గిరిజనులకు ఇచ్చిన ఎన్నికల హామీలను అమలు చేయాలని వినతి పత్రంలో విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. సమస్యల పరిష్కారానికి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో గిరిజన ప్రజా సమాఖ్య జాతీయ నాయకుడు శంకర్ నాయక్, సుధాకర్‌నాయక్, నారాయణనా యక్, పలువురు గిరిజన నాయకులు పాల్గొన్నారు.

త్వరలో ఉపాధి బిల్లుల జమ

నల్లచెరువు : ఉపాధి కూలీల బిల్లులను త్వరలోనే వారి బ్యాంక్ ఖాతాల్లో జమచేస్తామని ఏపీఓ మరియమ్మ పేర్కొన్నారు. మంగళవారం పంతులచెరువు గ్రామంలో ఉపాధి కూలీల సమస్యల పై సర్పంచు పార్వతమ్మ అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.

'మా సంతకాలు ఫోర్జరీ చేశారు'

కదిరిరూరల్ : మండలంలోని కే బ్రాహ్మణపల్లికి మంజూరైన పక్కా గృహాల కేటాయింపులో తమను కనీసం సంప్రదించకుండా, మా సంతకాలు ఫోర్జరీ చేసి లబ్ధిదారుల జాబితాను తయారు చేశారని కదిరి మండలం దిన్నెమీద పల్లికి చెందిన జన్మభూమి కమిటీ సభ్యుడు టీ చెన్నప్పనాయుడు ఆరోపించారు. దీని వల్ల అనర్హులకు ఇళ్లు దక్కాయని, తాను ఇదే విషయాన్ని కలెక్టర్, ఏపీ హౌసింగ్ కార్పొరేషన్ ఛైర్మన్, గృహనిర్మాణశాఖా మంత్రికి ఫ్యాక్స్ ద్వారా ఫిర్యాదు చేశానన్నారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎంపీపీ

తనకల్లు : మండలంలో నూతనంగా మంజూరైన పింఛన్లను ఎంపీపీ భూక్యాలక్ష్మి మంగళవారం మండలంలోని పెద్దపల్లిలో పంపిణీ చేశారు. మండలానికి నూతనంగా 260 పింఛన్లు మంజూరైనట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వృద్ధులను, వితంతువులను, వికలాంగులను ఆదుకోవడానికి ఎంతో కృషి చేస్తోందని తెలిపారు. ప్రతి ఒక్కరు ముఖ్యమంత్రి చంద్రబాబును గుర్తించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యుఎస్‌కు చెందిన రమణారెడ్డి, తెలుగుదేశం పార్టీ నాయకులు హరినాయక్, చంద్రశేఖర్‌రెడ్డి, బ్రహ్మానందరెడ్డి, నాగమల్లు, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేటి నుంచి తల్లిపాల వారోత్సవాలు

కంబదూరు: కంబదూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని కంబదూరు, కుందుర్పి, శెట్టూరు, బ్రహ్మసముద్రం మండలాల్లో అంగన్‌వాడీ కేంద్రాల్లో బుధవారం నుంచి 7వ తేదీ వరకు తల్లిపాల వారోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఇన్‌చార్జ్ సీడీపీఓ హేమ మంగళవారం ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. తల్లిపాల ప్రాముఖ్యతను చాటిచెబుతూ వారం రోజుల పాటు ర్యాలీలు, సమావేశాలు పెద్దఎత్తున నిర్వహిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు ఈ వారోత్సవాల్లో భాగస్వామ్యులై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు వారోత్సవాలను జయప్రదం చేయాలన్నారు.

ముగిసేదెప్పుడు... అందేదెన్నడు..!

లబ్ధిదారుల దరి చేరని సబ్సిడీ రుణాలు - బ్యాంకుల చుట్టూ తప్పని ప్రదక్షిణలు


ఎంపీడీఓ కార్యాలయం

కళ్యాణదుర్గం టౌన్: ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి కోసం స్వయం ఉపాధి కల్పనకు అనేక సంక్షేమ పథకాలకు శ్రీకారం చుట్టింది. అయితే అధికారులు, బ్యాంకర్ల నిర్లక్ష్యం కారణంగా ఆశయం ఘనం.... ఆచరణలో వైఫల్యం అన్న చందంగా మారుతోంది. ఏడాది పాటు ఎదురుచూసి అర్హతలతో పాటు అదృష్టాన్ని పరీక్షించాలనుకున్న బడుగులకు బ్యాంకు నుండి రుణం చేతికి అందడం గగనంగా మారుతోంది. ప్రభుత్వం కరుణించినా బ్యాంకర్లు కనికరించకపోవడంతో లబ్ధిదారులకు ఎదురుచూపులతో పాటు నిరాశ తప్పడం లేదు. ఏప్రిల్, మే నెలల్లో ఇంటర్వ్యూలు ముగిసినా బ్యాంకర్ల అంగీకారంతో ఫైలు ముందుకు కదిలినా లబ్ధిదారుల చేతికి అందడంలో మాత్రం ఆలస్యమవుతోంది. పంట రుణాల రెన్యువల్ సీజన్ ముగిసిన వెంటనే సబ్సీడీ యూనిట్లకు రుణాలు మంజూరుచేస్తామని తెలిపిన బ్యాంకర్లు రెన్యువల్ సీజన్లు ముగిసిపోతుండడంతో కొత్త పల్లకిని అందుకుంటున్నారు. ఇన్‌పుట్ సబ్సీడీ పంపిణీతో బ్యాంకులు రద్దీగా ఉన్నాయని, ఇన్‌పుట్ సబ్సీడీ పంపిణీ ముగిసిన అనంతరం మంజూరుచేస్తామని పేర్కొంటున్నారు. దీంతో నెలల తరబడి ఎదురుచూసిన లబ్ధిదారులకు మాత్రం నిరాశతో పాటు నిరీక్షణ తప్పడం లేదు. మొదటి విడత ఇన్‌పుట్ సబ్సీడీనే ఇప్పటివరకు పంపిణీ కాకపోవడం, వ్యవసాయ అధికారులు మాత్రం రెండు, మూడు జాబితాలతో అర్హులైన రైతులకు మంజూరుచేస్తామని పేర్కొంటుండడంతో అది ముగిసేదెప్పుడు... తమకు సబ్సిడీ రుణం అందేదెన్నడంటూ లబ్ధిదారులు వాపోతున్నారు.

కళ్యాణదుర్గం మండలంలో 2016-17 సంవత్సరానికి ఎస్సీ కార్పొరేషన్ కింద 37యూనిట్లు, ఎస్టీ కార్పోరేషన్ కింద 5, కాపు కార్పోరేషన్ కింద 33, బీసీ కార్పోరేషన్ కింద 65, బీసీ ఫెడరేషన్ కింద 220, మైనార్టీ కింద 10యూనిట్లు మంజూరుచేశారు. అయితే ఇంటర్వ్యూలు ముగిసిపోవడం, జన్మభూమి కమిటీల ఆమోదం పొందడం జరిగిపోయినా బ్యాంకర్లు కరుణించకపోవడంతో స్వయం ఉపాధి దూరంగా జరుగుతోంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బ్యాంకు అధికారులు రుణాలు మంజూరుచేసేలా చర్యలు చేపట్టాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

రుణాల మంజూరుకు చర్యలు చేపడుతాం



2016-17 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వివిధ కార్పొరేషన్ల కింద మంజూరైన రాయితీ రుణాలను బ్యాంకర్లతో చర్చించి వెంటనే లబ్ధిదారులకు అందజేయడానికి కృషిచేస్తాం. ఇప్పటికే బ్యాంకర్లతో పలుమార్లు చర్చించాం. ఆగస్టు నెలాఖరు లోపు రణాలను మంజూరుచేసి స్వయం ఉపాధి అవకాశాలను మెరుగుపరుస్తాం.


- నరసింహారెడ్డి, ఎంపీడీఓ

లోకల్ గైడ్ localguide

ఎమ్మెల్యే డైరీ

కళ్యాణదుర్గం టౌన్: శాసనసభ్యులు, ఉన్నం హనుమంతరాయ చౌదరి బుధవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు.

కళ్యాణదుర్గం మార్కెట్‌లో కూరగాయల ధరలు



టమోట 50, పచ్చిమిర్చి 50, వంకాయలు 60, లావుమిర్చి 60, ఎర్రగడ్డలు 20, ఆలుగడ్డలు 20, బెండ 40, బీరకాయలు 30, బీన్స్ 80, కాకర 40, చౌడే కాయలు 30, క్యాబేజి 30, బీట్‌రూట్ 40, క్యారెట్ 80

కళ్యాణదుర్గంలో మాంసం ధరలు

మటన్ : 340, చికెన్ : 180, నాటుకోడి : 260
చేపలు : 120, కోడి గుడ్లు(డజన్) : 48

కళ్యాణదుర్గం సినిమాలు

సౌభాగ్య : ఫిదా, వెంకటేశ్వర : వాసుకి
నూర్‌ముబారక్ : గౌతమ్‌నంద

మట్కా నిర్మూలనే లక్ష్యం

ప్రతిజ్ఞ చేయించిన పోలీసులు

కళ్యాణదుర్గం టౌన్: మట్కా మహమ్మారిని సమూలంగా నిర్మూలించాలన్నదే పోలీస్ శాఖ లక్ష్యమని పట్టణ ఎస్‌ఐ శంకర్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం పట్టణ పోలీస్ స్టేషన్‌లో మట్కా బీటర్లతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా 'మట్కా బీటర్లు మట్కా జోలికి వెళ్లం... పద్దతి మార్చుకుని గౌరవంగా బతుకుతాం.. తప్పు చేయం.. చేస్తే తప్పక శిక్షించండి' అంటూ ప్రతిజ్ఞ చేశారు. అనంతరం ఎస్‌ఐ మట్కా పేరు పట్టణంలో వినిపించకూడదని, మీకు తెలియకుండా ఎవరైనా నిర్వహిస్తుంటే వారి సమాచారాన్ని తమకు చేరవేయాలని, ఎంతటి వ్యక్తులైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. అనంతరం వారితో లిఖిత పూర్వక వాగ్మూలాలు తీసుకుని వదిలిపెట్టారు.

ఉపాధి పనులను వేగవంతం చేయండి : ఎంపీడీఓ

కంబదూరు: ఉపాధి హామీ పనులను వేగవంతం చేసేందుకు ఆయాగ్రామాల టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు కృషిచేయాలని ఎంపీడీఓ శివారెడ్డి తెలిపారు. మంగళవారం మండల పరిధిలోని కురాకులపల్లి, చెన్నంపల్లి, అయ్యంపల్లిలో జరుగుతున్న ఉపాధిహామీ పనులతో పాటు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణాలను పరిశీలించారు. ప్రతి ఇంటికి వ్యక్తిగత మరుగుదొడ్లు నిర్మించుకోవాలని, బిల్లులు కూడా సత్వరమే చెల్లించేందుకు కృషిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ హనుమంతరాయుడు, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు : ఆర్డీఓ


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీఓ రామారావు

కుందుర్పి: మండలంలోని ప్రజలకు రెవెన్యూ శాఖ అధికారులు ఇబ్బందులు కలుగజేస్తే కఠిన చర్యలు తప్పవని ఆర్డీఓ కేఎస్ రామారావు పేర్కొన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయాన్ని ఆర్డీఓ మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించారు. ఆర్డీఓ మాట్లాడుతూ రెవెన్యూ శాఖకు సంబంధించి ప్రజలు చిన్నపాటి సమస్యను తీసుకువచ్చినా ఆలస్యం చేయకుండా పరిష్కరించాలని తహసీల్దార్ రమేష్‌కు సూచించారు. వీఆర్ఓలను తన ఆధీనంలో ఉంచుకుని ఎప్పటికప్పుడు పనులు చేయించుకోవాలన్నారు. తహసీల్దార్ కార్యాలయానికి బదిలీపై వచ్చిన వీఆర్ఓలకు ఎందుకు పని కల్పించడం లేదని వివరాలను అడిగి తెలుసుకున్నారు. వీఆర్ఓలు లేని రెవెన్యూ గ్రామాలకు వారిని కేటాయించాలని సూచించారు. ప్రతి వీఆర్ఓ గ్రామాలకు వెళ్లి భూసమస్యలు, రస్తా, పట్టాదారు పాసుపుస్తకం తదితర సమస్యలు ఏవైనా ఉంటే వాటిని పరిశీలించి పరిష్కరించాలని సూచించారు. డీలర్లు వినియోగదారులకు నిత్యావసర సరుకులను సకాలంలో అందించాలని, అక్రమాలకు పాల్పడితే అలాంటి వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. వీఆర్ఓలు ప్రతి చౌకధాన్యపు డిపోను తనిఖీ చేయాలన్నారు.

అంగన్‌వాడీ కేంద్రంలో సరుకుల పంపిణీ


సరుకులను అందజేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

బ్రహ్మసముద్రం: మండలంలోని బుడిమేపల్లి అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం పౌష్టికాహార సరుకుల పంపిణీ చేపట్టారు. కిషోర బాలికలు, గర్భవతులు, చిన్నపిల్లలకు బియ్యం, వంటనూనె, కందిపప్పు, తదితర వస్తువులను అంగన్‌వాడీ కార్యకర్త సబీహా చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా గర్భవతులు, కిషోర బాలికలకు పౌష్టికాహారం అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టిందని, అందులో భాగంగానే ప్రతినెల సరుకులను అందజేయడం జరుగుతుందన్నారు. శరీరానికి కావాల్సిన పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల ఆరోగ్యంగా ఉంటారన్నారు.

అక్రమ భూ రిజిస్ట్రేషన్లు ఆపండి

అధికారులకు ఆర్యవైశ్యుల వినతి


వినతిపత్రం ఇస్తున్న ఆర్యవైశ్య సంఘం నాయకులు

కళ్యాణదుర్గం టౌన్: పట్టణంలో అక్రమ భూ రిజిస్ట్రేషన్లను నిలుపుదల చేయాలంటూ ఆర్యవైశ్య నాయకులు ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరికి, ఆర్డీఓ కేఎస్ రామారావుకు, సబ్ రిజిస్ట్రార్ రాధారమణకు మంగళవారం వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణ నడిబొడ్డున ఉన్న భూములకు తామే వారసులమంటూ కొందరు పుట్టుకువచ్చి అక్రమ రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారని, వాటిని అరికట్టాలని విన్నవించారు. సోమవారం పట్టణ నడిబొడ్డున ఉన్న 375సర్వేనెంబర్‌లో ఓ దేవాలయ ప్రాంగణంలోని భూమికి బెళుగుప్ప మండలానికి చెందిన మల్లెవేముల క్రిష్ణయ్య వారసులమంటూ విక్రయానికి తెరలేపారని, వీరికి ఓ డాక్యుమెంటరీ రైటర్ సహకరిస్తూ భూవివాదాలకు కారకులుగా మారుతున్నారని ఫిర్యాదు చేశారు. 6సెంట్ల భూమిని వివిధ పేర్లతో రిజిస్టర్ చేయించడానికి సోమవారం ప్రయత్నించగా, గమనించిన ఆర్యవైశ్య సంఘం నాయకులు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయానికి వెళ్లి అడ్డుకుని ఆధారాలు చూపాలని నిలదీశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు రఘునందన, జయం పురుషోత్తం, జయం విశ్వనాథ్, పాండురంగయ్య, గోపారం గోవిందరాజులు, బీకే హెచ్ రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం గాడిదల ఊరేగింపు...


గాడిదను ఊరేగిస్తున్న గ్రామస్తులు

శెట్టూరు: వర్షం కోసం రైతులు పడరాని పాట్లు పడుతున్నారు. గ్రామాల్లో బొడ్రాయికి జలాభిషేకం, శివాలయాల్లో ప్రత్యేక పూజలు, గాడిదల ఊరేగింపు, తదితర కార్యక్రమాలు చేపడుతున్నారు. అందులో భాగంగా మంగళవారం మండల పరిధిలోని చిన్నంపల్లిలో రైతులు గాడిదలను ప్రత్యేకంగా అలంకరించి డప్పులు వాయిస్తూ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. ఇలా ఊరేగింపు నిర్వహిస్తే వర్షం వస్తుందన్న నమ్మకంతో గ్రామంలో గాడిదలను ఊరేగించినట్లు గ్రామస్తులు తెలిపారు.

రెండు గ్రామాల్లో గ్రామసభలు

శెట్టూరు: మండల పరిధిలోని కైరేవు, చెర్లోపల్లి గ్రామాల్లో ఉపాధి హామీ ఏపీఓ సుధాకర్‌బాబు, ఈసీ అంజన్‌కుమార్, టెక్నికల్ అసిస్టెంట్‌లు పండరీష్, రత్నమ్మలు మంగళవారం గ్రామసభను నిర్వహించారు. ఈ గ్రామసభలో ఇప్పటి వరకు బ్యాంకు ఖాతాలకు ఆధార్ అనుసంధానం చేయని ఉపాధి కూలీల బ్యాంకు ఖాతాలకు ఆధార్‌ను అనుసంధానం చేస్తామన్నారు. కూలీలు ఈ గ్రామసభలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

శెట్టూరులో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం



అవగాహన కల్పిస్తున్న ఎంపీఈఓలు

శెట్టూరు: మండల కేంద్రానికి చెందిన గొల్ల వీరదాసప్ప అనే రైతు పొలంలో వ్యవసాయ క్షేత్ర సిబ్బంది ఎంపీఈఓలు గంగరాజు, సాయిభార్గవ్,భాస్కర్, కృష్ణ నాయక్‌లు వేరుశెనగ సాగుపై మంగళవారం రైతులకు అవగాహన కల్పించారు.

చంద్రన్న బీమా పంపిణీ

కళ్యాణదుర్గం రూరల్: చంద్రన్న బీమా పథకం కింద పంపిణీచేస్తున్న ఆర్థికసాయాన్ని సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బిక్కి రామలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం పురపాలక సంఘ పరిధిలోని మారెంపల్లి, సిద్దప్పవంకలో అనారోగ్యంతో మృతిచెందిన ఎర్రిస్వామి, వరలక్ష్మమ్మల కుటుంబాలకు చంద్రన్న బీమా పథకం కింద తక్షణసాయంగా ఒక్కో కుటుంబానికి రూ. 5వేలు పంపిణీచేశారు. అతితక్కువ ప్రీమియంతో ఎక్కువ బీమా మొత్తాన్ని పొందేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన చంద్రన్న బీమా పథకంలో కార్మికులు భాగస్వాములు కావాలన్నారు. ఈ కార్యక్రమంలో కోఆప్షన్ మెంబర్ మురళి, డీలర్లు నాగరాజు, లక్ష్మీనారాయణ, వన్నూరుస్వామి, బీమామిత్రలు సంధ్య, కళావతి, తదితరులు పాల్గొన్నారు.

మల్లాపురంలో ప్రబలిన విషజ్వరాలు



జ్వరంతో బాధపడుతున్న విద్యార్థి మానస

రాయదుర్గం రూరల్: మండలంలోని మల్లాపురంలో చిన్నారులకు వారం రోజుల నుంచి విషజ్వరాలు ప్రబలుతున్నట్లు గ్రామస్థులు వాపోతున్నారు. గ్రామంలోని కిషోర్, మానస, ఈశ్వర్ తదితర చిన్నారులు విషజ్వరాలతో బాధపడుతున్నట్లు తెలిపారు. అంజయ్య కుమారుడు కిషోర్ (2)కు నాలుగు రోజుల క్రితం జ్వరం రావడంతో రాయదుర్గంలో చికిత్స చేయించినప్పటికీ న యం కాకపోవడంతో బళ్లారికి తీసుకెళ్లినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. సిద్దప్ప కుమారుడు యశ్వంత్ కుమార్ (8)కు డెంగ్యూ లక్షణాలు ఉన్నట్లు వైద్యులు గుర్తించడంతో వారం రోజుల నుంచి బళ్లారిలోని ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సలు పొందుతున్నట్లు తెలిపారు.

విద్యార్థులు నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి

రాయదుర్గం రూరల్: ప్రతి విద్యార్థి వృత్తి విద్యా నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ పీ కళావతి పేర్కొన్నారు. మంగళవారం కళాశాలలో సమావేశం నిర్వహించారు. కళాశాలలో జేకేసీ టీఐఎన్ఎస్ క్లాసులు ప్రారంభించారు. స్వచ్ఛ ప ఖ్వాడా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ విషయం పై ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో సెమినార్ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటస్వామి, అధ్యాపకులు గురుమూర్తి, గోవింద, పీడీ నరసింహాచారి, జేకేసీ శిక్షకుడు అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

అనాథ, వీధి బాలల సంక్షేమానికి సమష్టి కృషి

జిల్లా ఎస్పీ జీవీజీ అశోక్ కుమార్

ఆంధ్రజ్యోతి, అనంతపురం: అనాథ, వీధి బాలల సంక్షేమం కోసం సమష్టిగా కృషి చేద్దామని ప్రభుత్వ విభాగాలు, స్వచ్ఛంద సంస్థలు బాలల పరిరక్షణ కమిటీలకు ఎస్పీ జీవీజీ అశోక్‌కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఆ వర్గాలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. పోలీస్ శాఖ నేతృత్వంలో బాలల సంక్షేమ విభాగం, కార్మిక శాఖ, బాలల సంక్షేమ కమిటీ, చైల్డ్‌లైన్, హ్యాండ్స్ రెడ్స్, బర్డ్స్ తదితర స్వచ్ఛంద సంస్థలతో పాటు ఐసీడీఎస్ అధికారులు సంయుక్తంగా జిల్లాలో ముస్కాన్ ఆపరేషన్ ద్వారా 97మంది చిన్నారులకు విముక్తి కల్పించడం ఆనందంగా ఉందన్నారు. ఇందులో 57 మంది బాలురు, 40 మంది బాలికలు ఉన్నారన్నారు. కొందరిని వారి తల్లిదండ్రులు, బంధువులకు అప్పజెప్పామన్నారు. మరోసారి వారు వీధుల్లోకి రాకుండా పెద్దలకు కౌన్సిలింగ్ ఇచ్చామన్నారు. మరికొందరిని హాస్టళ్లు, హోమ్స్‌కు పంపామన్నారు. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన ముగ్గురు చిన్నారులను ఆయా సంక్షేమ విభాగాలకు పంపించామన్నారు. జిల్లాలో ప్రతి పోలీస్‌స్టేషన్‌లో బాలల రక్షణ విభాగాన్ని బలోపేతం చేస్తామన్నారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ మాల్యాద్రి, డీసీఆర్‌బీ సీఐ ప్రసాద్‌రావు, బాలల పరిరక్షణ విభాగం అధికారి హసీన్‌బాషా, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ రంగరాజు, బాలల సంక్షేమ కమిటీ ఇన్‌చార్జ్ చైర్మన్ విజయశ్రీ, బాలల పరిరక్షణ అధికారి సుబ్రహ్మణ్యం, చైల్డ్‌లైన్ జిల్లా కోఆర్డినేటర్ కృష్ణమాచారితో పాటు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కొండప్ప, భానుజా, కుళ్లాయమ్మ, బాలాజి, శ్రీనివాస్ నాయుడు పాల్గొన్నారు.

9న ప్రపంచ గిరిజన ఆదివాసీ సభ : జీవీఎస్

ఎస్కేయూ: గిరిజనులకు అన్ని రంగాలలో సమాన ప్రాతినిధ్యం కల్పించాలని గిరిజన విద్యార్థి సమాఖ్య ఆధ్వర్యంలో ఈనెల 9న అనంతపురం లిటిల్ ఫ్లవర్ ఫంక్షన్ హాల్ నందు ప్రపంచ గిరిజన ఆదివాసీ సభను నిర్వహిస్తున్నట్లు ఎస్కేయూ అధ్యక్షుడు హనుమంతు నాయక్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఎస్కేయూ వైస్ చాన్సలర్ చాంబర్‌లో వాల్‌పోస్టర్లను వీసీ ఆచార్య రాజగోపాల్, రిజిస్ట్రార్ సుధాకర్‌బాబు విడుదల చేశారు.

ఒకే టీకాతో రెండు వ్యాధుల నివారణ

ఎంఆర్ వ్యాక్సిన్‌ను చిన్నారులకు వేయించిన ఎమ్మెల్యే ఉన్నం - తప్పనిసరిగా వేయించాలని పిలుపు





కళ్యాణదుర్గంలో ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేయిస్తున్న ఎమ్మెల్యే ఉన్నం - కంబదూరు, శెట్టూరులో టీకాలు వేస్తున్న వైద్యాధికారులు

కళ్యాణదుర్గం టౌన్: మీజిల్స్ - రూబెల్లా వ్యాక్సిన్ వేస్తే పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవిస్తారని ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక సౌత్ ప్రభుత్వ పాఠశాల జ్ఞానభారతి విద్యాసంస్థల్లో మీజిల్స్ - రూబెల్లా వ్యాక్సిన్‌ను విద్యార్థులకు వేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఒక్క టీకాతో రెండు వ్యాధులను తరిమికొట్టాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని, 2020నాటికి తట్టు, పొంగు అన్న వ్యాధుల పేర్లు వినిపించకూడదన్నదే ప్రభుత్వ నినాదమన్నారు. తొమ్మిది నెలల నుంచి 15సంవత్సరాల పిల్లలందరికి ఈ వ్యాక్సిన్‌ను వేయించాలన్నారు. పల్స్‌పోలియో చుక్కల తరహాలో మీజిల్స్ రూబెల్లా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ప్రభుత్వం గర్భిణీ స్త్రీ నుండి శిశువులతో పాటు చిన్నారుల సంరక్షణకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని, వాటిని సద్వినియోగం చేసుకుని తల్లిబిడ్డలు సంపూర్ణ ఆరోగ్యంతో జీవించాలన్నారు. అనంతరం వ్యాక్సిన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ బిక్కి రామలక్ష్మి, వైద్యాధికారి కృష్ణవేణి, ఎంఈఓ విజయకుమారి, జ్ఞానభారతి విద్యాసంస్థల అధినేత రమేష్‌బాబు, నాయకులు బీకే గోవిందప్ప, పాలవెంకటాపురం శ్రీరాములు, బసవరాజు, విద్య, వైద్య, ఆరోగ్య శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

శెట్టూరు: మండల కేంద్రంలో మంగళవారం ఎనిమిది పాఠశాలల్లో 1510మంది విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేసినట్లు వైద్యాధికారిణి ముబిసిరా బేగం తెలిపారు. ముందుగా జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ గురుప్రసాద్, సర్పంచ్ రమేష్‌లు వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఉన్నత పాఠశాల, కస్తూర్బా, ఆదర్శ, ప్రాథమిక, ప్రైవేట్ పాఠశాలల్లోని 1640మంది విద్యార్థులకు గాను 1510మందికి వ్యాక్సిన్‌ను వేసినట్లు వైద్యాధికారిణి తెలిపారు. ఈ వ్యాక్సిన్ కార్యక్రమాన్ని ప్రత్యేక అధికారి గంగారెడ్డి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వైద్యసిబ్బంది, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కంబదూరు: ఒకేటీకాతో తట్టు, రూబెల్లా వ్యాధులను నివారించేందుకు ప్రతిఒక్కరు నడుం బిగించాలని ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ సురేంద్ర తెలిపారు. మంగళవారం స్థానిక ఉన్నత పాఠశాలలో వైద్యాధికారి కళ్యాణ్‌కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్ టీకాలను వేశారు. మండలవ్యాప్తంగా 10,500మంది విద్యార్థులను గుర్తించామన్నారు. ప్రభుత్వ, ప్రైవేట్, అంగన్‌వాడీ విద్యార్థులందరూ సెప్టెంబర్ 8లోగా ఈ టీకాలను తప్పనిసరిగా వేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రఫీక్ అహమ్మద్, ఎంపీహెచ్ఈఓ కుమార వెంకటేశ్వర్లు, పీహెచ్ఎన్ రాజేంద్రమ్మ, సూపర్‌వైజర్లు సత్యనారాయణ, మహమ్మద్‌రఫీ, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

కుందుర్పి: మండల కేంద్రంలోని 1799మంది విద్యార్థులకు మీజిల్స్ రూబెల్లా వ్యాక్సిన్ వేయించినట్లు వైద్యాధికారిణి ప్రవీణ తెలిపారు. జడ్పీటీసీ మల్లికార్జున, వైస్ ఎంపీపీ రవి చేతులమీదుగా వ్యాక్సిన్‌ను ప్రారంభించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలతో పాటు కస్తూర్బా పాఠశాల, వాణి విద్యాలయం, రాధాస్వామి పాఠశాలలోని 1938మంది విద్యార్థులకు 1799మందికి వ్యాక్సిన్ వేయించామన్నారు.

ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట : ఎమ్మెల్యే

బ్రహ్మసముద్రం: ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే ఉన్నం హనుమంతరాయ చౌదరి పేర్కొన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఉన్నంతోపాటు ఎంపీపీ మంజుల, జడ్పీటీసీ గంగమ్మ, తహసీల్దార్ వెంకటేశం, వైద్యాధికారిణి నాగస్వరూప, ఎంపీడీఓ వెంకటేశ్వరరావులు హాజరయ్యారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎంఆర్ వ్యాక్సిన్ వేయడం దీర్ఘకాలిక వ్యాధుల నుండి చిన్నారులను రక్షించుకోవచ్చన్నారు. అనంతరం వైద్యాధికారిణి ఎంఆర్ వ్యాక్సిన్‌పై అవగాహన కల్పించారు. ఎమ్మెల్యే చేతులమీదుగా వ్యాక్సిన్‌ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ రెహమాన్, సర్పంచ్ జయలక్ష్మి, మండల కన్వీనర్ శ్రీరాములు, ఉపాధ్యాయులు, వైద్యసిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఉన్నం

పోలీసుల ఆర్థిక సహాయం



ఆర్థికసాయం అందజేస్తున్న సీఐ తదితరులు

కళ్యాణదుర్గం రూరల్: కంబదూరు పోలీస్ స్టేషన్‌లో స్వీపర్‌గా పనిచేస్తున్న మారెప్ప కుటుంబానికి అండగా నిలుస్తూ కళ్యాణదుర్గం సీఐ శివప్రసాద్ మంగళవారం స్థానిక సర్కిల్ కార్యాలయంలో రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు. సీఐ మాట్లాడుతూ మారెప్ప ఎన్నో ఏళ్లుగా తమలో ఒకడిగా స్టేషన్‌లో పనిచేస్తున్నాడని, ఆయన కూతురి వివాహం కోసం తమవంతు సాయం అందజేశామన్నారు.

విద్యార్థులకు నష్టం కలిగించొద్దు

కళ్యాణదుర్గం రూరల్: వసతి గృహాల్లో ప్రవేశానికి దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు నష్టం వాటిల్లకుండా నిబంధనల మేరకు సీట్లు కేటాయించేలా అధికారులు చొరవ చూపాలని మున్సిపల్ చైర్‌పర్సన్ బిక్కి రామలక్ష్మి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సాంఘిక సంక్షేమశాఖ వసతిగృహ సలహా సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ నరసింహారెడ్డి, ఎంఈఓ విజయకుమారి, ఏఎస్‌డబ్ల్యుఓ గురుస్వామి, హెచ్‌డబ్ల్యుఓ వై.వి లక్ష్మయ్యలు హాజరయ్యారు. ప్రభుత్వ అనుమతితో దరఖాస్తు చేసుకున్న మరికొంత మందికి సీట్లు కేటాయిస్తామన్నారు.



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్

బాగా చదివితే విద్యార్థులకు బంగారు భవిష్యత్ : ఎస్ఐ

మడకశిర రూరల్: విద్యార్థులు కష్టపడి బాగా చదివితే బంగారు భవిష్యత్ ఉంటుందని ఎస్ఐ లింగన్న తెలిపారు. మండల పరిధిలోని పాపసానిపల్లి ఉన్నత పాఠశాలలో దాతల సుబ్బారెడ్డి, రవిశంకర్‌రెడ్డిల సహకారంతో అందజేసిన నోటుపుస్తకాలను ఎస్ఐ చేతుల మీదుగా పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులు చదువులతో పాటు క్రమ శిక్షణ అలవరచుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో హెచ్ఎం గిరిజ, ఉపాధ్యాయులు హేమలత, లక్ష్మమ్మ, లక్ష్మీదేవి, రాజు, ప్రసాద్, శ్రీనివాసు, అల్లాబకాష్ విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి

గ్రామాలలో అధికమవుతున్న మంచినీటి సమస్య
పట్టించుకోని అధికారులు
ఇబ్బందులు పడుతున్న ప్రజలు

మడకశిర రూరల్: గ్రామాల్లో ఉన్న తాగునీటి బోర్లు అడుగంటి పోవడంతో తాగునీటి సమస్య అధికమయింది. మండలంలో చందకచర్ల, గౌడన హళ్లి, జమ్మానుపల్లి, ఆమిదాలగొంది, మణూరు, ఈ.అచ్చం పల్లి, రేకుంటకుంట, హెచ్ఆర్‌పాళ్యం, ఆర్. అనంతపురం, గంతలపల్లి, నల్లనా యనపల్లి తదితర గ్రామాల్లో తీవ్ర తాగునీటి ఎద్దడి నెలకొంది. అధికారులు పట్టనట్లు వ్యవహరిస్తున్నారని గ్రామస్థులు వాపోతున్నారు. ధర్నాలు, నిరసనలు చేసినా ఫలితం లేదన్నారు. స్పందించాలని వారు కోరారు.


నీటి కోసం ఇబ్బందులు పడుతున్న మహిళలు

5న అనియత విద్యాబోధకుల సమావేశం

అమరాపురం: ఈ నెల 5న జిల్లా కేంద్రంలోని ఉపాధ్యాయ భవన్‌లో ఉదయం 11 గంటలకు నిర్వహించే అనియత విద్యాబోధకుల సమావే శానికి అనియత విద్యాబోధకులు హాజరు కావాలని ఆ సంఘం నాయకులు ఈశ్వరప్ప, నారాయణస్వామిలు మంగళవారం తెలిపారు. ఈసమావేశానికి రాష్ట్ర నాయకులు వెంకన్న, రమణారెడ్డి, మహాత్ములు పాల్గొంటారన్నారు. ఈ సమావేశానికి హాజరయ్యే సూపర్‌వైజర్లు, అనియత విద్యాబోధకులు విద్యార్హత, అనుభవ ధ్రువీకరణ పత్రాలతో పాటు ఆధార్ కార్డులతో హాజరు కావాలని కోరారు.

గుణాత్మక విద్యను అందించాలి

అమరాపురం: ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల గుణాత్మకమైన విద్యను బోధించాలని ఎంఈఓ సత్యనారా యణ పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని వీరాపురం ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలిం చారు. ఎంఈఓ వెంట సీఆర్‌పీలు తిప్పే స్వామి, మంజునాథ్, ఓబుళరాయ ఉన్నారు.

తల్లిపాలతో బిడ్డకు శ్రేయస్సు

అమరాపురం: తల్లిపాలే బిడ్డకు అమృతమని, తల్లి పాలతో బిడ్డకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్యామల పేర్కొన్నారు. మంగళవారం కాచీకుంట గ్రామంలో జరిగిన తల్లిపాలవా రోత్సవాల కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ కేంద్రాలలో ఇచ్చేపౌష్టికాహారాలను గర్భవతులు, బాలింతలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యకర్తలు తిప్పమ్మ, లక్ష్మీదేవి, శంక రమ్మ, మల్లమ్మ, కల్పన తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీల వారీగా రిలే దీక్షలు

మడకశిర టౌన్: ఐదు మండలాల పరిధిలో 7 రోజుల పాటు పంచాయతీల వారీగా రిలేనిరాహారదీక్షలు చేపడుతున్నట్లు దండోరా జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.లక్ష్మీన రసప్ప తెలిపారు. 2న చందకచర్ల, గౌడన హళ్లి, 3న ఆమిదాలగొంది, ఆర్.అనంతపురం, 4న ఛత్రం, బుళ్లసముద్రం, 5న వైబీహళ్లి, హరేసముద్రం, 6న సీ.కొడిగేపల్లి, కల్లుమర్రి, 7న గోవిందాపురం, గంగళవాయిపాళ్యం, 8న మెళవాయి, గుండుమల, కదిరేపల్లి తదితర పంచాయతీ కేంద్రాలలో నిర్వహిస్తామన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

గుడిబండ : మండలంలోని కల్లురొప్పం గ్రామానికి చెందిన చౌడప్ప రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. గ్రామస్థులు అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. కల్లురొప్పం నుంచి రాళ్లపల్లి వైపు ఆటోలో వెళ్తున్న సమయంలో ఎదురుగా వస్తున్న కదిరేపల్లి సెయింట్‌ఆన్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ బస్సు అతివేగంగా వచ్చి ఢీకొనడంతో చౌడప్ప ఎడమకాలు విరిగినట్లు తెలిపారు. గాయపడిని అతనిని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో హిందూపురం ఆసుపత్రికి తరలించారు.

మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్‌తో సంపూర్ణ ఆరోగ్యం

మడకశిర టౌన్: రుబెల్లా వ్యాధిని పూర్తిగా నిర్మూలించాలన్న సంకల్పంతో రాష్ట్ర ప్రభుత్వం మీజిల్స్ రుబెల్లా టీకా కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని మున్సిపల్ చైర్‌పర్సన్ శరణ్యసుబ్బరాయుడు అన్నారు. మంగళవారం 11వ వార్డు పాఠశాలలో తట్టు రుబెల్లా టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ నరసింహరాజు, వైస్ చైర్మన్ పూలతోట పరమేష్, మాజీ చైర్మన్ ప్రకాష్, టీడీపీ పట్టణాధ్యడు మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

అమరాపురం: మండల కేంద్రంలోని స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హేమావతి ఉన్నత పాఠశాలలో మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్‌లు వేసే కార్యక్రమాన్ని ఎంఈఓ సత్యనారాయణ, డాక్టర్ నరేష్‌లు ప్రారంభించారు. 1700 మం ది పిల్లలకు వ్యాక్సిన్‌లు వేసినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ సత్యనారాయణ, సూపర్‌వైజర్ పద్మావతి, లక్ష్మీదేవి, రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

అగళి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాల, ప్రాథమిక పాఠ శాల, విజ్ఞానభారతి ఇంగ్లీష్ మీడియం స్కూల్, కేజీబీవీ, మోడల్‌స్కూల్, గుప్తకళాశాల ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో విద్యార్థులకు రుబెల్లా వ్యాక్సిన్‌లు వేసినట్లు డాక్టర్ మన్మథ కుమార్ పేర్కొన్నారు. కార్యక్రమానికి తహసీల్దార్ హనుమంతరాయప్ప, ఎంఈఓ గోపాల్, డాక్టర్ మన్మథకుమార్‌లు హాజరయ్యారు. హెల్త్ సూపర్‌వైజర్ అనుసూయమ్మ, వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, ఆయాలు పాల్గొన్నారు.


అగళిలో వ్యాక్సిన్ వేస్తున్న ఎంఈఓ, వైద్యసిబ్బంది

రొళ్ల: స్థానిక జిల్లా రిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన ఈ కార్యక్రమానికి ఆసుపత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ బీ.ఎస్. గురుమూర్తి, డాక్టర్ దివాకర్‌లు హాజరై పిల్లలకు టీకాలు వేసే కార్యక్రమం ప్రారంభించారు. ముఖ్యఅతిథులుగా జడ్పీటీసీ వీఎం పాండురంగప్ప, ఎంపీడీఓ సరస్వతీ, ఎంఈఓ శ్రీధర్, గ్రామాలలో జరిగిన కార్యక్రమాల్లో సర్పంచులు, ఎంపీ టీసీ, ఉపాధ్యాయులు పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు.

గుడిబండ : మండలంలోని 13 పంచాయతీ గ్రామాలలో మంగళవారం వైద్యశాఖ ఆధ్వర్యంలో 1256 మందికి ఎంఆర్ వ్యాక్సిన్‌లువేసినట్లు వైద్యాధికారిణి ఉష తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ ఉమాపతి, సూపర్‌వైజర్లు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు ఘన సన్మానం

మడకశిర రూరల్: మండల పరిధిలోని సిద్దగిరి, బుళ్లసముద్రం ఉన్నత పాఠశాలల్లో పనిచేస్తూ ఇతర ప్రాంతాలకు బదిలీ అయిన ఉపాధ్యాయులకు ఆ యా పాఠశాలల విద్యార్థులు, గ్రామస్థులు మంగళవారం ఘనంగా సన్మాన కార్యక్రమం చేపట్టారు. అనంతరం ఏర్పాటుచేసిన సమావేశంలో పలువురు వక్తలు మాట్లాడుతూ ఉపాధ్యాయు లు గా పనిచేసినంత కాలం గ్రామ ప్రజలు, విద్యార్థుల తల్లిదండ్రులతో మమేకమై పాఠశాల అభివృద్ధి, విద్యార్థుల విద్యాభి వృద్ధికి కృషి చేయాలన్నారు. అనంతరం బదిలీ అయిన ఉపాధ్యాయులను పూలమాలలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న విద్యార్థులు


ఆలయంలో సీసీ కెమెరా అమర్చుతున్న దృశ్యం

హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయంలో సీసీ కెమెరాల ఏర్పాటు

అమరాపురం: మండల పరిధిలోని ప్రసిద్ధిగాంచిన హేమావతి హెంజేరు సిద్దేశ్వరస్వామి ఆలయంలో చైర్మన్ ప్రకాష్, ఈఓ శ్రీనివాసులు మంగళవారం సీసీ కెమెరాలను ఏర్పాటుచేశారు. ఆలయంలో సైరన్‌తో పాటు దాదాపు పది చోట్ల సీసీ కెమెరాలు ఉంచినట్లు వారు పేర్కొన్నారు.

ప్రత్యామ్నాయ పంటలకు
ప్రణాళిక సిద్ధం
25వేల హెక్టార్లలోనే వేరుశనగ సాగు
: వ్యవసాయశాఖ ఏడీ మల్లికార్జున

మడకశిర: వర్షాభావ పరిస్థితుల కారణంగా గత యేడు కంటే ఈ యేడుసాగువిస్తీర్ణం తగ్గిందని వ్యవసాయశాఖ ఏడీమల్లికార్జున తెలిపారు. మంగళవారం ఏడీ మాట్లాడుతూ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో 54వేల హెక్టార్లకుగాను 25వేల హెక్టార్లలోనే వేరుశనగ పంట సాగైందన్నారు. మిగతా 4457 హెక్టార్లలో ఇతర పంటలు సాగుచేశారన్నారు. మొత్తం కలిపి ఈ ఖరీఫ్‌లో 28457 హెక్టార్లలో పంటలు సాగైనట్లు తెలి పారు. వేరుశనగ సాగుచేసే గడువు కూడా ముగిసిందన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలైన ఉలవలు, సజ్జలు, కొర్రలు, జొన్నలు, రాగులు, అలసంద, పెసర వంటి పంటలు సాగు చేసుకోవాలన్నారు. ప్రత్యామ్నాయ పంటలకు నియోజక వర్గంలో విత్తనాలు ఏ మేరకు అవసరమో ప్రణాళిక తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిక పంపుతామన్నారు. త్వరలో ప్రత్యామ్నాయ విత్తనాలు కూడా సబ్సిడీతో అందించనున్నట్లు తెలిపారు.

నేటి నుంచి గ్రామ సభలు

మడకశిర రూరల్: ఎన్టీఆర్ గృహ నిర్మాణాల కోసం గ్రామసభలు నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేపడుతున్నట్లు తహసీల్దార్ హరిలాల్‌నాయక్, ఎంపీడీఓ శ్రీనివాసరావు తెలిపారు. ఈ గ్రామసభలు బుధవారం 2న ఆమిదాలగొంది, ఆర్.అనంతపురం, గౌడనహళ్లి, 3న గుండుమల, కదిరేపల్లి, మెళవాయి, 4న జీవీపాళ్యం, గోవిందాపురం, వైబీహళ్లి, 5న సీ.కొడిగేపల్లి, బుల్లసముద్రం, కల్లుమర్రి, 7న మణూరు, చందకచర్ల, హరేసముద్రం, 8న ఛత్రం పంచాయతీ కేంద్రాలలో గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు గ్రామసభ నిర్వహించి లబ్దిదారులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు.

అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా ఉంచండి : సీఐ


సిబ్బందికి సూచనలిస్తున్న సీఐ శుభకుమార్

మడకశిర అర్బన్: అసాంఘిక కార్యకలాపాలపై గట్టి నిఘా ఉంచాలని సీఐ శుభకుమార్ పేర్కొన్నారు. మంగళవారం పట్టణ సమీపంలోని వైబీహళ్లి క్రాస్ వద్ద ఎస్ఐలు, పోలీసు సిబ్బందితో స్పెషల్ డ్రైవ్ కార్యక్రమం నిర్వహించారు. సీఐ మాట్లాడుతూ మట్కా,జూదం, పేకాట, క్రికెట్ బెట్టింగ్, రౌడీషీటర్లపై గట్టి నిఘా ఉంచాలన్నారు. పోలీసులు ప్రజల్లో విశ్వాసం పెంపొందేలా వ్యవహరించాలన్నారు. అమరాపురం మండలం ఆరోనపల్లి తాండాలో నాకాబంది నిర్వహించి ప్రతి ఇంటిని తనికీ చేశారు. రొళ్ల మండలంలో రోడ్డు భద్రతపై ఎస్ఐ నాగన్న వాహన దారులకు అవగాహన కల్పించారు. ఈకార్యక్రమంలో ఎస్ఐలు కేఎం లింగన్న, సిబ్బంది పాల్గొన్నారు.

వివరాలు ఎస్ఆర్‌లో నమోదుచేయాలి

రొళ్ల: ఏడాదిలోపు సర్వీసు ఉన్న ఉపాధ్యాయులు మెడికల్ లీవులపై వెళ్లేవారు సంబంధిత సివిల్ సర్జన్ డాక్టరుచేత ధ్రువీకరణ పత్రం ఫిట్‌నెస్ సర్టిఫికెట్‌ను ఎస్ఆర్ రికార్డులో నమోదు చేయాల్సి ఉంటుందని ఎంఈఓ శ్రీధర్ పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని టీడీపల్లి, గంతికల్లుగొల్లహట్టి పాఠశాలలను సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకం తనిఖీ చేశారు. అనంతరం మెడికల్ లీవులకు సంబంధించి ఉపాధ్యా యులకు నిబంధనలపై తెలియజేశారు. ఏడాది సర్వీసు ఉన్న వారు పది రోజులు మాత్రమే లీవులు ఉపయోగించుకునేందుకు అర్హులన్నారు.

నేటి నుంచి గ్రామసభలు

గోరంట్ల రూరల్ : గ్రామాల్లో 2నుంచి 15వరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ ఆజాద్ తెలిపారు. ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకానికి సంబందించి లబ్ధిదారులను ఎంపిక చేస్తారన్నారు. రోజుకు మూడు గ్రామాల వంతున తహసీల్దార్ మసూద్‌వలి ఎంపీడీఓ ఆజాద్, ఈఓఆర్డీ అంజినప్పలు విడివిడిగా గ్రామసభలు నిర్వహిస్తారు. 2న గంగంపల్లి, కమ్మ వారిపల్లి, వానవోలు, 3న గౌనివారిపల్లి, కొండాపురం, మలసముద్రం, 5న వెంకటరమణపల్లి, పులేరు, బూదిలి, 8న పాలసముద్రం, మల్లాపల్లి, నార్శింపల్లి, 9న వెంకటరమణపల్లి, రెడ్డిచెరువుపల్లి, మందలపల్లి, 10న గోరంట్లలో గ్రామసభలు నిర్వహించనున్నారు.

ప్రారంభమయ్యేదెన్నడో..!

నిరుపయోగంగా నూతన బీసీ హాస్టల్ భవనం

సోమందేపల్లి మండల కేంద్రంలో దశాబ్దాల క్రితం ఇక్కడ హాస్టల్ భవనం నిర్మాణం చేపట్టారు. భవనాన్ని పాక్షికంగా పూర్తిచేసి ఎనిమిది సంవత్సరాలపాటు వదిలివేశారు. అయితే ఇటీవల భవనం పూర్తిగా నిర్మాణమై సిద్ధంగా ఉంది. నెలలు గడిచినా ప్రారంభించడానికి అధికారులుగానీ, ప్రజాప్రతినిధులుగానీ చొరవ చూపడం లేదు. సోమందేపల్లిలో ఎలాంటి సంక్షేమ హాస్టళ్లలేవు. ఉన్న ఈ హాస్టల్‌నైనా త్వరితగతిన ప్రారంభిస్తారో లేక మరోసారి శిథిలావస్థకు వదిలేస్తారో అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **: సోమందేపల్లి**





నాగలూరులో గ్రామస్థులకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ వెంకటేశులు

ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు : సీఐ

పెనుకొండ రూరల్ : గ్రామాల్లో చిన్న చిన్న వివాదాలకు, ఘర్షణలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ వెంకటేశులు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలోని నాగలూరులో మంగళవారం పర్యటించి ఇళ్లలో సోదాలు నిర్వహించామన్నారు. రెండు బృందాలుగా పోలీసులు బయలుదేరి గతంలో రౌడీషీటరుగా ఉన్నవారి ఇళ్లలో సోదాలు నిర్వహించారు. అయితే ఇళ్లలో ఎలాంటి మారణాయుధాలు లభించలేదన్నారు. కార్యక్రమంలో ఎస్ఐలు జనార్దన్, మునీర్ అహ్మద్, ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

వాహనాలు తనిఖీచేసిన ఎంవీఐ

రొద్దం : హిందూపురం ఎంవీఐ రమణారెడ్డి మంళవారం స్థానిక పోలీస్‌స్టేషన్ వద్ద వాహనాలు తనిఖీ చేపట్టారు. ఎఫ్‌సీ కాని వాహనాలు, ఆర్‌సి పర్మిట్లు, ట్యాక్స్ చెల్లించని వాహనాలు తనిఖీచేసి కేసు నమోదుచేశారు. లైసెన్స్‌లేని డ్రైవర్లకు సైతం కేసు నమోదుచేసి కోర్టుకు హాజరు పరచనున్నట్లు ఆయన తెలిపారు. ఆరు వాహనాలపై సీజ్‌చేసి తాళాలను పోలీస్‌స్టేషన్‌లో అందజేశారు. పన్నులు చెల్లించి వాహనాన్ని తీసుకెళ్లాలన్నారు.

బీజేపీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



బైక్‌ర్యాలీ నిర్వహిస్తున్న బీజేపీ శ్రేణులు

సోమందేపల్లి : మండలంలోని రూకలపల్లిలో మంగళవారం బీజేపీ నాయకులు బైక్ ర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ జీఎం శేఖర్ ఆధ్వర్యంలో కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. అనంతరం జూలకుంటలోని అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం శేఖర్ మాట్లాడుతూ బీజేపీని మారుమూల గ్రామాల్లో తీసుకెళ్లాల్సిన బాధ్యత కార్యకర్తలపై ఉందన్నారు. ఇందుకోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. అలాగే నరేంద్రమోదీ పాలనపై ప్రజలకు తెలియజేయాలని సూచించారు. ఉప రాష్ట్రపతిగా వెంకయ్యానాయుడును ప్రతిపాదించడం తెలుగువారికి ఉన్న గౌరవమన్నారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు నాగప్ప, తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజూ కొనసాగిన రిలే దీక్షలు

పెనుకొండ : ఎస్సీ వర్గీకరనకు చట్టబద్దత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ రెండోరోజు రిలే దీక్షలు కొనసాగాయి. మంగళవారం స్థానిక ఆర్డీఓ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు పెద్దన్న, పోతులయ్య, నారాయణ, తిప్పన్న, అంజినప్ప, రవి, ఆధ్వర్యంలో దీక్షలు చేపట్టారు. వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు చట్టబద్దత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు కృష్ణ మాదిగ పిలుపు మేరకు రిలే దీక్షలు చేపడుతున్నామన్నారు.

రూ.5కోట్లతో వంతెన నిర్మాణం

గోరంట్ల రూరల్ : చిత్రావతి నదిపై గోరంట్లలో రూ.5కోట్ల వ్యయంతో కొత్త వంతెన నిర్మాణానికి సర్వం సిద్ధమవుతోంది. 6దశాబ్దాల క్రితం గోరంట్ల తొలి ఎమ్మెల్యే పూల వెంకటరమణప్ప అప్పట్లో చిత్రావతిపై వంతెన నిర్మించారు. అయితే మారుతున్న కాలానుగుణంగా పురాతనవంతెన ప్రమాదాలకు నిలయమై రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దీన్ని గమనించిన ఎంపీ నిమ్మలకిష్టప్ప, ఎమ్మెల్యే పార్థసారథులు చాలా కాలంగా కొత్తవంతెన నిర్మాణానికి కృషి చేస్తూ వచ్చారు. వంతెన నిర్మాణం ఆశగానే నిలిచిపోతుందన్న సమయంలో ఎంపీ నిమ్మల కేంద్రస్థాయిలో ముమ్మరంగా శ్రమించి గైల్ కంపెనీ ద్వారా నిర్మాణం పనులు చేపట్టడానికి అన్ని అడ్డంకులు తొలగింపజేశారు. దీంతో గైల్ కంపెనీవారు శుక్రవారం భూమిపూజ చేయ డానికి నిర్ణయించారు. దీంతో చిత్రావతి నది ఒడ్డున నేల చదునుచేస్తూ శిలా ఫలకం ఏర్పాటుకు స్థానిక టీడీపీ నాయకులు రెండ్రోజులుగా పని చేస్తున్నారు. కొత్త బస్టాండు కూడలిలో దివంగత నేత మాజీ ముఖ్యమంత్రి ఎన్టీరామారావు విగ్రహాన్ని ప్రతిష్టించే కార్యక్రమాన్ని భూమిపూజ అనంతరం నిర్వహించనున్నారు. కార్యక్రమాల్లో రాష్ట్ర మంత్రులు దేవినేని ఉమామహేశ్వర్ రావు, జవహర్, పరిటాల సునీత, కాలువ శ్రీనివాసులు, ఎంపీ నిమ్మల కిష్టప్ప, ఎమ్మెల్యే పార్థసారథి హాజరవుతారని టీడీపీ నాయకులు తెలిపారు.



కొత్త వంతెన ఏర్పాటుకు శంకుస్థాపన పనులు

తల్లిపాలు బిడ్డకు శ్రేయస్కరం

పెనుకొండ రూరల్ : తల్లిపాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ నిర్మల పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని దుద్దేబండ, అంగనవాడీ కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పుట్టిన శిశువుకు అరగంటలోపే మురుపాలు తాగించాలని సూచించారు. కార్యక్రమంలో అంగనవాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు.

పెనుకొండ ఎంపీడీఓగా శివశంకరప్ప



పెనుకొండ : పెనుకొండ ఎంపీడీఓగా శివశంకరప్ప బాధ్యతలు తీసుకున్నారు. ఇక్కడ పనిచేస్తున్న శివానందనాయక్ మూడునెలల క్రితం చిలమత్తూరుకు బదిలీకాగా ఆయన స్థానంలో కళ్యాణదుర్గం ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో పనిచేస్తున్న శివశంకరప్ప పదోన్నతిపై పెనుకొండ ఎంపీడీఓగా సోమవారం బాధ్యతలు తీసుకున్నారు. ఆయన్ను కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

ఎంఆర్ వ్యాక్సిన్‌తో పిల్లల ఆరోగ్యం పదిలం

పెనుకొండ : మీజెల్స్‌రూబెల్లా వ్యాక్సిన్ వేయడంతో పిల్లల ఆరోగ్యంగా ఉంటారని సర్పంచ్ అశ్వర్థనారాయణ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ ఛైర్మన్ వైఎన్ కుమారస్వామి పేర్కొంటున్నారు. స్థానిక బీటీఆర్ కాలనీలో ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు వ్యాక్సిన్ కార్యక్రమాన్ని చేపట్టారు. ముఖ్య అతిథులుగా హాజరైన వీరు కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడు తూ 9నెలల నుంచి 15ఏళ్లలోపున్న చిన్నారులకు తల్లిదండ్రులు తప్పక వ్యాక్సిన్ వేయించాలన్నారు. ఈ వ్యాక్సిన్ ద్వారా తట్టు, రుబెల్లా వ్యాధులు దరిచేరవన్నారు. కార్యక్రమంలో వైద్యురాలు సుకన్య, భాస్కర్, జీనత్, వార్డుమెంబర్ బీబీజాన్, హెచ్ఎం ఈశ్వరయ్య, ఉపాధ్యాయులు, ఆశా వర్కర్లు, అంగనవాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సోమందేపల్లి : మండలంలోని వివిధ గ్రామాల్లో మంగళవారం వైద్య సిబ్బంది మీజెల్స్ రూబెల్లా టీకాలు వేశారు. సోమందేపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యాధికారి ఆదిమూర్తి, చిన్నారికి టీకాలు వేయడం జరిగింది. కార్యక్రమంలో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలలో విద్యార్థులకు మంగళవారం ఎంఆర్ టీకాలు వేశారు. స్థానిక ఉన్నత పాఠశాలలో సర్పంచ్ అశ్వర్థనారాయణ ఎంఈఓ శ్రీరాములు ప్రారంభించారు. కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులకు టీకాలు వేశారు.స్థానిక మదర్‌హైస్కూల్, టీచ్ హైస్కూల్ విద్యార్థులకు టీకాలు వేశారు. మండలంలో 2297మంది విద్యార్థులకు టీకాలువేసి 99శాతం సాధించినట్లు డా.నీలిమ తెలిపారు. ఈ కార్యక్రమాల్లో అన్ని పాఠశాలలోని ఉపాధ్యాయులు పీహెచ్ఎన్ సరస్వతి, సూపర్‌వైజర్ పద్మావతి, ఎంపీహెచ్ఈఓ హరినాథ్, ఏఎన్ఎంలు ఆశవర్కర్లు పాల్గొన్నారు



పెనుకొండ, రొద్దం మండలాల్లో చిన్నారులకు రూబెల్లా టీకాలు వేస్తున్న స్థానిక నాయకులు, అధికారులు

గోరంట్ల రూరల్ : మీజెల్స్ రూబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గోరంట్లలోని బాలుర ఉన్నత పాఠశాలలో ఎంపీపీ నిమ్మల విద్యాధరణి సోమవారం ప్రారంభించారు. ఎంపీ తనయుడు నిమ్మల శిరీష్ డా.బండిరాజా, సూపర్‌వైజర్లు లక్ష్మీనారాయణ, రామ్మోహన్, రాజేశ్వరీ, హెచ్ఎం క్రిష్ణారెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు. వైద్య ఆరోగ్యసిబ్బంది మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో విద్యార్థులకు వ్యాక్సినేషన్ చేశారు.

కుంభకర్ణ ప్రాజెక్ట్ ముస్తాబు

సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటున్న వైనం

పెనుకొండ రూరల్ : శిథిలావస్థలో ఉన్న కుంభకర్ణ ప్రాజెక్ట్ సర్వాంగ సుందరంగా రూపుదిద్దుకుంటోంది. మండల పరిధిలోని పెద్దచెరువు కట్ట ఆంజనేయస్వామి ఆలయం సమీపంలో ఉన్న కుంభకర్ణ ప్రాజెక్ట్‌కు రూపురేఖలు మారుతున్నాయి. 2002లో మాజీ మంత్రి పరిటాల రవీంద్ర పర్యాటకంగా అభివృద్ధి చేయాలన్న ఉద్దేశ్యంతో కుంభకర్ణ ప్రాజెక్ట్‌ను నిర్మించడం జరిగింది. అయితే కాలనుగుణంగా ఆ ప్రాజెక్ట్ శిథిలావస్థకు చేరుకుంది. పరిటాల రవీంద్ర ఆశయాలు కొనసాగించేందుకు ఎమ్మెల్యే బీకే పార్థసారథి చొరవతో శిథిలావస్థలో ఉన్న కుంభకర్ణ ప్రాజెక్ట్ పునర్ నిర్మించేందుకు ప్రభుత్వం రూ.22లక్షలు మంజూరు చేయడంతో గుత్తేదారుడు మరమ్మతు పనులు చేపడుతున్నారు. కొత్త రంగులు వేయడంతో చూపరులను అలరించేలా ముస్తబవుతోంది.



నూతన హంగులతో పునర్నిర్మాణమవుతున్న కుంభకర్ణ ప్రాజెక్ట్

రేపటి నుంచి ఎన్టీఆర్ గృహ నిర్మాణాలకు గ్రామ సభలు

పుట్టపర్తి : ఎన్టీఆర్ గ్రామీణ గృహ నిర్మాణాల కోసం గ్రామ సభలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ సత్యనారాయణ, ఎంపీడీఓ ఇస్మాయిల్, హౌసింగ్ ఏఈ నారాయణరెడ్డిలు పేర్కొన్నారు. 3 వ తేది అవగొండపాలెం, నిడిమామిడి, వెంగలమ్మచెరువు, 4 న దిగువచెర్లోపల్లి, పెడపల్లి, చెర్లోపల్లి, వెంగలమ్మచెరువు, 5న పైపల్లి, జగరాజుపల్లి, కప్పలబండ , ఇరగరాజుపల్లి, వెంకటగారిపల్లి, 8 న రాచువారిపల్లి, కొట్లపల్లి నిర్వహిస్తారన్నారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన , ఎన్టీఆర్ గ్రామీణ గృహనిర్మాణ పథకం కింద కేంద్ర ప్రభుత్వం ఇంటికి రూ. 2 లక్షలు నిధులు మంజూరు చేస్తామన్నారు.



అవగాహన కల్పిస్తున్న అధికారులు

కూలీల సమస్యలపై గ్రామ సభ

ఓబుళదేవరచెరువు : ఉపాధి కూలీలకు సంబంధించి వాటి సమ స్యలు గుర్తించేందుకు మంగళవారం కొండకమర్ల గ్రామంలో గ్రామ సభలు ఏర్పాటు చేశారు. గ్రామ సభ సర్పంచు మారెన్న అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఇన్‌యాక్టివే షన్‌లో ఉన్న ఆధార్‌కా ర్డులు, బ్యాంక్ ఖాతా లను యాక్టివే షన్ చేయించారు. అనంతరం ఉపాధి కూలీల సమస్యలు తెలుసుకుని పరిష్కరించారు. ఎంపీ డీఓ కావలినాగరాజు, ఏపీఓ మంజుల, పీ.సీ సుబ్బారెడ్డి, సాంకేతిక సహాయకులు జహీర్ తదితరులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట రైతుల ధర్నా

ఓబుళదేవరచెరువు : పంటనష్ట పరిహారంకు సంబంధించి వివ రాలను చెప్పే నాథుడే కరువయ్యారని ప్రతి రోజూ కార్యాలయం వద్ద పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆగ్రహించిన రైతన్నలు మంగళవా రం తహసీల్దార్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. వీరికి ఏపీ రైతు సంఘం రాష్ట్ర నాయకులు రామచంద్ర, నియోజకవర్గ కార్య దర్శి పూల శ్రీనివాసులు, బీసీ జనసభ అధ్యక్షులు ఎంఎస్ షబ్బీర్‌లు మద్దతు తెలిపారు. రైతు లు ఇబ్బందులపై నాయకులు ఫోన్ ద్వారా ఎమ్మెల్యే పల్లె రఘునాథ రెడ్డికి దృష్టికి తీసుకెళ్ళారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వ్యవసాయ శాఖ అధికారులతో మాట్లాడి గ్రామాల వారీగా సమస్యలు పరిష్కరించే విధంగా చర్యలు చేపడతామని హామీనిచ్చారు. ఇన్‌పుట్ సబ్సిడి రాని రైతులు వివరాలను డిప్యూటీ తహసీల్దార్ మహబూబ్‌పీరాకు అందజేయాలని ఎమ్మెల్యే తెలిపారు.

రక్షక తడులకు సమాయత్తం కండి

పుట్టపర్తిరూరల్: స్థానిక రైతన్నలు బోరుబావులు ఉండి పంటలు ఎండుతున్న రైతన్నలు రక్షకతడుకలకు సిద్ధం కావాలని వ్యవసాయాధికారిణి సాయిలక్ష్మీపేర్కొన్నారు. నీరు ఉన్న బోరు బావుల రైతులు ఎకరానికి రూ.150 నగదును చెల్లించి 25 పైపులు, ఒక రెయిన్‌గన్ లేదా 5 స్ప్రింకర్లు పొందవచ్చన్నారు. రక్షకతడులు తరువాత తిరిగి వెనక్కి ఇవ్వాల్సి ఉంటుందన్నారు. ఇందుకు గాను ఆధార్, పట్టాదారుపుస్తకం జిరాక్స్‌లను ఇవ్వాలన్నారు.

ఎంఆర్ టీకాలతో సంపూర్ణ ఆరోగ్యం

నల్లమాడ : రెడ్డిపల్లి జడ్పీఉన్నత , ప్రాథమిక పాఠశాల, రెండు ప్రైవేటు పాఠశాలలు, ఆర్ రామాపురంలో ఎస్సీ బాలికల గురుకుల ఆశ్రమ పాఠశాలలో పిల్లలకు మంగళవారం ఎంఆర్ టీకాలు వేసినట్లు రెడ్డిపల్లి వైద్యులు బాబ్‌జాన్ తెలిపారు. తహసీల్దార్ అ బ్దుల్‌హమీద్, ఎంపీడీఓ రాబర్ట్ విల్సన్, పీహెచ్‌ఓ రామచంద్రరెడ్డి, సూపర్‌వైజర్లు రమేష్, రె డ్డెప్ప, మంజుల, సాలెమ్మ, రెడ్డిపల్లి సర్పంచు సూర్యనా రాయ ణ, ఆరోగ్య సిబ్బంది ప్రమీల, సుభాషిణి, అరుణ, మంజుల పాల్గొన్నారు.

ఓబుళదేవరచెరువులో : స్థానిక జడ్పీ ఉన్నత పాఠశాలలో జడ్పీటీసీ పిట్టా ఓబుళరెడ్డి , వైద్యాధికారి డాక్టర్ నాగార్జున రెడ్డిలు ఎల్లలకు మీజిల్స్, రుబెల్లా టీకాలను వేశారు. ఆగస్టు 1 నుంచి సెప్టెంబర్ 8 వ తేదీ వరకు వేస్తున్నట్లు తెలిపారు. ఎంఈఓ లలితమ్మ , హెడ్‌మాస్టర్ అనసూయమ్మ, మండల కోఆప్షన్ సభ్యులు నిజాం, పీహెచ్‌ఎన్ నాగలక్ష్మీ పాల్గొన్నారు.

కొత్తచెరువు: మీజిల్స్-రుబెల్లా టీకాతో పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని డాక్టర్ అజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. పిల్లలో తట్టు, రుబెల్లా వ్యాధినివారణకుఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలనిడాక్టర్ అజయ్‌కుమార్ రెడ్డి తెలిపారు.



నల్లమాడలో ఎంఆర్ టీకా వేస్తున్న వైద్యసిబ్బంది

బుక్కపట్నంలో: స్థానిక బాలికల ఉన్నతపాఠశాలలో ఎంఆర్ టీకాను బాలికలకు డాక్టర్ సునీల్ మంగళవారం వేసి ప్రారంబించారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ యశోద పాల్గొని పిల్లల ఆరోగ్యం కోసంఎంఆర్ టీకాలను వేస్తున్నట్టు పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా మొదటి రోజున 1291 విద్యార్థులకు టీకాలు వేసినట్టు డాక్టర్ తెలిపారు.ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం గోపాల్, రాధాశ్రీదేవిలుపాల్గొన్నారు.

పింఛన్ల పంపిణీ పరిశీలన

ఓబుళదేవరచెరువు : మండలంలోని కొండకమర్లలో మంగళవారం ఎన్‌టీఆర్ భరోసా ఫించన్ల పంపిణీ కార్యక్రమాన్ని ఎంపీడీఓ కావలినాగరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ నెల 3 వ తేదీ లోపు ఫించన్ పంపిణీని పూర్తి చేయాలని , నడవలేని వృద్దులు ఉం టే ఇళ్ళ వద్దకే వెళ్ళి ఫించన్లు పంపిణీ చేయాలని గ్రామ కార్యదర్శి మల్లికార్జునుకు ఆదేశించారు. ఈ పంపిణీ కార్యక్రమంలో సర్పంచు మారెన్న తదితరులు పాల్గొన్నారు.



ప్రధానోపాధ్యాయుడిని సన్మానిస్తున్న సీఆర్‌పీలు

ఉపాధ్యాయుడికి ఘన సన్మానం

ఓబుళదేవరచెరువు : మండల పరిధిలోని కొండకమర్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తూ బదిలీపై వెళ్ళిన హెడ్‌మాస్టర్ శ్రీనివాసరావుకు మంగళవారం మండల సీఆర్‌పీలు, ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. శ్రీనివాసరావు ఇన్‌చార్జ్ ఎంఈఓగా , కొండకమర్లలో హెచ్‌ఎంగా పనిచేస్తూ విద్యాభివృద్ధి కోసం తన వంతు కృషి చేశారన్నారు. ఇతనితోపాటు బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులు నర్సిరెడ్డి, రమాదేవీ, ఆదినారాయణరెడ్డి, అయూబ్‌బాష, రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాసనాయక్, మాధవి, క్రిష్ణవేణి, షఫీలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఐఎస్ కోఆర్డినేటర్ జయమ్మ, రిజ్వాన, సీఆర్‌పీలు చెన్నక్రిష్ణ, నరసింహులు, సుధాకర్‌లు పాల్గొన్నారు.

నేడు మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక

- కౌన్సిలర్‌లకు విప్‌జారీ

పుట్టపర్తి : మున్సిపల్ ఛైర్మన్ ఎన్నిక కోసం అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో ఉదయం 11 గంటలకు కౌన్సిల్ సమావేశం నిర్వహించి, నూతనంగా ఛైర్మెన్‌ను ఎన్నుకోనున్నారు. మాజీ మంత్రి , ఎమ్మెల్యే పల్లె రఘునాథరెడ్డి ఆధ్వర్యంలో మున్సిపల్ ఛైర్మెన్ ఎన్నిక నిర్వహిస్తున్నారన్నారు. 2014 ఎన్నికల తర్వాత మున్సిపల్ ఛైర్మెన్ పదవీ కాలాన్ని పీసీ గంగన్న, బెస్త చలపతిలకు సమాన కాలాన్ని పంపిణీ చేస్తూ నాడు ఒప్పందం చేసుకున్నారు. అయితే అనుకున్న సమయానికి పీసీ గంగన్న ఛైర్మెన్ పదవికి రాజీనామా చేయలేదు. అధిష్టానం ఆదేశాల మేరకు రాజీనామా చేశారు. దీంతో బెస్త చలపతిని ఛైర్మెన్‌గా నియమించడానికి అధికారులు ముహూర్తం నిర్ణయించారు. ఎన్నికలో కౌన్సిలర్‌లు అందరూ పాల్గొనాలని విప్ జారీ చేశారు. అధికార పార్టీలో తెలుగుదేశంలో 14 మంది కౌన్సిలర్లు ఉన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారధి ఆదేశాల మేరకు మున్సిపాల్టీ తాత్కాలిక ఛైర్మెన్ కడియాల రామమో హన్ , కౌన్సిలర్లకు విప్‌ను జారీ చేశారు. ఎన్నికలు ఆర్భాటంగా నిర్వహించడానికి ఛైర్మెన్ బెస్తచలపతి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. నాయకులు అందరికి ఆహ్వానం పంపడమే కాక , మాజీ మంత్రి , స్థానిక ఎమ్మెల్యే పల్లెరఘునాథరెడ్డిలకు ప్రత్యేకంగా ఆహ్వానించారు.



ప్రతి కూలీకి పని కల్పించాలి : ఏపీఓ

రాయదుర్గం రూరల్ : ఉపాధి హామీ పథకంలో భాగంగా జాబ్‌కార్డు కలిగిన ప్రతి కూలీకి పని కల్పించాలని ఏపీవో అప్పస్వామి పేర్కొన్నారు. మంగళవారం ఎంపీడీవో కార్యాలయంలో ఉపాధి సిబ్బందితో ఆయన సమావేశం నిర్వహించారు. ప్రతి వారం పని గుర్తించి కూలీలకు సరిపడా పనులు ఇవ్వాలన్నారు. పనులు కల్పించడంలో క్షేత్రసహాయకులు నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన పనులను కూలీలకు తప్పకుండా కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఈసీ మురళి, టెక్నికల్ అసిస్టెంట్లు, క్షేత్రసహాయకులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో మీజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్ ప్రారంభం



కణేకల్లులో ఎంపీపీ షేక్ ఫాతిమాబీ, రాయదుర్గంలో మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం, డీ హీరేహాళ్, బొమ్మనహాళ్‌లో టీకాలు వేస్తున్న దృశ్యం

కణేకల్లు : మండలంలో తొమ్మిది నెలల నుంచి 15 సంవత్సరాల లోపు బాలబాలికలకు మీజిల్స్ రుబెల్లా వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఎంపీపీ షేక్ ఫాతిమాబీ మంగళవారం ప్రారంభించారు. స్థానిక మోడల్ స్కూలులో వైద్యాధికారి నాగభూషణం ఆధ్వర్యంలో 222 మంది విద్యార్థులకు వ్యాక్సిన్లు వేసినట్లు తెలిపారు. తల్లిదండ్రులు అర్హులైన పిల్లలకు వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ షేక్ ఫక్రుద్దీన్, ప్రిన్సిపాల్ స్వర్ణలత, డెంటిస్ట్ శ్రీనివాసులు, ఫార్మసిస్ట్ మహేష్, ఏఎన్ఎం గౌరి, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : ముర్రపాలే బిడ్డకు మొదటి టీకా అని సూపర్‌వైజర్ పద్మావతి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని నాగిరెడ్డిపల్లిలో తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆరుగురు గర్భవతులకు సామూహిక సీమంతం చేశారు. సూపర్‌వైజర్ మాట్లాడుతూ పుట్టిన వెంటనే బిడ్డకు ముర్రపాలు తాగించాలన్నారు. ఆస్పత్రుల్లోనే కాన్పులు జరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హనుమంతప్ప, గ్రామైక్య సంఘం లీడర్, అంగన్‌వాడీ వర్కర్ తిమ్మక్క పాల్గొన్నారు.

రాయదుర్గం టౌన్ : మీజిల్స్ రుబెల్లా టీకా అర్హులైన పిల్లలందరికీ వేయించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి పేర్కొన్నారు. పట్టణంలోని జడ్పీ బాలికోన్నత పాఠశాలలో మంగళవారం టీకా కార్యక్రమాన్ని ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ గాజుల వెంకటేశులు, కౌన్సిలర్లు ముచ్చుగి నాగరాజు, బండి భారతి, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ రామాంజినేయులు, మున్సిపల్ కమిషనర్ మోతీకృష్ణ, ప్రభుత్వ వైద్యుడు సత్యనారాయణ, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

డీ హీరేహాళ్ : ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్ కార్యక్రమాన్ని డాక్టర్ రామాంజినేయులు ప్రారంభించారు. తట్టు, రుబెల్లా వ్యాధుల నివారణకు వ్యాక్సిన్‌ను పిల్లలకు అందజేయాలన్నారు.

రాయదుర్గం రూరల్ : మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్‌ను తప్పనిసరిగా వేయించాలని ఆవులదట్ల పీహెచ్‌సీ వైద్యుడు కార్తీక్ కుమార్ పిలుపునిచ్చారు. మంగళవారం జడ్పీ ఉన్నత పాఠశాలలో టీకా కార్యక్రమాన్ని నిర్వహించారు.

పీవోడీటీ డాక్టర్ సుజాత, లక్ష్మీనరసమ్మ, ఎంపీపీ భారతి, జడ్పీటీసీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆవులదట్ల, కొండాపురం గ్రామాల్లోని ఆరు పాఠశాలల్లో 819 మందికి టీకాలు అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ సోమక్క, ఎంపీటీసీ ఈశ్వరమ్మ, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ చైర్మన్ ప్రసాద్ పాల్గొన్నారు.

బొమ్మనహాళ్ : బొమ్మనహాళ్, శ్రీధరఘట్ట పీహెచ్‌సీ పరిధిలో అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రైవేటు పాఠశాలలు, ప్రభుత్వ పాఠశాలల్లో మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ గౌతమి, డాక్టర్ ఈరణ్ణ తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్లు బాబురాజు, క్రిష్ణవేణి, రమేష్, పీహెచ్ఎన్ షకీలాబేగమ్, సీహెచ్‌వోలు ప్రదీప్ కుమార్, లోకనాథ్, సర్పంచ్‌లు శ్రీమతి రామదాసు, గోవిందరెడ్డి, కన్వీనర్ బలరామిరెడ్డి, జడ్పీటీసీ వాణి జగన్నాథరెడ్డి, ఆరోగ్య కార్యకర్తలు, పాఠశాల హెచ్ఎంలు అంగన్‌వాడీ, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

లోకల్ గైడ్
localguide

ఎమ్మెల్యే డైరీ

రాయదుర్గం : శాసనసభ్యులు, గ్రామీణ గృహ నిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ రాష్ట్ర మంత్రి కాలవ శ్రీనివాసులు బుధవారం నంద్యాలలో ఉంటారు.



రాయదుర్గం : **మధు :** ఫిదా
కేబీ ప్యాలెస్ : గౌతమ్‌నందా
ఎస్వీ సినిమాక్స్ : మాయామాల్
ఉద్దేహాళ్ : తాజ్ : ఏజెంట్ భైరవ
కణేకల్లు - శ్రీ చిక్కణ్ణేశ్వర : గౌతమ్‌నందా

నిత్యావసర సరుకుల ధరలు

కిలో కందిపప్పు రూ. 70, శెనగపప్పు 60, ఉద్దిబ్యాళ్లు 110, పెసరబ్యాళ్లు 78, పప్పులు 120, చింతపండు 130, పామాయిల్ 63, రిఫైండ్ ఆయిల్ 85, కొబ్బరినూనె 110, తెల్లగడ్డలు 60, చక్కెర 44, బెల్లం 55, వట్టి మిరపకాయలు 100, గోధుమపిండి 32, ఉప్మారవ్వ 40, కొబ్బరి 110, రాగులు 40, జొన్నలు 35, గోధుమలు 35, సోనామసూరి బియ్యం 55 (పాతవి).

ఉపాధి కూలీల ఆధార్ అనుసంధానానికి చర్యలు

కణేకల్లు : మండల వ్యాప్తంగా ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల ఆధార్ అనుసంధానానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు ఏపీవో ప్రసాదరెడ్డి తెలిపారు. ఇప్పటివరకు దాదాపు 2970 మంది కూలీల ఖాతాలు బ్యాంకులతో ఆధార్ అనుసంధానం కాకపోవడంతో అవన్నీ ఇన్ యాక్టివ్‌లో ఉన్నాయన్నారు. ఇందుకుగాను 1వ తేదీ నుంచి 10వ తేదీ వరకు గ్రామాల వారిగా కూలీలు బ్యాంకులకు వచ్చి తమ ఖాతాలకు ఆధార్ నెంబర్లకు లింకప్ చేసుకోవాలన్నారు. 1వ తేదీన గెణిగెర, జక్కలవడికి, 2న యర్రగుంట, బ్రహ్మసముద్రం, 3న బెణకల్లు, బిరదకుంతం, 4న గరుడచేడు, తుంబిగనూరు, 5న ఉడేగోళం, కణేకల్లు, 7న పూలచెర్ల, గోపులాపురం, 8న రచ్చుమర్రి, కళేకుర్తి, 9న మాల్యం, హనుమాపురం, 10న సొల్లాపురం, హనకనహాళ్ గ్రామాల ఉపాధి కూలీలు బ్యాంకులకు వచ్చి ఆధార్ సమస్యను పరిష్కరించుకోవాలని కోరారు.

చిరుత సంచారంతో గ్రామస్థుల ఆందోళన

రాయదుర్గం రూరల్ : మండలంలో రాత్రివేళ చిరుత సంచరిస్తుండటంతో గ్రామస్థులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. వారం రోజుల నుంచి పలు గ్రామాల్లో చిరుత సంచరిస్తూ రామక్క, చిత్రయ్యలకు చెందిన రెండు మేకలు, వెంకటేశులుకు చెందిన ఆవుదూడను చంపితిన్నట్లు సమాచారం. విషయాన్ని ఫారెస్ట్ అధికారులకు తెలియజేసినప్పటికీ ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

గుమ్మఘట్ట : మండలంలోని గోనబావి గ్రామానికి చెందిన దేవేంద్రరెడ్డి సోమవారం అర్ధరాత్రి రాయదుర్గం మండలం బొమ్మక్కపల్లి గ్రామం వద్ద రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి వెలుగు సిబ్బంది ఆధ్వర్యంలో చంద్రన్న బీమా కింద రూ.5 లక్షలు అందుతుందని, తక్షణ సహాయం కింద రూ.5 వేలు నగదు అందజేశారు. కార్యక్రమంలో వెలుగు సీసీ వన్నూరుస్వామి, బీమా మిత్ర, టీడీపీ మండల కన్వీనర్ గిరిమల్లప్ప, నాయకులు దానవేంద్ర, సిద్ధనగౌడ, ఆనందరెడ్డి, హనుమక్క పాల్గొన్నారు.

మేత కోసం భూములు మినహాయించాలి

రాయదుర్గం రూరల్ : గ్రామంలో పశువులు, గొర్రెలు, మేకల మేత కోసం పౌరంబోకు భూములు మినహాయించాలని, ఆ భూముల్లో మొక్కలు నాటకూడదని మండలంలోని కెంచానపల్లి వాసులు కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ నాగరాజుకు వినతిపత్రం సమర్పించారు. అదేవిధంగా ఉపాధి అధికారులు పనులు కల్పించే ముందు తప్పనిసరిగా గ్రామసభ నిర్వహించాలని ఎంపీడీఓకు విన్నవించారు.

ఘనంగా ఆర్ఎస్‌వైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

రాయదుర్గం రూరల్ : రాయలసీమ విద్యార్థి యువజన సంఘం ఆవిర్భావ దినోత్సవాన్ని మంగళవారం స్థానికంగా ఘనంగా నిర్వహించారు. డివిజన్ అధ్యక్షుడు సంతోష్‌రెడ్డి, రవితేజ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎం వెంకటేష్‌బాబు హాజరై జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఇర్ఫాన్ బేగ్ మాట్లాడుతూ రాయలసీమకు కడప ఉక్కు పరిశ్రమ, అనంతపురం జిల్లాకు సెంట్రల్ యూనివర్సిటీ, గుంతకల్లుకు రైల్వే జోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. హాస్టల్‌లో చదువుతున్న విద్యార్థులకు మెస్, కాస్మొటిక్స్ చార్జీలు పెంచాలని ప్రభుత్వాన్ని కోరారు.

నేమకల్లులో భక్తుల కిటకిట

బొమ్మనహాళ్ : శ్రావణ మంగళవారం సందర్భంగా మండలంలోని నేమకల్లులో భక్తులు కిటకిటలాడారు. అర్చకులు స్వామివారికి ఉదయం నుంచి ప్రత్యేక పూజలు, అలంకరణ, ఆకుపూజలు నిర్వహించారు. కాంస్య కవచంతో ప్రత్యేకంగా ముస్తాబుచేశారు. కర్ణాటక, ఆంధ్ర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేక హనుమాన్ దర్శన్ బస్సులు, ప్రైవేటు వాహనాలతో నేమకల్లు ఆలయ ప్రాంతం కిటకిటలాడింది. సాయిబాలాజీ స్పాంజ్ ఐరన్ ఫ్యాక్టరీ యజమాని తోటకూర శ్రీమన్నారాయణ దంపతులు భక్తులకు అన్నదానం చేశారు. సాయంకాలం ఆలయ ఆవరణలో హనుమాన్ భక్తులు, ఆంజనేయ భక్త మండలి సభ్యులు దీపారాధన, భజనలు చేశారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా ఆలయ ఈవో శ్రీనివాసులు, ధర్మకర్త కాశీనాథ్, మండలి సభ్యులు ఏర్పాట్లు చేశారు.



అలంకరణలో స్వామివారు

ప్రతిష్ఠా హోమం

బొమ్మనహాళ్ : ఉద్దేహాళ్ ఈశ్వరాలయం ధ్వజస్తంభ ప్రతిష్ఠ సందర్భంగా మంగళవారం ప్రత్యేక హోమాలు, పూజలు నిర్వహించారు. కంకణధారులైన భక్తులు కుటుంబ సమేతంగాను, మహిళలు హోమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. అనంతరం భక్తులు భజనలు చేశారు.

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోవాలి : చైర్‌పర్సన్

రాయదుర్గం టౌన్ : పట్టణంలోని 17వ వార్డు ప్రజలు స్వచ్ఛందంగా ఆక్రమణలు తొలగించుకుని అభివృద్ధికి సహకరించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి పేర్కొన్నారు. పట్టణంలోని గుగ్గిరెట్టి ప్రాంతంలో మంగళవారం వైస్ చైర్మన్ గాజుల వెంకటేశులు, కౌన్సిలర్ ముచ్చుగి నాగరాజు, క్రిష్ణవేణి, కమిషనర్ కృష్ణ, డీఈ పౌరాళ్ల సురేష్, ఏఈ బాలమల్లేష్ పర్యటించారు. ప్రజాసమస్యలు అడిగి తెలుసుకున్నారు. వార్డులో రూ.50 లక్షలతో రోడ్లు, డ్రైనేజీలు నిర్మిస్తామన్నారు. ప్రజలు ఆక్రమణలు తొలగించుకుని అభివృద్ధి పనులకు సహకరించాలని ఆమె కోరారు.



సమస్యలు తెలుసుకుంటున్న మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి

ఇద్దరు వైద్యుల నియామకం

రాయదుర్గం : పట్టణంలోని ప్రభుత్వ వైద్యశాలకు ఇద్దరు వైద్యులను నియమిస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కడప జిల్లా సింహాద్రిపురం పీహెచ్‌సీ గైనకాలజిస్ట్ మాధవి, గుంటూరు జిల్లా మార్టూరు పీహెచ్‌సీ జనరల్ ఫిజీషియన్ విజయ్‌కుమార్‌ను రాయదుర్గం వైద్యశాలకు బదిలీ చేస్తూ ఉత్తర్వులు అందాయి.

జింక్, జిప్సమ్ పంపిణీ

బొమ్మనహాళ్ : మండలంలోని ఉంతకల్లులో 84 మంది రైతులకు 2.5 టన్నుల జింక్, శ్రీధరఘట్టలో 79 మంది రైతులకు 20 టన్నుల జిప్సమ్‌ను మంగళవారం పంపిణీ చేసినట్లు ఏవో అహ్మద్ బాషా తెలిపారు. కార్యక్రమంలో ఏఈవో వెంకటనారాయణ, ఎంపీఈవోలు ఇలియాజ్, అనిల్, వంశీ, అనుశ్రీ, రైతులు పాల్గొన్నారు.

టీడీపీ బూత్ కమిటీల ఏర్పాటు

గుమ్మఘట్ట : గుమ్మఘట్ట, గోనబావి, పూలకుంట, 75 వీరాపురం గ్రామాల్లో మంగళవారం ఎంపీపీ పాలయ్య ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు బూత్ కమిటీలు ఏర్పాటు చేశారు. మండల కన్వీనర్ గిరిమల్లప్ప, ప్రధాన కార్యదర్శి రంగస్వామి, ఉపాధ్యక్షుడు ఆనందరెడ్డి, ప్రచార కార్యదర్శి సన్నణ్ణ, నాయకులు దానవేంద్ర హాజరై మాట్లాడారు. గ్రామాల్లో పార్టీ అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు.

ఉన్నత లక్ష్యంతో చదవాలి

రాయదుర్గం టౌన్ : విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి హరిప్రసాద్ యాదవ్ పేర్కొన్నారు. పట్టణంలోని ఆదర్శ పాఠశాలలో మంగళవారం జేవీవీ ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. దేశ నిర్మాణం పాఠశాలల్లోని తరగతి గదుల్లో నిర్మించబడుతుందన్నారు. విద్యార్థులు విలువలతో కూడిన విద్యనభ్యసించాలన్నారు. లక్ష్య సాధనలో ఎదురయ్యే అవరోధాలను ఎదుర్కొని వాటిని అభివృద్ధిగా మలుచుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ప్రకాష్ నాయుడు, ఉపాధ్యాయులు యాదవమూర్తి, నాయకులు నాదే అలీ, సోహిల్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న హరి ప్రసాద్

'తాగునీటి సమస్యను పరిష్కరించండి'

అనంతపురం సప్తగిరిసర్కిల్: అనంతపురం రూరల్ మండలం అక్కంపల్లి పంచాయితీ పరిధిలోని నీలంరాజశేఖర్‌రెడ్డి కాలనీలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని మాలమహానాడు నాయకులు బండిరవికుమార్, ఓబులేసు, గ్రామస్థులు తహసీల్దార్‌ను కోరారు. ఈ మేరకు మంగళవారం తహసీల్దార్ అన్వర్‌హుస్సేన్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కాలనీకి 4 ట్యాంకర్ల నీటి సరఫరా చేస్తున్నారన్నారు. కాలనీకి కనీసం 6 ట్యాంకర్ల నీరు సరఫరా చేయాలన్నారు. ప్రస్తుతం ట్యాంకర్ల ద్వారా సరఫరా చేస్తున్న నీరు కాలనీ వాసులకు సరిపడం లేదన్నారు. నీటి సరఫరా చేసే వారు నీటిని డబ్బులకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు సురేష్, లింగమయ్య, మారుతి, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలల్లో అన్ని సదుపాయాలు కల్పిస్తాం : మంత్రి





బాలికల వసతి గృహాన్ని ప్రారంభిస్తున్న మంత్రి పరిటాల సునీత, సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి, ఆస్పత్రిని ప్రారంభిస్తున్న దృశ్యం

రాప్తాడు: ఆదర్శ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించి రాప్తాడు నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లోనూ ఆదర్శంగా తీర్చిదిద్దుతామని స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత తెలిపారు. పంగల్‌రోడ్డు సమీపాన 1.30 కోట్లతో నిర్మించిన ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహాన్ని మంగళవారం మంత్రి పరిటాల సునీత ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... కార్పొరేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య అందించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషి చేస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాల బలోపేతానికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ ఆదర్శంగా తీర్చి దిద్దుతానన్నారు. విద్యార్థులు చదువుకునే వయస్సులో సెల్‌పోన్ల వాడకం పూర్తిగా తగ్గించాలన్నారు. ప్రస్తుత కాలంలో చాలా మంది విద్యార్థులు స్మార్ట్‌పోన్ మోజులోపడి విద్యకు దూరమవుతున్నారన్నారు. ఒక అమ్మగా చెబుతున్నా.... విద్యార్థి దశలో శ్రద్ధగా చదువుకుని తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులకు మంచి పేరుతీసుకురావాలన్నారు. చెడు అలవాట్లకు దూరం చేసి మంచి అలవాట్లను అలవర్చుకోవాలన్నారు.అనంతరం ఉత్త మ ఫలితాలుసాధించిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, పాఠశాలకు ల్యాబ్ ట్యాప్‌లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆర్డీఓ బాలానాయక్, ఎంపీపీ దగ్గుపాటి ప్రసాద్, తహసీల్దార్ నాగభూషణం, ప్రిన్సిపాల్ శరత్ చంద్ర టీడీపీ మండల కన్వీనర్ నారాయణస్వామి, ప్రధాన కార్యదర్శి శీనయ్య, నెట్టెల లక్ష్మినారాయణ, రాజేంద్ర, గోపాల్, సర్పంచ్‌లు శ్రీనివాసులు, గోపాల్ పాల్గొన్నారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రారంభం

అనంతపురం సప్తగిరిసర్కిల్: ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలందించాలని రాష్ట్ర స్త్రీ శిశుసంక్షేమ శాఖ మంత్రి పరిటాల సునీత వైద్యాధికారులకు సూచించారు. మంగళవారం అనంతపురం రూరల్ మండలం పరిధిలోని కురుగుంటలో నూతనంగా నిర్మించిన ప్రాథమిక ఆరోగ్యకేంద్రం ప్రారంభోత్సవం కార్యక్రమంని ర్వహించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర స్త్రీశిశు సంక్షేమశాఖ మంత్రి పరిటాల సునీత, టీడీపీ నాయకులు పరిటాల మహేంద్ర, జడ్పీటీసీ వేణుగోపాల్, డిఎంహెచ్‌ఓ వెంకటరమణ, మార్కెట్ యార్డ్ వైస్ ఛైర్మన్ పాముురాయి వెంకటేశ్ ముఖ్య అతిథులుగా హారయ్యారు. తొలుత శిలా ఫలకాన్ని ఆవిష్కరించి, ఆసుపత్రి ప్రారంభించారు. అనంతరం ఆస్పత్రిలోని వార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పేద ప్రజలకు మెరుగైన వైద్య సేవలందించాలన్న ఉద్దేశ్యంతో ఆస్పత్రిని ప్రారంభించామన్నారు. ఆస్పత్రి నిర్మాణం బాగుందన్నారు. అయితే ఆస్పత్రి ఊరికి చివర్లో ఉండడంపట్ల కొంత అసంతృప్తి వ్యక్తం చేశారు. ఏదేమైనప్పటికి వైద్యులు , సిబ్బంది నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవందించాలన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ చల్లా జయక్రిష్ణ, మాజీ మండల కన్వీనర్ లక్ష్మినారాయన, అదనపు డిఎంహెచ్‌ఓ పద్మావతి, వైద్యులు పురుషోత్తం, పంకజాక్షి, నారాయణస్వామి, ఎంపీడీఓ ఓబులమ్మ, ఈఓఆర్డీ లక్ష్మినరసింహ టీడీపీ నాయకులు చంటి, గంగాధర్, కుమ్మర రా మాంజినేయులు, వెంకటరాముడు, ఈశ్వరయ్య, ఎంఆర్‌పీఎస్ రమణ, మహేష్ నాయక్, సుమన్, అదనపు డిఎంహెచ్‌ఓ పద్మావతి, వైద్యులు పురుషోత్తం పాల్గొన్నారు.

ఇందిరమ్మ కాలనీలో షార్ట్ సర్క్యూట్

అనంతపురం సప్తగిరిసర్కిల్: అనంతపురం రూరల్ మండలం పరిధిలోని ఇందిరమ్మకాలనీలో నివాసం ఉంటున్న చాకలి పోతులయ్య ఇంటిలో మంగళవారం షాట్‌సర్క్యూట్ జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు మేరకు.... పోతులయ్య సాయంత్రం బట్టలుఉతికి ఇంట్లో ఇనుపతీగలకు ఆరబెట్టాడు. ఉన్నపలంగా షాట్‌సర్క్యూట్ అయ్యి బట్టలన్ని కాలిపోయాయి. దీంతో లక్షరూపాయలు నష్ట వాటిల్లినట్ల బాధితుడుపోతులయ్య తెలిపారు.

బాలికల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ అవసరం

రాప్తాడు: కౌజీబీవీ పాఠశాలలో చదువుతున్న బాలికల ఆరోగ్యంపై ఆ పాఠశాల సిబ్బంది ప్రత్యేక శ్రద్ధ వహించాలని తహసీల్దార్ నాగభూషణం తెలిపారు. మంగళవారం కెజీబీవీ పాఠశాల బాలికలకు చేస్తున్న హిమోగ్లోబిన్ వైద్య పరీక్షలను ఆ పాఠశాలకు వెళ్ళి పరిశీలించారు. కెజీబీవీ పాఠశాలల్లో బాలికలను సొంత బిడ్డల్లా చూసుకోవాలన్నారు. కార్పొరేట్ పాఠశాలకు ధీటుగా విద్యనందించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచాలన్నారు. కార్యక్రమంలో కేజీబీవీ నిర్వహకురాలు మత్యాలమ్మ, సిబ్బంది పాల్గొన్నారు.

బహిరంగ సభను జయప్రదం చేయండి

రాప్తాడు: రాయలసీమకు ప్రత్యేక ప్యాకేజీ కోసం ఈ నెల 10న అనంతపురం మున్సిపల్‌ల కార్యాలయం ఎదుట నిర్వహించే బహిరంగ సభను జయప్రదం చేయాలని మండల సీపీఐ నాయకులు తెలిపారు. ఈ మేరకు నియోజకవర్గ కేంద్రమైన రాప్తాడులో మంగళవారం పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఈ సభకు సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యుడు బలి రాఘువులు, రాష్ట్ర కార్యదర్శి మధు, కేంద్ర కమిటీ సభ్యులు గఫూర్‌తో పాటూ పలువురు ముఖ్య అతిథులుగా హాజరై జిల్లాలోని ప్రజల సమస్యలపై, రాయలసీమ ప్రత్యేక ప్యాకేజీపై చర్చిస్తామన్నారు. కావున సీపీఎం నాయకులు అధిక సంఖ్యలో హాజరై సభను విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాప్తాడు డివిజన్ కార్యదర్శి రామాంజినేయులు, మండల కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, నాయకులు ఎర్రిస్వామిరెడ్డి, పోతులయ్య, లింగన్న, నారాయణస్వామి పాల్గొన్నారు.

ఆత్మకూరులో: ఈ నెల 10న సీపీఎం పార్టీ తలపెట్టిన బ్రమాద రంగ సభను జయప్రదం చేయాలని మండల సీపీఎం నాయకులు శివశంకర్ తదితరులు మంగళవారం పోస్టర్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభకు రాష్ట్ర కమిటీ సభ్యులు రాఘువులు, మధు, రామయ్య, తదిత ర ప్రముఖులు హాజరుకానున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పార్టీ నాయకులు , కార్యకర్తలు తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు శివ, రాము, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగుల అభివృద్ధికి ప్రభుత్వం కృషి

రాప్తాడు: దివ్యాంగుల అభివృద్ధి ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతోందని ఎంపీపీ దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఎంపీడీఓ కార్యాలయం వద్ద మండలంలోని పలు గ్రామాలకు చెందిన దివ్యాంగులకు ట్రైసైకిళ్ళు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ... దివ్యాంగులకు ప్రభుత్వం ప్రతి నెలా 1500 రూపాయలు ఫించన్ అందిస్తోందన్నారు. ప్రతి ఏడాది దివ్యాంగులకు అవసరమైన ట్రైసైకిళ్ళు, చేతి కర్రలు అందిస్తూ వారిలో ఆ త్మస్థైర్యాన్ని నింపుతోందన్నారు. దివ్యాంగులు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసులు, టీడీపీ నాయకులు నెట్టెం లక్ష్మినారాయణ, రాజేంద్ర, నారాయణస్వామి, ముత్యాలప్ప ల్గొన్నారు.

అనారోగ్యంతో ఉద్యాన శాఖ అటెండర్ మృతి

అనంతపురం కలెక్టరేట్ : ఉద్యాన శాఖ అటెండర్‌గా పనిచేస్తున్న బోజిరెడ్డి (30) అనారోగ్యంతో మృతి చెందాడు. బుక్కరాయసముద్రం మండలం ఆకులేడుకు చెందిన బోజిరెడ్డి గత పదేళ్లుగా అనంతపురం ఉద్యాన శాఖ ఏడీ-1 కార్యాలయంలో అవుట్‌సోర్సింగ్ కింద అటెండర్‌గా పనిచేస్తున్నాడు. అనంతపురం నగరంలోని తపోవనంలో నివాసముంటున్న అతను గత కొన్ని రోజులుగా పచ్చకామెర్లతోపాటు తీవ్ర జ్వరంతో బాధపడుతున్నాడు. స్థానికంగా ఆస్పత్రిలో చికిత్స పొందినా ఫలితం లేకపోయింది. మెరుగైన చికిత్స నిమిత్తం బెంగుళూరుకు తరలిస్తుండగా మంగళవారం రాత్రి 8 గంటల సమయంలో మృతి చెందాడు. అటెండర్ మృతిపై ఉద్యాన డీడీ సుబ్బరాయుడు, ఏడీలు సత్యనారాయణ, సతీష్,ఇతర అధికారులు, సిబ్బంది సంతాపం వ్యక్తం చేశారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ప్రతి చిన్నారికి మీజిల్స్, రుబెల్లా టీకా



కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ నారాయణస్వామి

రాప్తాడు: 9 నెలల నుండి 15 సంవత్సరాల లోపు పిల్లలంద రికి మీజెల్స్, రుబెల్లా టీకా తప్పని సరిగా వేయాలని అదనపు డిప్యూటీ డిఎంహెచ్‌ఓ పద్మావతి తెలిపారు. మంగళ వారం రాప్తాడు ఉన్నత పాఠశాల ల్లో వేస్తున్న మీజెల్స్, రుబెల్లా టీకాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... చిన్నారులలో వ్యాదులకను నివారించి వారికి మెరుగైన ఆరోగ్యం కోసం ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా ఈ టీకా కా ర్యక్రమం చేపట్టిందన్నారు. టీకాలపై ప్రజల్లో అవగాహన కల్పించి 15 సంవత్సరాలలోపు పిల్లలందిరికి టీకా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిహెచ్‌ఓ శ్రీనివాసులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రామగిరిలో: మీజిల్స్-రుబెల్లా వ్యాక్సిన్‌తో పిల్లలు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని ఎంపీపీ బడగొర్ల ఆంజనేయులు అన్నారు. రామగిరి కేజీబీవీ పాఠశాలలో మంగళవారం ఎంపీపీ బడగొర్ల ఆంజనేయులు, సర్పంచ్ శ్రీనివాసులు,ఎంపీడీఓ పూలనరసింహులు, కేజీబీవీ ఎస్‌ఓ సౌమ్యలతలు విద్యార్థులకు మీజిల్స్-రుబెల్లా వ్యాక్సిన్ వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి శివానాయక్, సూపర్‌వైజర్ శ్రీనివాసులు, పాల్గొన్నారు.

ఆత్మకూరులో: మండల పరిధిలోని గ్రామాల్లోని 9 నెలల నుంచి 15 సంవత్సరాల వరకూ వయస్సున్న ప్రతి ఒక్కరికి మిజిల్స్ రుబెల్లా టీకా తప్పనిసరిగా వేయించాలని మండల వైద్యాధికారి పంకజాక్షి తెలిపారు. మండల కేంద్రంలోని కస్తూరిబా పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు టీకాలు వేశారు. అనంతరం వైద్యాధికారి మాట్లాడుతూ ప్రాణాంతకమైన వ్యాధి నివారణకు మీజిల్స్ రుబెల్లా టీకాను తప్పనిసరిగా వేయిస్తే ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా ఉంటారని తె లిపారు. నిర్లక్ష్యం చేస్తే చిన్నారులు వ్యాధుల భారిన పడి వారి ఆరోగ్యాన్ని నాశనం చేసుకుంటారన్నారు.

అనంతపురం సప్తగిరిసర్కిల్: మండలంలోని 9 నెలల నుంచి 15 ఏళ్ళ వయస్సు గల పిల్లలందరికి ఎంఆర్ వ్యాక్సిన్ వేయించాలని డా. నారాయణస్వామి పేర్కొన్నారు. మంగళవాంరం అనంతపురం రూరల్ మండలం పరిధిలోని కురుగుంట ఏపీ రెసిడెన్సియల్ పాఠశాలలో ఎంఆర్ వ్యాక్సిన్‌నేషన్ కార్యక్రమం ప్రారంభించారు. డాక్టర్ నారాయణస్వామి కార్యక్రమానికి హాజరై వ్యాక్సిన్ గురించి వివరించారు. పిల్లలకు గతంలో ప్రైవేట్ ఆస్పత్రుల్లో మీజిల్స్ రెబెల్లా వ్యాక్సిన్ వేయించినా సమీపంలో ఉన్న పాఠశాలకు పిల్లలను తీసుకెళ్లి వ్యాక్సిన్ వేయించాలన్నారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం సునీత, ఎంపీహెచ్‌ఈఓ నాగేశ్వరయ్య, కార్యదర్శి ప్రసాద్, సూపర్‌వైజర్లు హేమలత, విజయలక్ష్మి, పీహెచ్‌ఓ రాజమ్మ పాల్గొన్నారు.

'మహాత్ముడి కలలను సాకారం చేసుకుందాం'

అనంతపురం టౌన్ : జాతిపిత మహాత్మగాంధీ కలలుగన్న పరిశుభ్ర భారతదేశాన్ని సాకారం చేసుకుందామని ఐక్యరాజ్యసమితి కార్యకర్త శివకుమార్ పేర్కొన్నారు. మంగళవారం నెహ్రూ యువకేంద్ర(ఎన్‌వైకే) ఆధ్వర్యంలో నగర శివారులోని టీటీడీసీ పరిసర ప్రాంతాల్లో యువతీయువకులు, ఎన్‌వైకే సిబ్బంది స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పిచ్చిమొక్కలు, రాళ్ళు, కంపచెట్లను తొలగించి టీటీడీసీ ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. అనంతరం 'పరిశుభ్రమైన భారతదేశం మహాత్మాగాంధీ కల..! ఇది వాస్తవమా కాదా..?' అనే అంశంపై అవగాహనా సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఐక్యరాజ్యసమితి కార్యకర్త శివకుమార్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని, అనంతపురం జిల్లాను ఇతర జిల్లాలకు ఆదర్శంగా తీర్చిదిద్దాలన్నారు. ఎన్‌వైకే డీడీఓ శ్రీనివాసులు మాట్లాడుతూ యువకేంద్రం ఆధ్వర్యంలో ఈనెల 1 నుంచి 15వ తేదీవరకు 'స్వచ్ఛ భారత్ పక్వాడ'ను నిర్వహిస్తున్నామన్నారు. వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, క్విజ్, మొక్కలు నాటడం, ర్యాలీలు వంటి కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో స్వచ్ఛభారత్ యువ అంబాసిడర్ భరత్, రిసోర్స్‌పర్సన్ కానాల, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

చేనేత సమస్యలపై 7న నిరసన

అనంతపురం సెంట్రల్: చేనేత రంగం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 7న వివిధ సంఘాల ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపడుతున్నట్లు అఖిలపక్ష నాయకులు తెలిపారు. మంగళవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.... చేనేత ఉత్పత్తులపై జీఎస్టీ వేయడం ద్వారా ఈ పరిశ్రమ ఉనికినే కోల్పోయే ప్రమాదం ఉందన్నారు. చేనేత వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా అఖిలపక్ష చేనేత సంఘాల ఆధ్వర్యంలో చేపట్టే ధర్నాలో పెద్ద ఎత్తున చేనేత కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రేడ్ యూనియన్ నాయకులు చలపతి, రాజారెడ్డి, అమీర్‌బాషా, నరసింహులు, రవీంద్ర, గోవిందు, రమణ, శ్రీనివాసులు, రమేష్, నందా, నాగభూషణ, నాగేంద్ర, కిశోర్ పాల్గొన్నారు.

రేపటి నుంచి ఎన్టీఆర్ గ్రామీణ హౌసింగ్‌పై గ్రామ సభలు

గార్లదిన్నె:ఇళ్ళులేని పేదలకు ఎన్టీఆర్ పక్కా గృహాలు మంజురు చేసేందుకు ఈనెల నుంచి 9 వరకు గ్రామ సభలు నిర్వహిస్తునట్లు ఎంపీడీఓ భాస్కర్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. అధికారులు బృందాలుగా గ్రామసభలకు హాజరవుతారని చెప్పారు. ఈ నెల 3న ఇల్లూరు, పెనకచెర్ల, కోటంక, 4 కల్లూరు, కృష్ణాపురం, ఎంపీఆర్‌డ్యాం, 5న గార్లదిన్నె, కేశవాపురం, కొప్పలకొండ, 7నముంటిమడుగు, మర్తాడు, కమలాపురం, 8న ముకుందాపురం, యర్రగుంట్ల, తిమ్మంపేట, 9న సిరివరం, కనుంపల్లి, బూదేడు గ్రామాల్లో సభలు నిర్వహిస్తామన్నారు.






శింగనమల, బుక్కరాయసముద్రం, నార్పలలో వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం, నార్పలలో తల్లిపాల వారోత్సవాల ర్యాలీ

ఎంఆర్ వ్యాక్సినేషన్ ప్రారంభం

శింగనమల: మీజిల్స్, రుబెల్లా వ్యాధులు బారిన పడకుండా పిల్లలకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేయించాలని ప్రభుత్వ విప్ యామినీబాల పేర్కొన్నారు. మంగళవారం శింగనమలలో ఎంఆర్ వ్యాక్సిన్ కార్యక్రమాని ఆమె ప్రారంభించారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాలలోపు పిల్లలకు వ్యాక్సిన్ వేయాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, ఎంపీటీసీలటు రాజేశ్వరి, కుళ్ళాయప్ప, డాక్టర్లు రమణానాయక్, తహసీల్దార్ నాగేంద్ర, ఎంపీడీఓ జయరాం, మండల టీడీపీ పార్టీ అధ్యక్షుడు గుత్తా ఆదినారాయణ, డేగల కృష్ణమూర్తి, చితంబరదొర, మసూల చంద్రమోహన్, సీ వెంకటేశ్, రవీంద్రరెడ్డి, విజయ్, భాస్కర్‌రెడ్డి, అమర్‌నాథ్‌రెడ్డి, రాజాబాబు, ప్రకాశ్, పక్రుద్దిన్, శంకర్, మెడికల్ సిబ్బంది, తిరుపాలమ్మ, వెంకటరమణ, ఆశ్వర్థ, అలివేలమ్మ, ప్రమీల, వరలక్ష్మి, సుధాకర్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

గార్లదిన్నె: 15 సంవత్సరాల వయస్సులోపు ఉన్న పిల్లలందరికి మీజిల్స్ రుబెల్లా టీకా వేయించాలని వైద్యాధికారి అన్వర్‌బాషా తెలిపారు. మంగళవారం స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రంలో టీకా కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అన్వర్‌బాషా, హెల్త్‌కమిటీ చైర్మ న్ నరసింహరెడ్డి, ఎంపీడీఓ భాస్కర్‌రెడ్డి, ఎంఈఓ చంద్రానాయక్, సీహెచ్‌ఓ నాగరాజు, ప్రధానోపాధ్యాయులు సుధారాణి, పంచాయతీ కార్యదర్శి ముత్యాల్‌రెడ్డి, హెల్త్ సూపర్ వైజర్లు తులశమ్మ, వెంకటలక్ష్మి, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

తల్లిపాలు బిడ్డకు శ్రీరామరక్షని ఐసీడీఎస్ఐ సూపర్‌వైజర్ నాగేశ్వరి పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని కల్లూరు పంచాయతీ పరిధిలోని 8 అంగన్‌వాడీ కేంద్రాల ఆధ్వర్యంలో తల్లిపాలు వారోత్సవాల ర్యాలీ చేపట్టారు. శిశువుకు కేవలం తల్లిపాలు ఇవ్వాలని, బిడ్డ పట్టిన గంటలోపు ముర్రుపాలు ఇవ్వాలన్నారు.

బుక్కరాయసముద్రం : ఎంఆర్ వ్యాక్సిన్ పిల్లలకు శ్రీరామ రక్ష అని మేజర్ పంచాయతీ సర్పంచ్ సాకే రమాదేవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మీజిల్స్ రుబెల్లా వ్యాక్సిన్ విద్యార్థులకు వేసి కార్యక్రమాన్ని సర్పంచ్ ప్రారంభించారు. అనంతరం వైద్యాధికారి దయాకర్ మాట్లాడుతూ సెప్టెంబర్ 8 వరకు టీకా వేయినున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోప్రాధ్యాయులు వెంకటేశులు, అస్పత్రి అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఓబులపతి, ఎంపీటీసీ నారాయణస్వామి సీహెచ్‌ఓ సీమా, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నార్పల: స్థానిక ప్రభుత్వ ,ప్రైవేట్ పాఠశాలలో మంగళవారం మెడికల్ ఆఫీసర్ పుష్పలత ఆధ్వర్యంలో విద్యార్థులకు మీజిల్స్ రుబెల్లా టీకా వేశారు. కార్యక్రమంలో మెడికల్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

తల్లిపాల వారోత్సవాలు

స్థానికంగా మంగళవారం ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. వీధుల గుండా నిర్వహించిన ర్యాలీకి ఎంపీపీ ఆకుల అరుణ, సర్పంచ్ ఆకుల నాగలలిత హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తల్లిపాలు ఎంతో శ్రేష్ఠమని అన్నారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ సాల్మాన్ ఎంఈఓ కిష్టయ్య, అంగన్‌వాడీ వర్కర్స్ శ్రీదేవి, లక్ష్మిదేవి, భారతి, విమల, రమాదేవి, వార్డు మెంబర్లు పాల్గొన్నారు.

పుట్లూరు : మండలకేంద్రంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఆరోగ్యసిబ్బంది విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్‌ను వేశారు. వైద్యాధికారి శ్రీనివాసులరెడ్డి ఆధ్వర్యంలో మీజిల్స్, రుబెల్లా వ్యాధుల నివారణకు ఈ వ్యాక్సిన్‌ను వేశారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యసిబ్బంది, అంగన్వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : విప్

శింగనమల: రైతు సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం పెద్దపీట వేసిందని ప్రభుత్వ విప్ యామీనబాల పేర్కొన్నారు. మంగళవారం ఐకేపీ ద్వారా సబ్సిడీతో స్వయం ఉపాధి కింద హర్యానా గేదెలను పంపిణీ చేసి మాట్లాడారు. రైతు రుణమాఫీ, బీమా, సబ్సిడీ వ్యవసాయ పరికరాలు, ట్రాక్టర్లు ఇచ్చామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రమాదేవి, ఎంపీటీసీ రాజేశ్వరి, కుళ్ళాయప్ప, ఆదినారాయణ, డేగల కృష్ణమూర్తి, మసూల చంద్రమోహన్, భాస్కర్‌రెడ్డి, చితంబరదొర, సి వెంకటేశ్ పాల్గొన్నారు.

నేడు గార్లదిన్నెకు ప్రభుత్వ విప్ రాక

గార్లదిన్నె: శింగనమల శాసన సభ్యురాలు, ప్రభుత్వ విప్ యామినిబాల బుధవారం గార్లదిన్నెకు వస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ జయరాం తెలిపారు. ఆదర్శ పాఠశాల హాస్టల్‌ను ప్రారంభిస్తారని, కార్యకర్తలు తరలిరావాలని కోరారు.

ఆంధ్రాబ్యాంకు మేనేజర్‌గా నాగేశ్వరరావు

యల్లనూరు : స్థానిక ఆంధ్రాబ్యాంకు మేనేజర్‌గా మంగళవారం నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టారు. గతంలో ఇక్కడ పని చేసిన గురివిరెడ్డి హైదరాబాద్‌కు బదిలీ కావడంతో ఆయన స్థానంలో నాగేశ్వరరావు వచ్చారు.

వర్షం కోసం పూజలు

నార్పల: స్థాఇక గంగమ్మ తల్లికి మంగళవారం వర్షం కోసం ప్రత్యేక పూజలు నిర్వహించారు. పొలిమేరలోని బొడ్రాయికి 101 బిందెల నీరు పోసి జలాభిషేకం చేశారు. వర్షాలు కురిసి రైతులు పాడిపంటలతో బాగుండాలని దేవతలకు పూజలు చేశారు.

జింక్, జిప్సం పంపిణీ

నార్పల: స్థానిక వ్యవసాయ కార్యాలయంలో మంగళవారం జింక్, జిప్సం పంపిణీ కొనసాగింది. 123 మంది రైతులకు ఇచ్చామని వ్యవసాయాధికారి వెంకట్ కుమార్ తెలిపారు.

సాక్షర భారత్ కేంద్రాల తనిఖీ

నార్పల: మండలంలోని కేశేపల్లి, కురగానిపల్లి, నడి మిదొడ్డి సాక్షర భారత్ కేంద్రాలను మంగళవారం ఈఓఆర్డీ సాల్మాన్, మండల కో-ఆర్డినేటర్ షేర్‌ఖాన్‌లు ఆకస్మిక తనిఖీ చేశారు. రికార్డులు, వాచకం పుస్తకాలు తనిఖీ చేశారు.

ఫారంపాండ్లు, ప్యాకింగ్ హౌస్‌లకు దరఖాస్తులు

నార్పల: అర్హులైన రైతులు ఫారంపాండ్లు, ప్యాకింగ్ హౌస్‌లకు దరఖాస్తు చేసుకోవాలని మంగళవారం హార్టికల్చర్ అధికారి దేవానంద్ తెలపారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 2017-18 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రీన్ హౌస్‌లతో రక్షితపంటల సాగు, ప్యాకింగ్ హౌస్‌లు, ఫారంపాండ్లకు ప్రాధాన్యత ఇస్తున్నామని అన్నారు. అర్హులైన రైతులు హార్టికల్చర్ కార్యాలయంలో ఈ నెల 10వ తేదీ లోపు సంప్రదించాలన్నారు. మరిన్ని వివరాల కోసం 7893484573 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

రసాభాసగా మండల సర్వసభ్య సమావేశం



జడ్పీటీసీ, ఎంపీటీసీల మధ్య వాగ్వాదం

యల్లనూరు : మండల సర్వసభ్య సమావేశంలో అధికార, ప్రతిపక్ష సభ్యుల మధ్య మాటల యుద్ధం పెరిగి తీవ్ర వాగ్వాదానికి దారితీసింది. ప్రతి విషయానికి ఎమ్మెల్యే పేరు చెబుతున్నారని డిప్యూటీ చీఫ్ వెంకటరమణ మాటకు టీడీపీ సభ్యుడు భోగతి ప్రతాప్‌రెడ్డి అడ్డు తగలారు. ఎమ్మెల్యే మాట వినకుండా ఎవరి మాట వినాలని వాగ్వాదానికి దిగారు. దీంతో ఇద్దరి మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. మండల కార్యాలయంలో మంగళవారం సర్వసభ్యసమావేశాన్ని ఎంపీపీ మునిప్రసాద్, జడ్పీటీసీ వెంకటరమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. బెల్టుషాపులతో పాటు పేకాట స్థావరాలపై చర్చ రచ్చకు దారితీసింది. జడ్పీటీసీ వెంకటరమణ మండలంలో ఎటువంటి కార్యక్రమాలు జరుగుతున్నా సమాచారం ఇవ్వడంలేదని ఎంపీడీఓ సాంబశివుడుపై విరుచుకుపడ్డాడు. ఎమ్మెల్యే పేరును ప్రతిసారీ జడ్పీటీసీ ఉచ్ఛరిస్తుండడంతో ఎంపీటీసీ భోగతి ప్రతాప్‌రెడ్డి అడ్డుతగిలారు. సమస్య ఉంటే మీ వద్దే పరిష్కరించుకోండి కానీ ఎమ్మెల్యే పేరు ఎందుకు వాడుతున్నారంటూ జడ్పీటీసీని నిలదీశారు. దీంతో జడ్పీటీసీ, టీడీపీ సభ్యుల మధ్య ఘర్షణ వాతావరణం మొదలైంది. కాగా మండల సర్వసభ్యసమావేశం కేవలం ప్రసంగాలకే పరిమితమైంది. అధికారులు తమ తమ శాఖల గురించి తెలియచేశారు. మండల సమస్యలేవీ పెద్దగా ప్రస్తావనకు రాలేదు. సమావేశంలో ఆర్‌డబ్ల్యుఎస్ ఇంజనీర్ రామలింగారెడ్డి, ఏపీఓ సాంబశివుడు, హౌసింగ్ ఏఈ రాజశేఖర్‌రెడ్డి, పశువైద్యాధికారి శివసాగర్‌రెడ్డిలు తమ శాఖల గురించి తెలియపరిచారు. అనంతరం సభ ముగిసినట్లు ఎంపీడీఓ సాంబశివుడు తెలిపారు.

పింఛనుదారులకు చంద్రబాబు పెద్దకొడుకే.. : విప్



లోలూరులో పింఛన్లు పంపిణీ చేస్తున్న విప్ యామినీబాల

లోలూరు (శింగనమల): వితంతు, వికలాంగులు, వృద్ధుల పింఛన్ల లబ్ధిదారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పెద్ద కొడుకులాగే ఆదుకోవడం జరుగుతోందని ప్రభుత్వ విప్ యామినీబాల పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని లోలూరు, రఘునాథ్‌పురం గ్రామాల్లో పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో, దేశంలో ఎక్కడా లేనివిధంగా వికలాంగులకు రూ. 1500 వృద్ధులకు, వితంతువులకు రూ.1000 చొప్పున పింఛన్లు ప్రతి నెలా ఇస్తున్నారన్నారు. అనంతరం అంగన్‌వాడీ సెంటర్ తనిఖీ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు డేగల కృష్ణమూర్తి, రవీంద్ర రెడ్డి, మారుతినాయుడు, రహంతుల్లా, చితంబరదొర, వెంకటరమణ, మసూల చంద్రమోహన్, భాస్కర్‌రెడ్డి, నాగభూషణం, మల్లికార్జున, ఓబిలేసు, సుబ్రమణ్యం, మహేశ్వరరెడ్డి, పాల్గొన్నారు.

ఫ్యాన్లు, ఆట వస్తువుల పంపిణీ

తరిమెల (శింగనమ): తరిమెల ఎస్సీ బాలుర వసతి గృహం, పాఠశాలకు తరిమెల గ్రామానికి చెందిన కరుణాకర్ రెడ్డి కుమార్తె మనీశ్వరి పుట్టినరోజు సందర్భంగా ఫ్యాన్లు, ఆటవస్తువులు ఉచితంగా అందజేశారు. మంగళవారం గ్రామ పెద్దలు తరిమెల రంగారెడ్డి చేతుల వారిగా ఎస్సీ వసతి గృహానికి 8 ఫ్యాన్లు ఆటవసువులు, జిల్లా పరిషత్ పాఠశాలకు 6 ఫ్యాన్లు 10 వేల రూపాయల విలువగల ఆటవస్తులు అందజేశారు.

వ్యక్తిపై హత్యాయత్నం...?

గార్లదిన్నె: ఓ వ్యక్తిపై కొందరు హత్యాయత్నానికి పాల్పడగా తెగిపడిన చెయ్యితో మండలంలోని కల్లూరు రైల్వే స్టేషన్‌లో భయందోళన చెందుతూ తారసపడ్డాడు. స్థానికులు వైద్య సేవలకు పామిడి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. బాధితుతు తెలిపిన వివరాలివి. శింగనమల మండలం కల్లుమడి గ్రామానికి చెందిన ఆదెన్న కుమారుడు నాగార్జున కూలీ పనులు చేస్తూ జీవించేవాడు. నాగర్జున ఆదే గ్రామంలోనే జయంతి అనే ఆమెను ప్రేమించి పెళ్లి చేసుకున్నాడు. రైతు కూలీగా పనులు చేసుకుంటూ జీవనం కొనసాగించేవారు. అయితే మంగళవారం రాత్రి కల్లూరు రైల్వే షేషన్‌లోకి వెలుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు తనపై ఇనుపరాడ్లు, కొడవలితో దాడి చేశారన్నారు. ఈ దాడిలో ఎడమచెయ్యిని కొడవలితో నరికారన్నారు. భయందోళనతో ప్రాణాలు కాపాడుకునేందుకు రైల్వేషేషన్‌లోకి పరుగులు తీశానన్నారు. అక్కడ స్థానికుల సహాయంతో పామిడి ప్రభుత్వ ఆస్పత్రిలో ప్రథమ చికిత్స పొంది మెరుగైన చికిత్సకు 108 వాహనం ద్వారా అనంతపురం తరలించారన్నారు. ఈ విషయంపై ఎస్ఐ ప్రదీప్ కుమార్‌ను వివరణ కోరగా కల్లూరులో విచారించగా రైలు కింద పడ్డారని కొందరు, గొడవపడ్డారని మరొకొందరు అంటూ పలువురు సమాధానం చెప్పారని ఎస్ఐ తెలిపారు. పూర్తి వివరాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

అనాథ విద్యార్థినులకు దుస్తుల పంపిణీ

నార్పల: స్థానికంగా దివంగత వరలక్ష్మమ్మ ఆరో వర్ధంతి సందర్భంగా ఆమె కుమారులు భాస్కర్‌రెడ్డి, వెంకట శివారెడ్డిలు కస్తూర్బా పాఠశాల, ప్రభుత్వ బాలికల పాఠశాలలో చదువుతున్న అనాథ విద్యార్థినులకు దుస్తులు పంపిణీ చేశారు. పదవ తరగతి స్టడి మెటీరియల్స్‌ను ఉచితంగా పంపిణీ చేశారు.

బదిలీ ఉపాధ్యాయులకు సన్మానం

సోదనపల్లి (శింగనమల): సోదనపల్లి జిల్లాపరిషత్ పాఠశాలలో బదిలీలైన 8 మంది ఉపాధ్యాయులను గ్రామ పెద్దలు సన్మానం చేశారు. పూలమాలలుశాలువా కప్పి సన్మానం చేశారు.

అంబేడ్కర్ విగ్రహానికి స్థలం కేటాయించాలి

పుట్లూరు : స్థానికంగా రాజ్యాంగ నిర్మాత బీఆర్ అంబేడ్కర్ విగ్రహం ఏర్పాటుచేయాలని ఎమ్మార్పీయస్ నాయకులు మంగళవారం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించారు. నాయకులు భాస్కర్, రామ్మోహన్, రామాంజి, సూరి పాల్గొన్నారు.

వ్యక్తిపై కేసు నమోదు

గార్లదిన్నె: మండలంలోని కోటంక గ్రామానికి చెందిన మంగలి శ్రీనివాసులుపై కేసు నమోదు చేసినట్లు జమేదార్ సత్యానారాయణ మంగళవారం తెలిపారు. కోటంక గ్రామంలో మంగలి పుల్లమ్మ, ఆమె మరిది మంగలి శ్రీనివాసులు ఇద్దరి మధ్య స్థల విషయంలో గొడపడ్డారన్నారు. దీంతో మంగలి శ్రీనివాసులు వదినైన పుల్లమ్మను ఆసభ్యకంగా మాట్లాడి, బెదిరింపులకు గురిచేసినట్లు పుల్లమ్మఫిర్యాదు చేసిందన్నారు.

మహిళలు స్వశక్తితో ఎదగాలి : డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి

సి బండమీదపల్లి (శింగనమల): స్వశక్తితో పనులు చేస్తూ ఆర్థికంగా ఎదగాలని సాక్షరభారత్ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి తెలిపారు. మంగళవారం మండలంలోని సి బండమీదపల్లిలో సాక్షరభారత్ ఆధ్వర్యంలో మహిళలకు కుట్టుమిషన్ల శిక్షణ తరగుతులను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మహిళలు కుటీర పరిశ్రమలతో పాటూ వృత్తి పరమైన శిక్షణ తరగతుల ద్వారా నైపుణ్యం సాధించి ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ వెంకటప్ప, ఎంపీటీసీ భాగ్యలక్ష్మి, సూపర్‌వైజర్ రామసుబ్బారెడ్డి పాల్గొన్నారు.





డ్రైనేజీల్లో పేరుకుపోయిన మురుగు, నిరుపయోగంగా ఫాగింగ్‌మిషన్

నిధులన్నీ వృథా... దుర్గంధం నడుమ యాడికి

యాడికి : మేజర్ పంచాయతీ అయిన యాడికిలో పారిశుధ్యం అటకెక్కింది. లక్షల రూపాయలు ఖర్చవుతున్నా పూర్తిస్థాయిలో పారిశుధ్య పనులు జరగడం లేదు. కార్మికులు కావాల్సినంత మంది ఉన్నా అధికారుల నిర్లక్ష్యం వల్ల పూర్తిస్థాయిలో పనులు చేపట్టడం లేదు. ఫాగింగ్ మిషన్ ఉన్నా నిరుపయోగంగా మూలనపడేశారు. కాలనీల్లోని మురికి కాల్వలను శుభ్రం చేయడంలేదు. కాలువల్లో దోమల నివారణ కోసం బ్లీచింగ్ పౌడర్ చల్లడంలేదని పలువురు ఆరోపిస్తున్నారు. దీనివల్ల దోమల ఉధృతి పెరిగి రోగాల బారిన పడుతున్నామని వాపోతున్నారు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఉన్నతాధికారులు ఆదేశాలు ఇచ్చినా, స్పెషల్‌డ్రైవ్ నిర్వహించాలని సూచించినా స్థానిక పంచాయతీ అధికారుల్లో ఎలాంటి చలనం లేదు. ఉన్నతాధికారుల ఆదేశాలు పెడచెవిన పెట్టారు. కేవలం ర్యాలీలు నిర్వహించి తూతూమంత్రంగా పారిశుధ్య చర్యలు చేపడుతున్నారు గానీ పూర్తిస్థాయిలో చేపట్టడంలో శ్రద్ధ వహించడంలేదని పలువురు విమర్శిస్తున్నారు. యాడికి మేజర్ పంచాయతీలో పదిమంది రెగ్యులర్ పారిశుధ్య కార్మికులు, పదిమంది కాంట్రాక్టు పారిశుధ్య కార్మికులు మొత్తం 20మంది ఉన్నారు. వీరికి నెలకు రూ.4.5లక్షలు జీతాల రూపంలో ఇస్తున్నారు. అంతేకాకుండా పారిశుధ్య చర్యల కోసం బ్లీచింగ్ పౌడర్, సున్నం, ఆయిల్‌బాల్స్ తదితరవాటికోసం నెలకు రూ.50వేలకు పైగా ఖర్చుచేస్తున్నట్లు అధికారులు చెబుతున్నారు. మొత్తం కలిపి సంవత్సరానికి దాదాపు రూ.60లక్షలు ఖర్చుచేస్తున్నారు. అయినా మండలకేంద్రంలోని ప్రధాన కాలువల్లో మురికిని మాత్రం పూర్తిస్థాయిలో శుభ్రం చేయలేకపోతున్నారు. దీనివల్ల కాలువల్లో మురికి పేరుకుపోయి దోమల ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయని స్థానికులు బోరుమంటున్నారు.

తీరని దోమల బెడద

మురికి పేరుకుపోవడంతో దోమలతో పాటు మురికినీటిలో పందులు చేరి బీభత్సం చేస్తుండడంతో దుర్వాసన వెదజల్లుతోందని ప్రజలు విమర్శిస్తున్నారు. మండలకేంద్రంలోనే కాకుండా పంచాయతీ పరిధిలోని పిన్నేపల్లి, తిరునాంపల్లి తదితర గ్రామాల్లో కూడా మురికినీరు నిల్వఉండి దోమలు ఉత్పన్నమై రోగాల బారిన పడుతున్నారు. మండలకేంద్రంలో నామమాత్రంగా పారిశుధ్య చర్యలు చేపడుతున్నా పల్లెల వైపు మాత్రం పంచాయతీ అధికారులు, పారిశుధ్య కార్మికులు కన్నెత్తి చూడడంలేదని గ్రామాలప్రజలు వాపోతున్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా దోమల నివారణకు రోజూ ఫాగింగ్ చేయాల్సి ఉండగా ఇంతవరకు ఒక్కరోజు కూడా ఫాగింగ్ చేయలేదు. ఇలా పంచాయతీ అధికారులు పారిశుధ్య నిధుల్లో అక్రమాలకు పాల్పడడంతో పాటు పారిశుధ్య చర్యల్లో నిర్లక్ష్య ధోరణి వహించడం వల్ల ప్రజలు రోగాల బారిన పడి పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత ఉన్నతాధికారులు పారిశుధ్య చర్యలు చేపట్టడంపై దృష్టి సారించి ప్రజలు రోగాల బారిన పడకుండా కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.

పల్లెల వైపు అధికారులు రావడంలేదు
- నరసింహులు, పిన్నేపల్లి



పల్లెల్లో అపరిశుభ్రత రాజ్యమేలుతున్నా పంచాయతీ అధికారులు మాత్రం పల్లెల వైపు కన్నెత్తి కూడా చూడడంలేదు. దీనివల్ల సైడుకాల్వల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురికినీరు నిల్వఉండి దోమలు పెరిగిపోతున్నాయి. ప్రజలు రోగాల బారిన పడుతున్నారు. పంచాయతీ అధికారులు వెంటనే పారిశుధ్య పనులు చేపట్టాలి.

ఉన్నతాధికారుల ఆదేశాలు పట్టించుకోవడంలేదు - సూర్యుడు, పిన్నేపల్లి



పంచాయతీ అధికారులు ఉన్నతాధికారుల ఆదేశాలు ఏమాత్రం పట్టించుకోవడంలేదు. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని ఎప్పటికప్పుడు పారిశుధ్య పనులు చేపట్టాలని ఉన్నతాధికారులు ఆదేశించినా ఇక్కడ మాత్రం అధికారులు ఇవేమీ పట్టనట్లు ఉన్నారు. దీనివల్ల మురికికాలువల్లో చెత్త పేరుకుపోయి రోగాల బారిన పడుతున్నాం.

పారిశుధ్య చర్యలు చేపడుతున్నాం
- నరసింహారెడ్డి, ఈఓ, యాడికి

మండలకేంద్రంలో ఎప్పటికప్పుడు పారిశుధ్య చర్యలు చేపడుతున్నాం. గ్రామాల్లోకి వెళ్లాల్సిఉంది. పారిశుధ్య కార్మికులు తక్కువగా ఉన్నందున గ్రామాల్లో చర్యలు చేపట్టలేకున్నాం. గ్రామాల్లో మురికికాలువల్లో చెత్త పేరుకుపోయినట్లు తమ దృష్టికి తీసుకువస్తే పారిశుధ్య కార్మికులను పంపి శుభ్రం చేయిస్తాం. ఫాగింగ్ మిషన్ బాగు చేయించాం.త్వరలో ఫాగింగ్ నిర్వహిస్తాం.

పాఠశాలకు కంప్యూటర్ స్టాండ్ వితరణ

పుట్లూరు : మండలంలోని గొల్లపల్లి ప్రాథమిక పాఠశాలకు మంగళవారం గొల్లపల్లి దస్తగిరి కుమారుడు పెద్దపీరయ్య కంప్యూటర్ స్టాండ్‌ను వితరణగా ఇచ్చారు. రూ.3వేల విలువచేసే కంప్యూటర్ స్టాండును ప్రధానోపాధ్యాయుడు శంకర్‌కు అందచేశారు. అనంతరం 2016-17లో ఐదో తరగతిలో మంచి ఫలితాలు సాధించిన రమణి అనే విద్యార్థినికి రూ.1800ల ప్రోత్సాహక బహుమతిని అందచేశారు.



స్టాండును అందజేస్తున్న దృశ్యం

నూతన వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే జేసీ

పుట్లూరు : మండలకేంద్రంలోని ఓ వివాహ కార్యక్రమానికి మంగళవారం తాడిపత్రి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా నూతన వధూవరులను అక్షింతలు చల్లి ఆశీర్వదించారు. అనంతరం విందులో పాల్గొన్నారు. ఎమ్మెల్యే వెంట నాయకులు భోగతి నారాయణరెడ్డి, ఎస్వీ రవీంద్రారెడ్డి, కులశేఖర్‌రెడ్డి , స్థానిక టీడీపీ నాయకులు ఉన్నారు.



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే జేసీ

మారని సమాచార హక్కు చట్టం బోర్డు

తాడిపత్రి రూరల్ : సమాచార హక్కు చట్ట కింద ప్రజల కోసం నోటీసు బోర్డులో సంబంధిత అధికారుల పేర్లు, ఫోన్‌నెంబర్లు ఉంచాలి. ఈ వివరాలను అధికారులు మారినపుడు, ఫోన్ నెంబర్లు మారినపుడు ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేస్తుండాలి. కానీ స్థానిక ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయంలో అధికారులు మారి నెలలు గడుస్తున్నా నోటీసు బోర్డులో పాతనెంబర్లే దర్శనమిస్తున్నాయి. గ్రామాల్లోని నీటి సమస్యలపై అధికారులకు విన్నవించుకోవడం కోసం ప్రజలు అధికారులకు ఫోన్‌చేస్తే పనిచేయకపోవడంతో ప్రజలు విసుగెత్తుతున్నారు. దాదాపు ఆరునెలల క్రితం ఆర్‌డబ్ల్యుఎస్ ఈఈ కనకసింహన్ కొన్ని కారణాల వల్ల ఆత్మహత్య చేసుకున్నాడు. ఆ తర్వాత ఆరునెలల కాలంలో ఇద్దరు అధికారులు ఇక్కడ పనిచేశారు. ప్రస్తుతం ఈఈగా ఇషాన్‌బాషా కొనసాగుతున్నారు. కానీ నోటీసు బోర్డులో మాత్రం ఆరునెలల క్రితం పనిచేసిన కనకసింహన్ పేరు, ఫోన్‌నెంబర్లు అలాగే ఉన్నాయి. ఇక్కడకు వచ్చిన ప్రజాప్రతినిధులు, ప్రజలు నోటీసుబోర్డుపై ఉన్న ఫోన్‌నెంబర్లకు ఫోన్‌చేస్తే స్విచ్ఛాఫ్ రావడంతో ఎవరికి ఫోన్‌చేయాలో తెలియని గందరగోళంలో ప్రజాప్రతినిధులు, ప్రజలు ఉన్నారు. ఏ అధికారి విధుల్లో ఉన్నాడో తెలియని పరిస్థితి ఏర్పడింది. ఎవరు ఎప్పుడొస్తున్నారో, ఎప్పుడు వెళుతున్నారో తెలియని పరిస్థితి. కనీసం ఫోన్ ద్వారానైనా అధికారులను సంప్రదించవచ్చునుకుంటే వారి ఫోన్‌నెంబర్లు కూడా అందుబాటులో లేవని పలువురు ఆరోపిస్తున్నారు. అలాగే జేటీఓ రవికుమార్ జూన్ 1న వేరే ప్రాంతానికి ట్రాన్స్‌ఫర్ అయ్యారు. ఇప్పటికి రెండు నెలలు గడుస్తున్నా నోటీసు బోర్డులో మాత్రం పేరు, ఫోన్‌నెంబర్లు అలాగే ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యానికి ఇదే నిదర్శనమని పలువురు వాపోతున్నారు. ఇప్పటికైనా నోటీసు బోర్డులో ప్రస్తుత అధికారుల పేర్లు ఉంచి ప్రజలకు సహకరించాలని కోరుతున్నారు.



పాత సమాచారం దర్శనమిస్తున్న నోటీసు బోర్డు

లోకల్ గైడ్



తాడిపత్రి మార్కెట్‌లో కూరగాయల ధరలు

పచ్చి మిరపకాయలు-రూ.50, టమోట-60, ఉల్లిగడ్డలు-20, ఉర్లగడ్డలు-20, అంకుర వంకాయలు- 30, ముల్లంకాయలు: 40, చిక్కుడు కాయలు-40, మొటిక్కాయలు- 25, బెండకాయలు-25, బీరకాయలు-30, కాకరకాయలు-40, క్యారెట్-50, క్యాబేజీ-20, క్యాలీఫ్లవర్-25, బీట్ రూట్- 25, దోసకాయలు:20, ముల్లంగి : 20, బీన్సు - రూ.40.

తాడిపత్రి సినిమాలు

బీహెచ్ మహల్ : మాయామాల్ (సెల్ ఫోన్ :08558222772), లక్ష్మీనారాయణ : డీజే (సెల్‌ఫోన్: 9848957005), విజయలక్ష్మి: వాసుకి (సెల్‌ఫోన్: 08558-223078), వరలక్షి: బాహుబలి-2 (సెల్‌ఫోన్:08558-223078), జయలక్ష్మి: ఫిదా (సెల్‌ఫోన్: 08558-223078), సాయితేజ: నిన్నుకోరి (సెల్‌ఫోన్: 08558-221100), దాదా: దండుపాళ్యం-2

యాడికి: లక్ష్మీప్రియ: నిన్నుకోరి (సెల్‌ఫోన్: 90592 90284)

మాంసం ధరలు

చికెన్ (కేజీ) : రూ.180, స్కిన్‌లెస్ చికెన్ : 200, మటన్ : 440, చేప: 120, గుడ్లు (100) : రూ.410

గ్యాస్ సమాచారం

అందుబాటులో ఉన్న సిలిండర్లు
ఇండియన్ : 350 హెచ్‌పీ గ్యాస్ : 330

ఎమ్మెల్యే డైరీ

తాడిపత్రి : ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి బుధవారం నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటారు.

అంగన్‌వాడీ కేంద్రం ఆకస్మిక తనిఖీ

తాడిపత్రి : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అన్న అమృత హస్తం పథకాన్ని ఎందుకు ప్రారంభించలేదని అంగన్వాడీ టీచర్ మాధురిని మున్సిపల్ వైస్‌చైర్మన్ జిలాన్‌బాషా ప్రశ్నించారు. పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి అంగన్వాడీ సెంటర్-2ను మంగళవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్‌చైర్మన్ అన్న అమృతహస్తం గురించి ఆరాతీశారు. ప్రభుత్వం నుంచి వస్తు సామాగ్రి సరఫరా కాకపోవడం వల్ల ఈ పథకాన్ని ప్రారంభించలేదని మున్సిపల్ చైర్‌పర్సన్‌కు ఆమె వివరించారు. తాత్కాలికంగా గర్భవతులకు పాలు, గుడ్లను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అనంతరం ఆస్పత్రిపాలెంలోని నీటి సరఫరా గురించి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఆయనవెంట జిల్లా పార్టీ కార్యదర్శి జాకీర్, మైనార్టీ నాయకులు షెక్షావలి తదితరులు ఉన్నారు.



అంగన్వాడీ టీచర్‌ను ప్రశ్నిస్తున్న జిలాన్‌బాషా

సీపీఎం రాష్ట్ర సమావేశాల పోస్టర్ విడుదల

పుట్లూరు : మండలంలోని సూరేపల్లిలో మంగళవారం సీపీఎం రాష్ట్రస్థాయి సమావేశాల పోస్టర్లను నాయకులు రామాంజి, సూరిలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపి కరువును పారదోలేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు కుళ్లాయప్ప, బాలగురయ్య, లక్ష్మిదేవి, రామలక్షుమ్మ, రామక్రిష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న సీపీఎం నాయకులు

వర్షం కోసం విరాటపర్వం పఠనం

పెద్దవడుగూరు : మండలంలోని లక్షుంపల్లి శివరామాంజనేయస్వామి దేవస్థానంలో మంగళవారం గ్రామపెద్దల ఆధ్వర్యంలో విరాటపర్వం పఠన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇలా చేయడం వల్ల వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్న నమ్మకంతో అనాదిగా ఈ పఠన కార్యక్రమం చేపడుతున్నట్లు గ్రామపెద్దలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకపూజాకార్యక్రమాలు నిర్వహించారు. భక్తాదులకు తీర్థప్రసాదాలు అందజేశారు.


విరాటపర్వం పఠనం చేస్తున్న దృశ్యం


పెద్దవడుగూరు, పెద్దపప్పూరు, తాడిపత్రి రూరల్, తాడిపత్రి టౌన్‌లో ఎంఆర్ వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం, తాడిపత్రిలో తల్లిపాల వారోత్సవాల్లో మాట్లాడుతున్న సీడీపీఓ శశికళ

చిన్నారులకు ఎంఆర్ వ్యాక్సిన్
తప్పనిసరిగా వేయించాలి

పెద్దవడుగూరు : స్థానిక కస్తూర్బాగాంధీ పాఠశాలలో మీజిల్స్ రుబెల్లా టీకా కార్యక్రమాన్ని మంగళవారం ఎంపీపీ దేవమ్మ, తహసీల్దార్ విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ వెంకట రమణారెడ్డి ప్రారంభించారు. 9 నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లలకు టీకా వేయించాలన్నారు. మీజిల్స్ రుబెల్లా వ్యాధులు రాకుండా అరికట్టవచ్చని తెలిపారు. ఆయా గ్రామాల్లో టీకా కేంద్రాలు ఏర్పాటుచేశారు. క్రిష్టిపాడు గ్రామంలో సర్పంచ్ దస్తగిరి ప్రారంభించారు. కార్యక్రమంలో డాక్టర్ శ్రీధర్‌రెడ్డి, ఎస్ఐ రమణారెడ్డి, ఎంఈఓ రాముడు, కేజీబీవీ పాఠశాల పర్యవేక్షకురాలు లీమారోజ్, టీడీపీ సీనియర్ నాయకుడు బాలిరెడ్డి, ఎంపీహెచ్ఓ మక్బుల్, ఏపీఎంఓ రామచంద్ర, ఆరోగ్యసిబ్బంది పాల్గొన్నారు.

పెద్దపప్పూరు : మండలవ్యాప్తంగా మంగళవారం ఎంఆర్ వ్యాక్సిన్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి విష్ణుమూర్తి, ఎంపీటీసీ సోమరాజు ఆధ్వర్యంలో విద్యార్థులకు ఎంఆర్ వ్యాక్సిన్లు ఇచ్చారు. మౌర్య పాఠశాలలో ఎంపీడీఓ అనురాధ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంఈఓ మాధవ, ఆరోగ్యసిబ్బంది, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

తాడిపత్రి రూరల్ : మండలంలోని చుక్కలూరు ఎంపీహెచ్ స్కూల్‌లో మంగళవారం ఎంపీడీవో చలపతి, వైద్యాధికారి వేముల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఎంఆర్ వ్యాక్సిన్ల కార్యక్రమాన్ని ప్రారంభించారు.

యాడికి : తట్టు, రుబెల్లా వ్యాధులు రాకుండా టీకాలు వేయించుకోవాలని ఎంపీపీ రంగయ్య, వైద్యాధికారిణి జహాన్ పేర్కొన్నారు. మంగళవారం స్థానికంగా టీకా కార్యక్రమం నిర్వహించారు. తొలిరోజు దాదాపు 500 మంది పిల్లలకు టీకాలు వేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆదినారాయణ, టీడీపీ నాయకులు నాగమునిరెడ్డి, వైద్యాధికారులు నాగేంద్ర, ప్రవీణ్‌కుమార్, ఎంఈఓ కాశప్ప, ఎంపీహెచ్ఓలు కోదండరామిరెడ్డి పాల్గొన్నారు.

తాడిపత్రి టౌన్ : మీజిల్స్ రుబెల్లా టీకాల కార్యక్రమాన్ని మున్సిపల్ ఛైర్‌పర్సన్ వెంకటలక్ష్మి ప్రారంభించారు. స్థానిక బంకమడివీధి ప్రాథమిక పాఠశాలలో కమిషనర్ శివరామక్రిష్ణతో కలిసి ఆమె కార్యక్రమాన్ని ప్రారంభించారు. 9నెలల నుంచి 15 సంవత్సరాల్లోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పకుండా ఎంఆర్ టీకా వేయించాలన్నారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నరసింహారెడ్డి, వైద్యులు అజేంద్ర, లోకేష్, వైద్యసిబ్బంది, డిష్ మల్లేశ్వరుడు, 108 సిబ్బంది మురళి తదితరులు పాల్గొన్నారు.

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠం

తల్లిపాలే బిడ్డకు శ్రేష్ఠమైనవని ఐసీడీయస్ సీడీపీఓ శశికళ పేర్కొన్నారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా స్థానిక బంకమడివీధిలో గర్భవతులు, బాలింతలకు తల్లిపాలపై అవగాహన కల్పించారు. మంచి ఆరోగ్యంతో పాటు రోగనిరోధక శక్తి పెంపొందుతుందన్నారు. అంతకుముందు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ కవిత, సూపర్‌వైజర్ సరోజ, నాగరత్న పాల్గొన్నారు.

ఆరుగురికి బైండోవర్

యాడికి : మండలంలోని చింతలాయపల్లికి చెందిన ఆరుగురిని మంగళవారం తహసీల్దార్ బ్రహ్మయ్య ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ కత్తిశ్రీనివాసులు తెలిపారు. కోటిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, చిన్నకొండారెడ్డి, సుధాకర్‌రెడ్డిలతో పాటు మరో ఇద్దరు తరచూ భూసమస్యపై ఘర్షణపడుతుంటే ముందస్తు చర్యగా తహసీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు ఎస్ఐ తెలిపారు. ఇకముందు ఘర్షణ పడరాదని, భూసమస్యలేవైనా ఉంటే సంబంధిత అధికారుల వద్దకు వెళ్లి పరిష్కరించుకోవాలని సూచనలిచ్చి పంపారు.


రేపు ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ధర్నా

తాడిపత్రి టౌన్ : మున్సిపల్ పాఠశాలల ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈనెల 3 మున్సిపల్ కార్యాలయం ఎదుట ఉపాధ్యాయ సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్లు ఏపీటీయూఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రఘురామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు డేనియల్ తెలిపారు. ఆగస్టు 17న మున్సిపల్ డైరెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్న ధర్నా కార్యక్రమంలో ఉపాధ్యాయ సంఘాలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

గుండెపోటుతో వాటర్‌షెడ్ అసిస్టెంట్ మృతి

యాడికి : మండలంలోని చింతలాయపల్లికి చెందిన మద్దిలేటి(55) అనే వాటర్‌షెడ్ అసిస్టెంట్ మంగళవారం గుండెపోటుతో మృతిచెందాడు. మద్దిలేటి ఐదేళ్లుగా వాటర్‌షెడ్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నాడు. సోమవారం రాత్రి గుండెనొప్పిగా ఉందని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి రాగా పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు తెలపడంతో కర్నూలు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు.

వాహనాల తనిఖీ


వాహనదారులకు జరిమానా విధిస్తున్న ఎస్ఐ

పెద్దపప్పూరు : మండలంలోని చీమలవాగుపల్లి ప్రధాన రహదారిపై మంగళవారం ఎస్ఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో వాహనాల తనిఖీ చేశారు. రికార్డులు, హెల్మెట్లు లేని 10వాహనాలకు రూ.1000ల జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు. ప్రమాదాల నివారణపై కౌన్సెలింగ్ ఇచ్చామని తెలిపారు.

బదిలీ డాక్టర్, టీచర్లకు ఘన సన్మానం



బదిలీ అయిన డాక్టర్, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

తాడిపత్రి టౌన్ : పట్టణంలోని ప్రభుత్వాసుపత్రిలో ఎముకల వైద్యుడు పవన్‌కుమార్ బదిలీ అయిన సందర్భంగా మంగళవారం ఆయన్ను ఎమ్మార్పీయస్ నాయకులు ఘనంగా సన్మానించారు. పూలమాలలు వేసి శాలువాలు కప్పి సన్మానం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీయస్ నాయకులు మాట్లాడుతూ పవన్‌కుమార్ ప్రజలకు అందుబాటులో ఉంటూ నిష్పక్షపాతంగా వైద్యసేవలందించారన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీయస్ నాయకులు కంబయ్య, పెద్దిరాజు, అంకాలప్ప, శివుడు, రామక్రిష్ణ, బాబయ్య, రవి తదితరులు పాల్గొన్నారు.

పెద్దవడుగూరు : మండలంలోని చిత్రచేడు గ్రామంలోని జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులుగా పనిచేస్తున్న నాగరాజు, సుధాకర్, నాగూర్‌తో పాటు మరో ముగ్గురు ఉపాధ్యాయులు బదిలీ కావడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డేనియల్, విద్యార్థులు వారిని సన్మానించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుడు మాట్లాడుతూ విద్యార్థులు విద్యపై మక్కువ పెంచుకునేందుకు కృషిచేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. ఇలాగే బదిలీపై వెళ్లిన ప్రాంతాల్లో కూడా విద్యార్థులకు మంచి విద్యాబోధన చేయాలని తెలిపారు.


వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అధికారులు

నేటి నుంచి గ్రామసభలు

తాడిపత్రి రూరల్ : మండలవ్యాప్తంగా బుధవారం నుంచి ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ పథకంలో భాగంగా కలెక్టర్ ఆదేశాల మేరకు గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ చలపతి తెలిపారు. మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో కలెక్టర్ ఆధ్వర్యంలో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతరం కలెక్టర్ ఆదేశానుసారం ఎన్టీఆర్ రూరల్ హౌసింగ్ పథకం కింద ఎంపికైన లబ్ధిదారులు అర్హుల, అనర్హులా అని నిర్ణయించడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ యల్లమ్మ, డిప్యూటీ తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంఈఓ నాగరాజు పాల్గొన్నారు.

'రైతు సేవలో రెవెన్యూ శాఖ' కార్యక్రమం

యాడికి : మండలంలోని రాయలచెరువు గ్రామంలో మంగళవారం రైతుసేవలో రెవెన్యూశాఖ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బ్రహ్మయ్య రైతులతో మాట్లాడుతూ రాయలచెరువు రెవెన్యూ గ్రామపరిధిలోని భూముల్లో ఏవైనా సమస్యలుంటే తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామని తెలిపారు. బుధవారం కూడా కార్యక్రమం కొనసాగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ వాసుదేవరావు, వీఆర్వోలు రమేష్, శ్రీధర్, పవిత్ర, వెంకటేష్ పాల్గొన్నారు.


రైతులతో మాట్లాడుతున్న తహసీల్దార్ బ్రహ్మయ్య

అక్రమ ఇసుక రవాణాకు అడ్డుకట్ట

పెద్దపప్పూరు : మండలంలోని పెద్దపప్పూరు పెన్నానది పరివాహక ప్రాంతంలో అక్రమ ఇసుక రవాణాను నిరోధించడానికి మంగళవారం ఎస్ఐ శ్రీహర్ష ఆధ్వర్యంలో ఎక్కాకవేటర్ సాయంతో పెన్నానది రహదారిలో గుంతలు తవ్వారు. అనంతరం ఎస్ఐ మాట్లాడుతూ అక్రమంగా ఇసుకను తరలిస్తే కఠినచర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. అలాగే వారిపై కేసులు నమోదు చేసి జైలుకు పంపడం జరుగుతుందని తెలిపారు. ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న వారి గురించి సమాచారమివ్వాలని, వారి పేర్లను గోప్యంగా ఉంచడం జరుగుతుందని ఎస్ఐ కోరారు.


ఎక్కాకవేటర్‌తో గుంతలు తవ్వుతున్న దృశ్యం

సినిమా గైడ్

ఉరవకొండ

మల్లేశ్వరి : ఫిదా
వెంకటేశ్వర : దువ్వాడ జగన్నాథమ్
బాలాజీ : గౌతమ్‌నందా

ఉరవకొండ తహసీల్దారుగా అనిల్‌కుమార్

ఉరవకొండ: మండల తహసీల్దారుగా అనిల్‌కుమార్ మంగళవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న తిమ్మప్ప పదవీ విరమణ పొందారు. ఈడీటీగా పని చేస్తున్న అనిల్‌కుమార్‌ను ఎఫ్ఏసీ తహసీల్దారుగా నియమించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన అర్జీలను పరిష్కరించడానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు.

ఫలించిన తిమ్మాపురం రైతుల కల

- హంద్రీనీవా కాలువకు పైపుల ఏర్పాటు - పనులను ప్రారంభించిన ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్

కూడేరు : హంద్రీనీవా కాలువ నీటిని తిమ్మాపురం చెరువుకు మళ్లించేందుకు అవసరమైన పైపులైను ఏర్పాటు పనులను ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్ మంగళవారం ప్రారంభించారు. ఈ చెరువుకు నీటిని అందించడం వల్ల కూడేరు, అరవకూరు గ్రామాలకు, చెక్ డ్యాంలకు, ఆనకట్టలకు సాగునీరు అందుతుందని రైతులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో ఆయన నియోజకవర్గంలో లక్ష ఎకరాలు సాగుచేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసి ఇరిగేషన్ శాఖకు ప్రతిపాదించారు. అనుమతులు లభించడంతో పైపులైను ఏర్పాటుకు అవసరమైన పనులు మొదలుపెట్టారు. కాలువల్లో అమర్చిన పైపులను సిప్లాన్ డ్రగ్స్ ఎండీ రాళ్ళపల్లి అనంతయ్య సొంతంగా తీసుకువచ్చారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శ్రీనివాసులు, ఎస్పీ వెంకటనాయుడు, మలోబులు, తిరుపాలునాయుడు, వెంకటరాముడు, మధు, నరసింహులు, మురళి, కూడేరు మల్లికార్జున, పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ

అరకొర పదునుకే విత్తనం

కూడేరు: మండలంలో కురిసిన అరకొర పదునుకే అదును దాటుతోందని అన్నదాతలు విత్తనం వే స్తున్నారు. కొందరు రైతులు వేరుశనగ వేస్తుండగా, మరికొందరు కంది, ఆముదం, పెసర తదితర విత్త నాలు వేస్తున్నారు. మంగళవారం వివిధ గ్రామాల్లో అన్నదాతలు విత్తడాన్ని వేగవంతం చేశారు. పదిరోజుల్లో వర్షాలు కురిస్తే విత్తనం మొలకెత్తే అవకాశం ఉంటుందని రైతులు తెలిపారు.



ప్రతి రైతుకూ ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలి : ఎమ్మెల్యే


ధర్నాలో రైతులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

వజ్రకరూరు : ప్రతి రైతుకూ ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాలని ఉరవకొండ నియోజకవర్గ ఎమ్మెల్యే విశ్వేశ్వరరెడ్డి పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ కార్యాలయం వద్ద మంగవారం రైతులతో కలిసి ధర్నా చేపట్టారు. కార్యాలయం వద్ద బైఠాయించి వ్యవసాయాధికారుల పనితీరును విమర్శించారు. మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన రైతులు ఇన్‌పుట్ సబ్సిడీ జమ కాలేదన్నారు. ఇన్‌పుట్ సబ్సిడీని ఇతర రైతుల ఖాతాల్లో జమ కావడంతో తీసుకోలేక పోతున్నారన్నారు. వ్యవసాయాధికారుల తప్పిదాల కారణంగా ఇన్‌పుట్ సబ్సిడీ జమ కావడం లేదన్నారు. వ్యవసాయాధికారి మధుకర్ మాట్లాడుతూ.. గతంలో విధులు నిర్వహించిన ఏఓ చేసిన పొరబాట్ల కారణంగా రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ జమ కాలేదన్నారు. ఇప్పటి వరకు ఇన్‌పుట్ సబ్సిడీ జమకాని రైతులు ఆధార్‌కార్డు, పట్టాదారు పాసుపుస్తకం జిరాక్స్‌లను కార్యాలయంలో అందజేస్తే రెండవ విడతలో ఇన్‌పుట్ సబ్సిడీ వచ్చేలా ప్రయత్నం చేస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల నాయకులు ఉస్మాన్, ప్రకాశ్, అనిల్‌బాబు, భుమా కమలారెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వైసీపీ కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

మరుగుదొడ్లను పరిశీలించిన ఎంపీడీఓ

విడపనకల్లు: మండలంలోని వేల్పుమడుగు గ్రామంలో ఎస్సీ కాలనీలో ప్రభుత్వం నిర్మిస్తున్న మరుగుదొడ్లను ఎంపీఈఓ షకిలాబేగం, ఏపీఓ సుధాకర్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వేల్పుమడుగులో దళితులకు 70 మరుగుదొడ్లను మంజూరు చేశామని, వీటిలో 50 మరుగుదొడ్ల నిర్మాణాలు పూర్తి అయ్యాయని అన్నారు. వాటికి సంబంధించిన బిల్లులకు త్వరలోనే మంజూరు చేస్తామన్నారు. మహిళలతో కలిసి ఇంటింటికి వెళ్లి మరుగుదొడ్లను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఉపాధిహామీ సిబ్బంది, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి గృహనిర్మాణ శాఖ గ్రామసభలు

బెళుగుప్ప : ఇల్లు లేని నిరుపేదలకు పక్కా ఇళ్ల మంజూరు కోసం లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు బుధవారం నుంచి 10వ తేదీ వరకు గ్రామసభలు నిర్వహిస్తునట్లు మండల హౌసింగ్ ఏఈ హరినాయక్ తెలిపారు. ఎంపీడీఓ, తహసీల్దార్, ఎంఈఓల పర్యవేక్షణలో మూడు బృందాలు వెళ్లి గ్రామసభలు నిర్వహిస్తామన్నారు.

అర్హులందరికీ గ్రామీణ గృహాలు : ఎంపీడీఓ

పామిడి : మండలంలోని పల్లెల్లోని అర్హులందరికీ కేంద్ర ప్రభుత్వ గ్రామీణ గృహాలు మంజూరు చేస్తామని ఎంపీడీఓ రమేష్‌నాయక్ తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో మంగళవారం హౌసింగ్ డీఈ మధుసూదన్‌రెడ్డి, ఈఓఆర్‌డీ చంద్రమోహన్, హౌసింగ్ ఏఈ రమణారెడ్డితో ఆయన సమీక్షించారు. మండలానికి 938 గృహాలు మంజూరయ్యాయని, లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు 2న దేవరపల్లి, జీ కొట్టాల, నీలూరు, గజరాంపల్లి, ఖాదర్‌పేట, అనుంపల్లి, 3న కండ్లపల్లి, సొరకాయలపేట, ఎదురూరు, రామరాజుపల్లి, కట్టకిందపల్లి, దిబ్బసానిపల్లి, 4న ఎద్దులపల్లి, రామగిరి, వంకరాజు కాలువ, పాళ్యం, పాళ్యంతండా, కత్రిమల గ్రామ పంచాయతీల్లో సభలు నిర్వహిస్తామన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఉరవకొండ: రోడ్డు విస్తరణలో భాగంగా చెట్ల తొలగింపు కారణంగా విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏఈ మురళి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల పాటు ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల దాకా విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గుర్తించుకోవాలన్నారు.

భూములను దళితులకు ఇప్పించాలి

విడపనకల్లు: మండల పరిధిలోని హావళిగి గ్రామానికి చెందిన దళితులకు ఇచ్చిన భూములను లాక్కున్నారని, వాటిని వెనక్కు ఇప్పించాలంటూ తహసీల్దారు శంకరయ్యతో ఆ గ్రామంలోని దళితులు వాగ్వాదం చేశారు. ఈ సందర్భంగా దళితులు మాట్లాడుతూ.. 1977వ సంవత్సరంలో హావళిగి గ్రామంలోని దళితులకు ల్యాండ్ సీలింగ్ కింద 11 మందికి ఒక్కొక్కరికి 1.10 ఎకరాల ప్రకారం పంపిణీ చేశారన్నారు. అదే గ్రామానికి చెందిన మేఘనాథ్ అనే వ్యక్తి సర్వే నెంబరు 668 సీ2లో 4.85 ఎకరాల భూమిని 1977వ సంవత్సరం కంటే ముందే కుంతి బసప్పతో కొనుగోలు చేశారని తెలిపారు. కుంతి బసప్ప 1977వ సంవత్సరం కంటే ముందు ల్యాండ్ సీలింగ్ కింద ప్రభుత్వానికి ఇచ్చేశాడన్నారు. మేఘనాథ్‌రెడ్డి తను కొనుగోలు చేశాను కాబట్టి తనకే హక్కు ఉందని కోర్టుకు వెళ్లడంతో తమను ఆ భూమిలోకి వెళ్లకుండా పోలీసు అధికారులు అడ్డుకుంటున్నారన్నారు. ఆ భూములు తమకు ఇప్పించి పంటలు సాగు చేసుకునేలా చూడాలని తహసీల్దారును కోరారు. తహసీల్దారు శంకరయ్య మాట్లాడుతూ.. దళితులు కూడా కోర్టుకి వెళ్లి స్టే తెచ్చుకుంటే రెండున్నర ఎకరాల భూమిని వదిలేసి మిగిలిన భూమిలోకి వెళ్లేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. అనంతరం దళితులు మేఘనాథ్‌రెడ్డి, హనుమంతరెడ్డి తమను బయపడిస్తున్నారంటూ పాల్తూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు.


తహసీల్దారుతో వాగ్వాదం

వైభవంగా గ్రామోత్సవం


రాచేపల్లి పూజలో పాల్గొన్న ఎమ్మెల్సీ

ఉరవకొండ : మండలంలోని రాచేపల్లి గ్రామంలో శ్రీ ఆంజనేయస్వామి, లలితాదేవి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో భాగంగా గ్రామోత్సవ కార్యక్రమాన్ని మంగళవారం సాయంత్రం నిర్వహించారు. ఈ సందర్భంగా ఛండీ, నవగ్రహ, దీక్షా హోమాలు చేపట్టారు. ఈ పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్ పాల్గొన్నారు. బుధవారం స్వామి వారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం చేపడుతున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచు వేలూరే కేశన్న, ఎంపీటీసీ సభ్యురాలు నిర్మల, నాయకులు నారాయణస్వామి పాల్గొన్నారు.

ఎమ్మెల్సీకి గజమాలతో సన్మానం

ఉరవకొండ : ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్‌ను తెలుగు యువత జిల్లా అధికార ప్రతినిధి మదమంచి శ్రీనివాసులు, మండల కన్వీనర్ మారయ్యలు మంగళవారం వేర్వేరుగా సన్మానించారు. జాబ్‌మేళా ఏర్పాటు చేసినందుకు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. సన్మానించిన వారిలో టీడీపీ నాయకులు భూషప్ప, టీఎన్ఎస్ఎఫ్ నాయకుడు కుమార్, తెలుగుయువత మండల నాయకుడు చిన్నరాయుడు తదితరులున్నారు.

అదనపు గదులను మంజూరు చేయాలి : డిగ్రీ కళాశాలకు అదనపు గదులు మంజూరు చేయాలని ప్రిన్సిపాల్ రామచంద్రమూర్తి, దండా మల్లికార్జున, జయన్నలు ఎమ్మెల్సీని కోరారు. ఆయనకు వినతి పత్రాన్ని అందజేశారు. గదుల కొరత కారణంగా కళాశాలను షిఫ్టు పద్ధతిలో నిర్వహిస్తున్నామని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి గదులు మంజూరు చేయిస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు.

బాలుడి అప్పగింత


బాలుడిని తండ్రికి అప్పగిస్తున్న సీఐ

గుత్తి: తప్పిపోయి వచ్చిన బాలుడు జయరాజు(12)ను 1098 చైల్డ్‌లైన్ సిబ్బంది స్థానిక సీఐ ప్రభాకర్ గౌడ్ డీసీపీయూజే డబ్ల్యూ ప్రొటెక్షన్ అధికారి వెంకటేశ్వరి సమక్షంలో అతని తండ్రి చిన్న మద్దిలేటికి మంగళవారం అప్పగించారు. కర్నూలు జిల్లా తలముడిపి గ్రామానికి చెందిన చిన్న మద్దిలేటి కుమారుడు ఇంటి నుంచి పారిపోయి వచ్చాడు. ఈ బాలుడ్ని గుర్తించిన 1098 చైల్డ్‌లైన్ సిబ్బంది వివరాలను సేకరించి సీఐ సమక్షంలో తండ్రిని పిలిపించి అప్పగించారు. ఈ కార్యక్రమంలో చైల్డ్‌లైన్ కో-ఆర్డినేటర్ బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి కుటుంబానికి ఎమ్మెల్సీ కేశవ్ పరామర్శ

కూడేరు: మండల పరిధిలోని గొట్టుకూరు గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు మాబూసాబ్ (75) మృతి చెందడంతో ఆయన కుటుంబాన్ని ఎమ్మెల్సీ పయ్యావుల కేశవ్ పరామర్శించారు. పార్టీ ఆవిర్భవించినప్పటి నుంచి మబూసాబ్ పార్టీకి అనేక సేవలు అందించారని స్థానికులు ఎమ్మెల్సీ దృష్టికి తీసుకొచ్చారు. గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందారు. మాబూసాబ్ లేని లోటు పార్టీకి తీర్చలేనిదని ఎమ్మెల్సీ అన్నారు. ఆయన కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్సీ వెంట టీడీపీ నాయకులు జయరాం, మలోబాబు, పురుషోత్తం, నాగార్జున రెడ్డి, కిష్ట, ఓబులేసు, వెంకటప్ప, ఆల్లాబకాష్, ప్రతాప్ నాయులు, రామలక్ష్మి తదితరులు ఉన్నారు.